శ్రీ రస్తు

శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర

(సంపూర్ణచరిత్ర)

ప్రకాశకులు:

సి.వి.కృష్ణా బుక్‌డిపో,
19/99. అమ్మవారి కోవిల్ వీధి,
వాల్‌టాక్స్ రోడ్డు పోస్టు, మదరాసు 1.

(రిజిష్టర్డు కాపీరైట్)

294.592
SRE

CT

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11685

V.R. MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
11685

మహాయోగి వేమన కవీంద్రుని చరిత్ర

గ్రంథకర్త:

(విజ్ఞాన, విపులాంశ విమర్శనము)

నేదునూరి గంగాధరంగారిచే

ఇప్పటికి "వేమన-వేమన వెట్టివేమన్న" అని చరిత్రలు వ్రాసినారే గాని; మహాయోగి, మహాకవిగా శ్రీ వేమనార్యుని చరిత్రలు వ్రాయలేదు ఎప్పుడు, ఎక్కడ, ఏవంశమున, వేమన జన్మించెనో నిక్కచ్చిగా నేటివరకు తేల్చక వాకోపవాదములతో ముగించినారీ కవిపుంగవుని జీవితము-యీ యోగిపుంగవుని గురించి విశేష కృషిచేసి నేదునూరి గంగాధరంగారిచే చక్కని చరిత్ర వ్రాయబడినది మా యీ ఉద్యమమును భాసాభిమానులు తెలిసికొని ఆనందింపగలందులకు అభిలషించుచున్నాము. వెల 3-00



సి. వి. కృష్ణా బుక్ డిపో, తపాలుపెట్టె నెం. 1805 మదరాసు-1

శ్రీ మహా భక్త విజయము

(కర్త: కలవటాల జయరామారావు)

ఈ గ్రంథమున నలువదిభక్తాగ్రేసరులచరిత్రలనువర్ణింప బడినవి. ఇది కేవలము సామరజనులకొరకే వ్రాయబడినది. గ్రంథమంతయు సులభశైలిలో వ్రాయబడినందున సామాన్య భాషాజ్ఞానముగల స్త్రీ పురుషులు చదివి ఆనందింపవచ్చును ప్రతి భక్తుని కథయు చదువ మొదలిడిన కడపటిపరకు చదువ బుద్ధి పుట్టునట్లు రచింపబడినది. ఇది నీతులకు నిలయము, భక్తులకు పట్టుగొమ్మ, స్త్రీలకు కల్పవృక్షము, దుర్మార్గులను సన్మార్గులుగను, అనీతిపరులను నీతికోవిదులుగను, కామకులను మోక్షకామకులుగను, నాస్తికులను ఆస్తికులుగను మార్చి శ్రీహరి ప్రేమకు పాత్రుల గావించి మోక్షసాధనకు మార్గము చూపగలదు.

నాణ్యమైన క్యాలికోబైండు, అందమైన జాకెట్టుతో 436 పేజీలు గలవి. వెల 5-00

సి. వి. కృష్ణా బుక్ డిపో, తపాలుపెట్టె నెం. 1805 మదరాసు-1

4102B116.

శ్రీ సిద్ధయ్య జీవితము

"శ్రీ సిద్ధయ్య జీవితము" అను నీయుత్తమ వచనగ్రంథము భక్తిరసపూరితము సకల పుణ్యములకు రాశియగు శ్రీ కాశీయందు విజయసింగను క్షత్రియునకుం గొమరుండై జనించి ఆనందభైరవయోగి యను పేరఁ గొంతకాలము రాజ్యమును ధర్మముగాఁ బరిపాలించి ప్రజలచే సత్కీర్తివడసిన మహనీయ చరితుండీ యోగిపుంగవుండు. ఒకానొక నెపముచే నితఁడు మహమ్మదీయ కులమున 'పీరుసాహేబు' అను నాతనికి 'ఆదాం బీ' యను భార్యయం దుద్భవించిన పేక్ తెగకుఁ జెందిన మాననీయుఁడగు మహమ్మదీయుఁడు, శ్రీ పోతులూరి-వీరబ్రహ్మముగారి ప్రియాంతేవాసి, కులమున మహమ్మదీయుఁడయ్యు గురుకులవాస మొనర్చి హిందూమతావలంబియై పారమార్థిక విషయములం దారితేఱినవాఁడై సత్యవ్రతుండై, సత్కర్మాచరణతత్పరుండయి, యనింద్యచరితుఁడయి, పితృవాక్యపరిపాలనా ధురంధరుఁడై పొగడొందిన పుణ్యాత్ముఁడు. అట్టి యీతని జీవిత చరిత్రము తేటమాటలతో సులభశైలిని ఆబాలగోపాలమునకు అర్థమగునట్లు ముద్రింపించితిమి. వెల 1-50

సి. వి. కృష్ణా బుక్ డిపో, తపాలుపెట్టె నెం. 1805 మదరాసు-1

శ్రీరస్తు

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర

(సంపూర్ణ చరిత్ర)

V.R. NARLA MEMORIAL
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ప్రకాశకులు:

సి.పి.కృష్ణా బుక్‌డిపో,
19/99. అమ్మన్ కోవిల్ వీధి.
వాల్‌టాక్సు రోడ్డు పోస్టు, మదరాసు.1.

(రిజిష్టర్డు కాపీరైట్)

దీనివెల] :: [4-00

294.592
SRE

రచయిత

కలవటాల జయరామారావు

మద్రాసు

తొలిపలుకు

శ్లోకము

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతిభారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం. 1
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే. 2

ఇవి సర్వేశ్వరుని వాక్కులు. ఆసర్వేశ్వరుడే ఈసర్వ ప్రపంచమునకు నాయకుడు. త్రిమూర్తులనగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సర్వేశ్వరుని వివిధరూపములు. ఆత్రిమూర్తులే సూత్రధారులై ప్రపంచమును నడిపించుచున్నారని మతాంతరులు, నాస్తీకులు తప్ప తదితరులు భావింపక తప్పదు.

శ్రీమహావిష్ణువు పైనజెప్పినరీతి ప్రపంచమునందేభాగమున దుర్మార్గు లెక్కువై పాపము లభివృద్ధియగునో యాభాగమున తానవతరించి పాపవినాశన మొనరించి ధర్మసంస్థాపన జేయుదునని పలికియున్నాడు. ఆరీతిగనే యఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడగు రమాకాంతుడు పలురూపముల దాల్చెను. సత్యమును వచింపవలసి వచ్చినచో శ్రీహరి యెత్తిన యవతారములను లెక్కింపజాలము. అయినను పెద్దలు శ్రీహరి యవతారములలో పదింటిని

ముఖ్యముగా భావించి ''దశావతారములు'' అను పేరిడి తక్కిన చిన్నచిన్న యవతారములను జేర్చుకొనక వదలిరి.

ప్రపంచమునందలి ప్రతిమానవుడు శ్రీహరియంశ మునం దవతరించెనని చెప్పినను తప్పులేదు. ఎందుకనగా మానవులలోనే మహాపురుషు లుద్భవించిరి. సాధారణముగా మాతృగర్భమునుండి భూపతనమైన మానవుడు శిశు. బాల్య యౌవన కౌమార వృద్ధావస్థలకు గురికాక తప్పదని తోక మొరుంగక పోలేదు అట్టి మానవులలోనే కొందఱు ప్రథమావస్థనుండియే తాము దైవాంశ సంభూతులైనట్లు అటులనే బాల్య యౌవన కౌమార దశలలో గొందఱును తమ చర్యల గార్యరూపమున జూపి దివ్యపురుషులైనట్లు కాటుదురు.

దశావతారముల పిమ్మట శ్రీహరి యవతరించుట జాలించెనని తలంచుట పొరపాటని మాతలంపు అయిన తన యవతారముల జాలించియే యుండిన ఇప్పటికి ప్రపంచ మేగతిపట్టి యుండునో యూహింపజాలము. దశావతారముల పిమ్మట ప్రపంచమున నధర్మములు చెలరేగక పోలేదు. అటులనే యా యధర్మముల నశింపజేయుటకు శ్రీహరి యవతరింపక పోలేదు అత డవతరించియే యుండును. దశావతారముల పిమ్మట జరిగిన యవతారములలో క్రిందవానిని మనము లెక్కకుతీసికొనిన పొరబాటు కాదని మాయూహ.

ఉ. చేఁ 1 పయుఁ 2 కూర్మముం 3 వర 4
సింహము 5 వామన 6 జామదగ్న్య 7 సీ
తాపతి 8 సీరి కృష్ణు 9 లల
తాపసి బుద్ధుఁడు 10 11 నేను, 12 మహమ్మదుఁ
శీపతి 13 గారు నయ్యుమరి
చేరగవచ్చెను 14 వీరబ్రహ్మమై
అపరమేశుఁడే మఱల

నక్కట! నెన్నివిధాలఁ బుట్టునో,
కడపటి నాలుగవతారములను అవతారిదరిమిలాలో
జేర్చినందులకు గొందఱు మాపై గోపముజెందిన జెండ
వచ్చును. సర్వమత సామరస్యమును గోరు ప్రతిమానవ
హృదయముగల వ్యక్తి మమ్మభినందింపక పోడు మతములా
వేరుకావచ్చును కాని మానవత్వము వేరుకాదు మానవ
త్వము వేరైనను మానవహృదయము వేరుకాదు మానవ
హృదయములుభిన్నమైనను మానవజీవాత్మ భిన్నము కాదు

సూచన: 1 మత్స్యావతారము 8 బలరామావతారము
2 కూర్మావతారము 9 శ్రీకృష్ణావతారము
3 వరహావతారము 10 బుద్ధావతారము
4 నరసింహావతారము 11 ఏసునాథావతారము
5 వామనావతారము 12 మహమ్మదావతారము
6 పరశురామవతారము 13 గౌరాంగావతారము
7 శ్రీరామావతారము 14 వీరబ్రహ్మావతారము

కనుక జీవాత్మకైస్తవుడైనను, మహమ్మదీయుడైనను, పాషండమతము వానిదైనను మరెవరిదైనను అంత్యమునందొకే పరమాత్మను జేరకతప్పదు అట్టిమానవుడేమతమున జన్మించిన జన్మించుగాక అతడు విజ్ఞానవంతుడై సదభిప్రాయుడై, మానవాతీతుడై దివ్యపురుషుడనిపించుకొని కడపట అవతారపురుషుడన బరగినచో నత డేమతమువాడైనను అతనిని మనము పూజనీయునిగభావించి యతని ననుసరించుటలో దోషముండదు.

ఇపుడు దశావతారములయందు నమ్మకమున్నవారు ఆయవతారములలో గొన్ని జంతువులలోను, కొన్ని మానవులలోను అందు కొన్ని బ్రాహ్మణులలోను మరికొన్ని బ్రాహ్మణేతరులలోను గలిగినవని తెలిసికొనియే యుందురు అట్టి దశావతారముల నన్నిటిని మానవులమగు మనము పూజనీయములుగ భావించి వాని ననుసరించుచున్నాము అటులనే తర్వాత జరిగిన యవతార పురుషుల ననుసరించుటలో తప్పులేదు.

ఇక మన వీరబ్రహ్మావతారమును గూర్చి యోచింతము. ఇది కేవలము శ్రీహరి దాల్చిన యవతారములలో నొకటియని యొప్పుకొనక తప్పదు ఈయవతార పురుషుడు విశ్వబ్రహ్మణుడుగ జన్మించిన జన్మించుగాక, అవతార పురుషుడవతార పురుషుడే కాని వేరుకారు అతనికి జాతి భేదములు మతభేదములు గలుగవు ఈయవతార పురుషుడు

దానిని నిరూపించెనని పాఠకులు తెలిసికొనగలరు. కనుక అట్టి యవతార పురుషుని సర్వమతములు, సర్వజాతుల వారు గూడ పూజింపవచ్చును.

ఈ యవతారము యిటీవల నవగా సుమారు రెండు వందల యేబదిసంవత్సరముల క్రితము జరిగినది. అంతకు ముందుగా జరిగిన యవతార పురుషులకంటె నీయవతార పురుషుడు మిక్కిలి యద్భుత లీలల జూపెను. అన్నిటికంటె ప్రధానమైనది యితర యవతారపురుషు లొనరింపని కాల జ్ఞాన రచనను మిక్కిలి ప్రశంసింపవలసియున్నది. అప్పటి భూతవర్తమాన కాలములను గురించి చర్చింపనవసర మిచ్చట గానిపింపదు. అతడు రచించిన కాలజ్ఞానములోని భావ్యకాలముల వివరములు చదివిన ప్రతిమానవుడు నబ్బర పడక తప్పదు. ఒక్కటికూడ రిత్తకాకుండ ప్రతియొక్కటి జరుగుచునే యున్నది. ఇకముందుకూడ జరుగగలవు.

ఇట్టి యవతార పురుషుని గూర్చి పలుపురు పలు గ్రంథముల రచించిరి. ఇంకను యెన్ని గ్రంథములు వ్రాసినను వ్రాయవచ్చును. అతని లీలలనుగూడ ఒకొక్కగ్రంథకర్తయొకొక్కరీతిగ రచించెను. మొత్తముమీద అందరు వ్రాసినవియు లోకులు చెప్పుకొనుచునే యుండుటచే వాని విషయము చర్చింపవీలుపడదు.

ఇతర ప్రచురణకర్తలవలనే శ్రీకృష్ణా బుక్ డిపో వారునూ "శ్రీ పోతులూరు వీరబ్రహ్మము జీవిత చరిత్ర"

అను పేరుతో నొక గ్రంథమును బ్రకటించియుండి యిప్పుడు దానినే విపులముగ బ్రాయించగోరి యీ కార్యమును పన్ని చేయగోరగా నాకంతటి శక్తి లేకపోయినను వారికి నాకు గల యన్యోన్య స్నేహభావము ననుసరించి యంగీకరింపక తప్పదాయెను.

అవతారపురుషుల చారిత్రముల బ్రాయుటకు బ్రతి గంథకర్తకు అధికారము గలదు. ఒక్కొక రొక్కొక మార్గమునననుసరించి బ్రాసినను బ్రధానవిషయ మందరికి నొకటేకనుక నేను బ్రధానవిషయములను వదలక నాకు దోచిన స్వల్పవిషయములో లోకములో వాడుకొను విషయ ములు జేర్చి బ్రాసితిని అందులకు పాఠకులు క్షమింతురు గాక.

ఇది పండితుల కొఱకు బ్రాసిన గ్రంథముకాదు. సామాన్యముగ చదువసేర్చిన వారిలో వీరబ్రహ్మముగారి హితోపదేశముల బ్రచార మొనరింపగోరి బ్రాయబడినది. భాషకు బ్రాధాన్య మొసగి బ్రాసినదికాదు. ఈ నాసేవ యెంతమాత్రము పాఠకుల హృదయమును జూడగొనునో జూడవలసియున్నది.

ఇట్లు

గ్రంథకర్త.

శ్రీ రస్తు

విషయసూచిక

విషయము	పుట
అవతారిక	17
అవతార ప్రారంభము	44
శ్రీహరి నిర్ణయము	49
శ్రీహరి కలియుగమున బుట్టుట	51
ప్రకృతాంబ శిశువును అత్రిమునికిచ్చుట	52
వీరపాపమాంబా వీరభోజయాచార్యులు సంతాన ప్రాప్తికై గోవిందుని ధ్యానించుట	53
వీరపాపమాంబా వీరభోజయాచార్యులు తీర్థయాత్రలు	56
వీరపాపమాంబా వీరభోజయాచార్యులు అత్రిమహా మునివలన శిశువును బొందుట	57
వీరబ్రహ్మావతారము	58
బాల్యము	60
వీరభోజయాచార్యుడు మరణించుట	61
విద్యాభ్యాసము	62
వీరబ్రహ్మము తల్లికి జ్ఞానోపదేశమును జేయుట	65
తత్త్వవివరణము	71
వీరబ్రహ్మము తల్లికి చూపిన విశ్వరూపము	76
వీరబ్రహ్మము దేశయాత్ర	78
ఈశ్వరుడు ఆనందభైరవయోగిగా అవతరించుట	79
ఆనందుని బాల్యము	81
ఆనందసింగు అడవికి వేటాడబోవుట	82

ఆనందసింగు అడవిలో ప్రమాదమున గోవునుసంహరించు 83
విజయసింగు పండితులతో యోచించుట 87
ఆనందసింగు యోగిరూపమున తీర్థముల సేవింపనరుగుట 88
ఆనందయోగి వీరప్పయ్యను దర్శించుట 89
వీరప్పయ్య ఆనందయోగికి దర్శనమొసగి గోహత్యా పాపమును బోగొట్టుకొను మార్గమును దెలుపుట 90
ఆనందభైరవయోగి గోహత్యా పాపమునుండి తరించు మార్గము నెరుంగుట 91
వీరప్పయ్య ఆనందభైరవయోగికి గోవధపాపమును బోగొట్టి మంత్రోపదేశము చేయుట 92
మహామంత్రము 92
వీరప్పయ్య బనగానపల్లె జేరుట 95
వీరంబొట్లయ్య గోపాలకుడగుట 96
గరినిరెడ్డి అచ్చమ్మ యింట బనికి గుదురుట 97
వీరప్పయ్య కాలజ్ఞాన రచన ప్రారంభించుట 100
అచ్చమ్మ వీరప్పయ్యను పరీక్షించుట 102
అచ్చమ్మకు బ్రహ్మోపదేశ మొసగుట 107
బ్రహ్మ అన్నాజయ్యగా నవతరించుట 112
విశ్వాత్మకుడు శిశువునకు అన్నాజయ్య యని నామకరణ మొనరించుట 113
అన్నాజయ్య బాల్యము విద్యాభ్యాసము 114
అన్నాజయ్య సన్యాసాశ్రమమును స్వీకరించుట 115
అన్నాజయ్య బనగానిపల్లె కేగుట 116
అన్నాజయ్య లోమశమున వీరప్పయ్యను దర్శించుట 117
వీరప్పయ్య తమయవతార రహస్యమును దెలుపుట 119

విషయ సూచిక

అన్నాజయ్య పూర్వపుసంగతులను వీరప్పయ్యవలన 121
అన్నాజయ్య పూర్వపు విషయముల దెలిసికొనుట 122
వీరంభొట్లయ్య గరిమిరెడ్డి అచ్చమ్మ పుత్రోనకు దృష్టినొసగుట 129
బనగానపల్లె నవాబు వీరంభొట్లయ్య శక్తి నెరుగుట 131
వీరంభొట్లయ్య రాచనగరునకు బోవుట 134
వీరంభొట్లయ్య కాలజ్ఞానమును వివరించుట 139
అఱచేత విగ్రహమును చేయుట 156
అరచేతి విగ్రహము అల్లాడుపల్లె జేరుట 157
పశుబాలురు ఆసంగతి గ్రామాధికారికి చెప్పుట 159
బాలుడు గ్రామాధికారికి స్వప్నములో గనబడుట 160
అల్లాడుపల్లెలో దేవాలయ నిర్మాణము 161
వీరబ్రహ్మము వీరభద్రుని జూడవచ్చుట 163
వీరబ్రహ్మము దువ్వూరు జేరుట 164
వీరబ్రహ్మము కందిమల్లయ్యపల్లె జేరుట 165
శ్రీలక్ష్మీదేవి కలియుగమున జన్మించుట 167
శ్రీలక్ష్మి పెద్దకొమెర్లలో జన్మించుట 168
గోవిందమ్మ జననము 170
గోవిందమ్మ బాల్యము 171
శివకోటయ్య గోవిందమ్మకు పెండ్లి చేయ గోరుట 172
గోవిందమ్మ తన భర్తను తానే నిర్ణయించుకొనుట 174
గోవిందమ్మ తలిదండ్రులకు తన స్వప్నవృత్తాంతము 175
శివకోటయ్యకు విష్ణువు కలలో గనంబడుట 177
కందిమల్లయపల్లె 179

వీరబ్రహ్మము ప్రజలకు దన మహిమ జూపుట 180
వీరబ్రహ్మము పెండ్లి చేసుకొని వత్తునని పోవుట 181
వీరబ్రహ్మము పెద్దకొమ్మల చేగుట 182
చచ్చిన రెడ్డిని బ్రతికించుట 184
బ్రతికినవానిని జంపి మరల బ్రతికించుట 186
వీరబ్రహ్మము బ్రహ్మయ్య సంశయము తీర్చుట 189
పెద్దకొమ్మల్లో కాలజ్ఞానమును బోధించుట 191
గోవిందమ్మ యోగిని వరించుట 195
శివకోటయ్య వీరబ్రహ్మమును నాహ్వానించుట 197
గోవిందమాంబా వీరబ్రహ్మముల వివాహము 198
వీరబ్రహ్మము భార్యాసమేతముగ కందిమల్లయ్య పల్లెకు తిరిగి వచ్చుట 204
వీరబ్రహ్మము గ్రామజాతర సమయమున తనమహిమ 205
పోలేరమ్మతో నిప్పు తెప్పించుట 206
వీరబ్రహ్మము దినచర్య 208
వీరబ్రహ్మము భార్యాసమేతముగ తీర్థముల సేవించుట 209
గోవిందమ్మ గర్భమును దాల్చుట 213
వీరబ్రహ్మమునకు కుమారీ కుమారులు జన్మించుట 214
భక్తులు మఠమును గట్టించుట 216
ఆనందభైరవయోగి సిద్దయ్యగా జన్మించుట 217
సిద్దయ్య బాల్యము 219
సిద్దయ్య వీరబ్రహ్మమును దర్శించుట 211
సిద్దయ్యను బ్రహ్మముగారి సతీసుతులు తిరస్కరించుట 223
సిద్దయ్య వీరబ్రహ్మము పాదములమీదబడి శిష్యునిగా గైకొనుమని ప్రార్థించుట 224

సిద్దయ్యను వెతకుచు పీరుసాహేబు వచ్చుట 226
పీరుసాహేబు సిద్దయ్యను పిలుచుకొని పోదలచి వచ్చుట 227
సిద్దయ్య తండ్రితో రానని చెప్పుట 228
పీరుసాహేబు వీరబ్రహ్మముగారి హితోపదేశమును విని
సిద్దయ్యను స్వామివారికే వదలిపోవుట 230
సిద్దయ్యకు బ్రహ్మోపదేశము చేయుట 234
సిద్దయ్యకు సృష్టిరహస్యముల దెలుపుట 236
సిద్దయ్యకు భూలోక మర్మముల దెలుపుట 237
సిద్దయ్యకు గాయత్రీ జపమూలము నెఱింగించుట 238
వీరబ్రహ్మము సిద్దయ్యను గృహస్థును కాగోరుట 240
సిద్దయ్య గురువు ఆజ్ఞనుమీరజాలక గృహస్థుకాదలచుట 241
వీరబ్రహ్మము ఉత్తరదేశ సంచారము వెడలుట 243
హైదరాబాదు నవాబు స్వామిని ఆహ్వానించుట 246
శ్రీ స్వామివారు హైదరాబాదునకు బోవుట 247
శ్రీస్వామి నవాబుకు దన మహిమ జూపుట 248
స్వాములవారు నవాబుకు కాలజ్ఞానమును దెలుపుట 250
అసూయాపరులగు తన శిష్యులకు దగిన పాఠమునేర్పుట 252
కుష్ఠురోగిని స్వర్ణదేహు నొనరించుట 254
వీరబ్రహ్మం మరల తన మఠమును చేరుట 256
సిద్దయ్యకు పునర్జన్మ జన్మరాహిత్యముల వివరించుట 258
యోగాసన పద్ధతులు 260-289
వీరబ్రహ్మము దక్షిణాంధ్రదేశమున సంచార మొనర్చుట 291
విశ్వబ్రాహ్మణుడు స్వామిని పరీక్షించుట 292
స్వామి సిద్దయ్య మొదలగువారిని రమ్మని సాంఖ్య
యోగమును వివరించుట 294

కక్కయ్య దేహములోని అధిదేవతలను చూచుటకు
భార్య గర్భమును జీల్చుట 295
వీరబ్రహ్మముగారు కక్కయ్య భార్యను బ్రతికించి
యిద్దరికి అధిదేవతలను జూపుట 296
వీరబ్రహ్మము కర్మాలు జేరుట 298
నవాబు స్వామి శక్తిని పరీక్షించుట 299
నంద్యాల విశ్వబ్రహ్మణులు స్వామినిగౌరవింపకపోవుట 301
సిద్దయ్యచే పుట్టెడు బియ్యపు అన్నమును తినిపించుట 303
శ్రీ వీరబ్రహ్మము అహోబిలమును చేరుట 304
బ్రహ్మరక్కసి గర్వభంగ మొనరించుట 305
వీరబ్రహ్మము పుష్పగిరికి బోవుట 308
స్వాములవారు పుష్పగిరి బ్రాహ్మణుల జయించుట 309
బ్రాహ్మణులువీరబ్రహ్మగారికి ఉత్సవము జేసి గౌరవించుట 310
సిద్దయ్య అల్లాడుపలె వీరభద్రస్వామిని సేవింపగోరుట 312
వీరబ్రహ్మమును చోరు లడ్డగించి కొల్లగొట్ట చూచుట 313
చోరులకు గన్నులు కనబడక పోవుట 314
కడప నవాబు స్వామికి సమ్మను బంపుట 315
వీరబ్రహ్మము సిద్ధవటమును జేరుట 319
నవాబు సిద్ధయ్యను పరీక్షించుట 322
సిద్ధవటము నవాబు వీరబ్రహ్మము శిష్యుడగుట 323
వీరబ్రహ్మముగారు కందిమల్లయ్యపల్లె జేరుట 324
వీరబ్రహ్మము తన యవతారమును జాలింప గోరుట 326
వీరబ్రహ్మము అవతారమును ముగించుట 328
సిద్దయ్యకు వీరబ్రహ్మము ఋషిరూపమున గనంబడి
బనగాపల్లెకు బోవకుండ జేయుట 331

సిద్దయ్య కందిమల్లయ్యపల్లెకు తిరిగి వచ్చుట 333
గోవిందమ్మ సిద్దయ్యకు సమాధినిజూచుట కాజ్ఞ ఇచ్చుట 335
సిద్దయ్యకు వీరబ్రహ్మము దర్శన మొసగుట 336
సిద్దయ్య గోవిందమ్మతో సెలవుదీసికొని ముడుమాల జేరబోవుట 337

గోవిందమాంబమునిమడుగువిశ్వబ్రాహ్మణులశపించుట 338
పోతులూరు సమాధిమూత దీయుట 341
వీరబ్రహ్మముగారు పోతులూరయ్యను శపించుట 343
భార్యాసమేతుడై పోతులూరయ్యారణ్యవాసంబోవుట 344
పోతులూరయ్య భార్యతోగూడ లింగాలకొండలో పర్ణశాల నిర్మించుకొని యుండుట 347
పోతులూరయ్య పెద్దన్నను తన శిష్యుడుగా జేసికొనుట 348
పోలూరయ్యపేరువ పెద్దన్నను కొన్నాళ్ళు తలిదండ్రుల కడ నుండగోరుట 350

పోతులూరయ్య జలగుండమును జేరుట 352
పోతులూరయ్యకమ్మిపాపన్నకుదహనక్రియలొనరించుట 353
పోతులూరయ్య పెద్దన్నను కందిమల్లయ్యపల్లెకుబంపుట 356
గోవిందమ్మ కొడుకును కోడలిని మఠమునకు రాగోరుట 358
క్రొత్తకోట కృష్ణారెడ్డి పోతులూరయ్య వస్తువుల నపసారించుట 361
కృష్ణారెడ్డిపోతులూరయ్యవస్తువులను తెచ్చియిచ్చుట 363
పోతులూరుస్వామి మలమీదపల్లె జేరబోవుట 370
పోతులూరయ్య పోలేరమ్మను శిక్షించుట 372
పోతులూరయ్య వనవాసకాలము దాటినంపున కందిమల్లయ్యపల్లెకు బోదలచుట 376

ఈశ్వరమ్మచరిత్ర 379
ఈశ్వరమ్మ తండ్రికి చైతన్యము కలిగించుట 380
రంగరాజు వీరబ్రహ్మము వంశమున వివాహమాడుట
గోరి బయలుదేరి వచ్చుట 382
రంగరాజు పోతులూరయ్య కాలజ్ఞానమును దెచ్చుటకు
బనగానిపల్లెకు బోవుట 383
రంగరాజు అగ్నిగుండమును ప్రవేశించుట 386
రంగరాజును ప్రేమించిన ఈశ్వరమ్మ బ్రహ్మచారిణీ
దీక్షబూనుట 388
ఈశ్వరమ్మ తన మేనమామను కుష్టురోగివి కమ్మని
శాపమొసగుట 389
ఈశ్వరమ్మ యాభరణములను రేకలకుంటపాళెగాడు
దొంగలించుట 390
ఈశ్వరమ్మ సంచారము పోవుట 393
ఈశ్వరమ్మ తన తండ్రివలన శాపగ్రస్తయగు బ్రహ్మ
రాకసి శాపమును బోగొట్టుట 394
ఈశ్వరమ్మ గోళ్ళభావాజీకి గర్వభంగ మొనరించుట 396
పెద్దారిగట్ల మంత్రవాదుల పరిభవించుట 397
ఈశ్వరమ్మ సీళ్ళనునెయ్యిగాను, నెయ్యినిసీళ్ళగానుమార్పిం
ఈశ్వరమ్మ నిర్యాణము 400 [చుట 399
ముడుమూలసిద్దయ్య 403
సిద్దయ్యపాముకరచిమరణించినతిమ్మారెడ్డినిబ్రతికించుట 403
పలుగుతూలపల్లె గోవిందయ్యకు సిద్దయ్య మంత్రోప
దేశ మొనరించుట 405

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

అవతారిక

పాఠకమహాశయులారా!

అవతారపురుషుడగు శ్రీ పోతులూరి వీరబ్రహ్మము గారి జీవిత చరిత్రమును మీకెరింగించుటకు ముందు అంతకు పూర్వము జరిగిన అవతారములను గురించి కొద్దిగ తెలిపి అవల మన యవతారపురుషుడగు బ్రహ్మముగారి జీవిత మును మీకు తెలుపగోరుచున్నాము.

భక్తవరులారా! ఆదియందు అనగా లోకము లెల్లను జలమయమై యుండినపుడు ఆమహాప్రళయమునం దేమియు లేక శూన్యంబుగా నుండెను ఆదృశ్యమును జగజ్జననిచూడ జాలక విచారమనస్కురాలై మఱల సకలభువనంబులను బుట్టింపనెంచి మొట్టమొదట మూడు అండములను సృష్టిం చెను. ఆ మూడు గ్రుడ్లలో బ్రహ్మయు, లక్ష్మియు, విష్ణు మూర్తియు పార్వతీదేవియు, శంకరుడును సరస్వతియువకు సగా జన్మించినవారైరి.

అప్పుడు జగజ్జనని బ్రహ్మను సరస్వతీదేవిని, శ్రీమహా విష్ణువును లక్ష్మీదేవిని, శంకరుడు పార్వతీదేవిని పరిణయ

17

మూక గోరెను. అరీతి జగజ్జనని వారి వివాహములు జేసినదే కాక వారిని సకలశాస్త్రపూర్ణులుగ నొనరించి అదృశ్యమై పోయెను.

అపుడు త్రిమూర్తులు జగజ్జననిగానంజాలక అకటా! జనని మన కగుపడకుండ మాయయ్యెపోయెను. ఇక మన మేమి చేయవలెను. ఆమెమన కేవియుబె లుపకపోయెను. ఆమె నెటులైన మనము చూచి ఆమె యేమి అనతిచ్చునో అవిధముగ నడచుకొనుట మంచిది ఎటులైనను మరల ఆమెను చూచి తీరవలెనని సంకల్పించిరి.

ఆరీతి దృఢసంకల్పులై త్రిమూర్తులు తమ భార్యల వెంటనిడుకొని స్వర్ణగిరి శిఖరమున కేగి తగిన యాశ్రమములు నేర్పాటుగావించుకొనిరి. అపలనిర్మలాత్మలై స్నానసంధ్యా ధ్యానుష్ఠానముల నిర్వర్తించి జగజ్జననిం గూర్చి ఘోర తపం బాచరించుచుండిరి.

అవిధి త్రిమూర్తులు కొంతకాలము తీవ్రతప మొనరింపగా వారితపంబునకు మెచ్చి జగజ్జననివారిక ప్రత్యక్షమై "ఓత్రిమూర్తులారా! ఏల యింతటి కఠినతపమాచరించితిరి. అందులకు గారణమేమి? నాకు మిక్కిలి సంతోషమునుగలిగించితిరి మీకేమైన వరములుగావలసియుండినకోరుకొనుడు మీరుకోరిన వరములన్నింటిని యిత్తునని" చెప్పెను.

అందులకు త్రిమూర్తులు కరములమొగిడించి "ఓజననీ! నీవు యీరీతి మమ్ములసృష్టించి శూన్యలోకంబున డించి పోయిన మేమీయజ్ఞానదశలో యేమిచేయవలయునో దోపకున్నది. మాకు అవసరమగువానిని నీవే సృష్టించి, మేము

యేయే కార్యముల నిర్వర్తింపవలెనో యానతిమ్ము'' అని ప్రార్థించిరి.

అపుడు లోకమాత ప్రసన్నయై మరల మూడు అండములను సృష్టించెను. ఎందు మొదటి యండమును రెండు భాగము లొనరించి భూమి ఆకాశములను జేసెను. తర్వాత మిగిలిన రెండు గ్రుడ్లను ఎనిమిది భాగములొనరించి అష్ట దిక్కుల ఎర్పాటుగావించెను. ఆవల బ్రహ్మనుజూచి ఓయీ! నీవు సత్యలోకమున కధిపతివై సృష్టిలయ కార్యములను నిర్వర్తించుచుండుమని యాజ్ఞాపించెను. తదుపరి శ్రీమహా విష్ణువును బిలిచి నీవు వైకుంఠమునందుండి దుష్టశిక్షణ శిష్ట పరిపాలన కార్యముల సాగించుచుండుమని యానతిచ్చెను పిమ్మట శంకరునిగని శంకరా! నీవు కైలాసమునుజేరి తపో ధనులకు వారికి దగినట్లు వరముల నొసంగుచు దుష్టసంహార మునకును శిష్టపరిపాలనకు సహాయపడు చుండుమని పలి చ్చెను.

ఆరీతి యాజ్ఞాపించి జగజ్జనని మాయమైపోయిన దాయెను. అపుడు మూర్తిత్రయము జనని యానతి నసుస రించి తమ కార్యక్రమమునకు బూనుకొనినరాయిరి. బ్రహ్మ భూమిపై ముప్పదిమూడుకోట్ల ప్రాణులను, వానికిగావలసిన సకల వస్తుసముదాయమును సృష్టించెను. ఆరీతి సృష్టిచే సృష్టింపబడినవారిలో రాక్షసులను నొక తెగవారుండిరి.

ఆరాక్షసులలో మధుడనువాడు ముఖ్యుడై మహాబల వంతుడై యుండెను. వాడు తన్నెదిరించువారు లేనందున కడకు శ్రీ మహావిష్ణువు మీదికి యుద్ధమునకు బోయెను.

అపుడు శ్రీహరి వానిని చక్రమునకు ఆహుతి జేసి లోకమునకు సంతోషము కలిగిరిచెను. అపుడువాని సంతతి మిక్కిలి దుఃఖించుచు యేమియుతోచక తగిన గుడుపును జేరి తగిన యుపాయము దెలిసికొనదలచిరి. అపుడందఱును జేరి శుక్రాచార్యుని సన్నిధికేగి గురుదేవా! శ్రీహరి మాతండ్రిని జంపెను. ఆ పగను దీర్చుకొనుటకు మాకుదగిన యుపాయమును బోధింపుడని ప్రార్థించిరి

అందుకు శుక్రాచార్యుడు సంతోషించి మధుసంతతికి సకల విద్యల నేర్పించి, అందఱు మందరగిరికేగి శంకరుని గూర్చి ఘోరతపం బాచరింపుడనియు, అపుడు మహేశ్వరుడు ప్రత్యక్షమై మీకోరికల దీర్చునని చెప్పెను. అపుడు రాక్షసగణము మందరనగంబునకేగి తపమునకుదగిన స్థలమును నిర్ణయించుకొని నీరంబున స్నానమొనరించి ఏకదీక్షతో తప మొనరించుచుండిరి. వారు తపమాచరించుటను దేవతలు తెలిసికొని దేవనాథుని కడకేగి రాక్షసుల తపము నెరవేరినచో దేవతలను తరిమి కొట్టుదురనియు, యేవిధముగానైనను వారి తపమును భంగ మొనరింపవలెననియు ప్రార్థించిరి దేవేంద్రుడు యోచించి దానవుల తపస్సును జెరచి రమ్మని యప్సరసలను బంపెను. ఆభాసురాంగులు మందరపర్వతమునకేగి రాక్షసుల తపోభంగ మొనరింప సర్వవిధముల ప్రయత్నించిరి. వారి మాయోపాయములు బొత్తిగా నెరవేరకపోయెను. అపుడు వారు విఫలమనోరథులై దేవేంద్రుని కడకేగి జరిగిన సంగతి విన్నవించిరి.

అపుడు దేవేంద్రుడు దిక్కుతోచక దేవగురుండగు బృహస్పతి దర్శనమునకేగి రాక్షసులొనరించు ఘోరతపం

మును గుఱించి తెలియజేసి, వారి తపము నెఱవేరినచో వారు మూడులోకములనుజయించి సర్వనాశన మొనరింతురు గనుక వారికోర్కెలనెర వేరకుండ జేయు యుపాయమును బోధింపు మనెను. అపుడు బృహస్పతి బాగుగ యోచించి దేవేంద్రుని వెంటనిడుకొని సత్యలోకమునకేగి కమలాసనుని ప్రార్థించి ముగ్గురును గలసి కైలాసమునకేగిరి. కైలాసపతి వారలగని కూర్చుండనియమించి వారిరాకకు గారణమడిగెను.

అపుడు దేవేంద్రుడు కరములజోడించి మహేశ్వరా! మందరగిరిమీద రాక్షసులందరును ఘోరతప మొనరించు చున్నారు. వారి తపస్సు సంపూర్తియైనచో ముల్లోకముల జయించి సర్వనాశన మొనరింతురు. కనుక మాయందుదయ యుంచి వారితపస్సు పూర్తికాకముందె తాము వారికి ప్రత్యక్షమై వారికి దగినట్లు వరములు ప్రసాదింపుడు. ఆవరములకు దగిన విఘ్నములనుగూడ యోచించి వరములను ప్రసాదింపు డనెను. బ్రహ్మయు బృహస్పతియు దేవేంద్రునికోర్కె నెర వేర్చనిచో రాక్షసులవలన యందఱకు బాధలు తప్పవనిరి.

అప్పుడు శివుడు మంచిదని వారిని బంపెను. ఆవల మందరగిరికేగి తప మొనరించు రాక్షసులకు ప్రత్యక్షమై "ఓయీ! మీ తపంబునకు సంతసించితిని మీకు వలయువర ములు ప్రసాదించెద కోరుకొమ్మనెను. అపుడు మహేశ్వరా! మాయందనుగ్రహము గలిగెనంటిరి. అటులైన మాకు దేవ యక్షగంధర్వ కిన్నరకింపురుష దిక్పాలకాది మహాపురుషుల చేత చావులేక సకలభోగభాగ్యంబుల గలిగిసుఖముగనుండు వటుల వరంబు ప్రసాదింపుమనిరి.

అందుకు పార్వతీరమణుడు బాగుగ యోచించి "ఓ దానవశిఖామణులారా! మీరు అసాధ్యమగు వరములగోరి తిరి అయినను మీరు తపమున నన్ను మెప్పించితిరి గనుక మీకోరిక దీరునట్లు వర మొసంగితిని. ఆవరప్రభావముమీరు న్యాయప్రవర్తనులై యుండునంతకాలము ఫలించుచుండును. పాపకార్యముల జేయ మొదలు పెట్టిన చో నా వరప్రభావము ఫలింపదని చెప్పి యదృశ్యుడై పోయెను.

ఆవిధంబున ఈశ్వరుడిచే వరంబులబడసి కొంతకాలం దుర్మార్గకార్యముల జేయక కాలము గడుపుచుండిరి. ఆవల కొందఱు గర్వాతిశేకంబున కన్నుల దెలియక భూమండల మునమండు రాజపుంగవుల జంపుచు ఋషులం యాగంబుల బాడొనరించుచు, వారి హోమగుండములలో రక్తమాంస ములను బడవేయుచు, బ్రాహ్మణుల ననేకవిధంబుల బాధించుచు, స్త్రీలను జెఱబట్టుచు - శిశుహత్య, స్త్రీహత్య గోహత్యలనొనరించుచుండిరి. ఆ దానవులలో గొప్పవాడగు మహిషాసురుండు అవక్రపరాక్రమ వంతుడై స్వర్గమును ముట్టడించి దేవనాథుని పరాభవించి దిక్పాలుర గర్వ మడంచి యడవులకు బారద్రోలెను.

అపుడు దేవేంద్రుడు ఏమియుదోచక బ్రహ్మదేవుని కడకుబోయి తనకు మహిషాసురుని వలనగలిగిన పరాభవంబును విన్నవించి వానిని జయించు మార్గమును బోధింపుమని ప్రార్థించెను. అందుకు బ్రహ్మదేవనాథునితోగూడ విష్ణు మహేశ్వరుల కడకుబోయి జరిగిన సంగతి విన్నవించి తగిన యోచన జేయగోరెను. అపుడు త్రిమూర్తులు యేకాంతస్థలం బునకేగి జగజ్జననిని ప్రార్థించిరి.

ఆకీర్తి త్రిమూర్తులు జగజ్జనని ప్రార్థించినంతనే ఆమె ప్రత్యక్షమై వారిని భయపడవలదు రాక్షసులందఱి నాశన మొనరింతునని చెప్పి త్రిజగన్మోహనాకారమునుదాల్చి మంథర గిరిని జేరబోయెను. అక్కడ ఆమె మందర శిఖరంబునకేగి సుస్నాతయై దవాళాంబరమును ధరించి త్రిజగన్మోహినియో యన నొప్పి పుష్పలతాకుంజమున గూర్చుండి వీణియనుగొని శ్రుతిసవరించి గాన మొనరింప దొడంగెను.

ఆమెగానము నాలించి అందుండిన రాక్షసు లేలెంచి యామె సౌందర్యమును గాంచి అచ్చెరువంది తమ నాయకు డగు మహిషాసురుని కడకేగి ఆమెను గుఱించి వేయివిధం బుల వర్ణించి ఆ మోహనాంగి మాకు రాణిగానుండ దగి యున్నది ఆమె నెటులేని మీరు చేపట్టక తప్పదు. ఆమెను మీరొకసారి చూచిన బాగుండును చూపెదము రండని ప్రార్థించిరి.

ఆ మాటల నిన్నతోడనే మహిషాసురుడు కామో ద్రేకుడై రాక్షసులారా! ఆస్త్రీ కడకు నేను రావలయునా? దానిని మారాజుపిలుచుచున్నాడని చెప్పుడు. ఆమె రానిచో బలవంతమున పట్టి తెండని సుగ్రీవుడను తన మంత్రి వెంట కొందఱు రాక్షసనాయకులను రాక్షససైన్యమును బంపించెను ఆ రాక్షసులందఱును ఆర్భటించుచు బోయి ఆ స్త్రీనిజూచి తమరాజు రమ్మనుచున్నాడనియు రానియెడల బంధితురాలి నొనరించి పట్టి తెమ్మని యన్నాడు కనుక వచ్చి ఆయనను వరించుట శ్రేయస్కరమనియు, రాక్షసులకు రాణివై స్వర్గమునుజేరి మారాజుతో గూడ స్వర్గసింహాసనమున గూర్చుండ వచ్చునని చెప్పిరి.

అందు కా నారీరత్నము కోపోద్దీపితురాలై దుర్మార్గు లారా! కనులగానక ఇష్టమువచ్చినట్లు మాటలాడుచూటికా ఎవరైననుసరేనన్ను యుద్ధమున జయించిన వానిని పతిగాయ మాడెదను మీరాక్షస రాజు శక్తివంతుడైనచో నాతో పోరుమని చెప్పుడనెను. అందుకు ధూమ్రలోచన శుంభ నిశుంభరక్త బీజాది రాక్షసనాయకు లామెనుబట్టి గొంపోదు మని ముందునకురాగా ఆమెలేచి శూలమునుగొని రాక్షస సైన్యమునుదునుమాడి ధూమ్రలోచనుని ధూమంబొనరించి శుంభుని సృక్కడంచి నిశుంభుని నిర్ధూమధామంబు గావించి రక్తబీజుని రక్తముద్రావెను.

అపుడు కొందరు రాక్షస హతశేషులు పరుగెత్తి మహిషాసురునింగని "రాజా! ఆమె సామాన్యస్త్రీయైయుండ లేదు మనరాక్షస నాయకులను సైన్యమును తుత్తునియ లొనరించి రక్తబీజుని రక్తముద్రాగినది. ఆమె మనరాక్షస కులమును నిర్మూలము చేయుటకు అవతరించిన శక్తియై యుండెనని తోచుచున్నదని చెప్పిరి. ఆమాటల విన్నంతనే మహిషాసురుడు తోకత్రొక్కిన త్రాచుపాము బోలి రోజుచు సర్వ సైన్యములం గూర్చుమని సేనాధిపతుల కాన తిచ్చి రణభేరి వేయించుచు మందరగిరి శిఖరమునకు బోయిన వాడాయెను.

మహిషాసురుడు క్రోధపూరితుడై సర్వసైన్య సమేత ముగా మందరగిరి శిఖరమునకేగి అందు పూజప్పరముకడ వేంచేసియుండు జగన్మాతను సాధారణ స్త్రీయని భ్రమపడి యామెను బంధింపుడని సేనానుల కాజ్ఞయిచ్చెను. అపుడా దేవి భీకరాకారమును దాల్చి కన్నులనుండి నిప్పుల గురి

పించుచు శూలపాణియై దానవులపై దగులుపడి రాక్షస మూకలనెల్ల నిర్జీవులగావించెను. అపుడురాక్షసరాజు తన సేనాధిపతులజూచి ఆమెను బరిమార్పుడనెను. అపుడుసేనా నాయకులు ఖడ్గముల ధరించి దేవిపై కురికిరి. ఆమె వారిని నిముసమున బరిమార్చగా మహిషాసురుడు క్రోధాకారుడు గా మారి సింహనాద మొనరించినవాడై హుంకరించి యామెపై దగులుపడెను

అంతట జగజ్జనని దానవాధి పనినిజూచి కన్నులనెఱ్ఱి జేసి "ఓరీ! రాక్షసాధమా! మీరొనరించిన దుర్మార్గములనేక ములు గలవు. ఆపాపకార్యములవలన మీపాపముకొండలై పెరిగినది. ఇక మిమ్ము దయదలపరాదని మిమ్ము రూపు లేకుండ జేయసంకల్పించి యీమహిమున యవతరించితిని. నిను జంపక విడువను. రారమ్ము నీధైర్య శౌర్యబలపరా క్రమముల జూతము రమ్ము." అని మహిషారునిపై బడి క్రిందబడునట్లు గదచేపోది, పాదములతో క్రొక్కి, శూల ముచే బొడిచి ఖడ్గముచే వాని శిరమును క్రుంచెను.

అపుడు త్రిమూర్తులు దేవతలు తమ వెంటరాగా మహాశక్తిస్వరూపురాలై యున్న జగన్మాతనుటదిలకించి కర ములు ముకుళించి నమస్కరించి యామెను శాంతింపుమని ప్రార్థించిరి. అందు కామె త్రిమూర్తులారా! ఇప్పటికిదానవ సంహారంబుగిసినది కాని వారు మరలప్రబలకపోరు. రాక్ష సులు సామాన్యులుగారు. మహాశక్తిపరులు తపోధనులు. వారు మిమ్మారకుండనీయరు. దేవనాథుడవ్వను, దేవత లన్నిను వారికి బొత్తిగా సరిపడదు వారు సురరాజును బరి

మార్చి స్వర్గమును తమ యధీనము గావించుకొని దేవతలను రూపు లేకుండ జేయవలెనని పట్టుదల వహించి యున్నారు. కనుక వారు చెలరేగినపుడంతయు నేను అవతరించి వారిని జంపవలెనన్న బాగుండదు. నాపనిని త్రిమూర్తులే చేయవలెనని పలికెను.

అందుకు త్రిమూర్తులు మహాశక్తికి ప్రణమిల్లి తల్లీ! నీయంతటి శక్తి మాకుగలదా మమ్ము శక్తివంతులగావించి మేము యేయే కార్యముల నిర్వహింపవలసి యుండునో వెలవిచ్చిన మీ యాజ్ఞానుపరిపాలింతుమనిరి. అందులకు ఆదిశక్తి త్రిమూర్తులగని "ఓ బ్రహ్మదేవా! నీవు ప్రపంచము సాగుటకు గావలసిన ప్రాణులను, వారికి వలయు సకల వస్తుసముదాయములను సృష్టించుచుండుము, నిన్ను శక్తిసంపన్నుని కోకరించితి. నిన్ను గూర్చి యెవరేని తపమొనరించిన చో వారికి ప్రసన్నుడవై విఘ్నముల యోచించి వరములనిచ్చుచుండుము. ఇందుసరస్వతి నీకు సహాయపడుచుండును. నీవు సత్యలోకమునకధిపతివై పాలించుచుండు" మనెను.

ఆవల శ్రీవిష్ణుమూర్తినిజూచి "ఓయీ! నీవు వైకుంఠమును పాలింపుము. నీవు దుర్మార్గులను శిక్షించు నెపముల సన్మార్గులను రక్షింపుచుండవలెను. దుర్మార్గుల బరిమార్చుటకు దగిన రూపముల దాల్చుగల శక్తిని ప్రసాదించితిని. ఎవరి నేరీతిశిక్షింపవలెనో, ఎవరి ఎటుల గాపాడవలెనో యోచించికార్యముల నెఱవేర్చుచుండుము. నీవేయవతారమునుదాల్చిన సుశ్రీలక్ష్మినీతోడనేయవతరించి నీకుసహాయపడుచుండును" అనెను.

పిమ్మట మహేశ్వరునిజూచి ''శంకరా! నిన్నుకైలాస మునకధిపతిని గావించితి. పార్వతితోగూడ కైలాసమును పాలింపుచుండుము. నీకును నిన్ను తపమున మెప్పించువారికి వరముల ప్రసాదించుశక్తి నొసంగితిని, ఆ వరముల నొసం గుచో వానిని మరల ప్రగ్రహింపగల మార్గమును యోజించి, తగురీతిని విఘ్నముల నూహించి యిచ్చుచుండుము. నీకును దుష్టశిక్షణ మొనరింపగలశక్తి నొసంగుదును. నీకు నీకార్య ములలో ఉమాదేవి తోడపడగలదు. ఆంతయేగాక నీవు కోరినరూపమును దాల్చగలవు. ఈకార్యములలో త్రిమూర్తు లగు మీరు ఒకరినొకరు సంప్రతించుచు, ముగ్గురును ఒకరి కొకరు సహాయపడుచు సర్వప్రపంచములనుచక్కగ పాలింప వలెను. నేను మిమ్ముసదాకనిపెట్టి అవసరమైనప్పుడు తోడుం డెద'' నని యదృశ్యమై పోయెను.

జగజ్జనని యదృశ్యమైనంతనే త్రిమూర్తులు దేవతలను, ఋషులను, గరుడగంధర్వ కిన్నెర కింపురుషులజూచి మీరు మీనిలయంబునకేగి సంతోషంబుతో నుండుడు. ఇంద్రుడు దేవలోకమునకురాజైపాలించుచుండును. మీకేకష్టం వచ్చి నను సురరాజునకు దెలుపుడు, అతడు మమ్ము సహాయపడ గోరును. తక్కంగల కార్యాలన్నిటిని మేము జూచుకొందు మని వారినిబంపి ఎవరిలోకంబునకు వారేగిరి. ఆరీతి గొన్ని సంవత్సరములు గడచిన తదుపరి.

సీ. పరమపదంబున ♦ బరగెడి వైకుంఠ
ముస స్వర్ణనిర్మిత ♦ ముగను నాల
యంబుండ దానియం ♦ దాది శేషుండను
వేయితలలపాము ♦ వెలయ దాని

మీఁదను శ్రీదేవి ♦ భూదేవి మధ్యను
పంచాయుధంబుల ♦ బరగఁదాల్చి
పులుగుల దొరకొల్వ ♦ వరమునితాలుపు
సృష్టింప బొక్కిట ♦ స్రష్టసర్వ
తే-గీ. దేవరాక్షసమానవ ♦ తిర్యగాది
జీవకోటులసృష్టింప ♦ జెడుగులొదవ
దాల్చెబొకార్వ హరి♦ యవతారములను
వానిదెలపెద వినరయ్య ♦ మాన్యులార!

శ్రీ మహావిష్ణువు వైకుంఠము నందుండి జగన్నాథ యానతిచొప్పున దుష్టశిక్షణ శిష్టపరిపాలన మొనరించుటకు అవతారములదాల్చ సంకల్పించి ప్రపంచమునందు ఎచ్చట యెప్పుడు పుణ్యము నశించి పాపము లెక్కువగునో అపుడు ఆ పాపకార్యములకు మూలకారకులను ద్రుంచి పాపముల బోకార్చి ధర్మముల స్థాపింతునని సెలవిచ్చిన వాడయ్యో. శ్రీమన్నా నారాయణుడు ధర్మసంస్థాపనార్థము ఉచ్చనీచయను భేదమును జూపక ఒక్కొక్క అవతారమును ఒక్కొకరీతి యెత్తుచుండును.

1. మత్స్యావతారము

సీ. సోమకాసురుడను ♦ నామంబు గలిగిన
రాక్షసవీరుడు ♦ రయముతోడ
సత్యలోకంబును ♦ జక్కఁగబాలింప
గనలేక నీర్ష్యతో ♦ గడలివచ్చి

భారతీ పతినట్టి ♦ బాధింపగా నెంచి
చదువులగొని చనె ♦ సంద్రమునకు
జదువుల వేల్పంత ♦ పదివేసములసామి
కడకేగి మొరలిడ ♦ కరుణగలిగి

తే-గీ. అదిదేవుండు మత్స్యమై ♦ యసురుజంపి
సంద్రమునడాచి యుంచిన ♦ చదువులెల్ల
బ్రభమమున తెచ్చి యిచ్చెను ♦ భద్రముగను
జొరపొగడంగ శక్యమే ♦ హరిని భువిని.

ఈరీతి మత్స్యావతారంబును సాగించిన శ్రీగోవిందుడు మరికొంతకాలమునకు తాబేటిరూపముతో నవతరింప వలసివచ్చెను.

2. కూర్మావతారము

సీ. సురల మృతంబును ♦ జుట్టుకొనగ నెంచి
మందరాద్రికినిజి ♦ హ్మాగము జుట్టి
సురులోక ప్రక్క-య ♦ సురులోక వంకను
బాలసంద్రంబున ♦ బట్టిచిలుక
వెన్నుడు కూర్మమై ♦ వీపునగిరిమోయ
నమృతంబు బుట్టిన ♦ వరసి దాని
మాకంచు దేవతల్ ♦ మాకని యసురులు
వాదులాడగజూచి ♦ వాదుదీర్ప

తే-గీ. మోహినీ వేషమునవచ్చి ♦ మోసగించి
అమృతమును నిర్జరులకును ♦ నట్టియొసగె
ఇటుల రెండవ యవతార ♦ మేగెవినుడు
చెప్పశక్యమె శ్రీహరి ♦ చేష్టవిని.

ఆపల మఱికొన్ని సంవత్సరములు జరిగిన తదుపరి శ్రీహరి మరల పందిరూపమున యవతరింప వలసిన పని వచ్చెను.

కే. వరాహావతారము

అసుర నాయకుడగు ♦ హిరణ్యాక్షుండు
భూదేవి బొలియించు ♦ బుద్ధితోడ
చేతులతోబట్టి ♦ చిటు చాపకై వడి
జుట్టి వారాశిని ♦ జొనిపివచ్చి
దేవసాధునిమం ♦ దేవతావళినెల్ల
బహుభంగులనుబట్టి ♦ బాధసేయ
భూదేవితోగూడి ♦ పోయినవారందఱు
ప్రార్థింపవిష్ణువు ♦ భయముబాపి

తే-గీ. వచ్చి వారాహరూపుడై వార్ధి జొచ్చి
యసురువధియించి వెనువెంట ♦ నవనిదెచ్చి
ఇటులమూఁడవయవతార ♦ మేగెవినుడు
విష్ణుమాయల డెలియగా ♦ వీలుపడునె.

ఆరీతిగా హిరణ్యాక్షుని జంపినంతట వాని సోదరుడు శ్రీహరిని జంపవలెనని తీర్మానించుకొని ఆతని బరిమార్చ గలశక్తిసంపాదించగోరెను. అందుకతడు మహారణ్యంబుల కేగినిరాహారుడై కూర్చుండి ఘోరతపస్సు బ్రహ్మనుగూర్చి చేయ మొదలిడెను. కడకు అతని చుట్టు చీమలు పుట్టల బెట్టగా ఆవల్మీకములో సర్పములు నివసింపసాగెను. అప్పటి కిని హిరణ్యకశిపుడు చలింపక తపోనిమగ్నుడై యుండెను.

అపుడు బ్రహ్మ ఇక అలస్యము చేయరాదని హిరణ్య కశిపునికి బ్రత్యక్షమై వరమును గోరుకొమ్మనెను. అపుడు హిరణ్య కశ్యపుడు సర్వేశ్వరా! నేటికి మిమ్ములగంటిని. నాయదృష్టము పండినది. వన్న నాకు గావలసిన వరమును గోరుకొమ్మని సెలవిచ్చితిరి. అటులైన నాకు జావులేకుండ వరమును బ్రసాదింపుడని బ్రార్థించెను. అపుడువాణీపతిభక్తా గ్రేసరా! అట్టి వరమును గోరుట సరికాదు. అట్టి వరమును యీయ నేనసమర్థుడను. నాచేతనగు వరమును మాత్రమే నేనియ్యవచ్చును. నాశక్తికి మించని వరమును ఒకటిగాదు యెన్నియైనను యిత్తునని నెమ.

అందుకు హిరణ్యకశ్యపుడు ఓలోకేశా! అటులైన నాకు దేవతలచేతగాని, రాక్షసులచేతగాని, మానవుల చేతగాని, అకసమునసైనను, భూమిమీదనైనను, ఇంటగాని, ఇంటి వెలుపలగాని, ఖడ్గముచేగాని, మంత్రముచేగాని, రాత్రి గాని, పగలుగాని చావులేని వరముల బ్రసాదింపుమనెను. అందుకు బ్రహ్మయోచించి సరి నీవుకోరిన వానిచే జావురాని వరమును బ్రసాదించితిని, ఇక నీవు నీతపమును జాలించి సకలప్రాణులను దయతో జూచుచుండుమని యదృశ్యు డాయెను. అంతట హిరణ్యకశ్యపుడు శ్రీహరిని బరిమార్ప దలచి ఆయత్తపడుచుండ హరి దానికి దగిన యవతారము దాల్చెను వినుడు.

శ్రీమన్నారాయణుడు హిరణ్యకశిపునకు విధాత యొసంగిన వరములను దెలిసికొని వానికి దగినట్లు క్రొత్త యవతారము నెత్తదలచెను. అందు కతడు హిరణ్యకశిపుని

బరివార్పుటకు దగినట్లుగా అటు మృగము ఇటు మానవుడు కాని నరసింహావతార మెత్తగోరెను.

4. నరసింహావతారము

సీ. అనుజుని జంపిన ♦ యాదిదేవుని జంప
శపథమూని యట్టి ♦ చందభుజుడు
భగవంతు నెప్పుడు ♦ ప్రార్థించు ప్రహ్లాదు
డను తనపుత్రుకు ♦ నటులెబట్టి
చెప్పనశక్యమా ♦ గొప్పబాధ బెట్ట
బాలుండు తాళక ♦ భక్తిమీర
శ్రీనివాసా నన్ను ♦ జేరి బ్రోవుమటన్న
స్థంబములోనుండి ♦ సరగవచ్చి

తే-గీ. పొట్టజించియు దానవు ♦ బట్టిత్రుంచె
స్థిరవిలాసుండునౌ నర ♦ సింహామూర్తి
ఇటుత నాల్గవ యవతారము ♦ మేగెనయ్య
హరిని గీర్తింప మనకిల ♦ నలవియగునె.

5. వామనావతారము

శ్రీనరసింహావతారము ముగిసిన పిదప గొన్నాళ్ళకు రాక్షసవర్గములో బలియనువాడు ప్రబలినవాడై అనేక సంవత్సరములు నిష్టతో తపమాచరించి సకల ఐశ్వర్యంబుల సంపాదించెను. అతడు అనేకవిధముల దానములుచేసి కీర్తి సంపాదించి బలిచక్రవర్తి యని పేరుగాంచి స్వర్గమును పరిపాలింపదలచెను. అపుడు శ్రీహరి వానిని రూపులేకుండ జేసి స్వర్గాధిపతియగు దేవేంద్రునికి మేలొనరించెను.

సీ. అడిగిన యర్థంబు ♦ నంతయు సమకూర్చు
బలిచక్రవర్తిని ♦ బట్టిచంప
గాశ్యపు నింటను ♦ గడుగుజ్జుకూపుతో
జనియుంచి సుతుడుగ ♦ ఘనతగాంచి
వామనుడనుపేర ♦ వచ్చి యాబలిఁగోడ
మూడు పాదంబులు ♦ మోయునంత
ధాత్రినినాకిమ్మ్ ♦ దానంబుగానవి
యవనినంతయు నొక్క- యడుగుమరియు

తే-గీ. ఆక సమునకు రెండవ ♦ యడుగుబెట్టి
యసురబరిమార్చె మూడవ ♦ యడుగునిడియు
యిటుల యైదవ యవతార ♦ మేగెనయ్య
హరియు దలచిన కానిదీ ♦ యవనిగలదె.

6. పరశురామావతారము

ఆరీతి కొంతకాలము జరిగిన యంత మీద భూలోకములో ధర్మము నశించినది. కొందరు రాక్షసులు సన్మార్గుల కడుంగడు కష్టపెట్టుచుండగా కొందరు క్షత్రియులు వారితోపాటు యన్యాయకార్యము లాచరింపుచుండ క్షత్రియుల రూపుమాపు నిమిత్తము నారాయణమూర్తి మరల అవతరింపగోరెను. ఈయవతారమున మానవజన్మమునందుత్తమ జన్మమగు బ్రాహ్మణుల వంశమున బుట్టవలసి వచ్చెను.

సీ. జమదగ్ని సూనుడై ♦ జనియించి పరశువు
కరమున ధరియించి ♦ కఠినమతిని
బదియు తొమ్మిది రెండు ♦ మాఱులు నృపతుల
పరిమార్చి భూముల ♦ బట్టికొనియు

దేవతలను బిల్చి ♦ దివ్యభూముల నెల్ల
దానంబు జేసెనా ♦ ధాత్రిసురుడు
జపతపరాక్రమ ♦ ప్రతిభతో దిరిగిన
బ్రాహ్మణ వీరుడై ♦ పరుగుచుండు

తే-గీ. అతని దాకగ నేరికీ ♦ యలవిగాక
రాజులందరు భీతిలి ♦ డాగుకొనిరి
ఆపుడు శ్రీ రామచంద్రుడు ♦ యవనిబుట్టి
పరశురాముని శక్తిని ♦ భంగపరచె.

ఈరీతిగా తన యంశముతో నవతరించిన పరశురాముని శ్రీహరి దశరథసుత కుమారుడై జన్మించి ఆ పరశురామావతారమును ఆయవతార పురుషుని సమస్తబలంబులను తన యవతారమున లీనము గావించుకొనదలచినవాడై పరశురాముడు తన్నెదిరింపరాగా నతని శక్తినంతయు లాగికొనినవాడయ్యెను.

7. శ్రీ రామావతారము

రామాయణ-సీసమాలిక

సీ. రాక్షసవర్గముల్ ♦ తోయిడి బెట్టంగ
దాపస సంతతుల్ ♦ దాళలేక
సురనాథుతోడస ♦ సురవైరి విష్ణువు
జేరికష్టములెల్ల ♦ జెప్పికొనగ
దశరథన్నృపతికి ♦ దనయుండనై పుట్టి
యసురులదునిమెద ♦ ననుచు జెప్పి
దశరథునకుబుట్టి ♦ తమ్ముడో సౌమిత్రి
గలసి దానవులను ♦ బనిమగూల్చి

జనకునిపంపున ♦ సౌమిత్రివెంటరా
సీతతో నడవుల ♦ జేరబోయి
ఖరదూషణాది రా♦క్షసులను బొలియించి
దుష్టశూర్పణఖను ♦ ద్రుళ్ళడంచి
రావణుజేతెంచి ♦ రమణిసీతనుగొని
చన; యూమెజాడల ♦ సడినెరుంగ
యాకలిబాధచే ♦ యడవిలో దిరుగుచు
శబరి యొంగిలి ♦ పండ్లు చవియెఱింగి
పొలతి కిష్కిందకు ♦ బొమ్మనబోవుచో
హనుమంతు గనుగొని ♦ యతడు వేగ
సుగ్రీవుమైత్రిని ♦ సుముఖుడై గూర్చియు
వాలిజంపుటమన్న ♦ వరుసజంపి
కపులని బంధించి ♦ కపిసేనతోబోయి
లంక జేరియు దాని ♦ గల్గ బట్టి
అతిధైర్యగుణధాము ♦ నతికాయుగజరూపు
నింద్రజిత్తునితోడ ♦ గ్రిందిత్రోక్కి
సంగ్రామ కేళీవి ♦ చత్తువిక్కృతరూపు
కుంభకర్ణునితోడ ♦ గూలద్రోక్కి
యన్యజీవాంతకు ♦ నతబలు నూర్ధ్వకరు
ఖడ్గరోమునితోడ గలిపిత్రోక్కి
స్థిరబలు బహుగర్వ ♦ శిశుహత్య స్త్రీహత్య
సింహవక్త్రునితోడ ♦ జితుకద్రోక్కి

తే-గీ. మహితవిక్రమువ్యాఘ్రాంకు ♦ మకరదంష్ట్రి
రశ్మికేతు మహాకాయ ♦ రణములోన
రావణాసురుతోడను ♦ రణమునందు
గూల్చిరావణు తమ్ముని ♦ కోర్కిదీర
లంకకధిపతినొనరించి ♦ పొంకమొగను
సీతతోడనయోధ్యను ♦ జేరిరాజ్య
భారమును వహియించెను ♦ భారమనక

8. బలరామకృష్ణావతారము

సీ. ఆది శేషుండు తా ♦ నష్టమ మగునవ
తారంబుకొని వసు ♦ ధను జనింప
వసుదేవు గృహమున ♦ బలరాముడనుపేర
జన్మించి సతీ_ర్థి ♦ జాలగాంచి
తనహలాయుధముచే ♦ దనుజులజెండాడి
బాధలమాన్పితా ♦ బ్రతిభగాంచె
పుండరీకాక్షుండు ♦ బూర్ణాశములతోడ
శ్రీకృష్ణమూ_ర్తియై ♦ చెలగిమున్ను
కంసుడు పెట్టిన ♦ కష్టంబులన్నిటి
తప్పించుకొనగల్గె ♦ ధైర్యమునను

తే-గీ. కంసు వధియించె కృష్ణుని ♦ కథలుజెప్ప
యాదిశేషునికైనను ♦ నలవియగునె
ధార్తరాష్ట్రులబొలియించి ♦ ధర్మజునకు
జయముగలిగించి రాజ్యంబు ♦ రయముతోడ
గూర్చి యవతారమునుబాసె ♦ కృష్ణుడంత

9. బుద్ధావతారము

సీ. శుద్ధోదనుండును ♦ శూరనృపాలుని
భూమాయాదేవి ♦ భాగ్యరాశి
పుత్రులులేరని ♦ పొగలుచు నుండగ
పుట్టె గౌతముడను ♦ పుణ్యమూర్తి
విష్ణుసంభూతుడై ♦ వెలసినయాతడు
బాపనెంచియు భువి ♦ బాపములను
జీవహింపలజేయ ♦ శ్రేయంబుగాదని
బోధించి మాన్పెనా ♦ బుద్ధమూర్తి

తే-గీ. బౌద్ధమతమును స్థాపించి ♦ బుద్ధితోడ
తపములొనరించి భువిని స ♦త్యంబు నెరపి
ధర్మస్థాపన జేసిన ♦ దాతయగుచు
వెలసి స్వర్గంబు జేరెనా ♦విష్ణుగలయ.

ఈరీతిగ శ్రీహరి సమయానుకూలముగ దుష్టశిక్షణ శిష్టపరిపాలన జేయుచుండుగామరల భూలోకంబున పాపాత్ము లెక్కు-వై యపరిమిత పాపము లొనరించుచుండగా భూదేవి శ్రీహరిని' పాపముల బోగొట్ట ప్రార్థించెను.

10. కలికావతారము

సీ. కడపటియుగమగు ♦ కలియుగంబునజాల
బాపముల్ మిక్కిలి ♦ ప్రబలుచుండ
మానవుల్ మాధవ ♦ మహిమల దలచక
గర్వంబుతోడుత ♦గ్రాలుచుండ్రు

కలిమాయలను మాన్పి ♦ కష్టములీడేర్చి
యతనినిగృహమున ♦ ననగ చరిత
కలియుగంబున దాను ♦ కల్కినతాడ్డై
పుట్టుసుశీలకు ♦ పుత్రుడగుచు
తే-గీ. కలియుగంబున గలిగెడి ♦ కలుషములను
గనియు నీయవకారంబు ♦ చాలదనుచు
బహుళరూపంబులనుగొన ♦ వలెనటంచు
దాల్చె దాల్చుచునున్నాడను ♦ తాల్పగలడు.

భక్తవరులారా! కలియుగము ప్రారంభమునకు పూర్వము శ్రీమన్నారాయణమూర్తి దాల్చిన యవతారములు కృత త్రేతాద్వాపరయుగంబులందు జరిగెను. ఆ యుగంబుల పరిమితి వివరించెద వినుడు.

కృతయుగము.....17,20,000
త్రేతాయుగము.....12,69,000
ద్వాపరయుగము.....8,64,000
కలియుగము.....5060 సంవత్సరములు

ఈ కలియుగ మింకను జరుగుచుండుట మీ కందరకు తెలిసియేయున్నదికదా, ద్వాపరయుగము శ్రీకృష్ణావతారముతో అంత్యమైనది, అప్పటినుండియే కలియుగప్రారంభమైనదని పెద్దలు నిశ్చయించిరి. కలియుగము ప్రారంభించునప్పటికి పాండవుల సంతతివాడగు పరీక్షిత్తు రాజ్యపాలనము జేయుచుండెను,

ఈ పరీక్షిత్తుపాండవమధ్యముడగు అర్జునునకు జన్మించిన అనక్ర పరాక్రమోపేతుడగు అభిమన్యునకు ఉత్తర

యందు జన్మించెను. ఇతడు కలియుగమున ధర్మమును తప్పక పరిపాలింపవలెనని రాజ్యమును పాలించుచుండెను.

పరిషత్తు రాజ్యభారమును వహించి పరిపాలించునెడ ధర్మమునాలుగుపాదములపై నడుచుచుండెను. అపుడు కలి పురుషుడు తనప్రభావంబుచే ధర్మముల నసింపజేయవలెనని తనశక్తిచే ధర్మదేవతను బాధింపదొడగెను. అపుడుధర్మ దేవత గోరూపమును దాల్చి దుఃఖించుచుండగా పరిషత్తు కలిపురుషునివలన ధర్మదేవతకు సంబంధించిన బాధలను మాన్పి మరల యథారీతి ధర్మముల నెలకొల్పెను.

ఆవల పరిషత్తు పుత్రుడగు జనమేజయుడు తండ్రి సింహాసనము నధిష్టించి తనపూర్వులవలెనే ధర్మముతప్పక రాజ్యపాలన మొనరించుచుండెను. ఈరీతిగా కలియుగమున సుమారు మూడువేల సంవత్సరములు గడిచెను, తదనంత రము విక్రమార్క-మహారాజు శకము ప్రారంభమైసుమారు 2015 సంవత్సరములు గడిచెను ఆవల శాలివాహనశకము ప్రారంభమై వేయినెనిమిదివందల యెనుబదియొక సంవత్స రములు గడిచెను.

ఆవల గొంతకాలము కలియుగమున యెవ రెంత కారము రాజ్యపాలన మొనరించినది తెలియుటలేదు. కాని బౌద్ధమతావలంబకుడగు అశోకచక్రవర్తితో మరల ధర్మ పరిపాలనము మొదలైనది.

అశోకుడు—ఇతడు 2216 సంవత్సరముల క్రిందట రాజ్యమునుచక్కగాపరిపాలించెను. అశోకునితర్వాత నలల వంశపు రాజులు యేడువందల సంవత్సరములును, నొకలంబ

రాజులు మూడువందలయేండ్లును, ఆంధ్రరాజులు సుమారు రెండవందల సంవత్సరములును రాజ్యమేలిరి.

మహమ్మదీయ శకము—అటుపిమ్మట యితర దేశములనుండిమహమ్మదీయులువచ్చి భరతదేశమును పాలించుచుండిరి. మతాంతరులగుతురుష్క-చక్రవర్తుల పరిపాలనము ప్రారంభముకాగానే ధర్మదేవతకు కష్టములు ప్రాప్తించెను. మహమ్మదీయులుహిందువులను బహువిధములపరిభవించిరి. హిందూపవిత్ర దేవాలయములనుపడగొట్టిరి ఆలయములలో గోవులను సంహరించియు, విగ్రహములను బగులగొట్టియు, దేవుని సొత్తునుకొల్లగొట్టియు, బ్రాహ్మణులను బాధించియు స్త్రీలను చెఱబట్టియు, అనేకవిధములుగా పాపకార్యము లొనరించుచు ధర్మము సత్యమును వానిని లేకుండ జేసిరి.

విజయనగర రాజ్యమును నిర్మించినవారు హరిహర బుక్క-రాయలను యిరువురు సోదరులు. హరిహరరాయలు బుక్క-రాయలు తొలుత ఓరుగల్లుమ ముఖ్యపట్టణము నొనరించుకొనిపరిపాలించుచుండినప్రతాపరుద్రమహారాజు దగ్గఱ అతని ధనాగారమునకు కావలివారుగా వుండిరి. ఇట్లుండగా ఢిల్లిలో పాదుషాయై పరిపాలించుచుండిన ఖల్జీవంశస్తుడగు అల్లావుద్దీను అను నతడు దండయాత్ర వెడలివచ్చెను. అతని సేనానాయకుడగు మాలికాఫర్ అను నతడు ప్రతాపరుద్ర మహారాజును కైదీగా నొనరించి ఢిల్లీకి గొనిపోయెను.

అప్పుడు ధనాగారమున కధిపతులై యుండినహరిహర రాయలు బుక్క-రాయలు ధనాగారమునుండి తమచేత నైనంతధనముసేకరించుకొనిమహమ్మదీయులకె జిక్కకుండ

తప్పించుకొనివచ్చి. కర్ణాటకమునందలి ఆనెగొంది యను చోట నిలిచిరి. వారు తమకడనుండిన యపారధనముతో విద్యారణ్యులను ఒక ఋషిసలహా ననుసరించి ఒకమహానగరమును నిర్మించి దానికి విద్యానగరమని పేరిడిరి. అదియే తర్వాత విజయనగర సామ్రాజ్యమను పేరుతో ప్రపంచమున మిక్కిలి ప్రసిద్ధి వహించినదాయెను.

ఈ విధముగా హరిహరరాయలు బుక్కరాయలు సుమారు ఇప్పటికి ఆరువందల సంవత్సరముల క్రిందట విజయనగరసామ్రాజ్యమును స్థాపించి పాలించుచుండిరి. హరిహర బుక్కరాయ లిద్దరి పరిపాలనానంతరము ఈ క్రింద వివరించిన రాజులు విజయనగరమును పాలింప గలిగిరి.

సీ. ఆనెగొందిని జేరి♦హరిహరరాయలు
బుక్కరాయలు మహా♦బుద్ధితోడ
విజయనగరమున♦విజయులై పాలించి
సత్కీర్తి గడియించి♦చనిరి పిదప
గండరాయుడును♦ఘనతతో పాలించె
లిరుపాక్షరాయడు♦వెలసెనంత
రాజశేఖర ప్రౌఢ♦రాయలు తదుపరి
వీరరాయులుకూడ♦వెలసెనవల
మల్లికార్జునుడంత♦మహిమతో పాలించె
వచ్చిరిసాళువ♦వారుపిదప
సాళువవారిలో♦సత్కీర్తి గాంచిన
సింగరాయండేలె♦క్షితినిబాగ
నరసరాయుడు చాల♦నేర్పుతో బాలించె
కృష్ణరాయుండేలె♦గోరినటుల

శ్రీకృష్ణరాయలు క్షితిసేలు నప్పాతం
రామరాజ్యముబోలె రంజిలంగ
ఆతని తమ్ములు అచ్యుతుండును సదా
శివరాయలనుపారు జెలుగిరంత
జయభేరి వేయించి జగతిని బాలింప
నరపతిరాజులు కోరినారు
రామరాజేలెను రాజ్యంబు కొన్నాళ్ళు
ఆతనితో రాజ్యంబు అస్తమించె
ఆవల ధర్మంబు అడుగంటగానాడె
తురకలు ప్రబలిన కారణమున
తే-గీ. ధర్మదేవత తనకెందు దారిలేక
సత్యదూరులగ నితాను సైపలేక
దుష్టులంజూచి భీతిల్లి తొలగెనకట
దిక్కుతోపక శ్రీహరి దిక్కటంచు
జేరివైకుంఠమున కేగి శేషశయను
ప్రార్థనము జేసెనిట్టుల భక్తితోడ
ఓసర్వేశ్వరా!

శ్లోకము

యదా, యదాహిధర్మస్య గ్లానిర్భవతిభారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానంసృజామ్యహం,
పరిత్రాణాయసాధూనాం వినాశాయచదుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.

(భగవద్గీత)

అని మీరు తొల్లి సెలవిచ్చియుంటిరి. ఇపుడు కలియు గంబున పాపము పెరిగినది. ఇంకను, దినదినమునకు పాపులు వృద్ధియగుటే కాని తగ్గుట లేదు. దేశమును ప్లేచులాక్ర మించి దుష్టపరిపాలనము సాగించుచుండిరి. దేవుడన్నను దేవాలయములన్నను వారు సహింపలేక నిర్మూలించు చున్నారు. గో, శిశు, స్త్రీ, నరహత్యలను గావించుచుం డిరి. సత్యధర్మముల కట చోటులేదు. వారి దుండగములు నెన్నియని వర్ణింపగలను. ఆదిశేషునకైనను వర్ణింప నలవి కాని పాపకార్యములు జరుగుచుండ తామేమియు తెలియ నటులూరకుండుట న్యాయమా. దుష్టశిక్షణ శిష్టపరిపాలన మీది యని జగజ్జనని సెలవిచ్చియుండ మీ రాకార్యములు నిర్వహింపనిచో గలియుగమున సన్మార్గులు నశింపవలసి యుండును. మీరు మరల యేదేనొక యవతారముందాల్చి దుష్టుల జెండాడి ధర్మమును నెలకొల్పవలెనని ప్రార్థించెను.

అందుకు శ్రీహరి యోజించి ధర్మదేవతా! భీతిల్ల కుము. నేను మరల ఆంధ్రదేశమునందవతరించి ధర్మమును నెలకొల్పెదను. ఈయవతారమున దుష్టులనుగూడ దండింప కయే సన్మార్గుల నొనరించుచు ధర్మమును నెలకొల్పెదను. ఇక నీవు పొమ్మనగా యామె సంతసముతో నమస్కరించి వెడలెను ఇక నాయవతారమును గూర్చి తెలిసికొందము

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర

మొదటి ప్రకరణము

అవతార ప్రారంభము

ఆరీతి ధర్మదేవత నోదార్చి, మరల కలియుగమున యవతరించెదననియు ధర్మయుల నెలకొల్పెదననియు శ్రీహరి యానతిచ్చి అటుపిమ్మట యోజించి తానొక్కడే యవతార మును దాల్చిన ప్రయోజనముండదని తలచి బ్రహ్మమహేశ్వరులతో యోజించి చేయదలచెను.

శ్రీమన్నారాయణుడు తదుపరి సత్యకైలాసలోకాధిపతులగు వాణీనాథ పార్వతీరమణులను రాబనిచెను. లక్ష్మీకాంతుని సంకల్పము నెరుంగగోరి స్రష్ట, శంకరులు బయలుదేరి వైకుంఠపురమున కేగి లక్ష్మీకాంతుని దర్శించిరి. శ్రీవహావిష్ణువు వారిని యుచితాసనాసీనుల గావించి కుశల ప్రశ్నానంతర మిటుల బల్కెను.

ఓ బ్రహ్మేశంకరులారా! మనముగ్గురకును మరల పని గలిగినది. కృత త్రేతా ద్వాపరయుగంబులలో మనము మువ్వుల జెండాడి ధర్మమును నెలకొల్ప గలిగితిమి. ఇంతకు

ముందు ధర్మదేవత విచ్చేసి కలియుగంబున సధర్మములు కొండలవలె బెరిగిపోవుచున్నవనియు ఆపాపభారమును తా నిక భరింపజాలననియు, దుర్మార్గులను సన్మార్గులుగ నొన రించి సత్యమును నెలకొల్పరమ్మని ప్రార్థింపగా అందుకు నేను సమ్మతించి మీతో మోచించి తగినట్లు చేసెదనని చెప్పితిని. అందుల కామె సంతసించి సర్వేశ్వరా! ఆలస్య మొనరింపవలదని మరిమరి ప్రార్థించి వెళ్ళినది.

ఇపుడు కలియుగమున తొంటి కృత త్రేతా ద్వాపర యుగంబులలోవలె దానవులు ప్రబలిపాపకార్యములొనరిం చుటలేదు కాని దానవులనుమించిన ప్రజలేమహాదుష్కర్మల నాచరించుచుండిరి. ఎవడో ఒక రాక్షసుడు ప్రబలి వాడు చేయు ఘోరకృత్యములను బోకార్చుటకే మిక్కిలి కష్టపడ వలసియుండెను. ఇపుడన్ననో కలియుగమున ఒక్కొక్క నరుడే ఒక్కొక్క రాక్షసునివలె తయారై యధర్మముల నొనరించుచుండి రనగా బ్రహ్మ శంకరులు శ్రీహరినిజూచి కలియుగ రాక్షసు లొనరించుదుండగముల బేర్కొనగోరిరి. అప్పుడు శ్రీహరి కలియుగమున మానవులుగా జన్మించిన రాక్షసుల కృత్యములను చెప్పదొడంగెను.

సీసమాలిక

ఓ బ్రహ్మా! శంకరా! ♦ ఓపికతోమీరు
కలికాని దుష్కర్మ♦ములను వినుడు
మానవులందఱు♦చానవతతి జేయు
చుండు పనుల్ జేయు♦జొచ్చిరంట
హిందూన్యపాలురు♦హితమును బాటించి
ధర్మమార్గంబున♦తమదుపాల

. నంబును సాగింప♦నరులు సంతస మొంది
ధర్మమార్గంబున♦దిరుగుచుండు
దానవులందఱు♦ధర మ్లేచ్ఛులై పుట్టి
పాపాలనొవరింప♦బాలుపడిరి
హిందువులందఱు♦హింసించుటయెగాక
గుడిగోపురంబుల♦గూల్చిరంట
ప్రతిమలబొకలించి♦బంగారము నెగాక
నవరత్నతతిగొని♦పోయిరంట
గుళ్ళలోపల జేరి♦గోవులవధియించి.
బ్రాహ్మణులనుబట్టి♦పరిభవించి
పతివ్రతలనుబట్టి♦పలువిధంబుల మాన
భంగబు జేసియు♦వదలిరంట
మధుసుర పానంబు♦మరిమరి జేయుచు
గోమాంసమునుదిన♦గోరిరంట

తేటగీత

యజ్ఞములజేయ జూచియు♦అగ్నులందు
కల్లుర క్తముంజోసియు♦కలుషమతులు
యజ్ఞదాతల గొట్టించి♦యనిపిరంట
సాధుపుంగవులను బట్టి♦చంపిరంట
బాటసారుల బాధించి♦వారిధనము
కొల్లగొట్టిరి, సత్రాల♦గూల్చిరంట
చెప్పరానట్టి కార్యముల్ ♦ జేసిరంట
చురక లొనరింప జాలని♦తులవపనులు
ధరనులేపని పలికెను♦ధర్మతల్లి
అట్టివారిని సహియింప♦నగు నెమనకు

ఆయుర్వాక్కుల పాపకార్యముల జూచి హిందువులలో గూడ యవినీతి ప్రబలినదని చెప్పెను. హిందువులలో అన్ని వర్ణములవారును వారి వారి ధర్మములమాని ధర్మవిదూరులై తమ్మునమించినవారు లేరని గర్వించి తిరుగుచుండిరట రాజులు ప్రజలను దోచుకొన మొదలు పెట్టినారనియు వారు కళలను బోషించుట లేదనియు, దానధర్మములను బొత్తిగా సహించుట లేదనియు నుడివినది హిందువులలో సహితము అనేకులు రాక్షసులను మించిన దుష్కార్యముల జేయుచుండిరని వారొనరించు యధర్మ కార్యములలోగొన్నిటిని వివరించి పోయెను వినుండు.

సీ. దేవాలయంబుల ♦ దిక్కు జూచుట లేదు
జేజేలపూజల ♦ జేయరంట
బ్రాహ్మణులజూచి ♦ భక్తిజూపుట లేదు
గోరక్షణంజేయ ♦ గోరరంట
అన్నసత్రంబుల ♦ నకట నిల్పుట లేదు
ఆసత్రములదెగ ♦ నమ్మిరంట
పీఠల బొడగన్న ప్రేమజూపుట లేదు
ధర్మకార్యంబుల దలపరంట

తే-గీ. భర్త భార్యనుహింసింప ♦ బాలుపడగ
పతినిజంపెడి భార్యలు ♦ ప్రబలిరంట
తల్లితండ్రులవిడనాడు ♦ తనయులంట
యుర్వ్యబుట్టిరి యనిచెప్పె ♦ యుర్వ్యమాత

సీ. వేశ్యానుర క్తులై ♦ యే వేళజూచిన
ప్రాగుడు బోతులా ♦ ధరణిసురులు

మధ్యమాంసంబుల ♦ మానకతినుచుండి
భ్రష్టులైతిరిగెడి ♦ బ్రాహ్మణులును
ధర్మకర్తలమని ♦ ధర్మముల్ విడనాడి
దేవునిసొమ్ముల ♦ దినెడివారు
ఆదరించెదనని ♦ యాసిలగల్పించి
దరిజేర్చి కుత్తుకల్ ♦ చఱుగువారు

తే-గీ. అన్నభార్యను బ్రేమించు ♦ అధమనరులు
కోడలింబట్టి చెఱుపగ ♦ గోరువారు
చెప్పరానట్టి కార్యముల్ ♦ జేయువారు
బరగబుట్టిరి ధరలోన ♦ పాపులకట

ఇవికాక యోగిపుంగవులను సాధువర్తనలను, ఎగతాళిజేయుచు బాధింపసాగిరి సత్రములను స్వగృహాములుగా చేసికొనిరి కొందరాసత్రములను బాడుగలకిచ్చి ధనమును మూటగట్టుట మొదలిడిరి కులవిద్యలను ధర్మములను బోనాడి శూద్రవిద్యలనేర్చి యితరులను మోసగించి వారిధనమును హరించుచుండిరి. బీదలు తమ స్వల్పధనమును దాచి పెట్టుటకు ధనవంతులకియ్యగా ధనవంతులాధనమునుహరించి వారినోట మట్టిగొట్టుచుండిరి. ధనమునాసించి యితరులను గొంతు కోయుటకు వెనుదీయుటలేదు. సత్యమును పలుకువారు కలి యుగమున దియ్యబెట్టి వెతకినను లేరట. ధనమొసగిన తప్పుడు సాక్ష్యములనిచ్చుచుండిరి. బ్రాహ్మణులగని బ్రాహ్మణేతరులను, బ్రాహ్మణేతరులజూచి యితరవర్ణములవారును ద్వేషించుచుండిరి.

కనుక మనమిక ఆలస్యముచేయక పాపులను ధర్మాను రక్తులుగజేయక తప్పదు. పుడమియందు యేభాగమున అధర్మము లెక్కుడగునో అపుడు తగిన యవతారమును దాల్చి ధర్మమును స్థాపించుచుండుడని జగజ్జనని తొలుత యానతిచ్చినదికదా, మనమిపు మూరకున్న అమె యాగ్ర హింపగలదు. అపారభూపలయమున పాపులు అసంఖ్యాకులై చీమలవలెను, యుసుళ్ళవలెను వృద్ధిజెందిరి ఇందరిని సన్మార్గు లుగ నొనరించుటకు ఒక అవతారముచాలదు. త్రిమూర్తుల మగు మనము మానవలోకమున ఒకొక్కరు ఒకొక్కచోట మానవులుగ జన్మించి మానవులతోగలిసి తిరుగుచు వారిని సన్మార్గులుగ జేయుట మన పనియైయున్నది.

శ్రీహరి నిర్ణయము

శ్రీ మహావిష్ణువు సత్యలోక నాయకుండగు పరమేష్ఠిం జూచి,

సీ. ఓ పరమేష్ఠినీ ♦ వొనరంగ జన్మించు
దక్షిణాపథమున ♦ దనరునట్టి
విశ్వబ్రాహ్మణుడగు ♦ ''విశ్వాత్మ''కునియింట
భార్య ''మాయామేయి'' ♦ భాగ్యశాలి
పరమపతివ్రత ♦ భగవంతునే సదా
భక్తితో ధ్యానించు ♦ ముక్తికొఱకు
ఆమహాతల్లికి ♦ ''అన్నాజయాఖ్యుడు''
ఆవల ''బ్రహ్మానందు'' ♦ డనెడిపేర

తే-గీ. బరగి క్షేత్రంబులన్నిట ♦ దిరుగుచుండి
ధర్మముల బోధచేయుచు ♦ ధాత్రియందు
పతితులందఱి నెక్లేని ♦ పావనాత్మ్మ
లుగను జేయుచు, నీకలి ♦ యుగమునందు

ఆవల శ్రీరమారమణుడు కైలాసాధిపతిం జూచి,

క. ఓ విశ్వేశ్వర నీవిక
పోవలయును "వారణాశి" ♦ పుణ్యస్థలికిక్
ఆ "విజయసింగు" గృహామున
యవనిం "ఆనందయోగి" వై జన్మింపక్

ఆవల శ్రీ లక్ష్మీపతి పరమేష్టి పరమేశ్వరులం బొడగని ఇకమీద నా యవతారమును గూర్చి చెప్పెదను వినుడని యిటుల నెను.

సీ. ఆంధ్రావని "త్రలింగ" ♦ మన దేశమందుండు
"నందికొండ"నియెడి ♦ నగరమునను
వీరభోజాచార్య ♦ డును "యనమదల" యం
యింటిపేరు గల్గి ♦ యెంతో ప్రీతి
"సాపఫ్ని" మఠమందు ♦ పరమపావణుడయి
విశ్వబ్రాహ్మణుడొందు ♦ వెలయుచుండె
ఆతడు నిరతరంబు ♦ హరిభక్తి ధ్యానించి
సత్యవంతుండయి♦జగతిబరగు

తే-గీ. వెలయు నాతనియిల్లాలు ♦ "వీరపాప
మాంబ" పతివ్రతగుణశీల ♦ యామెయందు
"వీరబ్రహ్మము, వీరప్ప ♦ య వీరంభొట్లు"
అనెడి నామత్రయంబున ♦ నలరియుచట.

నేను మహాతపోనిష్ఠాగరిష్ఠుండనై దివ్యజ్ఞాన సంప
న్నుండనై, నాజననియగు వీరపాపమాంబకు జ్ఞానమార్గంబు
నుపదేశించి, హరిహరనామంబున నొప్పు పురవరంబునందు
ఆనందాశ్రమమునందు సూర్యోపసనాతత్పరుడనై యుండెడ
ఇక మీరు మీలోకంబుల కరిగి మీ మీ యవతారంబుల
గూర్చి యోజింపుడనగా మంచిదని వెళ్ళిరి.

శ్రీహరి కలియుగమున బుట్టుట

శ్రీరమారమణుడును, వైకుంఠవాసుడును, శేషతల్పు
డును, ఆదిమధ్యాంతరహితుండగు శ్రీహరి బ్రహ్మాండపుర
వాసులగు ప్రకృతాంబాపరిపూర్ణయాచార్యులకు పుత్రుండై
యవతరింపదలచెను. ప్రకృతాంబా పరిపూర్ణయాచార్యులు
విశ్వబ్రహ్మవంశీకులు ఆదంపతులుసంతానహీనురాలై మిక్కిలి
జింతించుచుండిరి. అట్లుండగా ఒకనాడు ప్రకృతాంబ భర్త
యగు పరిపూర్ణయాచార్యులకు నమస్కరించి "ప్రాణవల్లభా
అపుత్రస్య గతిర్నాస్తి యను వేదవాక్యంబులు మీకు దెలి
యకపోలేదు. కనుక మనము సంతానప్రాప్తికై తీర్థయాత్ర
జేయుట మంచిదని నాయంతరాత్మ హెచ్చరించుచున్నది.
కనుక మన మొకసంవత్సరము తీర్థయాత్రల జేయుటలెస్స"
అనగా ఆమె భర్తయు సమ్మతించెను.

ఆదంపతుల్లంతట ఒకదినమును నిర్ణయించుకొని శుభ
లగ్నమున ప్రయాణమై తీర్థయాత్ర జేయబోయిరి వానేరక

దినంబులు పలుయాత్రల జేయుచు, పుణ్యతీర్థంబుల గ్రుంకుచు పవిత్రనదీనదంబుల స్నానమాడుచు మహాపుణ్య క్షేత్రంబననొప్పు కాశీక్షేత్రంబును జేరిరి. అచ్చటగొన్నాళ్లుండగా ప్రకృతాంబకు గర్భధారణ చిహ్నములు బొడకట్టెను అందు కామె సంతసించుచు యాసంగతి భర్తకెరింగింపగా నతడును సంతోషించెను. అచ్చటినుండి వారు ప్రయాణమై జన్మస్థానమునకు బోదమనిప్రయాణమై వెళ్ళుచుండగా ఒకానొక యడవిలో నిర్జనప్రదేశంబున ప్రకృతాంబకు ప్రసవవేదన ప్రారంభమై ఒక మగశిశువును ప్రసవించినదయ్యె.

ప్రకృతాంబ శిశువును అత్రిముని కిచ్చుట

ఆయడవిలో అత్రిమహాబుషి యాశ్రమము నేర్పరచుకొని తపమాచరించుచు శిష్యులకు వేదసారంబు బోధించుచుండెను. ఆమునీంద్రు డొకనాడు స్నానార్థమై నదికేగెను. అతడు నదిలోమొడ్డును సమీపింపగనే యందుండిన మహావృక్ష చ్ఛాయన పత్రంబులపై శిశువును బరుండబెట్టుకొని ఒకానొక దీనురాలు దుఃఖించుచుండగని "తల్లీ! నీవెవరవు? ఎందులకై ఈ ఘోరాడవికి విచ్చేసితివి. నీభర్తయెవరు. అత డెచ్చటికేగెను. ఈ శిశువు ఇంతకుమునుపే జన్మించినటులున్నది నీసంగతులన్నియు నాకు విశదీకరింపుము" అనెను.

అందు కాయువతి మునీంద్రా నేను సంతానహీననై భర్తతోగూడ సంతానమును బడయగోరి పుణ్యక్షేత్రంబుల దర్శించుటకును, పుణ్యతీర్థంబుల గ్రుంకుటకును, పుణ్యనదీ

సందంబుల గ్రుంకులిడుటకును వచ్చితిని. కాశీక్షేత్రంబున కొంతకాలము విశ్వేశ్వరుని సేవించగా వారి యనుగ్రహం బుసగర్భముందాల్చితిని. నిజనివాసంబున కేగుట మంచిదని పోవుచుండఇచ్చటికి వచ్చునప్పటికి నాకుబ్రసవవేదన ప్రారం భమై ఈపురుష శిశువు జన్మించెను. ఈశిశువు జన్మించిన లగ్నప్రభావమేమోగాని శిశువు అవతరింపగనే నాభర్తపర లోకమున కేగెను. భర్మపత్ని పతితోగూడ మరణింపవలసి నది విధియైయున్నది. నేనన్న ఈశిశువును వదలలేక వీమి చేయుటకు పోపకున్నాను. మేము విశ్వబ్రాహ్మణులము ఇదే నాశిశువును మీ కప్పగించితిని. మీ ఇష్టము అని పదిలోబడి మాయమాయెను.

---

*వీరపాపమాంబా వీరభోజయాచార్యులు సంతానప్రాప్తికై గోవిందుని ధ్యానించుట

ఓ భక్తశిఖామణులారా! నందికొండ సమీపమున నుండు పాపఘ్ని మఠమునవిశ్వబ్రాహ్మణుడగు వీరభోజయా చార్యుడు తనధర్మపత్నియగు వీరపాపమాంబతో, కాపుర మొనరించుచుండెను. అతడు పాపఘ్ని మఠాధిపతియై దేవ బ్రాహ్మణభక్తుడై సదా శ్రీమన్నారాయణుని ధ్యానించు చుండెను. అతడు అతిధిసత్కారమునకు బేరుపోయినవాడు.

---

*సూచన — శ్రీహరియే ప్రకృతాంబా పరిపూర్ణ యాచార్యులకు మాయాగర్భంబున జన్మించెను పాఠకులు గ్రహింపవలెను.

అతడు సత్యధర్మముల దప్పక బీదసాధుల బ్రేమించుచువారి కనేకవిధంబుల సాయపడుచుండెను. ముప్రొద్దుల దేవతార్చన చేయక తీర్థమునుగూడ బుచ్చుకొనకుండెను.

అతని భార్యవీరపాపమాంబ సుగుణాఢ్యనియైన దాచార సంపన్నురాలై భర్తయే దైవమని నమ్మి పూజించేడిది. పరమపతివ్రతయునై వభక్తురాలునునై పతికి అన్నివిధముల దగిన భార్యయనిపించుకొని యుండెను. ఆమహాతల్లికి సంతానము లేకపోయెనేయను చింతతప్ప ఇతర చింత లేకుండెను.

ఇట్లుండ ఒకానొకదినంబున వీరభోజయ్యా చార్యుడు గృహామున లేని సమయమున ఒక మహాపురుషుడు వచ్చి వీరపాపమాంబను చూచి "భగవతీ భిక్షాందేహి" యని తల వాకిటి నిలిచెను. అతనిని జూడగానే వీరపాపమాంబ యపరిమితానందభరితురాలై జలపూర్ణకలశంబుతో వెళ్ళియాతని పాదంబుల గడిగి యా జలంబులశిరముపై జల్లుకొని లోపలికిరండని తోడ్కొనిపోయి యున్నతాసనముపై గూర్చుండ గోరెను.

ఆ మహాపురుషుడు పీఠయుపై గూర్చుండి "తల్లీ! నీవు సంతానము కలుగలేదని ఖిన్నురాలవై సదా సంతానము నాసించి శ్రీహరిని పూజించుచుంటివి. నీకును నీ భర్తకును వృద్ధాప్యము వచ్చినదికదా. నీకు గర్భధారణశక్తిచాలదు. అయినను నీకు సుపుత్రప్తికలదని తెలిసికొంటిని. శ్రీహరికి మాయం దనుగ్రహముకలిగినది. ఆయనే మీకు కుమారుడుగ యవతరించును. నీవు చింతింపకు" మనెను.

అపుడు వీరపాపమాంబ స్వామీ! నాకు గర్భధారణ ప్తిలేదని ఇపుడేకదా మీరంటిరి. అపుడు నాకు సంతాన

మెట్లు కలుగును. అదియునుగాక శ్రీహరియే మాయింట బుత్రుడై జన్మించునంటిరి మీమాట విశ్వసింపమందురా యనెను.

అందులకామహాపురుషుడు జనినీ! నన్నేలసంశయించె దవు. నామాటలు రిత్తపోవు. శ్రీమన్నారాయణమూర్తి మీ ఇంటికి మీపుత్రుడుగారాగోరి అపుడే అవతరించియుండెను అతడు ఒకదివ్యపురుషుని యాశ్రమమున బెరుగుచున్నాడు. నీవుభర్తతోగూడదివ్యక్షేత్రంబులగనయాత్రల జేయవలసిన కాలము సమీపించినది. ఆయాత్రలజేయునపుడు మీకుమారుడు మీకులభించును. అనిచెప్పుచు యంతర్ధానమైపోయెను.

అంతలో గార్హ్యర్థమై బయటికి వెళిన్న వీరభోజ యాచ్చార్యుడు విచ్చేసెను. భర్తనుజూచిన దేవీరపాపమాంజ యానందముతో ఎదురేగి లోపలికి బిలిచికొనిపోయి నాథా! మనభాగ్యమేమందును. ఇంతకుముందే మన యింటికెవరో దివ్యపురుషుడు విచ్చేసెను. ఆ మహానుభావులు శ్రీహరియే మన ఇంటికి మనకుమారుడై వచ్చుటకపుడేభువిలో జన్మించి నాడట. మనము తీర్థయాత్రలంజేయ బోయినచో మనకా బాలకుడు లభించునట. ఒకనిమిషముందు వచ్చి యుండినచో ఆ మహానుభావుతో మీరు మాటాడి యుండవచ్చునని పలికి మనము తీర్థయాత్రలజేయ బోవుటకు దగిన సుము హూర్తమును నిర్ణయింపు డనెను.

అందుకు వీరభోజయాచార్యుడు ప్రియా! నీవుమిక్కిలి యదృష్టవంతురాలవు ఆ మహాపురుషుడు శ్రీహరిమో, హరమేష్టియో లేక సదాశివుడో యైయుండును. అతనిదర్శించి యాతిథ్యమిచ్చు భాగ్యము లేకపోయెనే యని చింతింప

వలసి యున్నది. అయినను అతనిమాటలను మనము వృథాచేయరాదు. తీర్థయాత్రల జేయబోవుటయే లెస్సయని పలికెను.

వీరపాపమాంబా వీరభోజయాచార్యులు తీర్థయాత్రలకేగుట

ఆరీతి గొన్నాళ్ళు గడచిన తర్వాత వీరభోజయాచార్యుడు ఒకవైదిక బ్రాహ్మణుని రావించి తాను భార్యా సమేతముగ యాత్రలజేయ బోవుటకు దగిన సుదినమును నిర్ణయింపుమనెను. ఆవిప్రుడు దినవారనక్షత్రలగ్న యోగంబుల పరిశీలించి ఒకదినమును నిర్ణయించిపోయెను. అప్పుడా దంపతులు బ్రాహ్మణుడు నిర్ణయించిన దినమున వారికి గావలసిన వస్తువుల మూటగట్టుకొని బయలుదేరి దినమొక మజిలీచేయుచు ప్రయాణము సాగించుచుండిరి.

వీరపాపమాంబా వీరభోజయాచార్యులు మొదట శ్రీశైలమునుదర్శించిమల్లి కార్జును పూజించిరి. అచ్చటనుండి బయలుదేరి కృష్ణాగోదావరినదులలో మునిగి ద్రాక్షారామమును చేరిరి. అచ్చట ద్రాక్షారామలింగేశ్వరునర్చించిజగన్నాథమునుజేరిరి. అచ్చట జగన్నాయకుని పరిపరివిధంబుల సేవించి సుభద్రాదేవినిపూజించి సరస్వతీ తీర్థమున స్నానము చేయ నుద్దేశించి యచటకేగి ఆతీర్థమున బ్రగుంకి అది అత్రి మహాముని యాశ్రమ భూమియని తెలిసికొని యా మునిని దర్శింపబోయిరి.

వీరపాపమాంబా వీరభోజయాచార్యులు అత్రిమహాముని వలన శిశువును బొందుట

—:o:—

ఆదంపతులు యడవిలోని ఫలపుష్పములను సేకరించి అత్రిమహాముని యాశ్రమమునుజేరి ఋషిపుంగవునికి సాష్టాంగ నమస్కారము లొనరించిరి. అపుడాఋషి వీరపాపమాంబ శిరముపై పుష్పములవేసి''దీర్ఘసుమంగళీభవ, సుపుత్రప్రాప్తి రస్తు'' అని యాశీర్వదించెను. అందుకాదంపతులు కరముల ముకులించి సవినయముగా నిట్లనిరి. స్వామీ! కొన్నిదినముల క్రింద ఒకానొక దివ్యపురుషుడు మాగృహమునకు విచ్చేసి మేము వృద్ధులమగుటచే మాకు సంతానము కలుగదని సెల విచ్చెను. మీరిట్లాశీర్వదించితిరి. దీనికి మీరేమందురో సెల విండని ప్రార్థించిరి.

అందుకాముని దివ్యదృష్టిని బరికించి ఆర్యా! మీపలు కులు సత్యేతరములుగావు. ఆమహాపురుషుడు శ్రీమన్నారా యణుడేకాని వేరుకాడు. మీరాయనను దర్శించితిరి కాన మీజన్మసార్థకమైనది. అయ్యా! ఆమహాపురుషుడు మీకింకను ఏమైన విషయములు దెలిపియుండును. అవి మీకు జ్ఞాపకము లేవా? అపుడే మరచితిరా? మీకు పుత్రుడు లభించునని యానతిచ్చెనా లేదా యనెను.

అందుకు వీరపాపమాంబ మునికులతిలకా! ఆదివ్యపురు షుడు మాకు యాత్రలజేయు యోగంబున్నదనియు, అప్పుడు మాకొక మహాత్మ్యనిదర్శనము లభించుననియు, ఆతని వలన మాకొకకుమారరత్నముగూడ సిద్ధించుననియు సెలవిచ్చెను. ఆప్రాప్తము మాకెవరివలన ఎప్పుడు సిద్ధించునోకదా! యని

చాలించినంతనే యత్రిమునీంద్రుడు తల్లీ! నీవు ధన్యురాలవు అని ప్రక్కనుండిన శిష్యులలో నొకరినిం జూచి ప్రకృతగర్భ ముక్తాఫలంబగు శిశువును దెమ్మనెను. అతడు వెంటనే పర్ణశాలలో నిద్రించుచుండిన యర్భకునిదెచ్చి మునిపుంగవునికర ములయం దునిచెను. అత్రి ఆబాలుని ముద్దిడుకొని వీరపాపమాంబ కొసగి ప్రతివ్రతా తిలకమా! ఈ యర్భకుడు సామాన్య బాలుడుకాడు. శ్రీమన్నారాయణాంశమున యవతరించిన దివ్యపురుషుడు విశ్వబ్రహ్మవంశమునకు జెందిన ప్రకృతాంబా పరిపూర్ణ యాచార్యులకు జన్మించినవాడు ఈ శిశువు యింతవరకు గోక్షీరముల వలన బెంచబడెను గాని చనుడని పంపెను.

వీరబ్రహ్మావతారము

అత్రిమహాముని వలన పుత్రునిం బడసి యాతని పాదపద్మములకు సాగిలపడి యాశీస్సులబొంది సెలవుదీసికొని యర్భకుని యెడిలోనిడుకొని వీరభోజయాచార్యుడు ముందు నడుచుచుండగా వీరపాపమాంబ యతనిననుసరించి పోవుచుండెను. ఈరీతి దినమొక మజిలీయొనరించుచు గతిపయ దినంబులలో తమ నివాసంబగు పాపఘ్నిమఠమును జేరిన వారైరి.

నిజవాసంబును జేరినదే వీరభోజయాచార్యుడు తన బంధుమిత్రులను రావించి తామొనరించిన తీర్థయాత్రలను

గురించి తెలుపుచు, అత్రిమహాముని దర్శనంబును, ఆమహాను భావుడొసగిన యర్భకునివృత్తాంతమును వివరించి ఆ బాలునకు దగిన నామకరణము జేయ సంకల్పించి యాచార్యులరప్పించి నామకరణ మహోత్సవమునకు దగిన ముహూర్తమును నిశ్చ యించి యెవరి గృహంబులకు వారిని బంపించెను.

నామకరణమహోత్సవమునకు ముందటిదినము భార్యా భర్తలిరువురును యేపేరుబెట్టిన బాగుండునని యేనామము స్ఫురింపనందున యోచించుచు రాత్రి పరుండి నిద్రపోయిరి. వారు గాఢనిద్రా పరవశులై యుండ అర్ధరాత్రిగడచినతదు పరి శ్రీహరి స్వప్నంబున దర్శనమిచ్చి "ఓ వీరభోజయా చార్యా! నేనే నీకుమారుడను కాగోరి నీ యింటికివచ్చితిని. కనుక నీవు నాకు జేపటిదినము వీరప్పయ్య, వీరంబొట్లు, లేక వీరబ్రహ్మము" అను నామతంబులోనీయిష్టమువచ్చిన పేరు నిడవచ్చును. అయినను నాకు కడపట నిలుచునది "వీర బ్రహ్మము" అను పేరేసుమా యని యంతర్ధాతుండయ్యెను.

అంత తెల్లవారగనే తన స్వప్నవృత్తాంతమును భార్యకు చెప్పి యిద్దరును గలిసి వీరబ్రహ్మముఅను పేరుపెట్ట నిశ్చయించుకొనిరి. ఆనాడుడయమునుండి మంగళవాయిద్య ములు మ్రోగుచుండ పురోహితులును, పండితులును, జ్యో తిష్కులును, కవులును, గాయకులును, బంధుమిత్రాదులు రాగా పురోహితుడు సమంత్రకంబుగా నామకరణక్రతువును ముగించి అందరియెదుట "వీరబ్రహ్మము" అను నామము నిడిరి. అపుడు వీరభోజయాచార్యుడు అందరిని వారివారికి దగినట్లు సత్కరించి పంపించెను.

బా ల్య ము

అంతట వీరపాపమాంబ కుమారరత్నంబగు వీర బ్రహ్మమును అల్లారుముద్దుగ బెంచుచుండ యుర్భకుడగు బాలవీరబ్రహ్మము

తే-గీ. శిశువుగానుండి తొట్లలో జేరి యూడి
బాలకుండయి గోవుల పాలద్రావి
పొర్లి నేర్చియు, దోగాడ నేర్చి పిదప
తప్పటడుగులవై చెను తల్లితండ్రి
చూడ మనవీరబ్రహ్మము సొగసుకాడు 5
వత్సరము దాటినో లేదో పడిగనడువ
నేర్చి, ముద్దుగ మాటాడె కీరమువలె
చేతులను ద్రిప్పినవ్వుచు చింగుదొక్కి
తల్లిదండ్రుల ప్రేమను కొల్లగొట్టె
చూడ మనవీరబ్రహ్మము సొగసుమీర 10
బాటుల ననుదినమభివృద్ధి యతడు జెంది
శుక్లపక్షనిశాకరు సోయగమున
అంద చందములన్ని యు కమరియుండ
అతడును నవ్వినవ్వించు యఖిలజనుల
అతడు నై దేండ్లనాటికే యూర్యులార! 15

ఆరీతి బాలుడగు వీరబ్రహ్మము. తల్లిదండ్రులనే గాక గ్రామవాసులందఱను యానందింప జేయుచు నందరిచే మిక్కిలి ప్రేమింపబడుచుండెను.

వీరభోజయాచార్యుడు మరణించుట

వీరబ్రహ్మము అయిదేండ్లు బాలుడగునప్పటికి అతని తండ్రి వయోవృద్ధుడైనందున దినదినంబునకు తనబలంబులు సన్నగిల్లుచుండ కొంతకాలమునకు వీరభోజయాచార్యుడు తన దేహమును చాలించి స్వర్గమును జేరుకొనెను.

అపుడు అతని ధర్మపత్నియగు వీరపాపమాంబ పతి వియోగదుఃఖము భరింపలేక పతితో సహగమనమొనరింప సిద్ధపడెను. ఆపుడాయూరి పెద్దలు, పిన్నలు, పండితులు, గ్రామాధికారులు ఏకముఖమున యామెకడకువచ్చి చిన్న వీరబ్రహ్మమును దిక్కులేనిపక్షిగా నొనరింపవలదని యనేక ప్రకారంబుల ప్రార్థించి సహగమన విరక్తురాలింగావించిరి.

అందుకామె వీరప్పయ్యకొఱకే జీవింపవలసివచ్చెను. అపుడామె భర్తకు విద్యుక్తముగ యపరక్రియల ముగించి దివ్యసుందరాకారుడగు చిన్ని కుమారుని బాల్యక్రీడలజూచి ఆనందించుచు పతివియోగదుఃఖమును మరచి ఆనందించు చుండెను. ఆతల్లి ఉదయమే బాలకునకు స్నానముచేయించి నొసట విభూతిరేఖల దిద్దినచో చూచెడివారికి సత్యలోకము నుండి యాబ్రహ్మయే యీ బాలకుని రూపమున వచ్చెనా యని యనిపించుచుండ తల్లిచూచి యానందసముద్రమున మునిగి తేలుచుండెను.

విద్యాభ్యాసము

తదుపరివీరపాపమాంబ బాలుడు పంచవర్షప్రాయుడై నందున యతనిని ఒక గురువు నొద్ద విడిచి విద్యనేర్పింపదల చెను. లోకము బాలునకువిద్యనేర్పింపనిచో "ముండపెంచిన బిడ్డ, మొగప్రాడులేనియెద్దు" ఒకటని పలుకుదురు. తానే తండ్రి తల్లియై వీరబ్రహ్మమును విద్యావంతుని జేయక తప్పదని తీర్మానించుకొనెను.

ఆమె ఒక శుభముహూర్తమును విచారించి సకల శాస్త్రపురాణములజదివి పండితుడనిపించుకొన్న గురుసత్తమునిరావించి "గురుసత్తమా! మన వీరప్పడు తండ్రిలేని బిడ్డయని మీరెరుంగుదురు. బాలునకు యైదేండ్లు నిండినవి ఇదియే విద్యాభ్యాసమునకుదగిన వయసుకదా. విద్యాహీను డగు వాడెట్టివాడైనను పశువుతోసమానమని పెద్దలందురు కనుక నాయందు దయయుంచి ఈ కుఱ్ఱవానిని మీయాశ్రమ మునందిండుకొని విద్యావంతుని జేయుడు" అని ప్రార్థించెను.

అందుకా గురుసత్తముడు "తథాస్తు" అని దీవించి అమ్మా! నీకోరిక్కను నెరవేర్చెదను. ఈ బాలునిముఖమున జూడ సకలవిద్యాపారంగతుడు కాగలడవి తోచెడిని నేనీ బాలుని నా యాశ్రమమునకు బిలుచుకొనిపోయెదను. గురు కులవాసము పూర్తియగులోపల సకలవిద్యల నేర్పి మరలనీ పుత్రుని నీ కర్పించెదను. భయపడవలదనెను. అపుడు తల్లి కుమారుని జూచి నాయనా! గురువుగారివెంటబోయి వారు నేర్పెడివిద్యల నేర్పుకొనివత్తువాయనెను. అందుకు బాలుడు కరములు జోడించి—

తే-గీ. అమ్మ! యనుమాన మేల నా♦యందునీకు
కూర్మి గురుకుల వాసంబు♦గురునియింట
సలిపి చదువులన్నిటి♦జక్కగా నేర్చి
తల్లీ నిన్ను జేరగలనమ్మ♦తప్పకుండ
ధరను తలితండ్రి దై వంబు♦గురువెయగును
కీర్తియే కాని వినుయపప♦కీర్తిరాదు.

అనితల్లికినమస్కరించి ఆమెదీవెనలగొని గురుదేవుని వెంట గురుకులవాస మొనరింప బోయినవాడాయెను.

ఆ గురుసత్తముడు వీరబ్రహ్మమును తన ఇంటికి బిలుచుకొనిపోయి తన పుత్రునికంటె యెక్కువ ప్రేమతో ఆదరించుచు ఒక శుభదివసంబున దనయెదుట గూర్చుండబెట్టుకొని నాయనా! నీవు ముందుగ ''గురు'' అను రెండక్షరముల యందలి గూఢార్థమును దెలిసికొనవలెను. దానినెరింగించెదవినుము. గు-అనగా అంధకారము. రు-అనగా తేజస్సు లేక ప్రకాశము. గురువు అనగా ఒక మానవుని అంధకారమునుండి బయటికిలాగి ప్రకాశముతో గూడిన స్థితికి దెచ్చెడివాడని యర్థము.

అట్టిగురుసత్తముడు వక్షపాతము లేక నిర్మలహృదయుడును, శాంతస్వరూపుడును, త్రికరణశుద్ధి గలిగినవాడును, దయ ప్రేమసత్యములకు నెలవైనవాడుగను నుండవలయును అతడు వాచాలుడును, కామక్రోధ మదమాత్సర్యములకు లోబడనివాడుగను నుండవలెను. అట్టి యుత్తమగుణములు గలవానిని గురువుగ భావించవలెను.

ఇక శిష్యుడు అనగేమో వివరింతును వినుము అన్ని వర్ణములవారును సకలవిద్యల నభ్యసించుటకు అర్హులై యుందురు. అట్టివారును తమ గురువును దైవముగా నమ్మి శ్రద్ధతో నతడు బోధించునీతిని, చదువులను విని నేర్చుకొను చుండవలెను. విద్యార్థి విధుల వినిపించెద వినుము.

సీ. గురు శేఖరుని జేరి♦కూర్మి జదువగవలె
సోమరిపోతులై♦సృక్కకుండ
గురువానతిమీర♦గోరకు మెప్పుడు
విషయానురక్తిని♦విడువకుండ
గురుసతి నాజ్ఞల♦మీరకు మెన్నడు
గురుద్రోహ మొనరింప గోరకుండ
గురుధిక్కరణ జేయ♦గూడ దేరికిగూడ
వినయవిధేయతల్♦విడువకుండ

తే-గీ. విద్యయేగూర్చు వినయంబు♦వినయమునను
బడయవచ్చును బాత్రత♦పరగదాని
వలన ధనమబ్బు మోక్షంబు♦బడయనగును
విద్యలను నేర్చు విద్యార్థి విధుల వినుము

అని వీర బ్రహ్మమునకు నీతుల బోధింప నతడు గురువును భక్తితో సేవించుచు ఆ గురుమహారాజువల్ల నేర్వదగిన విద్యల నభ్యసింపగలిగెను.

సీ. అక్షరాభ్యాసంబు♦దీక్షతో జేసెను
గురువాజ్ఞ నాతడు మీరకుండ
చదువను వ్రాయను♦చక్కగా నేర్చెను
గురువు చెప్పినదాని మీరకుండ

చదివెపురాణముల్ ♦చక్కగవతడు
గురువు చెప్పినయట్లు ♦యూరకుండ
వేదశాస్త్రంబులు ♦వినయంబుతోనేర్చి
గురువునావతివార ♦గోరకుండ
తే॥గీ. వేదవేదాంగములనేర్చె ♦వేడ్కతోడ
తర్కశాస్త్రంబు చదివెనా ♦తార్కకుండు
మంత్ర, జ్యోతిషశాస్త్రాల మర్మమెరిగి
గురువు పలుకులు జవదాట ♦గోరకుండు

ఆరీతి వీరబ్రహ్మము గురుకులమున సకలవిద్యలనేర్చి ఒకానొకదినమున గురువు సన్నిధికేగి "గురునాథా! తాము నాయండు కరుణగలిగి సకలవిద్యల బోధించిరి, మీ ఋణమును దీర్చ నాచేతగాదు. ఇకనాకు సెలవొసంగినచో వృద్ధురాలైయున్న నాతల్లికడ కేగెద" నసెను. ఆ మాటలకు గురువు సంతోషితస్వాంతుండై "నాయనా! నీకు శుభమగుగాక." అని యాశీర్వదించి తల్లికడకు పోనాజ్ఞ యిచ్చెను. వెంటనే వీరబొట్లయ్య గురువు పాదపద్మములకు భక్తితో నమస్కరించి గురువు తనకుతోడుగా బంపిన సహచరులతో సంతోషముగ మాటాడుచు నిజపురికేగుచు తల్లి సేవ జేయుచుండెను.

వీరబ్రహ్మము తల్లికి జ్ఞానోపదేశమును జేయుట

ఆరీతి వీరబ్రహ్మము మాతృస్త్రీకి సేవ లొనరించుచుండెను. అప్పటికి అతడు సుమారు పండ్రెండు సంవత్సర

ములుదాటిన బాలుడాయెను. అంతలో నతనికి దేశసంచార మొనరింపవలెనను కోరిక బనింపగా నతడు తల్లికి నమస్కరించి ''అమ్మా! నాకు తాపసవృత్తినవలంబించి దేశసంచారము వెళ్ళవలెనను కోరిక జనించినది. దేశసంచార మొనరించినగాని ప్రపంచజ్ఞాన మలవడదు నన్ను ''కూపస్థమూడూకము''వలె మనమఠము దాటి బయటికి పోనీయకుండుట యించిదికాదు దయయుంచి నాకు ఆజ్ఞయిమ్మని'' ప్రార్థించెను.

అందుకు వీరపాపమాంబ నాయనా! నేను సంతానరహితనై పరితపించుచు శ్రీహరిని పరిపరివిధంబుల ధ్యానింపగా నిన్ను ప్రసాదించెను. ఇపుడు నీ తండ్రియు పరమపదించెను. ఇప్పట్టున నన్నుదిక్కులేనిదాని నొనరించి దేశయాత్రలకేగెద వనుచుంటివి. ద్వాదశవర్ష ప్రాయమొక్కడ దేశయాత్రలెచ్చట. ఈవిచ్చికోరికలమానుము దేశయాత్ర అష్టకష్టములలో నొక్కటి ఇపుడు నీవు కష్టపడనేల. ఇచ్చట నీకేకొఱతయు లేదుకదా? ''నక్కయెక్కడ నాగలోక మొక్కడ'' అనునట్లు నీకీ నిపరీతపు కోరిక యేలజనించెనో తెలియరాకున్నది. దేశయాత్ర మిగుల కష్టపరంపరలతో గూడుకొని యుండును, నీవుకావలయునని కష్టముల నొడిగట్ట గోరుచుంటివి. అందులకు త్రికరణశుద్ధిగా నేను సమ్మతింపజాలను నిన్ను విడిచి నేనొక నిమిషమైనను జీవింపజాలను ఇన్నిదినములు తపించి నిన్ను బడసినందులకును, నిన్ను అతిప్రేమతో బెంచి పెద్దజేసినందుల కిదియాఫలము. నన్ను వడియేటముంచి పోజూచెదవా? ఈ బుద్ధి నీకెట్లు జనించెనో నాకు స్ఫురింపకున్నది. ఈమాటలు నీవు బుద్ధిపూర్వకముగ బలుకుచుంటివా లేక నీయందు పిచ్చిదయ్యము ప్రవేశించి

యిట్టిమాటల బల్కించుచున్నదా? నీ మాటలు నాకు కర్ణ
కఠోరములుగా నున్నవి. ఇట్టిమాటలను నేనుమున్నాటికిని
నోల్లను నీవు ఒకసారి కన్నులమూసికొని, హృదయముపై
చేయినిడి నీ యంతరాత్మ నుద్దేశించి నీవాడుపలుకులలో
న్యాయమున్నదేమో తెలిసికొనుము. అన్నా! నీపలుకుల
విన్నచో నాగుండియ లదరిపోవుచున్నవి. నాదేహము కం
పించుచున్నది. నా కన్నులు గిరగిర తిరుగుచున్నవి. నాకు
కన్నులు కనబడుట లేదు. చెవులువినుట లేదు. నీవు పన్ని
వదలిపోయిన నాప్రాణములు వికలముగ నిలువవని వడం
కుచు గ్రింద కూర్చుండెను.

అందుకు వీరబ్రహ్మము తల్లీ! శ్రీహరియే నన్ను నీకు
బ్రసాదించెనని చెప్పితివికదా! ఆ మహానుభావుడు అది
మధ్యాంతరహితుడు, అనాదరతీకుడు, సచరాచరజీవాంచిత
బ్రహ్మాండములోని సర్వప్రాణులను రక్షింపగోరువాడు
నన్ను నీకు ప్రసాదించినది యీ మహిమను గనిపెట్టుకొని
యుండుటకేనా! శ్రీమన్నారాయణుడు నన్ను పరోపకా
రార్థమై పుట్టించెను. కనుక "పరోపకారార్థమిదంశరీరమ్"
అను ధర్మము ననుసరించి అసర్వేశ్వరుని యానతి నెరవేర్చ
వలసినవిధి నాయందున్నది. నన్ను "ధర్మసంస్థాపనార్థము"
లక్ష్మీనల్లభుడు జన్మింపజేసెనని నమ్ముము సత్యధర్మములతో
గూడుకొనియుండిన యీలోకమిపుడు సర్వపాపములకు గురి
యైయున్నది. జనులు అజ్ఞానతిమిర కూపంబునబడి దిక్కు
తోచక మురికికీటిలోని కీటకమువలె నల్లాడిపోవుచున్నారు.
అట్టి పతితులు జ్ఞానోపదేశ మొసరించి వారికి తరుణో
పాయము జూపవలసిన భారము నాతలపైనున్నది. ఆ భార

మును భరింప నాచేతగాకున్నది. ఈ బరువును యెంత త్వరగా తగ్గించుకొనిన యంత మేలు. కనుక నన్ను సత్వర ముగ దేశ యాత్రాపదేశమున అజ్ఞానులకు జ్ఞానోపదేశం బొనరింప బంపుము అని పలువిధముల ప్రార్థించెను.

అంతట వీరపాపమాంబ కుమారుని జూచి నాయనా! నీవు శ్రీహరి యంశమున జన్మించి మావంశమును తరింప జేయుటకే నాకుమారుని మాకు లభించితివి పుత్రులులేని కొఱత దీర్చితివి. మమ్ము పుం అను నరకమున బడకుండ జేసితివి. అన్నిరహస్యముల దెలిసియు దెలియనట్లు కపటనాటక మును బ్రదర్శింప నేల పుత్రులధర్మములు నీవెఱుంగనివికావు తల్లిని సేవింపమని తవయుడు తనయుడనిపించుకొను నాతల్లిని మించిన దైవ మీధారుణీ లేదని పెద్దలనుచుండ వినలేదా కుమతులు సహితము తలిదండ్రుల సేవించుచుండ దైవాంశ జనితుడవగు నీవే తల్లిని దిక్కు లేనివాని నొనరించి పూర్వాశ్ర మమును, శిష్యులను వదలి పోయెదవందువు.

అదియునుగాక మనవంశవృక్షము శాఖోపశాఖలతో బెరుగకుండ జేసి పోజూచెదవా నీకు పరిణయమొనరించి మన వంశము వృద్ధియగునట్లు జేయవలయునని తలంచియుండ ఆశ్చర్యము నాకు గలుగకుండ దేశద్రిమ్మరివై పోయెదవందువు. అదియుగాక నీవీమఠసింహాసన మధిరోహించి మఠాధికారివి కాగా చూచి యానందింపగోరుచుండ నాయాశల నిరాశల జేసియే గెదవనుచుంటివి. అనుదినము ఈమఠమున కరుదెంచు భక్తుల సంశయవిచ్ఛేద మొనరించి, వారల దృష్టిపరచివారి వలన సమాశ్రమములు బడయుహారు లేకుండ జేసి పోవసిద్ధపడి తివి. కానోకటితలప దైవమొకటి తలచుననుట నాయంద

పిజ్ఞమైనది నాయాశలన్నిటిని కాపుమాపదలచితివి నన్ను దిక్కు లేనిదాని నొనరించిపోదువా యని గోడుగోడున దుఃఖింపసాగెను.

అపుడు వీరబ్రహ్మము తనలో యిట్లాలోచింప దొడగెను. ఈమె యింకను యజ్ఞాన కడలిలోబడి దిక్కుతోచకున్నది ఈమె మాయా లోకమును గుర్తింపలేక అమాయకురాలై పరితపించుచున్నది ఇక నేను తడవుసేయక తల్లికి జ్ఞానోపదేశ మొనరింపవలెనని తల్లినిజూచి "మాతా! వీల దుఃఖించెదవు, తల్లీ! నీవు లోకాధిపత్యమును వహింపగల తనయుని వడసి సామాన్య మానవుల తల్లివలె దుఃఖించెద వేల. ఆది అంతము లేనిలోకపీఠము వధిరోహించిమానవులచే బూజిల గొనబడగిన నాకీ మహమునందలి పీఠమేల. సర్వ మానవసేవ యొనరించి వారిని తరింపజేయుగల శక్తినాయం దుండ తల్లివగు నీసేవయొనరించి నిన్ను తరింపజేయుజాలనా.

అమ్మా! నీవు నేను అనెడి భేదభావమును గలిగియుండ గూడదు నాది యనునది యీసృష్టియందెవరికిలేదు తల్లీ! మనము చూచుచుండగనే ఎందరో జన్మించిరి, ఎందరో చని పోయిరి, అట్టివారిలో కోటీశ్వరులుండి సకలసౌఖ్యముల నను భవించుచుండ జూచితిమి కొందఱు సగము కడుపునకైన నంజిసహితము లేక మలమలమాడి అన్నమో! అన్నమో! యని యలమటించి పరితపింపజూచితిమి. ఆ యిరుతెగల వారు తమకున్న స్వల్పవస్తువును సహితము 'నాది, నాది' యని కలుపరించి చచ్చినవారేకదా. నాది నాది యను దానిని వారు మరణించినపుడు తమ వెంటగొని పోలేదుకదా వారు మాయలో జిక్కి- నేను, నాయిల్లు, నా భార్య,

నాబిడ్డలు, నాధనము, నాభూములు అని వాపోయి చచ్చిరి వారు నా, నా, యను వారొక్కరును వారివెంట పోరైరి. తండ్రిచచ్చినకుమారుడును కుమారుడు మరణించిన తండ్రియు గొంతసేపు విలపించి తదుపరి మరచిపోవుటయే కాని ఒకరు మరణించిన వారివెంట నా యను వాడు మరణించుట లేదు. కనుక యీలోకమున నా యనుదానిని పూర్తిగామరచి పోవుట లెస్స కనుక నీవుకూడ నామతము నా కుమారుడు అను దానిని మరచిపోవలెను.

జననీ! మహాతత్వమును అనగా సత్యత్వమును గూర్చి వివరింతును వినుము. ఈ శరీరము పంచభూతములనగా పృథివి అప్పు తేజస్సు వాయువు, ఆకసము అను వానివలన పుట్టినది ఈ దేహము రక్తమాంస శిల్యపురీషములతో నిండినను శరీరమునిలువజాలదు. ఈ దేహమున పృథివినలన చర్మము, మాంసము, ఎముకలు, నాళములు, వెంట్రుకలు పుట్టినవి. అప్పు అనగా జలమువలన రక్తము, మూత్రము ఘ్రాణేంద్రియము కళ్ళె, మేధస్సు, అనునవి కల్పింపబడెను తేజస్సు అనగా అగ్నివలన ఆకలి, దప్పి, నిద్ర, ఆలస్యము భోగము అనువవి జేయబడినవి. వాయువు వలన చలనము, వడుచుట తొందటి, సిగ్గుభయములు జనించినవి. నింగివలన కామక్రోధ మదలోభ మోహమాత్సర్యములు సంభవించినవి ఈయిరువదితత్వములు లేక శరీరము నిలువకాలదుఅట్టి దేహమునగలవాడే జీవుడని పిలువబడుచున్నాడు. ఆ జీవుని తెలిసికొనుటే ఆత్మయనబడును, యాత్మలో జీవాత్మ పరమాత్మయను ద్వివిధములు గలవు.

ఆకాశ పంచకము	వాయు పంచకము	తేజోపంచకము (అగ్ని)	ఉదక పంచకము	పృథ్వీ పంచకము	
జ్ఞానము	సమాన వాయువు	శ్రోత్రము	శబ్దము	వాక్కు	ఆకాశ తత్వములు
మనస్సు	వ్యాన వాయువు	త్వక్కు	స్పర్శము	పాణి	వాయు తత్వములు
బుద్ధి	ఉదాన వాయువు	చక్షువు	రూపము	పాదము	అగ్ని తత్వములు
చిత్తము	ప్రాణ వాయువు	జిహ్వా	రసము	గుహ్యము	ఉదక తత్వములు
అహంకారం	అపాన వాయువు	ఘ్రాణము	గంధము	గంధము	పృథ్వీ తత్వములు
అంతరింద్రియములు	ప్రాణేంద్రియములు	జ్ఞానేంద్రియములు	పంచతన్మాత్రలు	కర్మేంద్రియములు	

ఓ మహాతల్లీ ఇంతకుముందు జీవాత్మ, పరమాత్మ యనునవి రెండు కలవని చెప్పియుంటిని. వానిని గురించి వివరించెద వినుము.

జీవాత్మ—జీవాత్మ యనగా అజ్ఞానముతో గూడిన జీవుడు. ఇది మానవలోకమున బుట్టిన సర్వజీవకోటిని ఆవరించియుండును. నికే ప్రాణమనిపేరు. జీవాత్మ నావరించి యుండు మాయ అనగా అజ్ఞాన మెపుడు వీడిపోవునో అపుడు జీవాత్మ పరమాత్మలో జేరినదగును.

పరమాత్మ—పరమాత్మ యనగా పరిశుద్ధజ్ఞానముతో గూడిన జీవుడు లేక ప్రాణి, దానికి నా, నీ యను భేదముండదు. పరమాత్మ యను దానికి జనన మరణాదులుండవని తెలిసికొనుము.

తారకము—అమ్మా! నీకు తారకమును గూర్చి చెప్పెదను వినుము. తారకము వలన పరమాత్మను దెలిసికొన వీలుపడును. దీనిని పరమాత్మ నుపాసించు యోగమనియు వీలుంతురు. ఇది పరిశుద్ధజ్ఞానోదయమున లభించును ఇది మానవులను సంసార మహాసముద్రమునబడి దరిగానక మునుగుచు దేలుచు పరితపించుచున్నట్టి వారికి పడవయై సముద్రమును దాటించి మోక్షమార్గమును జూపును. ఈతారక మునకు పంచముద్రలుగలవు. వానిని 1 ఖేచరి, 2 భూచరి, 3 మధ్యమ, 4 షణ్ముఖి, 5 శాంభవీ ముద్రలని పిలుంతురు. ముద్రాపంచకపు వివరముల భాగుగా వినుము.

నీ. కనుల మూసియో వానిని దెఱచియో
భ్రూమధ్యమును జూడ పొసగనదియొ

"ఖేచరీముద్రయిఁ జేర్చింపబడునది
చూపుచిదాకాశసూత్మ్రకొల్ల
అది రోగ, దప్పినిద్ర, విస్మృతి, చావు
ఆకలిబాధలనణచగలదు
శంకింపబనిలేదుచక్ర-భ్రూమధ్యమ్ము
చూడగ వగునులోజూపువలవ

తే-గీ. అది తమో, మేళు, చందిరమద్ని రజిత
సూర్య, జిత్ర-శిలంబాలజూపగలుగు
పదియు నాఱ్యస్నెలంగల్గుపసిడి బోలి
తారక బ్రహ్మమునుజూపుగోదనంత

తే-గీ. చలనమును బాపికన్నులజాలడెఱచి
చూడగా నాసికాగ్రంబుచూపునిలిపి
"భూచరీముద్ర" యనబడుపొసగదీని
గురుముఖంబునసేర్వగాకుదురగలదు

తే-గీ. కవగ నాసికామధ్యమునగులసగము
చలనరహితపు జూడ్కు-ల-దక్క-నుదుటి
వదియు "మధ్యమముద్ర"యలరుదీని
వశ్యసించినవారికినగును శుభము.

తే-గీ. నాసికా కర్ణములమూసినాదబించు
కిళల, బాహ్యావిషయములగడకు ద్రోసి
అవల నంతర్ల క్ష్యమందలియూర్ధ్వచక్ర
మందుచూపుమ బుద్ధినియలరజేయ
వదియు "షణ్ముఖీముద్ర" యీసమ్మనిజము.

సీ. బాగప్రాణాపానతగిన వ్యానోదాన
పడిసమానములను వాయువులను
నాగకూర్మకృకర తగదేవదత్తము
పడిధనంజయ నుప వాయుతతిని
ఆత్మమనోబుద్ధి యుచిత్తహంకారము
అంతరింద్రియములనవఘటించి
త్వక్చక్షు శ్రోత జిహ్వాయుమది అఘ్రాణ
జ్ఞానేంద్రియంబులజాలగట్టి
వాక్పాణిపాదప యావస్థలనువట్టి
కర్మేంద్రియంబుతకడుజయించి

తే-గీ. చక్కదెలిచిన కన్నులజలస రహిత
ములుగనొనరించిలోజూచుగలియజూచు
నదియె "శాంభవిముద్ర" యెయలరుచుండు
అభ్యసించినచో దానయలరు పరము

కనుక నైనుదహరించిన పంచముద్రల నెఱింగి వాని ద్వార ప్రణవశబ్దంబువలన బరగిన చిణిచి చిణినాద, తాళనాద వేణునాద, భేరీనాద, మృదంగి, మేఘమున్నగు నాదముల వరుసదప్పక వినందగును చూపులో బిందువును గాంచుటయే ఉకారమనంబడు. అందు గోచరించుకళయే మకారమనబడును ఈనాదబిందుకళను గూడినదగు "ఓం" కార శబ్దమే తారకమనబడును ఇట్టితారకమును గనిపెట్టి పరాత్పరాత్మయగు పరబ్రహ్మను గుర్తించి బ్రహ్మానంద మున లీనమై పోవువాగే దుఃఖరహితులగు చున్నారు కనుక ఓ తల్లీ! నీవును పరబ్రహ్మసంధానమును గుర్తించి బ్రహ్మ్

సందముచే నీ మాయాప్రపంచమును మరచి అమనస్కుడై పరబ్రహ్మమును జేరదగును.

అప్పటికిని వీరపాపమాంబ బ్రాతుని కారకోపదేశము నందలి రహస్యమును దెలియజాలక బాహ్యప్రపంచిక మాయవలన యాముకన్నులు నిర్మలత్వము నొందలేదని వీరంభొట్లయ్య గ్రహించినవాడై ఆమెకు తన విశ్వరూపమును జూపించి ఈ మాయలోకపు మాయను తరిమి ఆమెకు బాహ్యప్రపంచముపై విరక్తి గలిగించి తరుణోపాయమును బోధింపదలచెను.

తల్లీ! ఈ బాహ్యప్రపంచము నీటిమీది బుగ్గవంటిది. అది కేవలము మిథ్యయని తెలిసికొనుము. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను లోకోక్తి ననుసరించి సకలంబును బ్రహ్మమయమని దెలిసి కన్నులయందలి ఘూష్మద్వారమును బంధించి గాలికి కదలెడి దీపమువలె మనస్సును చలింపనీక యేకైక దృష్టితో బ్రహ్మము నెఱింగినవారు మాత్రమే మోక్షమును బడయగలరు.

ఓ ప్రియజనసీ! వేయేల నావచనముల మిథ్యయని భావింపవలదు. తనయుని మాటలు బ్రహ్మవాక్కులని తెలిసికొనుము. తల్లీ! నీవు ఒక క్షణము కన్నులు మూసికొని వెంటనే తెరచి చూడుమనగా నాకు యట్లొనరించినప్పటికి తనయెదుట కుమారుడగు వీరభద్రయ్యకు లేక ఒక మహా దివ్యపురుషుడు కనబడెను.

వీరబ్రహ్మము తల్లికి చూపిన విశ్వరూపము

సీ. విశ్వరూపంబవ। వేయితలల్గల్గి
వేయికన్నులతోడ। వెలసియుండ
వేయినాశికలును। వేయిమీసులగల్గి
వేయినాల్కలతోడ। వెరపుగూర్చ
వేయికరంబుల। వేయిపదంబుల
భీకరాకారుడై। వెలయుచుండ
నాభిక్రిమూర్తులు। నగుమొగంబులనుండ
గగనభాగముదాక। కాయ మొప్ప

తే-గీ. పద్మమునసిల్చి చక్క-గ। కవలకుండ
గదయు, శంఖము, చక్రంబు। ఖడ్గ, డమరు
క, విలు; శూలంబు, వేదాల। గలిగి నిలిచె
''విశ్వరూపము'' జూపుచు। వేడ్క-తోడ.

ఆ భీకరాకారమును గనినంతనె వీరబాపమాంబ గడ గడ వడంకుచు కరముల జోడించి నాయనా! నేను మాయకు లోబడి నిన్ను నాపుత్రుడనియు, సాధారణ మానవబాలుడవనియు దలచితిని. ఆనాడుఅ తిమునీంద్రుడు నిన్ను నాకర్షించు సపుడు ''అమ్మా! ఈ బాలుడు మాయాగర్భజనితుడనియు, మానవగర్భమునందుండి వెడలినవాడు కాడనియు, శ్రీమన్నారాయణమూర్తి యంశమున ప్రకృతికి జన్మించెననియు చెప్ప వింటిని. ఆమాటల నప్పుడేమరచితిని. అందలి గూఢార్థము ఇపుడు బయటపడినది. తండ్రీ! లోకేశ్వరుడవగు నీవు కడ మానవపురాలసగు నేనొక్కడ, ''పక్కయొక్కడ వాగ

లోక కొక్కడ'' అను లోకోక్తి వనుసరించి సాక్షాద్భగవం తుడవగు నిన్ను నాతనయునిగా భావించినది నాతప్పా. తండ్రీ! నీరూపమును గనజాలకుంటిని. మరల నీ సుస్వారూప మును దాల్పుము.'' అని ప్రార్థింప ''ఓయమ్మా! భయపడ కుము. మరల క్షణము నీకన్ను మూసికొనిన వెంటనే తెరచి చూడు'' యనగా వీరబ్రహ్మాంబ యట్లే చేసెను. అమ్మ తిరిగి కన్నుల దెరచులోపల వీరబ్రహ్మము తల్లికి నమస్క రించుచు నిలబడి యుండెను.

అతడు తల్లిని చూచి జననీ! యిపుడు నీవు చూచిన విశ్వరూపమును గురించినగాని వన్ను గురించికాని ఇతరులతో వనకుము. నేను నిజముగ నీపుత్రుడనే సుమా. శ్రీహరి మానవపతియింట జన్మింపలేదా. అతడు అగ్నిహోత్రము నుండి వెలువడినట్లు నేను ప్రకృతకాంతనుండి వెలువడితి వంతయే కాని వేరుకాదు. హోమగుండమునుండి వెలువడిన కూరి మానవస్త్రీయగు కౌసల్యాతనయు డనిపించుకొనినట్లె నేనును మానవస్త్రీవగు నీపుత్రుడ వనిపించుకొనియే నా నాటకమును ప్రదర్శింపనున్నాడ.

ఓ జననీ నీవిపుడు పరబ్రహ్మమును దెలిసికొని యుందువు. ఇక నాకు దేశసంచారము జేయుచు నిమ్న శ్రేణి బుల కేగి మహాపుణ్యతీర్థంబుల గ్రుంకి, అ[illegible] అను జ్ఞానమార్గోపదేశం జొనరించుచు [illegible]నుర క్తుల శ్రేష్ఠు బోవుటకు అనుజ్ఞనిమ్మని ప్రార్థించెను [illegible] సర్వేశ్వరుడవగు నీకు నేను సెలవిచ్చుటెట్లు? నీ ఇష్టము. నీవెపుడుకోరిన యపుడే వెళ్ళుము అని [illegible]

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.N.
D.P.B.J.
Acc. No.

ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

రెండవప్రకరణము

వీరబ్రహ్మము దేశయాత్ర

వీరభోట్లయ్య తల్లికి విశ్వరూపసందర్శన భాగ్యము లభింపజేయగనే యాతమె యజ్ఞానతిమిరముపోగా ఈమాట పట దేశయాత్ర గావించుటకు ఆజ్ఞయిచ్చి ఆశీర్వదించెను. అపుడు వీరప్పయ్య తల్లిదండ్రులు బాల్యమున దనకు బెట్టిన యాభరణములను, దివ్యవస్త్రములనువదలి కాషాయ వస్త్రముల ధరించి కంఠమున రుద్రాక్షమాలయు కరమున జపమాలయు ధరించినవాడై ఫాలభాగమున విభూతిరేఖలు మెరయుచుండ తల్లికి నమస్కరించి ముందు దక్షిణదేశ మును జూడ నిశ్చయించినవాడై పాపట్ని మఠమును వదలిపోయెను.

అతడు తిరుపతి, శ్రీకాళహస్తి, కంచి, చిదంబరము, శ్రీరంగము, కుంభకోణము, మధుర మున్నగు దివ్యస్థలంబుల దిలకించి, తదుపరి రామేశ్వరమును జేరెను. అచ్చట ధను స్కోటికి వెళ్ళి మహోదధిసంగమమున స్నానంబు రామేశ్వరమున రామలింగేశ్వరుని సేవించి, అచ్చట కొన్నిదినములు నిలిచి

యాత్రలజేయు నెపమున వచ్చిన పణిత్తలకు ధర్మసూర్గము నుపదేశించుచుండెను.

ఆవల గొన్నాళ్ళకు అక్కడినుండి బయలుదేరి దర్భ శయనము నవపాషాణములుడర్శించి, కన్యాకుమారివరకుగల క్షేత్రములకు బోయి హరిహరపురంబునకేరెను. హరిహర పురంబునంగల దివ్యాలయంబులదర్శించి దేవతలనారాధించి ఒక నిర్జనప్రదేశమునతపోనియతిం గూర్చుండి దీక్షవహించి పూర్ణోపాసనాతత్పరుండై బ్రహ్మవందమునసుండెను. అతం డాకీతి గొంతకాలము అచ్చటనే నిలిచియుండెను.

ఈశ్వరుడు ఆనందభైరవయోగిగా అవతరించుట

ఓభక్తశిరోమణులారా! ముందుధర్మదేవతపాపభార మును వహింపలేక శ్రీమహావిష్ణువుతో భూమిపై యేదో యొక అవతారమునుదాల్చి పాపవినాశ మొనరింపప్రార్థించి యుండెనుకదా. అపుడు గోవిందుడు బ్రహ్మ శంకరులతో యోచించి శంకరుని కాశిలో ఆనందభైరవ యోగిగానవత రింపుమని చెప్పియుండెను.

కలియుగక్కై లాసంబనబరగిన వారణాసిమహా నగరమై యుండెను. కాశీరాజ్యమును పూర్వమునుండియు క్షత్రియ వంశసంభూతులగు రాజులు పరిపాలించుచుండిరి. మనకథా కాలమునాటికి కాశీనగరమును విజయ సింగు అను క్షత్రియ వీరుడు పరిపాలించుచుండెను.

విజయసింగున కెంతకాలమైనను సంతానము గలుగ కుండెను. అతడు భార్యతోగూడ నెన్నియో వ్రతముల నొన రించెను. తీర్థయాత్రలజేసి సకల దేవతల నారాధించియు ప్రయోజన మేమాత్రమును గలుగనందున శ్రీరామావల్లభుని సంతాన ప్రాప్తికై సదా ధ్యానించుచుండెను. అట్లుండగా ఒకానొకరాత్రి విజయసింహునిసతి గాఢనిద్రాపరవశురాలై యుండగ పార్వతీరమణుడు స్వప్నమున దర్శనమిచ్చి "అమ్మా! నీవు పుత్రులులేరని చింతింపకుము. త్వరలో నీగర్భమున నేనే జన్మించెదను" అని చెలవిచ్చి తిరోహితుడయ్యెను.

అంత గొన్నాళ్ళకు విజయసింగు భార్య గర్భవతి యయ్యెను. భార్యా భర్తలిద్దరును శంకరుని వరమువలన పుత్రుడు జన్మించునని సంతోషముతో బొంగిపోవుచుండిరి. వారు సదా ఈశ్వరధ్యానమున కాలమును బుచ్చుచుండిరి. అట్లుండగా రాజుభార్యకు క్రమముగా నవమాసములు దాపురించెను. అపుడు పూర్ణ గర్భవతియగు రాజుభార్యకుపదవ మాసమునందొక శుభలగ్నమున గర్భవేదన ప్రారంభమై యీశ్వరాంశసంభూతుడగు కుమారుడు జన్మించెను.

విజయసింగు సాంబమూర్తి యనుగ్రహమున పుత్రోత్పత్తిని బడసినందులకు సంతసించినవాడై పదునొకండవ దివసమున మంగళస్నానమును జేయించి పూజ్యులగు పురోహితులను బంధుమిత్రులను రావించి ఒక సుముహూర్తమున అవరూపముగ జన్మించి యానంద హృదయమున జేతియాడించెడి శిశువునకు "ఆనందుడు" అను నామమునిడెను.

ఆనందుని బాల్యము

—:o:—

ఆనందుడు దినదిన ప్రవర్థమానుడై శుక్ల పక్ష చంద్రుని వలె సర్వకళలతో నొప్పి తల్లిదండ్రుల కేకాక ఆపుర వాసు లందఱకు ఆనందమును గలిగించుచుండెను. విజయసింగు ఆనందునకు అన్నప్రాశము, కర్ణరంధ్రోత్సవము క్రమముగ సాగించి పంచవర్ష ప్రాయుడై నంతనే విద్యాభ్యాసము చేయించెను. రాకుమారుడు గురుకుల వాసమున జేరి సద్వి ద్యలన్నిటినేర్చి మరల దండ్రిగృహమునకు విచ్చేసెను.

అటుపిమ్మట విజయసింగు తనపుత్రునకు క్షత్రియో చిత విద్యలగు వ్యాయామ, ఖడ్గ, ముష్టి, మల్లయుద్ధ విద్య లలో నిపుణు నొనరించెను. ఆరీతి విద్యల నభ్యసింపగనే ఆనందునకు క్షత్రియధర్మముల ననుసరించి వుపనయనము నొనరించెను. అంతట గొన్నాళ్ళకు రాజకుమారుడు పదునా రేండ్లవాడై తనతోడి యువకులందఱకు మిన్నయై మహా బలవంతు డనిపించుకొనెను.

అంతలో రాజపుత్రుడు పదునెనిమిదేండ్ల వాడై రాజ్యాభిషేకమునకుదగియుండెను. విజయసింగు కుమారునకు పట్టముగట్టదలచిజ్యోతిష్కుల రప్పించి,ఆనందునిజాతకమును జూపించి పట్టము గట్టుటకు తగిన శుభలగ్నమును నిర్ణయింప గోరెను. అందుకు దైవజ్ఞులు జాతకమును బాగుగ చూచి, యోజించి "ఓరాజా! ఈతనికి రాజయోగములేదు. ఇట్లు చెప్పితిమని యాగ్రహింపకుడు. ఉన్నసంగతి చెప్పితిమి. ఇతడు రాజగాకున్నను మహాయోగి యగు" ననిరి.

అందుకు విజయసింగు సరి వానియదృష్టమును పరిశీలన గావింతమనిమిన్నకుండెను. అంతట నవయౌవనుడు, సుందరాకారుండును నగు ఆనందసింహుడు తన యీడు మిత్రులతో గలిసి ఉద్యానవనములందును, పుర బాహ్యప్రదేశములందును సాయంకాలమున వాహ్యాళి వెడలి వినోదముగ కాలము బుచ్చుచుండెను. అతడు తలిదండ్రుల యాజ్ఞ లేక ఏకార్యమునుగాని జేసి ఎరుంగడు. పితృవాక్య పరిపాలకుడని పేరు గాంచెను. అతనికి అశ్వారోహణము, మల్లయుద్ధము ధనుర్విద్యయన్న మిక్కిలి యిష్టము.

ఆనందసింగు అడవికి వేటాడబోవుట

ఆనందసింగు ఉన్నటులుండి ఒకనాడు తండ్రికడకరిగి తండ్రీ! నాకేలనో అడవులలో వేటాడబోవలయునని కోరిక జనించినది, మీరు నాకు అశ్వారోహణ, ధనుర్విద్య, మల్లయుద్ధము నేర్పించితిరిగదా, అడవికిబోయి నా ధనుద్విద్యా కౌశలమును క్రూరమృగంబుల వేటాడుటలో జూప కుతూహలపడుచున్నాను, కనుక నాయందు దయయుంచి నాసహాచరులతోడను పరివారముతోడను క్రూరమృగ సంహారార్థము అరణ్యమునకేగ యనుజ్ఞ నిమ్మని ప్రార్థించెను. అందుకు విజయసింగు సంతోషముతో సమ్మతించెను. ఆనందసింగు మరునాడు తన పరివారమునకు అడవికి వేటాడుటకు సర్వమును సిద్ధము చేయుమని యాజ్ఞ చేసి తన మిత్రుల కాసంగతిని తెలిపెను.

ఆనందసింగు అడవిలో ప్రమాదమున గోవును సంహరించుట

ఆమరునాడు రాజసేవకులు తగిన యాయుధంబులతో అరణ్యమునకు బయలుదేరిరి. కొందఱు ఖడ్గములతోడను కొందరు ఈటెలతోడను కొందరు అంబులతోడను ప్రయాణము కాగా మరికొందఱు వలలతోడను, ఉచ్చులతోడను, వడిసెలలగొని యుదమవెంట సింహాములన్నైన లెక్కసేయని జాగిలంబుల మెలడకు నినుపగొలుసుల దగిలించి పట్టుకొని బయలు వెడలిరి. ఆనందుడు అతని మిత్రులు ఉన్నతాశ్వములనెక్కి వేటదుందుభుల మ్రోగించుచుండ ముందు వెడలు చుండిరి.

ఆరీతి ప్రయాణము సాగించి చిట్టడవులదాటి ఘోరారణ్యమును ప్రవేశించి నిలుచుటకు దగిన నివాసముల నేర్పాటుచేసుగొని అందఱకును ముందు భోజనసదుపాయముల నేర్పాటు గావించి తదుపరి అందఱును ఒక మహా సరోవరంబునకేగి జలక్రీడల నొనరించి శ్రమదీర్చుకొని భుజించి విశ్రమించిరి. ఆనాడంతయు ప్రయాణశ్రమను దీర్చుకొనుటకు విశ్రాంతిగొనినవారైరి.

అంతటమరునాడు పరివారమంతయు ఆయుధహస్తులై వేటదుస్తుల ధరించి సిద్ధపడిరి. అరణ్యమందలి క్రూరమృగములుభీతిల్లి బయటికిరాగోరి ముందురణదుందుభుల మ్రోగించిరి. ఆశబ్దమునువిని పొదలలోదాగిన పులులు, సింహాములు, అడవిపందులు, చిరుతపులులు, సివంగులు, తోడేళ్ళు, ఖడ్గమృగములు, దుప్పులు, జింకలు, ఎలుగుబంట్లు మున్నగునవి భీతిల్లి అడవిలో నానాదిశల బరుగిడ సాగెను.

అపుడు ఆనందసింగు తన యశ్వ్వమునెక్కి ఈటియం గొని వ్యాఘ్రములవెంటాడి చంపుచుండెను. కొందఱు చిఱుత పులుల జంపుచుండ మరికొందఱు సివంగుల దఱిమి చంపు చుండిరి. ఎవరికి గనబడిన మృగాలను వారుసంహరించుచుండి కొందరా చచ్చినమృగముల నొకచోట బ్రోగుచేయగా నది చచ్చిన మృగముల కొండవలెనుండెను. కొందఱు గుంటల ద్రవ్వి వలలనొడ్డి జంతువుల బట్టుచుండిరి. కొందఱు ఆకస మున నెగురుపక్షుల వడిసెలరాలతో బడగూల్చుచుండిరి. కొందఱు జాగిలంబుల గొలుసుల రప్పించి చిఱుతపులులపైకి నుసికొల్పగా నవి వానినిదరిమి చీల్చి వేయుచుండెను. ఆలాగు వారు మధ్యాహ్నమువఱకు వేటాడి యలసి మరల దటాక మున దూకి జలవిహార మొనరించి యలపుదీరగనే భుజించి తరుచాయల విశ్రాంతి గొనుచుండిరి.

అట్లు విశ్రమించియుండగా ఆనందు డొంటరిగ యొక చెట్టుక్రింద విశ్రాంతిగొన నెంచి ధనుర్బాణముల బ్రక్కనిడు కొని పండుకొన బ్రయత్నించుచుండగా ఒక తెల్లని గోవు గర్భభారముచే మెల్లగ నీటిని ద్రాగుటకు సరస్సునకేగుట జూచి దానినొకకంట కనిపెట్టియుండెను. ఆధేనువు కొలని కింజని దప్పిదీర నీరంబులగ్రోలి మరల దన నెలవునకు మరలి వచ్చుచుండెను. అంతలో అందొక దట్టమైన పొదలోదాగి పొంచియుండిన వ్యాఘ్రము పొదనుండి గాండ్రించుచు గోవుపైకి లంఘించనుండగా ఆవు భీతిల్లి అంబాయని చావు అరపు అరచెను. ఆనందుడు ఆదృశ్యమునుగని ప్రక్కనుండిన వింటికి బాణమును దొడగి పులిమీదికి వదలెను. అంతలో నాపులి లంఘించుటచే గురితప్పి ఆ బాణము ఆవుకడుపులో

చూచెను. ఆవు అంబాయని యరచుచు నేలంబడి తన్నుకొని చచ్చెను. దానినిచూచి పులియుదప్పించుకొని పరుగెత్తెను.

ఆవ్యాఘ్రము పరెగెత్తుచుండుటయు, గోమాతఅంబాయని చావ్రకేక వేసి భూమిపై బడి విలవిల దన్నుకొని మరణించు దృశ్యమును గనినంతనే ఆనందుని చేతిలోవిల్లంబుల తమంతట కవియే జారి క్రిందపడుచుండగా రాజకుమారుడు 'హా! పరమేశ్వరా!' అని మూర్ఛిల్లెను. ఆహారవమును విన్న యాతని హితులు పరివార మాతనికే విపత్తు సంఘటించెనో గదాయని పరుగిడిచూడగా నతడు స్మృతిలేక పడియుండె. అప్పుడొకడు సరోవరమునకు బరుగిడి శీతలోదకమునుగొని తేగా హితులా యుదకమును ముఖముపై జల్లి ప్రథమచికిత్స యొనరింపగా రాజపుత్రుడు కన్నులదెరచి చూచెను.

అప్పుడు రాజకుమారుని మిత్రులు అన్నా! ఎందులకిట్లు మూర్ఛిల్లితివి. అందులకు గారణమేమనగా సతడిట్లు చెప్పదొడంగెను. మిత్రులారా! నేనేమనిచెప్పగలను నేనుమీతో గూడ విశ్రాంతిగైకొనుచుండ ఒక గోవు గర్భభారముతో తటాకమువంక మెల్లగ బోవుచుండ గాంచితిని. అంత కొంత నేపటికది సిరంబులద్రావికాబోలు తననెలవుకు బోవుచుండ పాదయంబు పొంచియుండెడి ఒకపులి గాండ్రుమని దానిపైకి దూకుచుండ నేను ప్రక్కనుండిన నావిల్లునకు బాణమును దొడిగి వ్యాఘ్రముపై బరివితిని. అంతలో పులి లంఘించుకతన నాబాణము గురితప్పి గోవు కడుపున జొచ్చినంతనే యది తన్నుకొని ప్రాణముల విడిచెను.

అకటా! నేనింక బ్రతికియు ప్రయోజనము లేదు. గోహత్యాపాతకము ననూన్నారకపీడదు. పచ్చితురకలు చేసెడి

యధర్మకార్యమును నేను చేతులార నొనరించితిని. మీరు ప్రమాదవశమున జరిగినది పాపహేతువు ననోనాదార్ప యత్నింతు రేమో, ప్రమాదమునగాని మరియే విధమున గాని "గోహత్య, గోహత్యయే కాని వేరు కాదు." అన్న లారా! ఈపాతకమునుండి నేనెట్ల బయటబడగలను. అకటా! పరమపాతకుడనగు నేనెట్లు నాతలిదండ్రుల కడకువచ్చి వారి ముఖముల జూడనగును. మీరందరును వెళ్ళుడు. నేనురాను ఈ సంగతి నాజననీజనకులకు జెప్పుడు చాలునన్నెను.

అందుకు మిత్రులు ఓయీ! నీకు బిచ్చి తల కెక్కినది కాబోలు, ప్రమాదమున జరిగిన దానికివగవ బనిలేదు. అందుకు మనము పురమున కేగి దానిని మీతండ్రిగారికి దెలుపుదము. అతడు పండితులతో యోచించి ఈ పాపపరిహారార్థము తగినయోజన చేయగలడని యాతని పలువిధముల నోదార్చిరి. ఆమాటల కతడు అన్నలారా! నేను యెందులకు వేటకువచ్చితినో గదా, ఊరకుండక తండ్రి వలదన్నను వినక ఆతని యాజ్ఞగొని మీకు శ్రమగలిగించి ఇటకు బిలుచుకొని వచ్చితిని. దీనికంతటికిని యేదో పరమ రహస్యముండక తప్పదు. ఇదిదైవకృతమని భావింపక తప్పదు. ఈ పాపమెట్లుపోవునోగదా. గోహత్యాపాతకము సమ్మోహక విడువదు. కానిండు మనము పురమునకరిగి జరిగిన దానిని తండ్రి కెరిగించిన యాతడు యోజించి తగిన యేర్పాటు చేయగలడు. అని మిత్రులతోగూడ సపరివారముగ బయలుదేరి పురమును జేరెను.

విజయసింగు.పండితులతో యోజించుట

ఆనందసిందు గృహమును జేరి దుఃఖించుచు దండ్రి పాదములపైబ్రవాలి ''తండ్రీ! నేను మహాపాపకార్య మొనరించితిని. ఆపాపము పూరకపోవునదిగాదు. అందుకు నేను నాప్రాణమర్పించిన సరిపోవును. కనుక నేను అగ్నిప్రవేశమొనరించుట కనుజ్ఞయిండు'' అని అరణ్యములో జరిగిన విషయములను పూసగ్రుచ్చినట్లు వినిపించెను.

విజయసింగపుడు నాయనా! దుఃఖింపవలదు. ఇది తెలిసి చేసిన పాపముకాదు. తెలియక చేసిన పాపమునకు బ్రాయశ్చిత్తముండకపోదు. ప్రమాదమున జరిగిన పాపము నిన్ను బాధింపదు. భయపడకుమని యోదార్చి ఒక సేవకుని బంపి పండితుల బిలుచుకొని రమ్మనెను.

అంతట పండితులువచ్చిరి విజయసింగు పండితులసభ నేర్పాటుగావించి వారికి ఆనందుని పాపకార్యము నెరింగించి దానికి దగిన పరిహారమును యోజించిచెప్పుడని ప్రార్థించెను. అపుడు పండితులందఱు ఏకాంతమునజేరి శాస్త్రపరిశోధనగావించి రాజునుచూచి ''ప్రభూ! గోహత్యాపాపము ప్రమాదమునజేసి మరి దేనివలనగాని జరిగినయూరక వదలునది కాదు. మేము శాస్త్రముల పరిశోధించి చూచితిమి. ఆపాపమొనరించినవారు కొంతకాలము దేశసంచార మొనరించుచు దివ్యక్షేత్రములకేగి మహాపురుషుల దర్శించి వారిని సేవించినచో సరిపోవునని యూనతియ్య రాజు చింతతో బలుకకుండ పండితులు వెళ్ళిరి.

ఆనందసింగు యోగిరూపమున తీర్థములసేవింపనరుగుట

విజయసింగు తనకుమారుడు ఇల్లువదలి పోవుట కిష్ట బడకుండెను. అదిచూచి ఆనందుడు తండ్రీ! మీరిట్లు చింతా సముద్రమున మునిగి నాకు తీర్థయాత్రల కనుమతింపకున్న నెట్లు. మీరు సమ్మతింపనిచో ఈగోహత్యాపాతకమున న్నే కాక మనవంశీకులనందర బాధింపకపోదు. మీరు భయపడ వలసిన పనిలేదు. నేను తీర్థయాత్ర పరుడనై తీర్థములను దేవతాస్థలములను దర్శించి మహాత్ముల సేవించి పాపవిదూ రుడనై మరల దిరిగి మీపదములకడకు రాగలను. అని పరి పరి విధములజెప్పి తండ్రిని సమ్మతింప జేసిన వాడయ్యె.

అంతట ఒకనాడు ఆనందుడు తండ్రికి దెలియకుండ గంగానదిలో స్నానంకులిడి నిర్మలహృదయుడై కాషాయవస్త్ర ములనుధరించి, నుదుట విభూతిరేఖలను, కంఠమునరుద్రాక్ష మాలను, చంకన జోలెను, కుడిచేత జపమాలను, యెడమ చేత కమండలమును వీపున జింక చర్మమును జుట్టి పెట్టు కొని పాదుకల దొడిగి జనకుని కడకువచ్చి "జై శంకరా విజయాభవ" అని పలికెను.

ఆయోగిపుంగవు దిలకించి విజయసింగు భ్రమించి పరమేశ్వరుడాయని లేచి నమస్కరించి యున్న తాసనమున గూర్చుండగోరెను. అంకాయోగి "తండ్రీ! నేను నీపుత్రు డగు ఆనందుడను. ఇపుడు ఆనందయోగినై తిని. నేను దీర్థ ముల సేవించుటకు బోవ ప్రయాణమైవచ్చితిని. త్వరలో నాపాపభారమును పోగొట్టగల దివ్యపురుషుల దర్శించి

వారిని సేవించి వారివలన తరించు మార్గము నెరింగివత్తును, దయయుంచి నన్ను ఆశీర్వదించి పంపుడనగా రాజు ఆశీర్వదించి సెలవిచ్చెను. అచ్చటనుండి అతడు తల్లికడకేగి ఆమె యాశీర్వాదముల వడసి తీర్థయాత్రల నెపమున దేశసంచారము వెడలిపోయెను.

ఆనందయోగి వీరప్పయ్యను దర్శించుట

ఆనందయోగి కాశీనగరమును వదలి తీర్థముల దర్శించుచు గోకర్ణము, పుండరీకము, శ్రీశైలము, మహానందీయాగంటి మొదలగు దివ్యక్షేత్ర సందర్శనానంతరము హరిహరపురంబును జేరి అందొక నిర్జన ప్రదేశమునంజేరి భగవంతునిగూర్చి తపమొనరింప సంకల్పించి తగిన స్థలమును వెదకుచుండగా ఒకానొక ఏకాంతస్థలమున యోగ నిష్టాపరవశుడైన యోగీంద్రుడుకనంబడెను. అతనిని జూడగానే యానంద యోగి అతడు దివ్యపురుషుడని గ్రహించెను. ఆ మహాపురుషుని వలన గోహత్యాపాపము పోగొట్టుకొను యుపాయము నెరుంగవచ్చునతని తపోనిష్టలోనున్నయతని బలుకరించిన చో తపోభంగ మొనరించిన పాపము సంభవించునేమో యని భయపడి అతనిమెదుట భగవంతుని ధ్యానించుచు గూర్చుండి యుండెను.

వీరప్పయ్య ఆనందయోగికి దర్శనమొసగి గోహత్యా పాపము బోగొట్టుకొను మార్గమును దెలుపుట

అంతట వీరప్పయ్య యోగనిష్టనుండి మేల్కొని కన్నుల దెరచి తనయెదుట గూర్చుండి భగవధ్యానములో నిమగ్నుడై యున్న యోగిని గని "ఆనందభైరవయోగీ! నీ రాకకై యెదురుచూచుచుంటిని. నీవు కాశీనగరమున విజయసింగు కుమారుడవై జన్మించినది నే నెఱుంగుదును. నీవు ప్రమాదవశాత్తు గోహత్య నొనరించితివి. అది ప్రమాదము కాదు. ఇది సర్వేశ్వరుని సంకల్పము. నిన్ను నాకడకుబంపుటకే భగవంతుడు ఆసంఘటనను గల్పించెను. నీవు చింతింపవలదు. నీ వాంశసంజనితులను గోహత్యాపాతకము సర్వదాయిడుముల పాలొనరింపదు. అదియునుంగాక నీవుపరమేశ్వరుడవయ్యి ఆయన సంకల్పమున కాశీనగరమునం దవతరించితివి. నీపేరు ఆనందసింగు మరియు ఆనందయోగికాదు. భగవంతుడు సంకల్పించినపేరు "ఆనందభైరవయోగి" అనువనని గ్రహింపుము. ఇప్పటినుండి నీవు ఆనందభైరవయోగినామంబున వెలయుచుండుము." అనగా ఆనందభైరవయోగి వీరప్పయ్యకు సాష్టాంగ దండమాచరించి అతని పాదములబట్టి మహాత్మా! నీవు మానవుడవు కావని నాకు తోచుచున్నది. శ్రీహరి తన దివ్యావతరము నీరీతి ధరించి వచ్చినటులున్నది. ఓ భగవస్స్వరూపా! నాయందు దయయుంచి నన్ను బాధించెడు గోహత్యాపాపమునుండి తరించు మార్గమును చెప్పి రక్షింపుడని ప్రార్థించెను.

ఆనందభైరవయోగి గోహత్యాపాతకమునుండి తరించు మార్గము నెరుంగుట

అందుకువీరప్పయాచార్యులు సాయనా! నీవుసామాన్య మానవుడవు కావనియు, పరమేశ్వరుని సంకల్పమువలన నీవు మానవయోనియందు జన్మించితివని యింతకుముందు చెప్పితిని. మానవగర్భమున జన్మించిన కారణమున నీవు శంకరావతారుడవయ్యు గోహత్యాపాపమును అనుభవింపక తప్పకున్నది. అయినను విచారింప బనిలేదు నీవు తురుష్కుడవై జన్మించినచో యీ పాపము పరిహారము కాగలదనెను.

ఆనందభైరవయోగి ఆ మాటలకు దేవా! నన్ను మహమ్మదీయ వంశమున జనింప మనుట న్యాయమా మహమ్మదీయులు మతవిరోధులనుట జగద్విదితము హిందూ దేవతలన్నను, హిందుమతమన్నను, వారికి సరిపోదుకదా. గోవులజంపి వానిని భుజించు తురకలలో జన్మించిన నా గోహత్యాపాపమెట్లుపోగలదు. మహమ్మదీయుడవై జన్మించిన మరియెన్ని గోవులగొంతు గోయవలసి వచ్చునోకదా, ఒక గోవును చంపిన పాతకమును బోగొట్టుకొనలేక బాధపడుచుండ మరల కటిక తురకనై యసంఖ్యాక గోవధకు బురిగొల్పుట జూడ నాకిక తరుణోపాయమే లేదని తోచుచున్నది. ఇందలి మర్మమును వెల్లడింప ప్రార్థింతునని.

అందుకు వీరంభొట్లయ్య నాయనా! నీవు కేవలము తురుష్కజాతిలో జన్మింపవు మతాంతరులగు ముసల్మానులచే బలవంతముగ మహమ్మదీయ మతములో జేర్పబడ్డ హిందు

వుల తెగయొకటి యున్నది. వారు మహమ్మదు మతమున గలిసినను హిందూమతముపై అభిమానమును గోలుపో లేదు. వారిని జనులు పింజారు లనియు దూదేకుల వారనియు బిలు తురు. కనుక నీవు ఆవంశమున యవతరించి మరల నాశిష్యు డవై పాపుల తరింపజేయగలవు. కనుక నీవు మరల దివ్య క్షేత్రముల దర్శించుచు బోయి నీతలిదండ్రులయొద్దజేరి రాజ యోగమున పతితుల గాపాడుచుండి యీ యవతారమును జాలించి నేజెప్పిన యవతారమును స్వీకరింపుమనగా ఆనంద భైరవయోగి తండ్రీ! నాకింకను సంశయము తొలగకున్నది యేమి చేయుదుననెను.

వీరప్పయ్య ఆనందభైరవయోగికి గోవధ పాపమును బోగొట్టి మంత్రోపదేశము చేయుట

—:o:—

అప్పుడు వీరప్పయ్య నాయనా! నీసంశయము లన్నిటిని బటాపంచ లొనరించు మంత్రము నుపదేశించెద వినుము.

మహా మంత్రము

ఆచమ్య...పూర్వోక్త ఏవంగుణవిశేషణవిశిష్టాయాం శ్రీమదాది శ్రీమతః.....గోత్రస్య.....నామధేయస్య .....మమధర్మపత్నీసమేత.....అస్య సకుటుంబానాం క్షేమస్థైర్యవిజయాయురారోగ్యైశ్వరాభివృధ్యర్థం.....
...ఇష్టకామ్యార్థసిధ్యర్థం, చతుర్విధఫల పురుషార్థసిధ్యర్థం.

శ్రీ వీరబ్రహ్మదేవతా ముద్దిస్య. శ్రీ వీరబ్రహ్మదేవతా ప్రీత్యర్థం, శ్రీ వీరబ్రహ్మేశ్వర దేవతా మహామంత్రోపాసన కరిష్యే—

మంత్రము

అస్య శ్రీ వీరబ్రహ్మస్తోత్ర మహామంత్రస్య, సిద్ధి యోగీశ్వరఋషిః పంక్తిఛందః, పరంజ్యోతి స్వరూపిణీ పరమాత్మదేవతా, ఓం బీజన్మః శక్తిః శివాయ ఇతి కీలకం, మమశ్రీ గురు పరబ్రహ్మప్రసాద సిధ్యర్థే జపే వినియోగః. అని జపమొనర్చి తదనంతరము కరన్యాసము చేయవలయు, ఆ కరన్యాస మేలాగనిన—

ఓం వీరబ్రహ్మాయ అంగుష్టాభ్యాన్నమః
ఓం నం సూతాత్మకాయ తర్జనీభ్యాం స్వాహా
ఓం వం బ్రహ్మోపదేశకారణాయ మధ్యమాభ్యం వషట్
ఓ శ్రీం అనామ కాభ్యాం నమః
ఓం వాం కనిష్ట కాభ్యాం వౌషట్
ఓం యం సత్యస్వరూపాయ కరతలకరపృష్టాభ్యాం ఫట్ అధహృదయాదిన్యాసః
ఓం వీరబ్రహ్మాయ హృదయాయ నమః
ఓం శిరసేస్వాహా-క్లీం-శిఖాయై వౌషట్, సౌం-కవచాయ హుం-హ్రీం-నేత్రత్రయాయవౌషట్ శ్రీం-అస్త్రాయ ఫట్, భూర్భువస్సువరోం మితిదిగ్బంధః.

ధ్యానము

"వందేనిత్యం భవభయహరం సర్వలోకాదివాసం
నిత్యాకారం సకలజిగతాం సూత్రదత్తారమాద్యం
భావతీతంత్రి గుణరహితం తత్వమస్యాదిగమ్యం
వీరబ్రహ్మమహంభజామిసతతం సచ్చిదానందరూపం"

అను మంత్రము నుపదేశించి తదనంతరము దశవిధ నాదముల నాలకించి సద్ధర్మనిరతుడవై యుండువేని పర బ్రహ్మమును దెలిసికొనగలవు దశవిధనాద వివరమును ఆలకింపుము.

దశవిధనాద వివరణము

దశవిధనాదము లనంగా కర్ణములందుండు దేవవాద్యములని తెలియందగు—

1. జలధిఘోష
2. భేరీనాదము
3. మద్దెలనాదము
4. మృదంగనాదము
5. ఘంటానాదము
6. కాహళనాదము
7. కింకిణీనాదము
8. వేణునాదము
9. భ్రమరనాదము
10. ఓంకారనాదము

అంతట ఆనందభైరవయోగి స్వామీ! మీరాదివ్య మంత్రోపదేశమువలన నేను తరించినవాడనైతిని. నాకుసెల

విచ్చి యెటకేగమందురో యానతిండనగా వీరంభొట్లయ్య, నాయనా! నీవు యిహికవాంచల బోనాడి ప్రకృతిని మరచి యోగమార్గమున నానందమయుడవై సమాధినిష్ట వహించి మరొకజన్మము నెత్తబొమ్ము. ముందు నీ జననీజనకుల సేవ కొన్నాళ్ళుచేసి, తదుపరి రాజయోగమున రాజ్యపాలనమొన రించి సజ్జనాళిని దయతో జూచుచుండుము. ఇక పొమ్మనగా నానందభైరవయోగి తన జన్మస్థానమగు కాశీనగరమునకు తిరుగు ప్రయాణము జేసెను.

వీరప్పయ్య బనగానపల్లె జేరుట

హరహరపురమున వీరంభొట్లయ్య తర్వాత గొంత కాలము తపోనిష్టనుండి అక్కడనుండి మరల తీర్థయాత్ర నొనరింప బయలుదేరెను. అచ్చటనుండి కందవోలున కేగి తుంగభద్రలలో స్నానమొనరించి నదినిదాటి అలంపూరువ కేగి జోగులాంబను సేవించి అచ్చటనుండి శ్రీశైలమున కరిగి మల్లికార్జునుని సేవించి కొన్నిదినము లచ్చట గడిపి, అచ్చటనుండి మహానందిక్షేత్రమున కరిగి అచ్చట మహా నందీశ్వరుని గొల్చి, ఓంకారమున కేగి యందలి సరోవర మున మునిగి నల్లమలలో ప్రయాణ మొనరించుచు అహో బిలమును జేరెను. అచ్చట శ్రీమదహోబిల నరసింహస్వా మినిదర్శించి కొన్నిదినము లుండెను. అచ్చటనుండి కణ్వా శ్రమమునకును అగత్స్యాల యాశ్రమమున చూచి గండి

కోట చేరి అచ్చట తురుష్కులచే నాశనమొనరింపబడిన మాధవుని యాలయమునుగని విచారమున మునిగి అక్కడ నుండి విరూపాక్షమున కేగి విరూపాక్షరాయలను సేనించి మరల పండరీపురమున కేగి పండరినాథుని దర్శించి చంద్ర భాగలో స్నానముచేసి త్వరితగతిం బయనించి యేలకో బనగానపల్లె జేరెను.

వీరంభోట్లయ్య గోపాలకుడగుట

వీరప్పయాచార్యులు బనగానిపల్లె జేరెను. అత డచ్చట జేరునప్పటికి సాయంకాలమైనది. ఆయూర నతనికి దెలిసినవారెవరును లేకుండిరి. అపుడతడు కానిమ్మని అందలి లేఖేటిలో స్నానమొనరించి యనుష్టానమును ముగించి గ్రామములో ప్రవేశించెను.

అతడు గ్రామమునం దొకచోట నిలువక దిరిగి తిరిగి తన్నెవరును బలుకరింపనందున యెట్టకేల కొక కాపువారి గృహాముకడ నిలిచి యెవరి నేమియు నడుగక ఆయింటి చెంగటనుండు ఒక తిన్నెపై గూర్చుండెను. అతడు విభూతి రేఖలతో శంకరునివలె గాన్పించుటచే దారిని బోవువారు అతడెవరై యుండునా? అని నిలిచి చూచి యెవడో పిచ్చి వాడని పలుకరింపక బోవుచుండిరి. అంతలో చీకటిపడెను. వీరప్పయ్య యెవరిని కాని అన్నమడుగక యాతిన్నెపై బరుండి నిదురించెను.

గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంట బనికి గుదురుట

వీరప్పయ్య నిదుగించిన యరుగు ఒక కాపువారిది. ఆ ఇంటియజమానురాలిని గరిమిరెడ్డి అచ్చమ్మయని పిలుచు చుండిరి. ఆమె సద్గుణసంపన్నురాలు, దానికి తోడు సంప దయు గావలసినంత యుండెను. ఆమె ధైవభక్తురాలును, బీదలయందు దయగలదై వారికియున్నంతలో దానధర్మముల జేసెడిది. ఆమె ఒకగోసంరక్షణశాల నేర్పాటుచేసియుండెను అందు పెక్కు-గోవులు, దూడలు నుండెడివి. ఆమెకు భూవస తియు చాలగలదు. ఆమె పనులన్నింటిని జూచుకొనజాలక గొందఱు పనివారిని జీతమునకు గుదిరించుకొని యుండెను. ఎంతజీతమిచ్చినను పనివారు పనివారే. ఆమె వేకువజామున లేచి పనివారిని నిదుర లేపుట అలవాటు. అటులనే యీదిన మున అచ్చమ్మ వేకువఝామునలేచి తలవాకిలిదీసి చూడ గా నింటియరుగుమీద ఒక యువకుడు గూర్చుండియుండె.

ఆ యువకుని విగ్రహము అచ్చమాంబ నాకర్షించెను. ఆమె యతనిని జూచి నాయనా!

ప్రశ్నోత్తరసీసము

ఏయూరి వాడవు?♦పదినీకులమయ్య?
బ్రహ్మండపురి, విశ్వ♦బ్రాహ్మణుండ
తలిదండ్రు లెవ్వరు?♦తరలిరా నేలను?
తలిదండ్రులే లేక♦ధరణినుండి
బంధువు లెవ్వరు?♦ఎందరు మిత్రులు?
అందఱుచుట్టాలె♦యవనిహితులు

V.R. NARLA MEMORIAL LIBRARY B.P.R.I. Acc. No.

ఎందులకొచ్చితివి?♦యెట కేగుచుంటివి?
ఎచ్చటపని లేక♦నిటకువ స్తి
అన్న! ఏపనిచేయగా♦నగును నీకు?
నేను చేయనిపని లేదు♦నిజముతెల్లి
ఆలమందను నా.యగా♦నగు నెనీకు?
అమ్మ! గోపాలకుడ నేను♦ఆదినుండి.

ఆమాటలవిని అచ్చమ్మ నాయనా! నేను గోసంరక్షణ శాలను గలిగియున్నాను. ఆగోవులను చక్కగ జూచుకొను వారు లేకుండిరి. ఈదినమునుండి నీవు ఆపనిని నిర్వహింపుము నీవు గోపాలకుడవు కాబట్టి ఆపనిని చక్కగ నిర్వర్తింపగల వని నమ్మితిని. నీవు విశ్వబ్రాహ్మణుడ నంటివి, నీకు భోజన సదుపాయముల జేయవలయును. అది నాధర్మము, నీవు వంట జేసికొనుట కలవాటుపడి యుంటివికదా? అని ప్రశ్నించెను.

అందుల కతడు అమ్మా! నేను విశ్వబ్రాహ్మణుడను కాబట్టి ;యీవిశ్వమునందలి అన్నిజాతులవారి యింటను భుజించుట కలవాటుపడియున్నాను అదియుగాక దినమొక యూరుగా దిరుగునేను అన్నివిధముల యాహారమును దిన గలను. నేను దేశద్రిమ్మరినై కడకు నీయింటగోపాలకుడనై యుండగోరి వచ్చితిని. ఇప్పటికి నీవే నాతల్లివి. ఈ యిల్లు తాత్కాలిక స్వగృహము. నాకు జీత మక్కర లేదు. ఇంత కలిదో గంజిదో నొసంగి గోచిగుడ్డ నొసంగిన జాలను. అటులన్న ఎల్లకాలము నేను నీయింట నుండజాలును. సమ యము వచ్చినపుడు యిచటనుండి పోగలవాడ ననెను.

అందులకు అచ్చమాంబ నాయనా! నీమాటల విన్న వాకేలనో యపరిమిత ఆనందముకలుగుచున్నది. నీవునన్నాకర్షింతివి. నీయందేదో మహోత్కృష్టముండునటుల దోచెడిని. నీవు నిక్కముగ మానవుడవేనా? నీముఖమునుండి దివ్యతేజస్సువెడలుచున్నది. నీవు ఒకమహాపురుషుడవై కాన్పించుచుంటివి. ఔరా! ఇట్టివానికినేను యజమానురాలనా? అన్నవస్త్రములిచ్చి కాపాడుశక్తి నాకుగలదా? అన్నా! నిన్ను గోపాలునిగా నియమించుశక్తి నాకులేదు. ఈయింటికి నీవే యజమానివై అందఱివలన పనులను గొనుచుండు మనెను. అందుకు వీరప్పయ్య తల్లీ! అంతటి బాధ్యతకు నేను సమ్మతింపను. అంతటి భారమును నేను వహింపజాలను. నేను గోపాలకవృత్తిని మాత్రము జేయగలనని నెను.

అచ్చమ్మ యోజించి నాయనా! నీయిష్టము వచ్చిన పనిజేయుము. ఆలమందకు నిన్ను యధికారి నొనరించితిని ఉదయమున నీకు చలిదియన్నమును మూటగట్టి ఇచ్చెదను. దానిని తీసికొని ఆవులను గ్రేపులను తోలుకొని సమీపముననుండు యడవిలో మేపుకొని చీకటి బడకముందే ఇల్లు జేరుచుండుము. ఎందులకందువా? ఆసమీపమునందొకకొండయున్నది. అందుగుహలుకలవు. ఆగుహలలో దుష్టమృగములుండును. ఏమరిన యని గోవ్రులనో దూడలనో బట్టుకొని పోయితినుచుండును. ఏమరియుండిన యవి నిన్ను గూడచంపగలవు. అని దిన కార్యక్రమమును నిర్ణయించెను.

వీరంభొట్లయ్య ఆనాటినుండియే గోపాలకుండయ్యెనుని ఆతడాదినమున అచ్చమ్మ ఇచ్చిన యన్నపుమూటను గొనవ్వలరకొండకేగి ఆగోవులను గ్రేపులను ఒకపచ్చిక బయలు.

నిలిపి వానిచుట్టు ఒక ఎల్లగీతను గీచి తన ఇష్టము వచ్చిన పనిలో నిమగ్నుడై యుండి సాయంకాలము యజమానురాలి యాజ్ఞ ననుసరించి యాలమందను ఇంటికి జేర్చుచుండెను. ఇది వీరప్పయ్య అనుదినము చేసెడిపనియై యుండెను.

ఆరీతి గొన్ని దినములు జరిగిన పిదప వీరంభొట్లయ్య యెప్పటియట్ల గోపుల నడవికి తోలుకొనిపోయి పచ్చికబయలున గాను గీచిన ఎల్లలో నిలిచి ఎటకో వెళ్ళుచుండెను. అతడు అందున్న ఒకానొక తాటిచెట్టును సమీపించి పైకి జూచినదే యాతాళవృక్షము క్రిందికి వంగెను. ఆచెట్టునకు నిడుపు వెడల్పుగల ఆకులుండుటచే దనకుగావలసినన్ని యాకుల గోసికొనినంతనె తాటిచెట్టు మరల నెప్పటివలనే నిలిచెను.

వీరప్పయ్య కాలజ్ఞాన రచన ప్రారంభించుట

అంతట వీరంభొట్లయ్య అచ్చమ్మ ఇచ్చిన యన్నపు మూట నందొక గోతిలో బడవైచి. ప్రక్కనుండిన గురిజారి చెట్టుచుండి కొన్ని ముండ్లను బెరికికొని తనకడనున్న దాటి యాకులతో గుహాను ప్రవేశించెను. అతడా గుహాలో నొక సమప్రదేశమునగూర్చుండి తాటియాకులపై గురిజారిముండ్లతో నేమోవ్రాయుచు వ్రాసిన యాకులను అచటనే భద్రపరచి చీకటి పడకముందే మరల గుహానుండి బయటికివచ్చి గోవులదోలుకొని అచ్చమ్మ గృహమును జేరుచుండెను.



బనగానిపల్లెలో గరిమిరెడ్డి అచ్చమ్మపశువులకాపరి వీరప్పయ్య అడవిలో పందనునిలిపి దానిచుట్టు
గీతనుగీచి క్రూరమృగముల బాధలేకుండజేసి తాను గుహలో కాలక్షేపమును వ్రాయుచుండెను

ఒకానొక దినమున వీరప్పయ్య యెప్పటివలెనే ఆవులను యడవికి దోలుకొనిపోయి ఎల్లగీరలో జేరినంతనే తాను తాటియాకులను గిరిజారి ముళ్ళనుగొని గుహలోపలికేగెను. అంతలో గొన్ని క్రూరమృగంబులు ఆవులనుజంపి తినవెంచి యచ్చటికి వచ్చినవి. అవి గోవుల చుట్టు గీచిన గీఅనుగని దానిని దాటి లోపలికేగ బ్రయత్నించి చేతగాక అవి గీత దాటి వచ్చినచో జంపుదమని పొంచియుండెను.

ఆ దృశ్యమును దారిని బోయెడు కొందఱు చూచిరి ఔరా! పాపము అచ్చమ్మ దిక్కులేనివాడని దారినిబోయెడి వానిని దగ్గరజేర్చి అన్నవస్త్రముల నొసంగి ఆలమంద నతని స్వాధీనముచేసి వానిని చక్కగ మేపగోరెను. ఆతడు సోమరియై ఆవులను వదలి యెటకో పోయినాడు. ఆవులను జంపపులులు మున్నగునవి పొంచియున్నవి. అయినను ఈప్రులులు గోవులపైబడి చంపక జూచుచు నిలబడియున్నవి. ఇందేమో రహస్య మున్నది. పశులకాపరియు గనంబడుటలేదు. ఈ సంగతి అచ్చమ్మ కెరింగింతమని యనుకొనుచు బోయిరి.

అచ్చమ్మ వీరప్పయ్యను పరీక్షించుట

ఆ బాటసారులు అడవిలో జూచిన దృశ్యమును అచ్చమ్మకు తెలిపి అమ్మా! నీవు పెంచెడి గోపాలకుని నమ్మవద్దు అతడు ఆవులను బొత్తిగా మేపుటలేదు. ఆవులను అడవిలో దోలి తానెచ్చటికో బోవును. ఈదినము మేము ఆ దారిన వచ్చుచుండగా గోవులను జంపుటకై పులులు చిరుతపులులు

మొదలగు అడవి జంతువులు పొంచియుండ జూచితిమి. అలమే పరికొఅకు వెదకితిమి కాని అతడు కనంబడలేదు. ఈదినమా పులులు యెన్ని యావుల జంపునో తెలియదు. ఉన్నసంగతి జెప్పితిమి. నీ యిష్టమని వారు గృహములకు వెళ్ళిరి.

అంతట అచ్చమ్మ యొంటిరిగ గూర్చుండి యిట్లాలో చింప దొడంగెను. ఔరా! వీరిమాటల నమ్మవచ్చునా. వీరప్పయ్య సోమరిపోతు కాదు. అతని ననుమానించుటకు దగిన కారణ మొక్కటియు లేదు. అతడు-నా యిల్లు జేరినదాదిగా నాకు సకల ఐశ్వర్యములు వృద్ధియగుచున్నవి. ఇక ఆవులన్నచో ప్రతిసంవత్సరము యీతిబాధలతో మరణించుచుండెను. అతడు వచ్చినప్పటినుండి ఆవులమందలోనే గాక తక్కుంగల పశువులలోగూడ వేదియు జచ్చినది లేదు. అతడు ఆవుల మేపక యెందో జనుచున్నాడను వీరిమాటలను నమ్మటకు వీలులేదు. అతడు ఆవులను మేపకున్నచో నవి బక్కచిక్కబోయి యుండవలెనుగదా. అటు జరుగ లేదు. అవి దినదినము బలిష్టములై చియ్యబట్టి యున్నవి. ఇపుడు నాయిల్లు గోక్షీరములనలన పాలసముద్రమును బోలియున్నది. అయినను బాటసారుల మాటల బరీక్షించవలయును. వారూరక అతనిపై నిందమోపుదురా? క్రొత్తవానిపై వారు పగసాధింపదలచిరా. ఆతడు నాతోదప్ప యితరులతో మాటాడుట లేదు. ఏమైనగాని రేపు అతనికి దెలియకుండ అడవికేగి పరీక్షించెదనని తీర్మానించుకొనెను. అంతలో సాయంకాలము కాగానే వీరప్పయ్య ఆలమందవెంట యింటికివచ్చి చేరెను. అచ్చమ్మ అతనింగని సంతోషించెను.

అనాటిరాత్రి భోజనానంతరము అచ్చమ్మ నాయనా! వీరప్పయ్యా! నేను వెకువన లేచి అవుకు గ్రామమునకు వెళ్ళి రావలసిన పనియున్నది. సాయంకాలము వఱకు నేను రాను సీవు యెప్పటివలెనే ఆవులమందను అడవికి దోలుకొనిపోయి మేపుకొనిరమ్ము. అంతలో నేనుకూడ రాగలనని చెను. అందుకు వీరప్పయ్య మంచిది అటులనే చేయుదునని శయనింప బోయెను.

ఆనాటిరాత్రి అచ్చమ్మ వేకువఝామున లేచి వీరప్పయ్య నిదుర మేల్కొనకముండె బయలుదేరిపోయిరవ్వల కొండ సమీపమున పొదలలో దాగియుండెను. అంతట వీరం భొట్లయ్య యెప్పటివలెనే ఆలమందతోవచ్చి యెప్పటివలెనే పచ్చికబయలునందాపి దానిచుట్టు గీతగీయుచుండగా పొదలో నుండిన అచ్చమ్మచూచెను. అతడావల కాటిచెట్టును సమీపించి పైకిచూడగా ఆచెట్టుక్రిందికి వంగినంతటనే వీరప్పయ్య తనకు గావలసినన్ని కాటాకుల గోసికొని గురిజారిముండ్లను బెరికికొని తన గుహలోనికిబోయెను. అతని చర్యలను గమనించుచుండిన అచ్చమ్మ ఆశ్చర్యముతో ముక్కుపైవ్రేలిడుకొనెను. అంతలో ఒక పెద్దపులి, ఒక చిఱుతపులివచ్చినవి. అవి రెండును ఆవులచుట్టు గీచిన గీతవరకు వెళ్ళి భయపడి దాటి పోవెరచి కొంతసేపు మందచుట్టు తిరిగి అడవిలోకి వెళ్ళెను.

అచ్చమ్మ పొదనుండి వెలుపలికివచ్చి బాటసారులు చెప్పిన మాటలన్నియు సత్యమని అయినను వీరప్పయ్య

గుహలో యేమిచేయుచున్నాడో చూతమని బోయి మెల్లగా చప్పుడు చేయకుండ గుహలోదూరెను. ఆమె కొంతలోపలికి వెళ్ళగనే వెలుగు కాన్పించెను. ఆ వెలుగు వీరంభొట్లయ్య కన్నులనుండి వెలువడినది. ఆవెలుగులో గూర్చుండి అతడు గురిజారి ముంటినిగొని తాటాకుపై యేమిరాసి వాసి ముగియగనే రెండవయాకుగొని వ్రాయుచు ఆదినమునోసిన తాటాకులన్నింటిని వ్రాసి ముగించి ఒక కట్టగా కట్టి లేచిగి చూచెను.

అంతవఱకు నిశ్శబ్దముగా చూచుచుండిన అచ్చమాంబ అతడు లేచిగి చూడగనే పోయి ఆతని పాదములపై బడి యిటులనసాగెను. ఓ సర్వేశ్వరావతారా! నీవు నివురుగప్పిన నిప్పువలెనీ నిజరూపమునుజూపక పిచ్చివేషమున దిరుగుచు నాయింటికేలవచ్చితివి. అకటా! నీవు భగవస్వరూపుడవని తెలిసికొనకపోతిని సామాన్యమానవుడని నిన్ను పసుల కాపరి నొనరించి పాపమొనరించితిని. నీవు శ్రీ గోవిందుడవే కాని మానవుడకావు. మహానుభావా! నీవీకలియుగమున పాపవినాశ మొనరింప నవతరించిన రమారమణుడే యగుదువు. ఆదిమధ్యాంతరహితా! అనాధరక్షకా! వైకుంఠవాసా! ఆపదాబ్ధిందవా! నాతప్పుల క్షమించి నాకు మోక్షమునొసంగుము. నాకీసంచారమును వలదు నాయందుదయయుంచినాకు సద్గతుల గలిగింపుమనెను.

అందుకు వీరప్పయ్య అమ్మా! నీపరిక్షముగించినదిగదా అదేచాలును. అమ్మా! నేనొకపిచ్చివాడనేకాని భగవంతుడ గాను. మీబోటిధనవంతులు సుఖముగనుండినకదా నాబోటి

వెట్టివారును బ్రతుకుట నీవు లేకున్న నాగతియే మైయుండునో గదా నాకు ఆశ్రేయమిచ్చితివి. పని గల్పించితివి. నీపుత్రుని వలె దయతో నాదరించుచుంటివి. నా కేకొనువయు లేకుండ జేయు నీవు నాయజమానురాలవైయుండి పాదముల బట్టి ప్రార్థించుట ధర్మముకాదు. నాపాదముల వదలుమనెను.

ఆమాటలకు అచ్చమ్మ పరమాత్మ స్వరూపుండవగు వీరప్పయ్యా! నన్ను పిచ్చిదాని వొనరింపకుము. నీమాట లన్నిటిని నేవిననోల్లను. నీవు నాకు బ్రహ్మోపదేశ మొన రించి తరింప జేతునని మాటయిచ్చిననే కాని నీపాద పద్మ ములను వదలనన్నెను. అందుకు వీరంభొట్లయ్య అమ్మా! భయపడవలదు నేను నీయింటికి వచ్చినది నీకు బ్రహ్మోప దేశమిచ్చి తరింప జేయుటకేగాని వేరుకాదు. నీవు తరించు కాలము రాకుండుటచే నేనూరక జూచుచుంటిని. నిన్ను నాభక్తురాలి నొనరించుటకే నీయింటికి వచ్చినవాడను. బ్రహ్మోపదేశ మీయకుందునా. అమ్మా! మూడవదినమున మనము యీగంటిక్షేత్రమున కేగవలెను. ఆదినము నీకు బ్రహ్మోపదేశ మిచ్చెదను. ఈసంగతి యితరులతో నన కుము. నాకంకెముండే నీవు యిలుజేరబొమ్ము. ఆవల నేను యెప్పటివలె అలమందను దోలుకొని యింటికి వత్తుననగా అచ్చమ్మ సంతోషముతో గృహమున కేగెను.

అచ్చమ్మకు బ్రహ్మోపదేశ మొసగుట

—:o:—

శ్రీ వీరంభొట్లయ్య రెండవనాటి రాత్రి శయనించుటకు పూర్వము అచ్చమ్మగారిని చూచి అమ్మా! రేపటిదినమే మూడవదినముకదా, వేకువనలేచి యాగంటి క్షేత్రమున కేగుటకు దగిన ప్రయాణసన్నాహము లొనరింపవలెనని చెప్పెను. అందుకామె తండ్రీ! నేనింతకుముందే ఆయేర్పాటుల బూర్తి జేయించితినని ప్రత్యుత్తర మొసగెను.

ఇరువురును వేకువజామునలనిదుర మేల్కొని కాలకృత్యములు తీర్చి ప్రయాణము సాగించి ఉదయము సుమారు మెనిమిది గంటలకు యాగంటిని చేరిరి. ఇద్దరును అందలితీర్థముల స్నానమూడి యాగంటీశ్వరుని బూజించిరి అనంతరము వీరప్పయ్య అచ్చమ్మను ఈశ్వరుని సన్నిధిని పద్మాసనమును వేసి కూర్చుండుమని యిట్లు పలికెను.

తల్లీ! "ఓం నమశ్శివాయ" అనునదే పంచాక్షరీ మంత్ర మనంబడును. దానిని మనోవాక్కాయశుద్ధిచే జపించినచో తప్పక మోక్షములభించును. అందుకు సంశయింపబనిలేదు. అమంత్ర వివరమును వినుము. పంచాక్షరీ మంత్రములోని ప్రథమాక్షరమగు ఓం అను శబ్దమునుండి పుట్టిన యీ ప్రపంచమున ద్వితీయాక్షరమగు "న" అను శబ్దము కాలమును సూచించును. తృతీయాక్షరమగు "మ" శబ్దము స్వయంప్రకాశకుడగు పరబ్రహ్మను సూచించును. ఆవల చతుర్థపంచమాక్షరములగు "శివం" అనుశబ్దమునకు శాశ్వ

తము అను నర్థమగును. అనగా యీపంచాక్షరీ "ఓం నమ శ్శి వం" అను దానికి ఈప్రపంచమందలి కాలమున స్వ్రప కాశమునుగల పరబ్రహ్మస్వరూపమే స్థిరమైనదని భావము, కనుక ఈ మంత్రమును త్రికరణశుద్ధిగా జపించినచో నీవ్ర తతంపగలవు. అమ్మా! నీకింకొక రహస్యమును జెప్పెద వినుము. "ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రహ్మణేనమః" అను నీపంచాక్షరమంత్రమును నొప్పెడి మంత్రమును ద్వాదశాక్షరమంత్రమందురు. ఈ ఈమంత్రమునందు మహాశక్తి యున్నది. ఆప్రభావ మనంతరము. కనుక ఆమంత్రరాజమును గూడ జపించినచో మోక్షమును సాధింపగలవు. ఇక మంత్ర గూఢార్థమును వినిపించెద వినుము.

సీ. ఓతల్లీ! యాలింపు ఓంకారశబ్దంబు
పరబ్రహ్మప్రకృతి ప్రణవశబ్ద
మందుండి నింగియు అద్దానవాయువు
అవాయునందుండి అగ్ని పుట్టు
అగ్ని మూలంబున యిలరును తేజము
నద్దానజలమును యలరె పృథివి
అందుండి జన్మించె ఔషధసర్వంబు
పంచభూతాత్మక ప్రాణమొసగు

తే-గీ. లక్షలెనుబది నాలుగు లక్ష్యముగ
వివిధరూపుల ప్రాణులు వెలయుచుండు
నందు మానవజన్మమే అధికమగును
మానవులచేత గానిది మహిని లేదు.

ఆదియుగాక నీకు మఱియొక పరమరహస్యంబును వెల్లడింతును. నీవు పూర్వజన్మమున ననున్ గూర్చి తపం బొనరించితివి. ఆతపఃఫలము ఆజన్మమున గాంచ లేకపోతివి. ఆవల గొంతకాలమునకు ఆశరీరమును వదలి ఈ బనగాన పల్లెలో గరిమరెడ్డిగారి ఇలు జేరియుంటివి. నీవు పరమపతి వ్రతవును, భూతదయాపశ్చాత్తాపముల కలిగి బీదల బ్రేమిం చుచుండ నేనెరింగి ఈ యవతారమున నీకు దరుణోపాయ మును గలిగింపగోరియే నిన్ను వెదకుచువచ్చి నీయిల్లు జేరితిని. నీకు సేవకుడనై సేవించితిని, మన సంకల్పములు జరిగినవి. ఇంతటినుండి నీవు ఆనందమయుడగు పరబ్రహ్మను ధ్యానించుచుండుమనెను.

అప్పుడు అచ్చమ్మ ఆపద్బాంధవా! అనాదరక్షకా! ఆదిమధ్యాంతరహితా! నాకు తరుణోపాయము నెరింగించితివి ఇక మనము మన గ్రామమునకు దిరిగిపోదము. తామింతటి నుండి గోపాలకవృత్తి జేయక, * గో-పాలన మొనరింప వలెను. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడవగు నీకసాధ్యమైనది ఎందునులేదు. అని యాగంటీశ్వరుని ప్రార్థించి ప్రయాణమై రాత్రి చీకటిపడునప్పటికి బనగానపల్లె చేరిన వారైరి.

---

*సూచన!—గో అనగా భూమి-పాలన యనగా పరిపాలించుట. అనగా సమస్త భూమండలమును పాలింపుమనుట.

అంతట అచ్చమ్మ మరునాడు బనగానపల్లెలో వీర
ప్పయ్యకొరకు ఒక మఠమును నిర్మింపగోరెను. ధనవంతుల
ను త్యాగధనులకును సాధింపరానిది లేదుకదా. ఆమె
ఒకరికి పదిమందిని పనివాండ్ర నియమించి కొద్దిదినములలో
మఠమును బూర్తిజేయించి వీరప్పయ్య నందు ప్రవేశ
పెట్టెను. అపుడు వీరప్పయ్య ఆమఠము ప్రక్కన ఒక పాత
రను గట్టింపుమని తానింతకుముందు గుహలో వ్రాయు
చుండిన తాటియాకు గ్రంథములను ఆపాతరలో బెట్టించి
దానిపై యరుగును గట్టించెను. అంత కొన్నాళ్ళకా
యరుగురాల సందునుండి యొక తింత్రినీవృక్షము పుట్టెను.
వీరప్పయ్య అప్పటినుండి ఆమఠమున గూర్చుండి కాలజ్ఞా
నము వ్రాయుచు అచ్చమ్మకు ధర్మోపదేశ మొనరించు
చుండెను.

ఓమ్

శ్రీపోతులూరి
వీరబ్రహ్మంగారిజీవితచరిత్ర

మూడవప్రకరణము

ఓ భక్తశిఖామణులారా! తరువాత జరిగిన విషయ
ములు దెలిపెదవినుడు. ఇంతకుముందు ధర్మదేవ తకలియుగ
పాపభారమును మోయజాలక త్రిమూర్తులనుదర్శించి శరణు
వేడగా నందు శ్రీహరి యామెనోర్చి కలియుగంబున జగ
జ్జనని యాజ్ఞానుసారము తాము అవతారముల దాల్చి ధర్మ
మును స్థాపించెదమనిచెప్పి పంపినది మీరు తెలుసుకొంటిరి
అంతట శ్రీమహావిష్ణువు ప్రకృతికి మాయాగర్భమునజన్మించి
వీరప్పయ్య, వీరంభొట్లయ్య, వీరబ్రహ్మము అను నామ
త్రయంబుతో నవతరించెనని చదివియేయుంటిరి. అటుపిమ్మట
శంకరుండు కాశీనగరంబున విజయసింగు వంశమున ఆనంద
సింగుగా నవతరించితదుపరి వీరప్పయ్యను గలిసికొని ఆనంద
భైరవయోగిగాయె వీరంభొట్లయ్య యాజ్ఞ ననుసరించి మరల
కాశీనగరమునకే మరలి రాజయోగ పద్ధతిని తలిదండ్రుల
సేవించుచు సాధుజనుల కాపాడుచుండెను. అటుపిమ్మట
బ్రహ్మయే విధిగ కలియుగమునసవతరించెనో తెలిసికొందము

బ్రహ్మ అన్నాజయ్యగా నవతరించుట

నాయనలారా! పుణ్యభూమియగు ఈభరతవర్షమున దక్షిణాపథము పుణ్యతీర్థములకును, దివ్యవాహినులకును క్షేత్రములకును మిగుల ప్రసిద్ధికెక్కినది. అచ్చటనే అనేక యోగిపుంగవులును, మహాపురుషులును, పండితులును దేవాంశసంభూతులును జన్మించిరిజన్మించుచున్నారు, ముందు కూడ జన్మింపగలరు. అట్టి దక్షిణదేశమున విశ్వబ్రాహ్మణ కుటుంబము లనేకములుండెను. ఆకుటుంబములలో విశ్వాత్మ కుని కుటుంబము కొంత ప్రసిద్ధికెక్కియుండెను. అతనికి మాయామేయి యను భార్యయుండెను.

ఆ దంపతులకు సంతానము లేనందున విచారసాగర మున మునింగి పుత్రసంతానము నొసంగుమని శ్రీమహావిష్ణు వును ధ్యానించుచు దివ్యక్షేత్రములకేగి దేవతలదర్శించుచు పుణ్యానదీనదంబుల గ్రుంకుచుండిరి. అంత గొన్నాళ్ళకు శ్రీమన్నారాయణమూర్తి స్వప్నమునదర్శనమిచ్చి మాయా మేయితో "అమ్మా! పుత్రులులేరని పొగలకుము. త్వరలో నీకు బ్రహ్మయే పుత్రుడుగా జన్మింపగలడు" అని చెప్పి యదృశ్యుడాయెను.

అటుపిమ్మట గొన్నిదినములకు మాయామేయి గర్భ మునుధరించెను. అంతటివరకు ఆమె తనస్వప్న వృత్తాంతము భర్తయగు విశ్వాత్మకున కెఱిగించక స్వప్నము నిజమో కాదో యను ననుమానముతో నూరకుండెను. ఎపుడు తన గర్భచిహ్నములు పొడజూపెనో అపుడే యామె సంతోష

మును పట్టజాలక భర్తనుజూచి కొన్నిదినముల క్రిందట గోవిందుడు కలలో గనుపడి బ్రహ్మ తనగర్భమునజన్మించు నని చెప్పి సంతానము లేదని విచారింపవలదని చెప్పెను. కల కల్లయగునేమోయని ఆసంగతి మీకెరింగింపక దాచియుంచి తిని. అందుకు క్షమింపుడు.

ఆ స్వప్నము ననుసరించి ఇపుడు నాకు గర్భచిహ్న ములు పొడచూపినవని చెప్పగా విశ్వాత్మకుడు సంతోషించి సత్పుత్రుని బడయగోరి భగవదారాధన మొనరించుచుండె. ఆరీతి గొన్నాళ్లు జరుగుచుండగామాయమ్మకి గర్భముదిన దినాభివృద్ధి జెందుచు సంపూర్ణ గర్భముగ మారినది. అంతలో పదవ మాసమున మాయమ్మకి గర్భవేదన ప్రారంభమై యొకానొక శుభలగ్నమున మగశిశువును ప్రసవించెను.

విశ్వాత్మకు శిశువునకు అన్నాజయ్య అని నామకరణ మొనరించుట

—:o:—

ఆరీతి మగశిశువు జన్మింపగనే విశ్వాత్మకుడుజ్యోతిష్కు లను రావించి జాతకుని యోగమును గురించి తెలుపుమని యడిగెను. అందుకు జ్యోతిష్కులు దీర్ఘాలోచన మొనరించి అయ్యా! మీకుమారుడు యోగపురుషుడగును. అతడు మహా యోగియై సన్యాసాశ్రమమును స్వీకరించి దేశముల దిరుగుచు బోవునే గాని మీయింట నుండడని చెప్పిరి. అందుల కొక ప్రక్కసంతోషమును మరియొకవంక విచారమును గలవాడై

దైవజ్ఞుల సత్కరించి పంపెను. ఆవల పదునొకండవ దిన మున పురోహితుని బిలిపించి "అన్నాజయ్య" అని నామ కరణ మొనరించిరి.

అన్నాజయ్య బాల్యము విద్యాభ్యాసము

మాయామేయా విశ్వాత్మక దంపతులు తమ పుత్ర రత్నమునకు అన్నాజయ్య అని నామకరణ మొనరించి యానందించుచుండిరి. ఆశిశువు దినదినము శుక్లపక్ష చంద్రుని వలె బెరుగుచు దలితండ్రులకు సంతోషమును గలిగించు చుండెను. అతని ముఖమున బ్రహ్మతేజస్సు విరాజిల్లుచుండు టచే ఆయూరి పిన్న పెద్దలు ఆ బాలుడు తప్పక మహాపురుషు డగునని చెప్పుచుండిరి.

అన్నాజయ్య క్రమముగ బెరుగుచు అయిదేండ్లు బాలు డయ్యెను. అపు డతనికి విద్యాభ్యాస మొనరింపదలచి ఉపా ధ్యాయుని రప్పించి అక్షరాభ్యాస మొనరించి, ఆ బాలుడు సహితము వినయవిధేయతలతో నుపాధ్యాయుడు చెప్పెడి దానిని శ్రద్ధతో విని నేర్చుకొనుచు తోడి బాలుర కంటె మిన్నయైయుండెను. అన్నాజయ్య తోడిబాలుర జేరి ఆటాడు కొనక సదా ఏకాంతమున జేరి యోచించుకొనుచుండెను. అతని చర్యల జూచి తలిదండ్రులే గాక గ్రామవాసు లంద ఱును దైవజ్ఞుల వాక్కులను తప్పవనుకొను చుండిరి.

అన్నాజయ్య ఆగ్రామమునకు ఏ సన్యాసి వచ్చినను, యేయోగి వచ్చినను వారివెంట దిరుగును వారిమాటల

శ్రద్ధతో వినుచుండెను. అతడు సదాసన్యాసులవలె ఆనందించుచు తిరుగుచు ఒక్కొకనాడు ఇంటికిగూడరాక సన్యాసుల వద్దనే కాలము బుచ్చుచుండ విశ్వాత్మకుడు వెదకి యింటికి గొనిపోవుచుండెను. ఆతని చర్యలదిలకించి ఆబాలుని అన్నా జయ్య యని పిలుచుటకు బదులు "బ్రహ్మానందుడు" అను మారుపేర బిలుచుచుండిరి.

అన్నాజయ్య సన్యాసాశ్రమమును స్వీకరించుట

అలాగు కొన్నాళ్లుజరిగిన పిమ్మట ఒకానొక దినమున తల్లిదండ్రుల కడకేగి నమస్కరించి జననీజనకులారా! మన యూరిలోని దేవాలయమున కొక యోగిపుంగవుడు వచ్చియున్నాడు. అతడు మహాత్మునివలె గనబడుచున్నాడు. నాకు సన్యాసాశ్రమమును గైకొనవలెనను యాసగల్గినది. గనుక నాయందుదయయుంచి నాకాజ్ఞయిండు. ఆయోగి నడుగగా నన్నుచూచి నాయనా! నీ తల్లిదండ్రుల యాజ్ఞను వడసివచ్చి నచో నీకు సన్యాసదీక్ష నొసంగెదనని చెప్పియున్నాడు. మీరేమైన ననుడు, నాకు ఈయూరిలోగాని, యీయింట గాని యుండుటకు యిష్టపడలేదు. నన్ను బలవంత మొనరించి ఇంట నిలుపగోరినను నిలువను. ఇది దైవసంకల్పము గాన నాయందనుగ్రహించి నాకోర్కెను దీర్చుమని ప్రతివాలెను. అందుకు విశ్వాత్మకుడును దీర్ఘముగ యోజించి "ఔను, దైవజ్ఞులుకూడ ఈబాలునకు సన్యాసయోగము తప్ప గృహస్థు యోగము లేదని చప్పిరి. ఆరీతిగనే వీనికీబుద్ధి జనించినది.

ఇది బ్రహ్మసంకల్పమే యగును. ఇందుకు వగవ బనిలేదు" అని కుమారుని జూచి నాయనా! నీయిష్టము. నీవు కోరినట్లు సన్యాసదీక్షగై కొనవచ్చును. అనిచెప్పగా అన్నాజయ్య తల్లి దండ్రులకు నమస్కరించి వారి యాశీస్సులను అనుజ్ఞనుబొంది గృహమును వదలిపోయెను. అతడు దేవాలయములోనుండిన యోగీంద్రుని కడకేగి నమస్కరించి మహాత్మా! నా తలి దండ్రుల యనుజ్ఞవడసి వచ్చితిని. దయయుంచి నాకుసన్యాస దీక్ష నొసంగుడనగా నతడు మంచిది రమ్మని ఏదో చెవిలో చెప్పి కన్నులు మూసికొమ్మని అన్నాజయ్య కన్నులు దెరచులోపల యదృశ్యుడై పోయెను.

అన్నాజయ్య బనగానిపల్లెకేగుట

అన్నాజయ్య యువకదశలోనే సన్యాసమును స్వీకరించిన తర్వాత మరల తలిదండ్రులగాని, తనగృహమునుగాని చూడరాదని స్వగ్రామము వదలి దేశసంచారమునకని బయలుదేరిపోయెను. అతడు సదా శైవభ్యాసపరుడై తీర్థయాత్రలజేయదలచెను. అతడు రామేశ్వరము, ధనుస్కోటి, కన్యాకుమారి, మధుర, శ్రీరంగము, కుంభకోణము, చిదంబరము, పక్షితీర్థము, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి, అహోబిలము, మహానంది, ఓంకారము, శ్రీశైలము మొదలగు పుణ్యస్థలములదర్శించి ఆయాదేవతల సేవించి యాగంటీశ్వరుని సన్నిధిం జేరెను. అక్కడ తపమాచరింపదగిన చోటును వెదకుచుండెను. తాను తిరిగి పుణ్యస్థలములయం దనేకు

లను జూచెను. అందు సన్యాసులును, యోగులును, సిద్ధులును, పై గంబరులును యుండిరి. అందరితో మాటలాడెను గాని ఎవరును అన్నాజయ్యకు నచ్చినవారుకారు. అంతలో యాగంటిలో అన్నాజయ్య స్వాములుడిలో గూర్చుండి యుండగా నెవరో యోగిరూపమునవచ్చి స్వామీ! మీరు బనగానపల్లెకు వెళ్ళలేదా, అక్కడ బ్రహ్మవాంశసంభూతుడగు వీరంభొట్లయ్య యున్నాడు. గరిమిరెడ్డి అచ్చమ్మ వారికొక మఠమును గట్టించినది. ఆయన అచ్చమ్మకు ధర్మోపదేశ మొనరింపగా నామె యాయనభక్తురాలుగ మారిపోయినది. వీరప్పయ్య పాపులకు ధర్మమార్గము బోధించుచు పరమపావనుల నొనరించుచున్నాడు అని చెప్పి తన దారినిపోయెను. అప్పటినుండి ఏలకో అన్నాజయ్యకు బనగానిపల్లెకు బోవలెనని మీమాంసముజనించెను. ఆ యోగిని చూచి మరికొన్ని వివరములు దెలిసికొందమని చుట్టుప్రక్కల వెదకిచూచెను. కాని ఎవరును అతనికంటబడలేదు. అందుకతడు కడుంగడు విచారించి సరి యిక యిందుండరాదు. బనగానిపల్లె మఠమున కేగి ఆ మహాపురుషుని శిష్యుడ నయ్యెదనని ప్రయాణమై పోయెను.

అన్నాజయ్య లోమఠమున వీరప్పయ్యను దర్శించుట

—:o:—

అన్నాజయ్య యాగంటినుండి ప్రయాణమై బనగానపల్లెచేరెను. అచ్చట గొందరివలన అచ్చమ్మగారి గృహమును దెలిసికొని పోయెను. అతడు భయభక్తులతో లోమఠ

మునజొచ్చి జింకచర్మముపై గూర్చుండి తాళపత్రములు మీద వ్రాయుచుండు పురుషునిగని యతడే వీరప్పయ్యైయుండును. కాని అతడు

తే-గీ. ఆదిమధ్యాంతములు లేక♦అలరుచుండె
దివ్య తేజంబు కన్నుల♦దేజరిల్లె
బ్రహ్మ తేజస్సు ముఖమున♦ప్రబలు గొలుప
నలరుచున్నాడు యన్యుల♦కలవియగునె.

అనుచు వెంటనే సాష్టాంగ నమస్కార మొనరించి దేవాదిదేవా! ఆదిమధ్యాంతరహితా! దీనరక్షకా! ఆపద్బాంధవా! శరణాగతబిరుదాంకా! శరణు శరణు నాకు సద్గతి గలిగింపవేయని శరణు వేడెను.

అపుడు వీరప్పయ్య ఆయువకుని జూచి "నాయనా! అన్నాజయ్యా! శరణొసంగితిని లెమ్ము. నేను నీ రాకకై యెదురు చూచుచు కాలము గడుపుచుంటిని ఇప్పటికి నా సంకల్పము నెరవేరినది" అనెను. అందుకు అన్నాజయ్య దేవా, నేను మిమ్మెపుడును దర్శించి యుండలేదు. నేను పరిచయుడనుగాను, అట్టిచో నాపేరు మీకెట్లు తెలిసెను. అవిగాక మీతక్కుంగల మాటలను వినిన నాకేమియు అర్థమగుటలేదు అందేదో అంతరార్థములేకపోలేదు. నేను వయసున చిన్నవాడనై నను అనేక దివ్యస్థలంబుల దర్శించి ఆదేవతల నారాధించి మహాతీర్థంబుల మునిగి యనేక యోగపురుషుల సేవించితిని, ఆపురుషులలో నొకరుగూడ మీరానతిచ్చినట్లు పలికినవారుకారు, నా జన్మ తరించినందున గాబోలు మిమ్ముల దర్శింప గలుగు భాగ్యముకలిగెను. దయామయా!

నను మిూశిష్యునిగా నెంచి నాజన్మము తరించునట్లు చేయు డనగా వీరప్పయ్య నాయనా! చింతింపకుము ఱేపటిరాత్రి వేకువన నీకు కొన్ని రహస్యములు నెరిగింతును. ఇది నీమత మగు కాల మేతెంచిన దనెను.

వీరప్పయ్య తమయవతార రహస్యమును దెలుపుట

అన్నాజయ్య పగలంతయు నిముసమొక యేడుగా గడిపెను అంత రాత్రికాగానే స్నానమొనరించి మఠమున గూర్చుండి యుండెను ఎందరో భక్తులును భక్తురాండ్రును వచ్చి వీరప్పయ్యను సేవించి యాయనచెప్పు ధర్మసూత్రముల విని పోవుచుండిరి. సుమారు నడిరేయి కావచ్చినను భక్తు లచ్చటనుండి పోకుండిరి. అంతలో అచ్చమ్మవచ్చి స్వామి వారికి విశ్రాంతి గొనుసమయమైన దనగా యెక్కడివా రక్కడనుండి లేచి బయటికి వెళ్ళిరి. అచ్చమ్మయు వెళ్ళెను అంతట అన్నాజయ్య లేచి దిక్కుల జూడసాగెను.

అపుడు వీరప్పయ్య అన్నాజయ్యను రమ్మని కను లతో దెలిపెను. అపుడు భక్తివినయములతో స్వామిసన్నిధి కేగి కరముల జోడించి కూర్చుండెను. అపుడు వీరప్పయ్య యిట్లు లనెను.

సీ. అన్నాజయ్యా! నీకు♦అన్నిటి దెలిపెద
అజ్ఞానమునసీవు♦యలరుకతస
కలియుగమందున♦కలుషంబులను బాప
వెలసిరి ముగ్గురు♦వినుమువారి

వీరప్పయాఖ్యుండ♦వెలసి యీకలిలోన
శేషశాయిని యిందు♦జేరినాడ
ఆనందభైరవు♦డను మోగిజన్మించె
ఈశ్వరాంశంబున♦గాశినుండె
తే-గీ. అన్న! బ్రహ్మావతారుడ♦వగుచునీవు
అన్నయాజాఖ్యుడను పేర♦వన్న జూడ
వచ్చితింతయ గలియందు♦పెచ్చు పెరుగు
కలుషములబాప మనమెల్ల♦గలిపి వినుము.

ఇంకను వివరముగ దెలిపెద వినుము శ్రీవిష్ణువునగు నేను మాయాగర్భమున జన్మించి పాపఘ్ని మతాధిపతి యగు యనమదల వీరపాపమాంబా వీరభోజయాచార్యుల పుత్రుడ వనిపించుకొంటిని. ప్రథమమున నన్ను వీరప్పయ్య యని పిలుచుచుండిరి ఆపేరుననే యిటకు నరుదెంచితిని. ఇప్పటినుండి గొన్నిదినంబులు వీరంభొట్లయ్య యను పేరు వహించి యుందును ఆవల వీరబ్రహ్మము అనుపేరుతో మరి యొక చోట పాపుల పాపనుల నొనరింప నుంటిని.

పరమేశ్వరుడే కాశీనగరమున విజయసింగు గృహమున జనించెను. అతనిని ఆనందసింగు అని పిలుచుచుండిరి. అతనిని నాప్రథానశిష్యుడుగ నొనరించుకొనదలచి అతనిచే గోహత్యను జేయించి నన్ను జేరునట్లుచేసితిని. అతడు కొన్నిదినములకుముందు నన్నుదర్శించి జ్ఞానోపదేశమును బొంది గోహత్యా పాపమును బోగొట్టుమని ప్రార్థింపగా ఆ పాప పరిహారార్థము త్వరలో నీవీయవతారమునుజాలించి వేరొక చోట మతాంతర వంశమున జన్మింపవలసియున్నది

అంతవరకు నీవు మరల వీతలిదండ్రులజేరి రాజ్యమును పాలించుచు రాజదోగమున నుండుమని పంపితిని. అతడు నాకు ప్రియశిష్యుడై జన్మించుకాలము రాగలదు.

పరమేష్టి దక్షిణదేశమున మాయామేయా విశ్వా త్మిక దంపతులకు పుత్రుడై జన్మించెను. అతనికి వారు అన్నాజయ్య యను పేరిడగా, జనులాతనికి బ్రహ్మానందు డను పేరిడిరి. అయన్నాజయ్యవు నీవు ఈవిషయములన్నియు నాకు ముందుగనే తెలియును నేను నీకొరకే యీమఠమున గనిపెట్టుకొని యుంటిని. అందులకే నీవు వచ్చుచుండగనే అన్నాజయ్యా! రమ్మని పిలిచితిని, వన్ను సర్వేశ్వరుడుగా భావింపుము. ఈదినమున కిది చాలును, పోయి నిద్రింపు మనగా అన్నాజయ్య వెళ్ళెను.

అన్నాజయ్య పూర్వపు సంగతులను వీరప్పయ్యవలన వినుట

అన్నాజయ్య మరునాడు పగలంతయు మిక్కిలి ఇష్ట ముతోగడుపుచు యెపుడు సూర్యుడస్తమించునా, యెపుడు అర్ధరాత్రమగునా యని వేచియుండెను రాత్రి యైనంతనే యతడు స్నానమొనరించి ఫలహారమొనరించి మఠమునందు గూర్చుండి వీరప్పయ్య నామజప మొనరించుచుండెను. ఎందరో భక్తులువచ్చి వీరప్పయ్య దివ్యవాణిని విని పోవు చుండిరి. అంతలో అచ్చమ్మవచ్చి స్వామివిశ్రాంతిగొనువేళ యైనదనగా నందరు వెళ్ళిరి. అపుడు వీరప్పయ్య అన్నా జయ్యను పిలిచి నాయనా! నీసంశయమేమో చెప్పుమనెను

అన్నాజయ్య స్వామీ! మీ రెప్పుడును తాటాకుపై యేమో వ్రాయుచుందురు. ఆ పుస్తకము పేరేమి అండే విషయముల వ్రాయుచుంటిరి. దయయుంచి సెలవిండని పలికెను. అపుడు వీరంభొట్లయ్య నాయనా! ఆ గ్రంథమునకు "కాలజ్ఞానము" అను పేరిడితిని. కాలత్రయము అనగా జరిగినది జరుగునది జరగబోవు కాలములని తెలియును. ఆత్రికాలములలో జరిగిన, జరుగుచున్న జరుగబోవు విషయములను పూసగ్రుచ్చినట్లు ఈ గ్రంథమున వివరించుచుంటి ననెను. అందుకు అన్నాజయ్య దేవా! నాయందు దయయుంచి ముందు జరిగిన దైవిక విషయములను దెలుపుడనగా మంచిదనెను.

అన్నాజయ్య పూర్వపు విషయముల దెలిసికొనుట

సీ. బ్రహ్మలోకమునందు♦బ్రహ్మకల్పంబులు
డెబ్బది రెండింట♦రాజ్యమేలి
బ్రహ్మకల్పంబులు♦పరగ నేబదిమూడు
గడిపితి రజతాక్షి♦కడుముదమున
అంత వైకుంఠము♦నందు ముప్పదిమూడు
బ్రహ్మకల్పంబులు♦బరగకూర్మ
సింహాసనంబును♦జెలగమూడ్వేల, యో
జనముల పొడుగుండ♦జక్కజేసి

తే-గీ. రాజ్యమేలితి దర్వాత♦డంబుమీర
పరగనిన్నూట తొమ్మిది♦బ్రహ్మకల్ప
ములును పరమాత్మ చర్చలో♦నిలిచియుంటి
అన్నయాజయ్య! వినవయ్య♦యఖిలభక్తి.

సీ. వందయెన్మిదిసార్లు♦వడిభూమిజుట్టితి
అంతనానందదాశ్ర♦మమును జేరి
వందలుపదమూడు♦వర్షముల్ సోభ్యము
సోభ్యము "అనుయోగ♦సూక్తిశాస్త్ర
ములు, మరి గ్రంథాల♦దిలకించి జదివితి
పదియు తొమ్మిదినూర్లు♦ప్రబలశక్తి
కాలమృత్యువునంత♦గడచినవాడనై
దివ్యశరీరాన♦దేజరిల్లి

తే-గీ. మూడువేలును మున్నూట♦ముప్పదాఱు
బ్రహ్మకల్పము లుండితి♦బ్రబలశక్తి
అంత నవతారమూర్తినై♦యలరినాడ
అన్నయాజాఖ్య వినవయ్య♦యతులభక్తి.

సీ. ప్రథమావతారంబు♦బరగెనానందాశ్ర
మంబును శిష్యుడ♦నయి చెలంగి
అది యేడువందలు♦నవల తొంబదియాఱు
బ్రహ్మకల్పంబులు♦బ్రబలనాయె
ద్వితియావతారంబు♦తరలెనచ్చోటి నే
యేనూటయరువది♦వినుము బ్రహ్మ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

కల్పంబు లంతట♦గాంచి తృతీయావ
తారంబుదాల్చితి♦తగినయట్లు

తే-గీ. పదియు నెన్మిదివేల సం♦వత్సరములు
అంత నాలవయవతార♦మరిగెవేయి
వందడెబ్బది కల్పముల్♦పొందుగాను
అన్నయాజాఖ్య వినవయ్య♦యతులభక్తి

సీ. నాలుగు ఖర్వముల్♦నలమూడువందల
యెబది కల్పముల్♦నై దవదియు:
కోట్లు డెబ్బదియేడు♦కుదుర నిర్వదిమూడు
బ్రహ్మకల్పంబుల♦బరగెనాఱు
వీడవయవతార♦మేగెనార్వందల
ముప్పదై దులు కల్ప♦ములును దొలగ
అష్టంబై నట్టి♦అవతారమదిదాఁటె
రెండులక్షలు మరి♦రెండువేల

తే-గీ. నరువదియు బ్రహ్మకల్పముల్♦నరిగెనంత
దొడరె తొమ్మిది: డెబ్బది మూడుకోట్ల
ముప్పదార్లక్షలేగాక♦మూడువేల
మూడువందల యర్వది♦ముఖ్యమైన
బ్రహ్మకల్పంబు లేగెను♦బ్రహ్మరూప!

సీ. గత డెబ్బదియు మూడు♦నేగెను కోటుల
ముప్పదియార్లక్ష♦లప్పుడేగ

నంత డెబ్బది వేలు♦యూతూన్నర్లయరువది
యైదువత్సరములు♦యరిగె 'బదియ'
యవతారమునసుంటి♦నట్లుతే కనిగిరి
పదునొకండవదాన♦పదులున్నైదు
వర్షములంతట♦బనగానపల్లెలో
తపమొనరించి♦దరలి పిదప

తే-గీ. నుండువాడ గృహస్థుగా♦నొక్క-చోట
శిష్యులెందరో గొల్వంగ♦జీవములతో
జేరియుందు సమాధిని♦జింతవదలి
మానవుడనయ్యి వినవయ్య♦మాననీయ!
తే-గీ. అన్నయాజయ్య నేనంత♦యవనిమీద
''వీరభోగవసంతరా♦యండ'' నగుచు
ఆపరబ్రహ్మ వంశమం♦దవతరింతు
నందిమండల క్షేత్రము♦నందు వినుము.

ఓ బ్రహ్మానందా! అన్నాజయ్యా! ఇపుడు విజయ నగర సామ్రాజ్యాధీశులలో గడపటివారు నరపతివంశజులగు రామరాజు తిరుమలరాజులతో సామ్రాజ్య మంతరింపగా హిందూమత ద్వేషులగు తురుష్క ప్రభువులు ప్రబలి దేవ బ్రాహ్మణ స్త్రీ శిశు గోహత్యల సొనరించుచుండిరి. ఈ పాపకార్యముల జూడజాలక పాప వినాశన మొనరింపదలచి ఆనందభైరవయోగి అన్నాజయ్యల జన్మింపజేసి నేను చిన్న తనమున వీరప్పయ్య యనియు, ఆవల వీరంభొట్లయ్య

యనియు బరగి యుందుంటివి. త్వరలో నేనిచ్చటనుండి వేరొక చోటికి బోయి 'వీరబ్రహ్మము' అను పేరుతో గృహస్థుడనై యుందును. అపు డెందరో శిష్యులు నన్ను జేరుచుందురు. వారందఱకు ధర్మోపదేశము లొనరింతును. అంత ఆనందభైరవయోగి తన యవతారమును జాలించి నాకు శిష్యుడుగ జన్మించును. ఆవల మేమిరువురను దేశసంచార మొనరించుచు పతితుల బ్రమపావనుల నొనరింతుము. ఆవల నేను జీవసమాధి నొంది నాకు బదులు నాకు శిష్యుడై జన్మించు ఆనందభైరవయోగికి నా మఠమున కధికారిగ జేతును. అనంతరము మరల ధర్మసంస్థాపనార్థము వీరభోగవసంతరాయలు అను పేరుతో నవతరించువాడ. నేను సాంద్రసింధ వేదమును జదివి ఆనందాశ్రమ శిష్యుండనై యుండి కార్తిక బహుళ తదియనాడు యీదివ్య దేహమున యవతరించితిని.

అనుచుండ బ్రహ్మానందుడు! స్వామీ! ఆనందాశ్రమమనగానేమో నేను గ్రహింపజాలకుంటిని. దయయుంచి తెలుపుడనగా వీరంభొట్లయ్య నాయనా! వినుము,

క. బ్రహ్మానందా! విను పర
బ్రహ్మస్వరూపంబే పరము।బ్రహ్మానందం
బ్రహ్మను దెలియగ వీర
బ్రహ్మను నేనుంటి నందు।బ్రహ్మస్వరూపా!

అంతయేగాక మరియు నాలకింపుము,

బ్రహ్మానందా! జాగ్రత్, స్వప్నసుషుప్తులను మూ
ఱును యవస్థాత్రయము లనంబడును. అవస్థాత్రయమును,
పంచకోశ వ్యతిరిక్తము, పంచకోశ వివరణము, స్థూలాంగ
సూక్ష్మాంగ కారణాంగ వివరముల దెలిసికొన్నచో ఆనం
దాశ్రమమున శిష్యత్వము సహింప నర్హతగలుగును.

స్వామీ! మీదివ్య సూక్తుల వినినందున నాసంశయ
ములు దీరినవి. ఇక మీరు విశ్రమింపుడు అని నమస్కరించి
శయనింప వెళ్ళెను. వీరంబొట్లయ్య కాలజ్ఞానమును రచింప
బోయెను.

ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

నాలవప్రకరణము

ఓ భక్తాగ్రేసరులారా! ముందటి ప్రకరణమున వీరం భొట్లయ్య అన్నాజయ్యయను బ్రహ్మానందునకు దనపూర్వాప తారంబుల గూర్చి తెలిపినది మీరెరింగియే యున్నారు. ఆవల మరునాడు అన్నాజయ్య వేకువజామున లేచి సుస్నా తుడై అచ్చమ్మగారొసంగిన అల్పాహారమును గొని పగ లంతయు వీరంభొట్లయ్య నామజప మొనరించు కొనుచు ఎప్పుడు రాత్రి యగునా, యెప్పుడు స్వామిచే రహస్యము లను దెలిసికొందునా యని కనిపెట్టుకొని యుండెను. అంత జీకటిపడుటయు అచ్చమ్మ యిచ్చిన ఫలహారముతిని లోమఠమున కూర్చుండియుండెను. భక్తులందరును వీరం భొట్లయ్య భక్తిమార్గపు సూక్తుల నాలకించుచుండిరి. అంత అచ్చమ్మ వచ్చి స్వామివారికి విశ్రాంతి వేళ సమీపించు చున్నదని హెచ్చరించెను. ఆమాటలవిన్నతోడనే భక్తులు తమ ఇండ్లకేగిరి. అపుడు వీరంభొట్లయ్య నాయనా! బ్రహ్మానందా! ఎచ్చటనుంటివి. రమ్మని పిలిచెను.

వీరంబొట్లయ్య గరిమిరెడ్డి అచ్చమ్మ పుత్రునకు దృష్టినొసంగుట

స్వామి పిలిచిన తోడనే అన్నాజయ్యస్వామీ! ఇదే వచ్చితినని పోయి సాగిలపడి మ్రొక్కి చేతులు జోడించుకొని యెదుట పద్మాసనము వైచికొని కూర్చొండెను. అపుడు స్వామి నాయనా! నిన్నటిరాత్రి నీకు నా పూర్వపు అవతారముల రహస్యమును వినిపించితిని, అనగా నాకాల జ్ఞానములో భూతకాలవిషయములందు చాలవఱకు వివరించితిని ఇక ప్రకృతము జరుగుచున్న యంశముల వివరింతును వినుమనుచుండగా అచ్చమ్మ పుత్రునితో వచ్చెను.

అచ్చమ్మ అంధుండగు తన పుత్రుడు బ్రహ్మానంద రెడ్డిని చేయబట్టి మెల్లగ నడిపించుకొని వచ్చెను అది చూచి వీరంభొట్లయ్య తల్లీ! ఇదియేమి ఈ బాలుడెవడు ఈతనికి దృష్టియెట్లు పోయినదని ప్రశ్నించెను.

అందుకామె స్వామీ! ఈ బాలుడు నాయేకైక పుత్రుడు. ఇతని పేరు బ్రహ్మానందరెడ్డి యని పెట్టితిని. జన్మించునపుడీబాలుడు అందరివలెనె జన్మించెను. అందచందములన్నిము నమరియుండుట మీరు చూచుచుంటిరి ఇతనికి యిన్నాటులుండి కనుల దృష్టిపోయినది. ఎన్ని చికిత్సలనో జేయించితిని ఎందరి దేవతలకో మ్రొక్కితిని దృష్టిరాలేదు మీరు అవతార పురుషులు. మా గృహమును మమ్మును రక్షించుటకుగదా మీరువచ్చితిరి. ఈ నా కుమారుని యం ధత్వమున కేది కారణమో సెలవిచ్చివీనికి దృష్టి నొసంగుడు

మీ చేతగాని దీ ప్రపంచమున లేదు అని సవినయముగ వేడు కొనెను.

అందుకు స్వామి అమ్మా! ఇన్ని దినములు నాకీవిషయ మేల చెప్పకుంటివి ఈ బాలుడు పూర్వజన్మమున సద్గుణ వంతుడై యుండియు బాలస్నేహితుల వెంటనాడుకొనునపు డొక కపోతము బాలురచేతికి జిక్కెను. అపుడు నీకుమా రుడు బాల్య చాపల్యంబున ఆకపోతము రెండు కన్నుల నొకముంటిచే బొడిచి యెగురవేసెను. కన్నులగోలుపోయిన యాపక్షి యెటుబోవుటకును తెలియక యుండంజెగురు చుండగ డేగ వచ్చి తన్నుకొనిపోయి చంపెను. ఆ పాప ఫలమిప్పు డీతనికి సంభవించినది. అతడు ఆపక్షి కన్నుల బొడిచిన పిమ్మట సద్గుణయుతుడు కాబట్టి తన పాపకార్య మునకై పరితపించి యిక నెన్నడు నిట్టిపని చేయనని పలి కెను. ఆసద్గుణమే యిపు డీతనికి దృష్టినీయగలదు. నాయనా బ్రహ్మానందరెడ్డీ! ఇటువచ్చి కనులు మూసికొనుమని యా మూసిన కన్నులపై జేతదుడిచి కన్నుల దెరువుమనెను ఆ బాలుడు కన్నుల దెరచి చూపువచ్చినదని గంతులిడ సాగెను.

అంత అచ్చమ్మ తండ్రీ! మా యదృష్టము పండినది. లోకరక్షకా! నీవలన నాపుత్రుడు ధన్యుడాయెను. అని పరి పరి విధంబుల స్తుతించుచుండగా సామ్వి! నన్నేల స్తుతించె దవు. ఇది నా ధర్మము నాధర్మమునేను నెరవేర్చినంతయే కాని యొక్కువ సేయలేదు అమ్మా! నీకువారునకు "పంచా క్షరి మంత్రోపదేశ మొనరించెదను" ఆ మహామంత్రమును నిశ్చల మనస్సులో జపించిన సకల కార్యములు సిద్ధించును

అని యా బాలుని దక్షిణ కర్ణమున "ఓం నమశ్శివాయ" యని మూడు సార్లు చెప్పి నాయనా! నీవీమంత్రరాజమును జపించుచు నీతల్లితోడను, ఈఅన్నాజయ్యతోను ఈమఠము నందలి భక్తులకు భక్తిమార్గమును బూపుచుండుము. నేను త్వరలో వేరొక చోటికి బోవలసియున్నది. అపుడు మీరు నాకు బదులుగా మఠమునం దొక శివలింగమును ప్రతిష్ట చేయించి నాకు బదులు పూజలొనరించుచుండుడు. త్రిమూర్తులవలె అన్నాజయ్య, అచ్చమ్మ, బ్రహ్మానందరెడ్డి అను మీరు ముగ్గురు ఈ మఠమున కధికారులై పాపులతరింప జేయుచుండుడని చెప్ప వారు చిత్తమని విశ్రమింప వెళ్ళిరి.

బనగానపల్లెనవాబు వీరంభొట్లయ్య శక్తి నెరుగుట

మహాభక్తుడగు బ్రహ్మానందరెడ్డి సదా స్వామిపదముల గనిపెట్టుకొని లోమఠమందుండెడి వాడు, అతడు ఒకనాడు స్వామినిజూచి ఓ అనాధరక్షకా! నాకు దృష్టి గలిగించితివి. ఇపుడు నాకు గ్రామములోని కేగి యెంతకాలమునుండియో దృష్టిని గోలుపోయినందున చూడజాలక పోయిన నాబంధువులను నా చెలికాండ్రను చూడ యాసగలిగినది. అయినను మీ యాజ్ఞ లేక పోరాదు. కనుక నాయందు దయయుంచి యనుమతి యిండని ప్రార్థించెను.

అందుకు వీరంభొట్లయ్య నాయనా! ప్రజాదృష్టిసామాన్యమైనది కాదు దృష్టివలన యొకొక్కరు కఠిన పాషాణమును బ్రద్దలు చేయగలరు. ఒకొక్కరు యూరక చూచి

నచో చెట్టుమీద పళ్ళులు కాయలు డుల్లినట్లు జలజలరాలి పడి చచ్చును. కనుక నీవిన్ని సంవత్సరములు దృష్టిని గోల్పోయి యింటినుండి పోజాలనివాడవు ఈదినమున పుర మును జూడ బోయినచో ప్రజానీకము ఆశ్చర్యముతో నిన్ను జుట్టుకొని యేకదృష్టితో జూడకపోరు అందువలన దృష్టి దోషము సంభవించవచ్చును. కనుక నీవు నా పూజా పీఠముకడ నుండు విభూతిని నొసట ధరించి పోవచ్చునని నెను.

అచ్చమ్మ పుత్రుడు యింటికేగి స్నానముచేసి శుభ్ర మగు వస్త్రముల ధరించి లోమఠమునందు స్వామి పూజా పీఠము కడకేగి విభూతిందాల్చి స్వామికి నమస్కరించి గ్రామములోని కరిగెను. బ్రహ్మానందరెడ్డి దారిన బోవుచు బాల్యమిత్రుల బలుకరించి క్షేమముల విచారించుచుండగా జూచిన ప్రజలు "ఔరా! బ్రహ్మానందరెడ్డి గ్రుడ్డివాడుకదా అతనికి అంధత్వ మెటుల బోయినది" అని యతని చుట్టు గుంపులు గుంపులుగ జేరి యతనివలన వీరంబొట్లయ్యగారి వలన తనకు చూపు మరల వచ్చినదనియు, అతడు భూమిపై యవతరించిన భగవంతుడు తప్ప ఇతరుడు కాడనియుం జెప్పుచు బోవుచుండెను.

ప్రజానీకమా వలుకుల విని ఆశ్చర్యపడుచు అట్టిభగ వస్వరూపుని దర్శించిన పాపములన్నియు బటాపంచలు కాగల వని లోమఠమునకు బరుగులిడిరి. ఆగుంపులను జూచి స్వామి చికాకుపడక వారికిదర్శనమిచ్చి తన పవిత్రకరమున విభూతి వారి నొసటిదిద్ది పంపుచుండెను. ఆ గుంపులలో హిందూ ముసల్మానులే గాక సర్వమత కులముల వారుండిరి స్వామి

కులమత భేదముల నెంచక దర్శనమిచ్చి విభూతిదిద్ది యాశీర్వదించి పంపుచుండెను.

ఆరీతి ప్రజలు స్వామిని దర్శించి గ్రామములోని కేగి స్వామి ప్రభావము నందఱు కెరిగించుచుండిరి. ఆ ప్రజలలో గొందఱు బంగనపల్లె నవాబు సేవకు లుండిరి ఆసేవకులు స్వామి యపారశక్తిని విని యీవిశేషములను నవాబునకెరిం గించిరి. ఆవార్తల విన్న నవాబు "ఔరా! అంతటిమహా పురుషుడు నారాజ్యములోనికి వచ్చుట మహాభాగ్యము" అట్టి వానిని దర్శించిన నా పాపములు తప్పక మాయము కాగలవు. అతనికడకు పాదచారినై పోదునా! ఆ మహానీయుని నాయంతఃపురమునకు రాగోరిన వచ్చునా ఆమాటల కాతడు కోపపడి శపించునా! నేను పాదచారినై పోవుట సమంజసము కాదు, ఆమహానీయుని రప్పించుటకు ధైర్యము చాలకున్నది. అయినను దివ్యపురుషులకు శాంతమే కాని కోపముండదని వినియున్నాను. అని తన యాప్తులలోనొకని రమ్మని ఓయీ నీవు అచ్చమ్మ లోమఠమునకేగి స్వామి వారినిజూచి యిటు లనుము, పరాత్పరావతారా! మిమ్ము నవాబు చూడగోరినాడు. అతడు మీదర్శనమునకు బాదచారియై వచ్చుటకు తగిన సమయమును దెలిసికొని రమ్మని పంపినందున వచ్చితిని. ఆజ్ఞయని పలుకకుండ చేతులు జోడించి నిలుచుండెను. అందుకు స్వామి యామహమ్మదీయునకు నొసట విభూతినిడి నీకుశుభమగును. నవాబుపాదచారియై నాకడకు రాబనిలేదు రేపు ఉదయము నాపూజను ముగించి తర్వాత నేనేయతని భవనమునకు వచ్చెదనని చెప్పి పంపెను.

వీరంభొట్లయ్య రాచనగరునకు బోవుట

ఆ మరునాడు నవాబు వేకువఝామున లేచి తాను యంతఃపుర స్త్రీలను స్నానమొనరింపుమని తానును జలక మాడి సేవకులు రావించి. మీరు నా పల్లికిని బాగుగ శుభ్ర పరచి పట్టుపాన్పును తలగడల నందిడి పుష్పమాలలతో జక్కగ నలంకరించి మంగళవాయిద్యములతో లోమ తమున కేగి స్వామిని బిలుచుకొని రమ్మనెను. వారటు లొనరించి మంగళవాయిద్యములతో బోయిరి.

అంతలో నవాబు దర్బారును అలంకరింపజేసి స్వామి రాకకై యెదురు చూచుచుండెను. ఆవల గొంతసేపటికి వీరంభొట్లయ్య పల్లకిలోగూర్చుండి నవాబు నగరునకువచ్చు చున్నాడను వార్తవచ్చెను. ఆ మాటల విని పురజనులా వీధిని రెండుప్రక్కల బారులుదీరి నిలుచుండి తమయొడిలో పువ్వుల నిడుకొని యుండిరి. కొందఱు మిద్దెలమీద నిలిచి స్వామిని దర్శించి పుష్పవర్ష ము గురిపింప గనిపెట్టియుండిరి.

అంత స్వామివారిరాక నెరింగించు మంగళారవములు వినంబడెను. బోయీలు పల్లకిని మోయుచు "వీరంభొట్ల య్యకు జై" యనినంతనే ప్రజలందరు మిన్నుముట్టునట్లు జయజయ శబ్దములొనరించిరి. రాజబాటన పల్లకి పోవు చుండగా దారిప్రక్కన బారులు తీరిన పురుషులు బుష్ప ముల జల్లుచుండిరి మిద్దెలపై నిల్చిన స్త్రీలు స్వామి పల్ల కిపై ప్రసూన వర్షములు గురిపించుచుండిరి అంతలో గోట ద్వారము సమీపించెను.

అపుడు నవాబు దర్బారునుండి పరుగిడుచువచ్చి కోట ప్రధాన ద్వారమున నిలిచి పల్లకి వచ్చినంతనే వంగి సల్లా ములు చేయుచు పల్లకిని బట్టుకొని దర్బారు మందిరమునకు దీసికొని వెళ్ళి స్వామిని సింహాసనముపై కూర్చుండ నియ మించి ప్రసూనములచే దయారుచేయించిన కిరీటమును దలపై నిడి గులాబిపూల మాలచే గంటము నలంకరించి చేతుల జోడించి యాజ్ఞ యని నిలుచుండె.

అపుడు వీరంభొట్లయ్య నాయనా! నీవు పూర్వజన్మ మున నాభక్తుడవై యుండినందున యీజన్మమున రాజు వంశమునజన్మించితివి. అసంగతి నాకు ముందుగ తెలియును అందులకే నీవు నన్ను జూడ పాదచారిగవత్తునని చెప్పిపంపి నను నాభక్తుని గృహమునకు నేనే రాదలచి వత్తునని చెప్పి పంపితిని నీవు ధన్యుడవు సుమా! అనునంతలో నవాబు స్వామీ! మీపలుకులలోని మర్మము నెరింగితిని తాము నా రాజ్యములోనికి వచ్చినందులకే కాక నామందరమునకు వచ్చినందుల కెంతయొ ఆనందించుచుంటిని, మీరు నా కోర్కెను నెరవేర్ప గోరుచున్నాను. భక్తుల కోరిక దీర్చుట మహాత్ముల ధర్మము. మీరు నాతోకూడ అంతఃపురమునకు విచ్చేసి జనానాస్త్రీలతో నేజేయు సత్కారమును బొందుట యేగాక విందు గుడపవలెనన గా స్వామి మంచిది పోదము రమ్మని యతని వెంట జనానాకు వెళ్ళెను.

అంతలో నంతఃపురమున రాజాజ్ఞ ననుసరించి మధుర పదార్థములనేగాక గోమాంసముతో జేయించిన పదార్థ ముల నొక బంగరు పల్లెమునందిడి పట్టు వస్త్రముతో గప్పి

ఒక పీఠము ముందు బెట్టియుండిరి. ఈసంగతి నవాబుకు దెలి
యును కాబట్టి స్వామి లోపలికి బోయినంతనే స్వామిని
పీఠము మీద గూర్చుండ నియమించిరి. అంతలో జనానా
స్త్రీలు నవాబు స్వామియెదుట గూర్చుండగా స్వామి పల్లె
ములోని పదార్థములే తట్టలలోనికి దెచ్చివారి ముందు
పెట్టిరి. అప్పుడు నవాబు స్వామివారిని ముందు భోజనమును
తిన ప్రారంభింపుడనియు, ఆనల తాము భుజింతుమనియు
చెప్పెను.

అపుడు వీరంభొట్లయ్య నవ్వుచు "నాయనా! నీ యతి
థినై వచ్చి నీ యాతిథ్యమును స్వీకరింపకుందునా. ఏల
సంశయించెదవు" అని ప్రక్కనయుండిన వెండిపాత్రలోని
నీటిని గొని యాపట్టు గుడ్డకప్పిన పల్లెముపై ప్రోక్షించెను
ఆశ్చర్యపడి నవాబే యాపట్టు గుడ్డను తీయగా తట్టనిండుగ
నానావిధ ఫలములుండెను. అపుడు వీరంభొట్లయ్య నాయనా
ఇక భుజింతును. మీరును భుజింపవచ్చునని వారిపల్లెము
లపైనీటిని జల్లగనే వారి తట్టలలోని పదార్థములన్నియు
ఫలములుగ మారిపోయినవి.

నవాబు చూచి సాష్టాంగ నమస్కార మొనరించి
"ప్రభూ! దాసునితప్పు దండముతో సరి" యందురు. నేను
మాయాంధకారమగ్నుడై నన్ను నేనెరుంగక మీబోటి
యవతారపురుషుల పరీక్షింప గోరినందులకు క్షమింపుడు.
నన్ను మాయాసముద్రమునుండి బయటికిలాగి తరింప జేయు
డని పరిపరి విధముల ప్రార్థించెను. అందుకు స్వామి నవా
బును దగ్గరకు రమ్మని కుడిచెవిలో మూడుసార్లు యూది
నీవు ధన్యుడవు పొమ్మనెను.



"బనగానపల్లె నవాబు పళ్ళెరములలో పలువిధ
మాంసాహారము నిడి భుజింపగోర వీరబ్రహ్మము
దానిని ఫలాహారముగా మార్చుట."

అంత అందఱును ఆపదార్థముల నారగించి లేచిరి. అపుడు నవాబు ఒక బంగరు పళ్ళెరమునందు కొన్ని నవరత్నముల నిడి పట్టుకావి వస్త్రములతో గూడ సమర్పించెను. ఆ పళ్ళెరము నందుకొని నాయనా! నిన్ను నాభక్తునిగా స్వీకరించితిని, నీవువచ్చి నాకాలజ్ఞానమును విని పోవుచుండుము. నీకు జయమగుగాక. అని దీవించి లేచి మరల బల్లకిలో కూర్చుండగా. బోయీలు మోసికొనిపోయి స్వామిని మఱమున జేర్చి బోయిరి.

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

నాలవప్రకరణము

ఓ భక్తవరులారా! మీరు గత ప్రకరణమున లో మఠమునుండి వీరంబొట్లయ్య బనగానపల్లె నవాబుగారి దర్బారునకు వెళ్ళి యాతనికి దర్శనమిచ్చి అంతఃపురమున నవాబు కుటుంబవర్గములో గూర్చుండి విందారగించి, నవాబును శిష్యునొనరించుకొని యతం డొసగిన బహుమాన ములతో గ్రమ్మర మఠమును జేరెనని చదివితిరి. ఆవల జరిగిన విషయముల దెలిపెద వినుము.

వీరంబొట్లయ్య కాలజ్ఞానమును వివరించుట

ఒకానొకదినంబున బనగానపల్లె నవాబు తనసేవకుని బిలిచి ఓయీ నీవేగి లోమఠంబునకుండు స్వామివారితో మాశిష్యుండగు నవాబుమిమ్మునర్శించి తాము రచించుచున్న కాలజ్ఞానమును వినుటకు రాదలచెను. మీ యుత్తరువునకై కాచియున్నాడని చెప్పుము. ఆతడేమి చెప్పునో తెలిసికొని

రమ్మని నన్ను పంపెనని చెప్పెను. నీవు ఆమఠమున యాతని సన్నిధిలో వినయముగ మాటాడుమని చెప్పి పంపెను.

సేవకుడు వీలినవారి యాజ్ఞ ననుసరింతునని లోమఠమున కేగి స్వామికి నమస్కరించి మహానుభావా! మా నవాబు మీతో తమ కాలజ్ఞాన వివరముల దెలిసికొనగోరిరి. అందులకు తగిన సమయమును దెలిసికొని రమ్మనిరి. తామేమి యాజ్ఞ యిత్తురో సెలవిండు. ఆ యుదంతమును ప్రభువు కెరింగింతునని నెను. అందుకు వీరంబొట్లయ్య నాయనా! మంచిది ఈదినమురాత్రి భక్తులందరువచ్చినపుడు నవాబును రమ్మను మని చెప్పెను. అందులకా సేవకుడు చిత్తమని సలాముచేసి పోయెను.

సేవకు డేగి స్వామి యాజ్ఞను రాజున కెరింగించెను. నవాబు యెపుడు రాత్రియగునాయను చింతచే రాచకార్య ములనెల్లవదలి కాచుకొనియుండెను. అంతట రాత్రికాగానే నవాబు బయలుదేరి ముందు సేవకుడు బోవుచుండ నతనినను సరించి పోవుచు లోమఠమును జేరెను. అతడేగు నప్పటికి స్వామివారు జింకచర్మముపై గూర్చుండి యుండెను. ఒక ప్రక్క అచ్చమ్మ అన్నాజయ్యయు రెండవప్రక్క బ్రహ్మానంద రెడ్డియు గూర్చుండి యుండిరి. బ్రహ్మానందరెడ్డి ప్రక్కన ఒక ంక చర్మమును బరచియుండిరి ఎదుట గొందఱు భక్తులుని నిశ్శబ్దముగ గూర్చుండియుండిరి. అంతలో నవాబువచ్చి వంగి మూడుసార్లు భూమిని దాకునట్లు సలామొనరించి నిలిచెను అపుడు స్వామి నవాబును చూచి నాయనా! ఇటు రమ్మ. బ్రహ్మానందరెడ్డి ప్రక్కనుండిన కృష్ణాజినముపై గూర్చుండు

మని కన్నులతో జెప్పెను. అపుడు నవాబచ్చటగూర్చుం డగా వీరంబొట్లయ్య యిట్లు చెప్పదొడంగెను.

నాయనలారా! పూర్వము ఆదినారాయణమూర్తి సకలభువనంబుల రక్షింపదలచి,

శ్లో. యదా యదా హిధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సుజామ్యహం.

ఈ ప్రపంచమునందెపుడు ధర్మమునశించి అధర్మము పెచ్చు పెరుగునో అపుడు అధర్మము యెక్కుడై నచోట తానవతరించి అధర్మమును నశింపజేయుదునని యానతిచ్చి యుండెను. ఆ మహావిష్ణువు యంశమునం దవతరించిన నేను పాపఘ్ని మతమున వీరప్పయ్య అను నామముతో బెరిగితిని అవల ఈ బనగానిపల్లెజేరి వీరంబొట్లయ్య అను నామమున బిలువబడుచుంటిని. అనగా యిపుడు భూతవర్తమానకాల విషయముల కడు సూక్ష్మముగ వెల్లడించితిని. ఇకముందు వీరబ్రహ్మము అను పేరుతో మఱియొకచో వెలసి పాపుల పరమపావనులను నొనరింప నున్నాను.

అన్నాజయ్యా! నీకు నేనింతకుముందే నాభూతకాల అవతారముల గూర్చి చెప్పియే యుంటిని, వర్తమానకాల మును కడుసూక్ష్మముగ నెరింగించితిని. ఇపుడుభౌష్యత్ కాల మున జరుగబోవు విషయము లనేకములుగలవు. అన్నిటిని దెలుపుటకు చాలదినములు పట్టును. ఇపుడు కొన్నింటిని మాత్రమే వివరింతును, నిశ్చల మనస్కుడై వినుడు.

క. శ్రీరంగధాముడనఘా!
చేరియు పాపంబులెల్ల ♦ జెండుచు భువిలో
దరహాసుండై వెలయుచు
పరిపరి విధములను బల్కె ♦ పసిబాలురతో. 1

తే-గీ. అన్న! కావేటిరంగని ♦ యతులశక్తి
పాపజాలంబు నశియించి ♦ పారిపోవు
ఆమహాత్మ్ముని శక్తిచే ♦ నవనిమరల
పదునొకండవ యవతార ♦ మది చెలంగు. 2

తే-గీ. బ్రహ్మచర్యాశ్రమంబదే ♦ పావనంబు
శాశ్వతంబని తెలియుడు ♦ జగతిలోన
నన్ను నమ్మనివారెల్ల ♦ నాశనంబు
నమ్మువారెల్ల నావారె ♦ సుమ్ము వినుడి. 3

క. కా, యా, రా, నాశాపము
మాయించును దుష్టజనుల ♦ మానదువినుడీ
పాయక నళ, పింగళయును
ప్రియమగు వత్సరములయ్యె ♦ ప్రీతిని నార్కు. 4

తే-గీ. కలియుగంబున మున్మందు ♦ క్షత్రియాళి
బలము గలిగియు క్షీణింత్రు ♦ ప్రబలునంత
హెచ్చుమతకలహంబులు ♦ పెచ్చుపెరిగి
దోచుచుండురు దొంగలు ♦ దొరకకుండ. 5

ఆ-వె. ఊరనూరనొక్క ♦ యద్భవంబై శక్తి
పుట్టినంత జాల ♦ పుడమియెల్ల
వడ్డరిల్లిపోవు ♦ ధరణిలో మేకలు
రాత్రియందు కూయు ♦ జిత్రముగను. 6

తే-గీ. అందువలనను జత్తురు♦ గధికజనులు
అంత తిరుమలలో బుట్టు♦వింతయైన
ధూమ కేతువు, నద్దాన♦తృళ్ళుజనము
మిట్టమధ్యాహ్నమందు♦పిట్టలవలె. 7

ఆ-వె. మెరసి దక్షిణమున♦యురుము నుత్తరమందు
పిడుగు లుద్భవిల్లి♦పుడమి జార
నింకు వాహనులును♦పొంకముగా నగ్ని
చల్లబడును దాన♦జనుల డుల్ల. 8

తే-గీ. ఇందు కొకగుర్తు దెలిపెద♦ముందుగానె
జెంగుళూరను పురమున♦పెద్దగాను
అయ్యయొక్కడు జన్మించు♦నధికుడగుచు
విధివశంబది తప్పదు♦వింతగాగ. 9

సీ. ఉత్తరమునబుట్టి♦యుర్మ్నులు మెరుపులు
పిడుగుల గురియును♦పెద్దగాను
అది శుద్ధ పాడ్యమి♦యందున జరుగును
మాయజంగంబులు♦మహిని నిండ
తల్లికి బిల్లయు♦బిల్లకు తల్లియు
చూడ వీల్లాకుండ♦జుట్టి పుడమి
పచ్చికాయలదిని యాక లెత్తంగ
కేగడిమట్టినే♦తగ భుజింత్రు

తే-గీ. అర్ధరాత్రిని గ్రామాల♦నధిక కేక
లుప్పతిల్లును గుణశీలు♦లప్పులందు
జావ, నాచార పరులనా♦చారులగుచు
బ్రాహ్మణులు చెడిపోదు ర♦బ్రాహ్మలగుచు. 10

తే-గీ. కలవుగండము లెన్నియొ♦నిలను, లింగ
మయ్య, జూపును నిజరూపు♦మయ్యలార!
పోవు శ్రీశైలతీర్థంబు♦పుడమి దాని
నాథుడే తెంచి మాటాడు♦నరులతోడ. 11

తే-గీ. నందికొండకు నుత్తర♦మందు నొక
బలమునందుండి జనియించు♦దలప వంద
యిరువదియులక్ష హాయములు♦పూరుషులును
వికృతిరూపాల గలిగి♦వినుడు బాగ. 12

నాయనలారా! అంతయేకాదు పాపులును, దుర్మదాంధులును తమలో తామె కలహించి హతులగుటచే కొంత భూభారము తగ్గును. విజయవాడలో నాళ్ళకినకదుర్గ జనించి కొందఱు రూపుమాపును. పర్వత శిఖరములపై మహాఅగ్ని జ్వాలలు పుట్టును. ఆజ్వాలలు గొందరినిరూపుమాపి భూభారముతగ్గించును. ఆలయములలోని దేవతా విగ్రహములు పల్లెలుపట్టణములపై నాట్యమాడును. దక్షిణదేశమునగంచి కామాక్షియు, కర్నాటక దేశమున కాళీమాతము, అరవ దేశమున వీరభద్రుడును, నందిమండల రాజ్యమున నాగేంద్రుడును చిన్నపెద్దలను భేదముచూపక నాశనమొనరించుటచే మరికొంత భూభారముతగ్గును. శ్రీశైల మల్లికార్జునుని యాలయమున పొగమంట లెగయును. అది వీరభోగవసంతరాయలు పుట్టుటకు యానవాలు ఆకసవాణి పలుకును.

అంత గొన్నాళ్ళకు బాణముల వర్షము కురియును. అపుడరవదేశమున కాళీబైరన పంపులు జనించిశీతలవాయువులు వీచుటచే ఆబాలవృద్ధులు తలలు పగిలి మరణింతురు. అంతట జనులలో బొబ్బరోగములు, కంటమాల, రాచ

వ్రణము, భంగదరరోగములు, నోటిపుండ్లు జనించుటచే జననాశనమగును, జనులలో యన్నటులుండి హృదయ చలనమూగి మరణములు జరుగుచుండును.

మరికొంతకాలమునకు గగన భాగమున నాలుగు నక్షత్రంబులు జూపట్టును. అంత ధనుష్టాధ్వని వినిపించుటచే దానివలన యనేకులు మరణింతురు. పశుజాలము ఆకసమును జూచి యరచును, భూమి పెళపెళారవములచే బగిలి భయంకర శబ్దము చేయుటచే జననాశనమగును. ప్రజలు రచ్చలెక్కి అయ్యో! మాగతి ఏమని పలువిధముల మొత్తుకొని చత్తురు. దేవియనుశక్తి బొబ్బలిడును, బసవేశ్వరునికి కంట నీరుగారును, అర్ధరాత్రి వాయసములరచును. అత్యధికవింతలు చెలరేగి పగలు నక్షత్రములు వెలిగి ఆకసమున వింత నవ్వులు పుట్టుటచే జనసముదాయము నశింపగలదు.

నాయనలారా! ఆవలకొన్నాళ్ళకు శ్రీశైలమున భ్రమరాంబికాయాలయమున ఒక మొసలిచేరి రెండుదినములుండి మేక యరపరచి అదృశ్యమైపోవును. శక్తులు కడకువ్యాఘ్రురూపమున్న జనుదెంచి జనుల జంపును. కుమారస్వామి తన గుడి తలుపుల బిగించుకొని తీయకుండును. అంతలో మళయాళ దేశమున మందపాలుడను వానరము జనులతోమాట్లాడుట తటస్థించును. తొడిపర్తిలో మేక మనిషివలె మాటాడగలదు. అంత గంగా యమున సరస్వతి నదులుప్పొంగును. అప్పుడు రామదుర్గమునందొక, రామచిలుక వీరధర్మముల బోధించును. కుంభకోణమునగోవును సంహరింతురు. గోలకొండలో కొంగమాటాడసాగును. కంచిలోని గరుడధ్వజమును కదలింతురు. కురుకొండలో వీరాంజయనేయులు

కోపోద్దీపితుడై నాలుగు తాటిమానుల పొడవు పెరుగును. అప్పటికి కొంతజనము నశించును.

ఆవల మల్లికార్జునుడు కన్నులనుండి నిప్పులగురిపించును. బసవేశ్వరుడు భీతిచే గడగడ వడంకును. అతనినోట భీకర శబ్దము పుట్టును. సూర్యమండలమునుండి నిప్పుకణములు గురియును. కొండలరాయనివీలూరు పాడుపడిపోవును. శ్రీ తిరుపతి వెంకటేశ్వరస్వామి యాలయమున మ్లేచ్ఛులు ప్రవేశింతురు. పలుచోట్ల కపిధ్వజములనుండి భయంకరారవములు వెలువడును. భూమండలము దద్దరించును. అంత దిరువళ్లూరువీరరాఘవస్వామి దేహమునుండి చెమ్మటలుగ్రమ్మును. దివ్యక్షేత్రములన్నియు తురుష్కుల వశమగును. ఆరీతిగా కొంతభూభారముతగ్గును. అనగా నప్పటికి జననాశనమగును అమావస్యనాడు చంద్రోదయముకాగా, అర్ధరాత్రిసూర్యోదయమగును. ఆకాశము రక్తమువలె ప్రకాశించును. అంచువలన దుర్మార్గులగు జనులు చాలవఱకు నాశనమై భూదేవి భారమును తగ్గును.

అష్టాదశవర్ణములవారు గణపతి మంత్రము నుపాసించుటచే పురములందు రక్తవర్ణములు గురియగలవు. లచ్చిగోడుగోడున దుఃఖించును. సముద్రములుప్పొంగును. ఇందువలన అనేకజనులు ప్రాణముల గోల్పోదురు. అంత కొంతవరకు మరల ధర్మము నిలుచును. ప్రజలందఱు సుఖంబుండుదురు. సస్యములు బాగుగాఫలించును. అన్నివర్ణములవారును సుఖంబుగనుందురు. అదియునుంగాక కలియుగమునన్నాలుగువేల అయిదు వందల ముప్పదిరెండు వర్షములు జరుగగా వండన సంవత్సరము వచ్చును. అపుడు గొప్ప కలివు సంభ

వించి భూకంపము కలుగును. నక్షత్రములు రాలును. కృష్ణా తీరమునందొక భూసురునింట హత్యజరుగును. ఆ హత్యను గూర్చి పశువు సాక్ష్యము పలుకగలదు. ఆదిగాక మీకు మరొక గుఱుతు చెప్పెదను. కలియుగమున నాలుగువేల ఱువందల డెబ్బదియైదు సంవత్సరములకు భవనామ సంవత్సరమున పినాకినీనది అధికమగు వెల్లువతో వచ్చును. నెల్లూరు రంగనాయకులు ఆ వెల్లువలో మునుగుటచే మూడుదినములు పూజలు జరుగవు.

సీ. భర్తలు భార్యలఁబట్టి బాధింతురు
పతిభక్తియుండదుఁ భార్యలందు
కులధర్మములుకూలిఁకూళ్ళలై జనులెల్ల
కామక్రోధంబులుఁకలినిహెచ్చు
తరిగొండదగ్గరఁధరపైని పుట్టును
ఈత చెట్లొకటిఁవింతగాను
రాతిర నిద్రించుఁరయమున ప్రొద్దున
లేచియునిల్చుండుఁపచ్చిచెట్టు

తే-గీ. ఎనిమిదేడులు గడువంగఁతనకు దానె
పడును శ్రావణశుద్ధానఁపట్టపగలె
నరులు తిందురు గడ్డినిఁగురుతులివియె
జనులు నాశనమగుటకీఁజగమునందు.

ఇంకొక గుఱుతును చెప్పెద వినుడు, కలియుగంబున అయిదువేలు తొమ్మిదినూర్ల డెబ్బదిఏడవ సంవత్సరమునకు సరియగు ధాతవర్షమున మార్గశిరమాసము మొదలు ఈశ్వర నామ సంవత్సర మాఘమాసాంతము లోపల నేమగునన,

తే-గీ. గోలుకొండయు వినుకొండ♦కొండవీడు
తాడిపర్తియు, బెజవాడ♦తంజనగరు
గుత్తి, బళ్ళారి, నెల్లూరు♦పత్తనముల
పుష్పగిరి, కందనోలను♦పురము మరియు
కంభ మందున్న మార్కాపు♦రంబులందు
చెన్న నగరము, మైసూరు♦చెలగనీత
ముక్కలందును తర్వాత♦మునిమడుగున
కఅవువచ్చును ధాన్యము♦కఅవుగాగ
రూకకును పట్టెడమ్మును♦రూఢివినుడు.

అంతియకాదు. ఇంకను చెప్పెదను వినండి. మార్కాపురమువద్ద భూమినుండి సువర్ణవృషభమును తీయుదురు. అయిదేండ్లు బాలుడు అయిదు వేదముల జదువు కాలము రాగలదు. ప్రతిరూమునను నక్కలు కూయుచుండగా, రాత్రింబవళ్ళు గుంపులై గ్రద్దలు కూయుచుండును. ఆకసమున ధర్మదేవత ఆర్భటించును. అంతలో విషగాలికొట్టగా పార్వతికంట నిప్పులురాలును. బసవేశ్వరుడు కన్నీరు గార్చును. మహాదేవుడు జడలెగురునట్లు నాట్యము చేయును పర్వత శిఖరాగ్రమందలి యుక్కుకంబము మ్రోది ప్రతిమ మాటాడగలదు. ఏలూరులో గుగ్గిళ్ళరాయుడు గజముచే జంపబడును. తిరుపతి కొండపై తురకలు చిందులు త్రొక్కుదురు.

నాయనా! మక్కామసీదులో పంది జన్మించును.

తే-గీ. అదియు దురకల యిండ్లలో♦నడ్డు లేక
దూరి, కలభాంబు పుట్టించి♦వారుదాని

పట్టజూచిన జిక్కక♦బరుగులిడుచు
విజయవాడకు జను దెంచి♦వేడ్కలలర
కృష్ణవేణమ్మ యొడ్డున♦గుర్తులేక
మాయమయి పోవునంతట♦మహినిజనులు
రాలిపోదురు నల్లులు♦రాలునట్లు
చెప్పచుంటిని ముందునే♦తప్పదిదియు.

ఈ విధముగా కలియుగము నలుమూలల ననేక వింతలు బుట్టుటచే జననాశనము తప్పదు. అదియుగాక చెప్పెద వినుడు.

అంతట వీరశైవులకును వీరవైష్ణవులకును మతకలహములు గలుగును. ఆ కలహముల దీర్చుకొనుటకు శ్రీశైల మందుగాడు ఋషులకడకు పోవుదురు, ఆఋషులు చేసెడి పరీక్షలో విష్ణుభక్తులు పరాజయమొందుదురు. ఋషులు చెప్పినట్లు విష్ణుభక్తులు పాతాళగంగను తీసికొని రాజాలనందుడ శివభక్తులు తాము తెచ్చెదమని తీసికొనివత్తురు. అందుకు వీరవైష్ణవులు సిగ్గుచే దలలవంచుకొనగా పాదాళగంగనుండి ఓంకారశబ్దము జనించును. అపుడు సప్తసముద్రములు, నదీనదములు, మానవశరీరముల ప్రవహించు రక్తముస్థంభించిపోవును. అపుడు నాభక్తులు తప్ప తక్కినవారు నశింతురు. అవియేకాదు ఇంకను వినుడు.

సీ. తోకలులేనట్టి♦మేకలాకులుదిన్ను
ఇచ్చిన సొమ్మునుయియ్యరెవరు
పందికి జన్మించు♦పదపడికోడియు
కోడిమనుజులవలె♦గూయగలదు

కంభము చెఱువున♦గనబడు బంగారు
బెల్లము చేదగు♦కల్లగాదు
జదివిన బ్రహ్మ్మణులు♦చవటలై పోదురు
మాలలు రాజులై♦తూలగలరు

తే-గీ. అయిదు కాళ్ళను గల్గిన♦యావుదూడ
రెండు యోనులతో బుట్టు♦రెంటియందు
ఆడమగ భేదములతోడ♦నలరుననియు
ఇట్టి చత్రములెన్ని యో♦పుట్టుముందు.

అంతయే కాదు మూడుకాళ్ళయావు మగవానిని ఈ నును వాడు మనుష్యులతో మాటాడి రాగములు తీయును. ఆకసమున పచ్చని రంగుతో మనుజుని యాకారము కనం బడును. అప్పటికి బళ్ళారిలోని భాగ్యమంతయు తొలగి పోవును. బొబ్బిలి జనులు తబ్బిబ్బులగుదురు. రాచస్త్రీలకు సంకటికూడ కఱవగును. అంతట సిద్ధేశ్వరమున ఒక మహా ఋషి పుట్టును. అపుడు పిడుగులురాలును, రక్తవర్ణముగల నాలుగు చుక్కలు పుట్టును. అందొక చుక్కకు మూడు తోకలుండును. అంతట,

ఆ-కె. కుక్కకడుపునందు♦కోడిజన్మించును
కనకదుర్గ మిగుల♦ఘనతగాంచు
కలుగు విప్రునింటి♦కరక చెట్టొక్కటి
చింతకాయలుండు♦చెట్టునిండ
తాటిచెట్టుపుట్టు♦తగమూడు కొమ్మల
నిమ్మకాయలుండు♦కొమ్మలందు.

ఆ-వె. సీమనుండివచ్చు♦శ్రీలక్ష్మ్మయంతట
సకలవైభవములు♦జరుగుచుండు

రామదాసువచ్చి♦రాజ్యమునేలును
ఇట్లుకొంత కాల♦మరుగు వినుడు.
తే-గీ. గాండ్లదానియింట♦గామదేనువుబుట్టు
కంచిప్రక్కనుండు♦గ్రామమందు
కాటియందు జనులు♦పుట్టుదురంతట
పాపినరులుజాల♦బాధపడగ.

అంత సువర్ణముఖినదియందు కొండలు మహోత్స్నలుద్భవింతురు. అపుడు నాయుడుపేటలోని ధనవంతులు నశింతురు. కోతులు రాగము తీసి పాటలుబాడును తిరుపతి పశ్చిమమునయుండిన బిలములో పదునెనమండ్రువైష్ణవులు ఇరువది నాలుగు గుఱ్ఱములు జన్మించి జనులను సంహరింతురు. స్త్రీలను పురుషులు విక్రయింతురు స్త్రీలు పురుషులకు యెదురు తిరిగి యిష్టమువచ్చినట్లు తిరుగుదురు అధర్మ గర్భములగాంచివారు స్త్రీ శిశుహత్యలజేయుదురు. కురుక్షేత్రము బుక్కాపురము, రాయచూరు, యాదగినది, నగరము పున్నాళ్ళి, ఓరుగల్లు, కల్పరిగి, ఆదవాని, ఆరవరాజ్యము, వెలుగోడు నాశనమైపోవును. పశ్చిమదిక్కు ధూమకేతువు జన్మించును, దానితోక యిరువది బారల వెడల్పుండును ముప్పదిమూడుదినములలో నదిసర్వజనులకు గోచరంబగును అపుడు పుణ్యాత్మలకు సూర్యబింబమునందొక పురుషరూపము కనబడును ఆకసము నెఱ్ఱనగును. ఆవు లాకసమును జూచియఱచుచుండు నింగినుండి భయంకరధ్వని వినిపించును.

నాయనలారా! నాకాలజ్ఞానమును పూర్తిగవివరించుటకు వీలుపడదు. దానిని వినుటకే కొన్నిదినములు పట్టును, ఇప్పటి కిది చాలును, మున్ముందుఅన్నాజయ్య నాకాలజ్ఞాన

మును లోకులకు వెల్లడి చేయవలసి వచ్చును. ఇక మీకు గొన్ని ముఖ్యాంశములను మాత్రము వివరింతు వినుడు.

నేను కలియుగము అయిదువేలయెనిమిదివందలసంవత్సరములు గడచిన తర్వాత 'శబల' యను గ్రామమునం దొక బ్రాహ్మణ వంశమునం దవతరించెను. అపుడు నన్ను "వీరభోగవసంతరాయడు" అనిపిలుతురు. అపుడు దుర్మార్గులను, పాపులను దండించి ధర్మపరాయణుల నొనరింతును. అపుడు కృతయుగధర్మము నడువగా నేనాయవతారంబును విరమించి నావైకుంఠమును జేరుదును.

ఇది జరుగుటకు యింకనుచాల సంవత్సరములగును. ఆయవతారము జరుగుటకు ముందు జరుగగల నిదర్శనముల మరికొన్నిటి వివరింతును. నాభక్తురాలగు గరిమరెడ్డి అచ్చమ్మ వంశమే నిలువకుండబోవును. ఆమె గోగణమంతయు మరణించును, *గోపాలకుడనై నేను వ్రాసిన కాలజ్ఞానమును అచ్చమ్మ యింటియందొక పాతరయందుంచితిని. కలియుగ

---

*సూచన—వీరంభొట్లయ్య కాలజ్ఞానమును దాచిన అచ్చమ్మగారి ఇంటిపాతరపై స్వామిచెప్పినట్లు చింతమాను పుట్టినది. ఆ చెట్టు సుమారు నూరు అడుగుల యెత్తున్నది దానికి రెండుకొమ్మలు మాత్రమున్నవి. ఇప్పటికి ఏడువందల సంవత్సరముల క్రిందట పుట్టినచెట్టుయిప్పటికినిఅంత పొడుగే యున్నది. ఆచెట్టు చింతకాయలు గాయును గాని యవితినుటకు బనికిరాక లోపలిభాగమంతయు గాటుకవంటి నల్లని పదార్థముతోనిండియుండును. అదియుగాక ఇపుడు యేదైన భయమునుగొలుపు ఉత్పాతమువచ్చుటకు ముందు ఆచెట్టు

మున వీరభోగవసంతరాయడు అవతరించుటకుముందు ఆపాత రప్పై నొక చింతచెట్టు మొలచును. ఆచింతచెట్టు వీరభోగ వసంతరాయలు పుట్టకముందు చేమంతిపువ్వులనుబూసి వికసించును. అదియుగాక అత డవతరించుటకుముందు 'జుర్రేరు' పొంగి బనగానపల్లె చాలభాగము నాశనమగును. నవాబు రాజ్యమును గోలుపోవును. ఇంకను నెన్నియో నిదర్శనము లున్నవి. ముఖ్యమైన దానిని వివరింతును.

సీ. ఉత్తరభూమిని♦యుద్భవమందును
వాణిజ్య మొనరించు♦వంశమందు
ఉత్తమగాంధియు♦యుత్తమోత్తముడగు
చుట్టుపుడమి నెల్ల♦సూత్రమునను
ఏకును చూపించి♦బాకని బెదరించి
మ్లేచ్ఛపాలనమును♦తుచ్ఛమనుచు
జాటి, యహింసను♦చాలగ బోధించి
వర్ణసంకరమును♦వడినొనర్చి

తే-గీ. జాతిమతభేదములనెల్ల♦భూతిజేసి
ప్రజలకెంతయు మేల్జేసి♦ప్రబలిచనును

పువ్వులన్నియు నొకేరాత్రి రాలిపోవుచుండును. ఆరెండు కొమ్మల మధ్యనుండి రక్తము వెడలి కుంకుమవలె గట్టిపడి యుండును, అచ్చటికేగిన ఈ నిదర్శనములను జూడవచ్చును శతవృద్ధుల నడగినచో దాము చూచునప్పటినుండి ఇట్లు జరుగుచున్నదనియు దమ పూర్వులు తమకట్లే చెప్పుచుండిరనియు చెప్పుదురు. ఈనిదర్శనములన్నియు నేటికిని మనము చూడవచ్చును.

కల్లనాయకు లందరు♦కొల్లగొట్టి
ప్రజలునేలుదుమని బాధ♦పరుపగలరు.

ఆవల అన్నాజయ్యను చూచి నాయనా! నేను బస గాసపల్లెను వదలి వేరొక చోటికి వెళ్లు సమయము సమీపించినది. ఎందులకనగా శంకరావతారుండగు ఆనందభైరవయోగి తన యవతారమును జాలించెను. అతడు నాకు బ్రియశిష్యుండై జన్మించునటుల ముందే యేర్పాటు జేసి యుంటిని. ఆరీతి అతడు వేరొక చోట జన్మించును. అతనిని మతద్వేషులయిం ట జనింపజేసి మతవిరోధియగు నాతనిచే హిందూమతమును బట్టించి పాపులకు ధర్మము నుపదేశించు నట్లు చేయుదును.

నీవు అచ్చమ్మ ఈలోమతమునందు భక్తులకు ధర్మములనుపదేశించుచుండుడు. ఈమతమునకు నీవు అధికారివి కాలజ్ఞానమును గ్రంథమును నీస్వాధీనమొనరించితిని. దానిని ప్రజలలో బ్రచారము గావించుట నీపని. ఇక మీరందఱు విశ్రమింపబొండు అని చెప్పగా వవాబు తన మందిరమున కేగుచు స్వామీ! నేను మీశిష్యుడను, కనుక యీమతమునందు సదా పూజలు జరుగగలందులకై కొన్ని భూములనిత్తునని వెళ్ళెను. అచ్చమ్మ, భక్తులను స్వామి విశ్రమింపబోవు నదమువో దమయి భఆలె చునుంనరుంక్కుల్లక్లు గాండ్కేగిరి.

ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారిజీవితచరిత్ర

అయిదవప్రకరణము

—:o:—

ఓ భక్తవరులారా! మీరు గతప్రకరణమున శ్రీవీరం భొట్లయ్య బనగానపల్లెలో మఠమునకుండ అన్నాజయ్య అచ్చటజేరి స్వామిని సేవించుచు యాతనివలన భక్తిధర్మ మార్గముల దెలిసికొనుచుండెను. అంత బనగానపల్లె నవాబు స్వామిని తన నగరమునకు బిలిపించుకొని యాయన మహాత్మ్యము నెరింగి శిష్యుడుగామారి స్వామికడ కొక దినమేగి కాలజ్ఞాన ప్రభావము నెరింగింపుమనెను. అందుకు స్వామి ఒకనాటిరాత్రి అన్నాజయ్య, అచ్చమ్మ, బ్రహ్మానందరెడ్డి, నవాబుల యొద్ద గూర్చుండబెట్టుకొని భక్తులెల్ల వినుచుం డగా కాలజ్ఞానమునందొక భాగమును వినిపించి తానచ్చటి నుండి మరియొక స్థలమున కేగవలసిన సమయము వచ్చిన దనియు, ఇకమీద లోమఠమున కధికారత్వము వహించి కాలజ్ఞానమును భక్తులకు దెలుపుచుండ గోరెను. ఆవల చరిత్రను వినిపించెద వినుడు.

వీరంభొట్లయ్య బనగానపల్లె వదలుట

ఒకానొకదినము రాత్రి వీరంభొట్లయ్య తాను గృహస్థాశ్రమమును స్వీకరింప దలచి శ్రీలక్ష్మిని కలియుగమున మానవుల గృహమునందు అనగా విశ్వబ్రాహ్మణులయింట జన్మించునట్లు పంకల్పింపగ నామె భూమిపై యవతరించెను అంత నతడు ఆమెను వివాహమాడగోరి తగిన నెలవును నిర్ణయించుకొనుటకు రాత్రి యెవ్వరికి దెలియకుండ లేచి ప్రయాణము సాగించుచుండెను.

అతడు బయలుదేరి కొత్తపేట కేగి అక్కడినుండి కోవెల కుంట్ల కేగి యందుండు రంగనాథస్వామిని సేవించి మెల్లగా కుముద్వతీనది ప్రక్కగ్రామముల దిలకించుచు బోవుచుండెను అట్లు బోవువాడు కుందులో స్నానమొనరించి దేవతార్చన చేయుటకు సమీపమున దొకగుడియేని లేకుండుటచే నదీ మధ్యంబున కేగి మునిగి చేతికివచ్చిన శిలను బట్టి లేచెను. అది యొక నల్లనిరాయియై యుండెను.

అరచేత విగ్రహమును చేయుట

ఆరాతిని యెడమచేతియం దిడుకొని దాని వంక జూచుచు సమంత్రకంబుగా ప్రాణప్రతిష్ట జేసి పూజించి జప మొనరించి తదుపరి దానిని ప్రవాహమున వదలెను. అంతలో నారాయి చిన్న విగ్రహముగమారి నీళ్ళమీద తేలి యాడుచు బోవుచుండెను.

అంతట వీరంభొట్లయ్య నదీగర్భమునుండి వెలుపలికి వచ్చి రాత్రికి సమీపమునందుండు గ్రామమును జేరు కొనెను ఆయూర దానెవరి గృహమునకు పోక ఒక దేవాలయమున విశ్రమించెను.

ఆనాటిరాత్రి ప్రొద్దు పోయిన తర్వాత ఆకసమంతయు నల్లని మేఘములచే గప్పబడెను. గంభీర ఘోషణములు మానవుల గుండియ లదురునట్లుండెను. అంతలో చిన్నచిన్న చినుకులు ప్రారంభము కాగా నపుడపుడు మెరుపులు తళుక్కు-మని కనుల మూయించుచుండెను. ఆ చీకటిలో నేదియు గానబడుట లేదు. ప్రపంచమంతయు కాటుక కొండలతోనిండెనా యన్నట్లుండెను. వర్షము మెల్లమెల్లగా వృద్ధియై ముందు బిందుబిందువులుగను, పిదప దారపు పోగు లవలెను అటుపిమ్మట నింగినుండి వరుణదేవుడు వదలిన ప్రళాళ్ళను బోలి మింటినుండి మంటికేకధారగా కురియు చుండెను ఆరీతి రాత్రి యంతయు కుండతో బోసినట్లు వర్షము కురియుటచే వాగులు వంకలు నదులు గుంటలు జలపూర్ణములై ప్రవహించుచుండ తెలవారునప్పటికి వర్షము నిలిచెను. ఆకసము నిర్మలమై కనంబడెను.

అరచేతి విగ్రహము అల్లాడుపల్లె చేరుట

కుముద్వతీ నదీప్రవాహమున మునుగుచు దేలుచు బోరుచుండిన విగ్రహము ఆరాత్రి వర్షముచేగలిగిన వెల్లువ వలన గొట్టుకొనిపోయి యొక గ్రామముకడ నదిగట్టునానుకొనియుండు మడుగులో నిలిచెను.

మగునాడు పసుల బాలురు నిండిన మడుగునుజూచి సంతోషపడి పశువులను గదిగట్టున పచ్చిక బయలున వదలి యూహాదమునదూకి ఈదుచుండిరి. అటుల వారీదుచుండగా ఎచ్చటనుండి వచ్చెనోగాని యొకనూతన బాలుడు వారలలో నొకడై నీట వారలగూడి యాడుచుండెను. ఆ బాలురతని బలుకరింపకనే జలక్రీడలలో నిమగ్నులై యుండిరి. ఆరీతి బాలురు సాయంకాలము వరకు ఆటలాడి పశువులదోలుకొని పోవుచు క్రొత్తబాలుని జూడగా వ్వాడు కనంబడకుండెను.

మరునాడు మరల యథాప్రకారము పశుబాలురువచ్చి మడుగున జలక్రీడల నాడుచుండ క్రొత్తబాలుడెటులో వారితో గలిసికొని యుండెను. బాలురు నీటిలో దొంగల యాటనాడు చుండగా క్రొత్తకుర్రవాడు వారల గలసి యాడుచు నందఱు నోడించుచుండెను. ఈలాగు మూడు దినము లాడిరి. ఒకనాడు కూడ క్రొత్తబాలుడు దొంగకా నందున పశుబాలు లందఱు మాటాడుకొని రేపు వానిని నెట్టులై న యోడింపవలెననుకొనిరి.

మరల మరునాడు ఆలకాపర బాలురువచ్చిమడుగులో దుమికిరి. ఎప్పటివలెనే క్రొత్తబాలుడు నీటనుండెను. బాలు రకు వాడెపుడు యెచ్చటనుండి వచ్చునో తెలియనందున యాశ్చర్యపడుచుండిరి. ఆదినము బాలురందరు మాటాడు కొని క్రొత్తవానిని దొంగనొనరింపజూచిరి కాని వాడు చిక్కకుండెను. ఇక ప్రయోజనము లేదని బాలు రింటికేగు చుండ కొత్తవాడు నీటదూకెను, ఆదిచూచి వారచ్చటనె నిలిచి చూచిరి. ఎంతసేపు చూచినను ఆ బాలుడు బయటికి రాకుండెను. వారు ఆశ్చర్యపడుచు గృహములకేగిరి.

పసులబాలురు ఆ సంగతి గ్రామాధికారికి చెప్పుట

సాయంకాలము చీకటిపడకముందె బాలురు గృహములకు జేరిరి. వారు మడుగులోదూకి బయటికిరాని యర్భకుని గుఱించిన వింతవార్తను తలిదండ్రుల కెఱింగించిరి. ఆ వార్త నిమిసములో గ్రామమంతటను బ్రాకినది. అపుడు గ్రామ పెద్దలు గ్రామాధికడకేగి యోచించిరి. అందు కతడు నమ్మక ఆపసులబాలుర బిలిపించి యడిగెను. ఆపిల్లవాండ్రు మూడుదినములనుండి జరిగిన విషయములను జెప్పి ఆబాలుడు వికృతముగ మడుగులో దాగియున్నాడని గట్టిగ పల్కిరి.

గ్రామాధికారి బాలురుచెప్పినదానిని విని సరి రేపు మేము పరీక్ష జేయుదుము పొమ్మనెను. గ్రామాధికారియు మరికొందఱును మరునాడు అందరికంటె ముందేగి మడుగు గట్టుపై గూర్చుండి చుట్టుప్రక్కల జూచుచుండిరి. అట నెవరును లేకుండిరి. అంతలో పసులబాలురు యెప్పటివలె వచ్చి మడుగులో దుమికిరి. ఎప్పటివలెనే క్రొత్తపిల్లవాడును ఆ బాలురతో గలిసి నీట యాడుచుండిన బాలుని జూచి గ్రామాధికారి మున్నగువారు వింత పడుచుండిరి.

అయినను వారాబాలుని ప్రశ్నింపక వానిక్రీడావిశేషములు గనుచుండిరి ఒకసారిగాని యాబాలుడు దొంగకాలేదు తక్కిన పిల్లవాండ్రు పలువిధముల వానింజోరు నొనరింపదలచిరి. కాని ఫలము లేకపోయెను. ఆవలసాయంకాలమగునని బాలురు బయలుదేరుచుండ క్రొత్తపిల్లవాడు గ్రామస్తులు

చూచుచుండగనే నీటిలో దూకి కనబడకపోయెను. పాపము వారు రాత్రి చీకటిపడువరకు జూచి విసిగి యింటికిపోయిరి. గ్రామమును చేరి గ్రామపెద్ద లందఱును యెంతో యోజించిరి. కాని యేదియు దోచినదికాదు. ఆవల వారు రేపు మరల పరీక్షించిన యన్నియు బయటపడునని మాటాడుకొని పోయిరి.

బాలుడు గ్రామాధికారికి స్వప్నములో గనబడుట

గ్రామాధికారి రాత్రి యిలుజేరి పరుండి యోజించి యోజించి ఒక నిర్ణయమునకు రాజాలక నిదురించెను. గాఢనిద్రలో నుండగా మడుగులోని బాలుడు అతనికి స్వప్నమున గనబడి "ఓతండ్రీ! నేను సామాన్య బాలుడను కాను. భగవంతుని వలన నిర్మింపబడిన శిలావిగ్రరూపము బాలునివలె గనబడుచు పసులబాలురతో నాడుకొను చున్నాను. నేను కోరిన రూపమున దాల్చగలను. నాపేరు వీరభద్రుడు. నన్ను మీ కెఱిగించి మీగ్రామ ప్రజలనే గాక పాపుల రక్షించుటకే వచ్చితిని రేపు మీ రామడు గులో వెదకిన నావిగ్రహము కనబడును. దానిని గొని పోయి ఒక యాలయమును నిర్మించి దాన నన్ను ప్రతిష్టింపుడు; మీకు శుభమగును అని మాయమై పోయెను.

అల్లాడుపల్లెలో దేవాలయ నిర్మాణము

అంత దెల్లవారగనే గ్రామాధికారి గ్రామపెద్దలను బిలిపించి స్వప్న వార్తలదెలిపి వారియభిప్రాయమును దెలుపు డనెను. అందఱును మంచిది. ఈదినము అందరము ఆగ్రహ దమునకువెళ్ళి వెదుకుదము. ఆవిగ్రహము లభించినచో జెప్ప బనిలేదు. మనము మన గ్రామము తరించినవారమగుదుము అని యందరును స్నానమొనరించి పరిశుభ్రవస్త్రములధరించి పశుల బాలుర వెంటనిడుకొని పోయిరి. అపుడు బాలురు మడుగులోదూకి యెప్పటివలనే జలక్రీడల బ్రారంభించిరి. ఆదినము క్రొత్తబాలుడు రాలేదు. కారణమేమో తెలియుట లేదు. అందరును యోచించిరి. అపుడు గ్రామాధికారి తాను మడుగులోదూకి మునిగినంతటనె యతనిచేతికొక శిలావిగ్ర హాము దొరికెను. అతడు బయటికివచ్చిచూడగా ఒక దివ్య సుందర విగ్రహమై యుండెను. అందరును సంతోషముతో బొంగి గంతులవేయ దొడగిరి.

అపుడు గ్రామాధికారి ఒక బాలుని పిలిచి పరుగిడి పోయి మంగళవాయిద్యములను తప్పెట్టవాండ్రను, చాకల వాండ్రను పగటిదివిటీలతో రమ్మంటినని చెప్పుమనెను. ఆ బాలుడు సంతోషముతో వాయువేగమున బరుగిడి వారి కావార్త నందించెను. అపుడుమంగళవాయిద్యములు తప్పె టలు కొమ్ములు మ్రోగించుచు గ్రామప్రజలు గుంపులై పగటి కాగడాలతో వచ్చి మడుగును చేరిరి.

అంతట ఒక పీఠమును గూడ దెప్పించి ఆపీఠముపై విగ్రహము నిడి మంగళవాయిద్యములతో సమీపమున నుండు ఒక చిన్నవసమునందు గుడిని కట్టించిన యోగ్య ముగ నుండునని అచ్చటికి వెళ్ళిరి. అచ్చట ఆపీఠము నొక తరుచ్ఛాయన బెట్టించి ఒక బ్రాహ్మణునితో నిత్యపూజల నొనరించుచుండుట కేర్పాటు చేసిరి.

ఆమఱునాడే గ్రామపెద్దలందఱును ధనమును ప్రోగు చేసి పనివాడ్రను రప్పించి యాలయ నిర్మాణమునకు శుభ ముహూర్తమునుజూచి పునాదులవేయించిరి. పనివాండ్రును మిక్కిలి కుతూహలముతోను శ్రద్ధతోను పనిజేయుచు దివ్యమగు నాలయమును గట్టిరి.

అంతట గ్రామపెద్దలు దైవజ్ఞులను పండితబ్రాహ్మణు లను రప్పించి ఆ శిలావిగ్రహమును యాలయమున నిలిపి ప్రాణప్రతిష్ట నొనరింపుమనిరి. అందుకు వారు సరియని ఒక సుముహూర్తమును నిశ్చయించి యావిగ్రహమునకు బ్రాణ ప్రతిష్ట మొనరించి "వీరభద్రస్వామి" అని పిలుచుచుండిరి.

సూచన:—ఈ దేవాలయము ప్రొద్దుటూరునుండి మైదుకూరునకు బోవు రాజబాట ప్రక్కన యున్నది. ప్రతి సంవత్సరము గొప్పతిరుణాల జరుపుచుందురు. భక్తులువచ్చి ముడుపులను, మొక్కుబడులను చెల్లింతురు. కొందఱు సంతానప్రాప్తికై ప్రార్థించి తమ ప్రార్థన నెరవేర్చి నందులకు శిశువులకు "వీరభద్రుడు" అని నామకరణ మొనరించు చుందురు.

వీరబ్రహ్మము వీరభద్రుని జూడవచ్చుట

అల్లాడుపల్లె సమీపమున యాలయనిర్మాణము ముగి సెను. ఆవార్తలు చుట్టుప్రక్కల గ్రామములకు వ్యాపించెను అందందు గ్రామములలో సంచరించెడి వీరంబొట్లయ్య కాకధ విన్నవించిరి. అపు డతడు తాను కుముద్వతీ ప్రవాహమున వదలిన శిలావిగ్రహమని తెలిసికొనెను. అచ్చటికివెళ్ళి ప్రజ లకు విగ్రహారాధనమును గుఱించి ప్రచారము చేయ సంక ల్పించెను. అచ్చటనుండి బయలుదేరి మరునాడు అల్లాడుపల్లె గ్రామమును జేరెను. గ్రామాధికారివలన జరిగిన విషయము లన్నిటిని గ్రహించెను. అచ్చటనుండి బయలుదేరి కుందునది లో స్నానముచేసి యాలయమును జేరి వీరభద్రుని ధ్యానించి సంతోషమున యందున్న సత్రమున విశ్రమించెను.

అతడు ప్రతిదినము కుముద్వతీనదియందు గ్రుంకి అను ష్ఠానముల దీర్చి అందొక మూల గూర్చుండి తపోనియతిని బాటించి జపమొనరించుట నిత్యకార్యక్రమముగా యేర్పర చుకొనియుండెను. ఇట్లుండ ఒకనాటిరాత్రి వీరభద్రుడు స్వప్న మున గనబడి యిట్లనెను. "ఓ సర్వేశ్వరా! నీవు లోకోప కారివై జన్మించిన నారాయణస్వరూపుడవు. నీకు నేను కావ లయునని కుందునదిలో దొరకితిని. నాకు ప్రాణప్రతిష్ట అర చేతియం దిడుకొని చేసితివి. ఆవల ప్రవాహనము వదలితివి.

నిర్వాణప్రతిష్ట మహిమ యీరీతి పరిణమించినది. నేను వీర భద్రుడను నామంబున బిలువబడుచుంటిని. నీవు వీరబ్రహ్మవు మన ఇరువురకు భేదమాత్రమంతయు లేదు. నాకు 'పోతులూరు' అను మరియొక నామము వాడుకలోనుండును. కొంతకాలము నకు నేను నీవు గృహస్థధర్మమునం దుండగా నీయింట నీయర్ధాంగికి గుమారుడనై జన్మింతును. అపుడు నీవు నాకు 'పోతులూరయ్య' అని నామకరణ మొనరింపుము'' అని చెప్పి తిరోహితుండై పోయెను.

వీరబ్రహ్మము దువ్వూరు జేరుట

వీరబ్రహ్మము అల్లాడుపల్లె వీరభద్రుని సన్నిధిని గొన్నిదినములు తపోనియతినుండి అచ్చటినుండి మైదుకూరు ద్వారా దువ్వూరు గ్రామమునుచేరి యొక విడిది గుదిరించు కొని యుండెను. దువ్వూరికడ లోహపు రాళ్ళుండుట గ్రహించి యారాల గరిగించి ఇనుమునుజేసి ఆ యినుముచే ప్రజలకు గావలసిన పరికరముల జేసి యిచ్చుచుండెను. ఆతని శక్తికి ప్రజలు ఆశ్చర్యపడి మిక్కిలి గౌరవించుచుం డిరి. అచ్చట నుండినంత కాలము ప్రజలకు దనపేరు 'వీరా చారి' యని చెప్పినందున యా పేరచ్చట సార్థకమయ్యెను.

వీరబ్రహ్మము కందిమల్లయపల్లె చేరుట

దువ్వూరు గ్రామము తనకు దగినదిగా లేదని తెలిసి కొనెను. అచ్చటినుండి వనిపెంట, బద్వేలు, పోరుమామిళ్ళ, కలసపాడు గ్రామముల జూచి కడపట కందిమల్లయపల్లెకు బోయెను. ఏకారణముననో యాగ్రామము అతనికి నచ్చినది అతడు ముందొక చావడిలో జేరి వ్రక్షంగము సని జేయుచు గ్రైతుల మన్ననబడసి జీవించుచుండెను. అతడు తనపేరు వీరబ్రహ్మమని చెప్పినందున యాపేరనే బిలుచుచుండిరి. అతడు చూచుటకు జడలు గడ్డము పెంచుకొనియుండుటచే గొందరు వెఱ్ఱివానిగ నెంచిరి. కొందఱు వెఱ్ఱి వీరబ్రహ్మమనియు బిలుచుచుండిరి. వీరబ్రహ్మము కొన్నిదినములకు ప్రజాదరణకు భాత్రుడై ఒక గృహమును నిర్మించుకొని యుండెను.

ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారిజీవితచరిత్ర

ఆఱవప్రకరణము

ఓ భక్తశిరోమణులారా! మీరు ముందటి ప్రకరణమున వీరంభొట్లయ్య బనగానెపల్లెను వదలి వచ్చుటయు అతడు గ్రామసంచార మొనరించుచు కుందునది ప్రవాహమునం దొక శిలకు ప్రాణప్రతిష్టచేసి వదలుటయు, ఆశిల విగ్రహరూపమున అల్లాడుపల్లె మడుగును జేరుటయు, ఆ గ్రామవాస్తవ్యులు ఆవిగ్రహమునకు ఆలయమును నిర్మించిన విషయముల జదివి తెలిసికొంటిరి. ఆవల వీరబ్రహ్మము అల్లాడుపల్లెకు వెళ్ళి వీరభద్రుని సేవించి దువ్వూరునందు కొన్నిదినములుండి అచ్చటినుండి కందిమల్లయపల్లె జేసి వడ్డంగివై గ్రామరైతులకు గావలసిన గొరమువ్లను జేరియిచ్చుచుండెను. ఆరైతులు అతనికొక యింటినిగట్టి ఇచ్చిరి. ఆయింట నతడు గృహస్థధర్మమును గడుపుచుండెను. ఆవలజరిగిన చరిత్రను దెలిసికొనుడు.

శ్రీలక్ష్మీదేవి కలియుగమున జన్మించుట

శ్రీ లక్ష్మీనాథుడు వీరబ్రహ్మ రూపమున కలియుగమునం దవతరించినది మనకు దెలిసియే యున్నది. ఆవీరబ్రహ్మము కందిమల్లియపల్లెలో గృహస్థధర్మమున నుండి గోరెను. అప్పటివర కతడు బ్రహ్మచర్య దీక్షతోనుండ ఎపుడు గృహస్థ ఆశ్రమధర్మమున నుండడలచెనో అపుడు శ్రీ లక్ష్మిని భూమిపై జన్మింప సంకల్పించెను. శ్రీరమా దేవి భర్తకోరిక ననుసరించి మానవుల యింట జన్మించ సిద్ధపడెను.

ఆ కాలమున అనగ విజయనగర వినాశనానవితరము ఆరాజ్యము చిన్నచిన్నసీమలగ విభజింపబడెను. గోలుకొండ నవాబుభాగమునకు వచ్చిన విజయనగరరాజులరాజ్యములో పెనుగొండ, గుత్తి, గండికోట, సిద్ధవటము అనుభాగములు ముఖ్యమై యుండెను. గండికోటలో గోలుకొండ నవాబు సేనానియగు మీరు జుమ్లా కొంతకాలము రాజ్యమేలెను. అతడు మహాదుర్మార్గుడు. గండికోటలోని మాధవస్వామి గుడిలో నూరుగోవ్రులను వధించెను. ఆవిగ్రహమును కరిగించి ఫిరంగులజేయించెను. బ్రాహ్మణులను, స్త్రీలను. హిందువులను బాధించుచుండెను. అతడు గండికోటసీమను చాల కాలము పాలింపలేక పోయెను. అతని క్రూరత్వములను దెలిసికొనిగోలుకొండ నవాబతని పదభ్రష్టు నొనరించెను. ఆగండికోట సీమయం దనేక గ్రామములుండెను. ఆగ్రామములలో పెద్దకొమెర్ల అనునది చరితాత్మకమైన గ్రామమై యున్నది.

శీలమ్మ పెద్దకొమెర్లలో జన్మించుట

పెద్దకొమెర్ల ఒక సామాన్యమగు గ్రామము. ఆగ్రామమున క్షత్రియులు లేకుండిరి కాని బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, వైశ్య, శూద్రజాతులవారుండిరి. అందు విశ్వబ్రాహ్మణులలో శివకోటయ్య యనునతడు తనకులవృత్తిచే జీవించుచుండెను. అతడు విద్యావంతుడును, సదాచారసంపన్నుండును, దేవ బ్రాహ్మణభక్తి గలవాడునునై యుండెను. అతడు బీదల బ్రేమతో నాదరించువాడు. సాధుపుంగవులు, యోగులు, సన్యాసులు, బైరాగులు మొదలగువారిని జూచిన సత్కరించి పంపుచుండెను అతని ధర్మపత్ని భక్తకనుసన్నలలో మెల గుచు ధర్మపత్ని యనుసామమునుసార్థక మొనరించుకొనెను ఆదంపతులకు సంతానము లేదను కొఱతతప్ప ఇతరకొఱత లేకుండెను.

సంతానము లేకపోయెనే యని దంపతులిద్దరును సంతాన ప్రాప్తికై దివ్యక్షేత్రముల దర్శించిరి. పుణ్యతీర్థముల సేవించిరి. పావననదీ నదంబుల గ్రుంకిరి. మహాత్ముల దర్శించిరి. ఏమియు ప్రయోజనము లేకపోయెను. వారు "అపుత్రస్య గతిర్నాస్తి" అని పెద్దలు వచించిరి. పుత్రులు లేనివారికి పుం అనునరకముతప్పదందురు. ఏమిచేయుదుము మనవంశమింతటితో నిలిచిపోవునేయని పరితపించుచుండిరి.

---

*సూచన—ఈ పెద్దకొమెర్ల గ్రామము ఇప్పుడు రాయల సీమలోని కడపమండలమున జమ్మలమడుగు తాలూకాలో జమ్మల మడుగుకు సుమారు అయిదుమైళ్ళ దూరములో నున్నది.

అంత నొకనాడు శివకోటయ్య శ్రీలక్ష్మీవల్లభునినామ జప మొనరించుచు శ్రీలక్ష్మీ మనోరమణా! అనాధరక్షకా! ఆపద్బాంధవా! ఏల నీకు నాపై గరుణరాకున్నది. నేనేపాప కార్య మొనరింపలేదే. అట్టినాయందు నీకేల గరుణ జనింప కున్నది. అన్నిభాగ్యముల నొసంగితివికాని సంతానభాగ్యము నిచ్చితివికాదు. సంతానము లేనివాడు చచ్చినవాని కంటే హీనుడు కదా. కామితార్థప్రదాయకా! నాకు సంతానము నొసంగి నావంశము నుద్ధరింపుమని ప్రార్థించుచు నిదుర బోయెను.

అత:పి భార్యసంతానము లేదని యతనికంటె బాధపడు చుండెను. యారాత్రి యామె శ్రీలక్ష్మిని కలశరూపమున యర్చించి ధూపదీప నై వేద్యముల నొసంగి తల్లీ! ఎన్నిదిన ములు నన్నిట్లు గొడ్డురాలుగ నుండనిత్తువు! నేనేపాప మొన రించితిని. నాకేల సంతానము నొసంగ కుంటివి. కోరిన కోర్కెలదీర్చు మహాతల్లీ! నాకొక పుత్రునొసంగరాదా. నీనామమునే సదా జపించినందుల కిదియా నీవు చూపెడి దారి. తల్లీ! ఒక పుత్రునొసంగి నన్ను ధన్యురాలి నొనరిం పుమని ప్రార్థించి నిద్రించెను.

ఆరీతి భార్యాభర్తలు దైవముల ప్రార్థించి నిద్రించిరి. అంత రాత్రి శ్రీలక్ష్మీ స్వప్నమునం దిరువురకు ఒకేసారి దర్శనమిచ్చి "మీరికసంతానము లేదని విచార పడవలదు. మీకు పుత్రసంతాన ప్రాప్తిలేదు. నేను మీయింట మీ కుమార్తనై జన్మింతును. నాకు గోవిందమాంబ" అను నామము నిడుడు. మీకు శుభమగుగాక అని యాశీర్వదించి యదృశ్యమై పోయెను.

గోవిందమ్మ జననము

అంతట శివకోటయ్య వేకువఝామున స్వప్నాంతరము నిదురమేల్కొని తన స్వప్నవృత్తాంతమును భార్యకు దెలిపెను. అపుడాతని భార్య ఆశ్చర్యమును వెళ్ళడించుచు "నాథా! మీస్వప్నమునిజమా? నన్ను పరిహసించుటలేదు కదా!" యనెను. శివకోటయ్య తరుణీ! నీతోపరిహాసములా సత్యమునే వచించితిని యనెను. అందుకామె అటులైన అట్టి కలయే నాకును కలిగినది. శ్రీలక్ష్మి తానే నాగర్భమున కూతురుగ జన్మింతునని చెప్పి యదృశ్యమయ్యె ననెను. అంతకు శివకోటయ్య చిరునవ్వు నవ్వుచు నాకును శ్రీలక్ష్మియేదర్శనమిచ్చినది. పుత్రసంతానప్రాప్తిలేదు.నీకుమార్తైనై జన్మింతును. నాకు 'గోవిందమ్మ' అను పేరు పెట్టుమని చెప్పిపోయెను. అయ్యో! ఇదేమివింత. నాకును అట్లే చెప్పినదని యామెపల్కి సంతోషమును పట్టజాలకుండెను.

అంత మరుసటి నెలలోనె శివకోటయ్య భార్యకు నెలతప్పినది. ఆమె లోపల సంతసింపుచు భర్తతో ననకుండెను. ఆవల రెండవనెల గడిచి మూడవనెల వచ్చెను. అపుడామె భర్తను పిలిచి నాథా! నాలో గర్భచిహ్నములు జూపట్టుచున్నవి. శ్రీలక్ష్మికటాక్షము కలిగినటులున్నది. అని పలుకగానే శివకోటయ్య తనలోసంతసించి మనకోర్కె నెరవేరునేమో చూతమనెను. అంతలో శివకోటయ్య భార్యకు క్రమముగ నవమాసములు నిండెను. ఒక శుభలగ్నమున యామె స్త్రీ శిశువును ప్రసవించెను.

అంతట దంపతులు శ్రీలక్ష్మి తమయింట జన్మించెనని సంతోషసాగరమున నోలలాడుచుండిరి. అంతపదునొకండవ దినమున ఆయూరి పురోహితుని, దైవజ్ఞులను, గ్రామపెద్ద లను పిలిపించి తనకుమారికి ''గోవిందమ్మ'' అను పేరు పెట్టిరి. శివకోటయ్య బ్రాహ్మణులను దైవజ్ఞులను దక్షిణ తాంబూలాదుల తోడను, తక్కుంగల వారిని తాంబూలము తోడను సత్కరించి పంపించెను.

గోవిందమ్మ బాల్యము

గోవిందమ్మ చంద్రవదనయై బంగారుబొమ్మవలె మెర యుచుండెను. ఆమెను చూచినవారు శివకోటయ్యనుచూచి ''అయ్యా! నీవు ధన్యుడవు. ఈబిడ్డ శ్రీలక్ష్మివలె జూపట్టు చున్న''దనుచుండిరి. అందుకుశివకోటయ్య అవును శ్రీమహా లక్ష్మిమాయింట జన్మించిన దనుచుండెను. అట్లు గోవిందమ్మ దినదిన ప్రవర్థమానయై శుక్లపక్ష శశికళలంబోలి పెరుగు చుండెను. ఆమె ముఖమున సదా చిరునవ్వు తాండవ మాడుచుండెను. ఆరీతి గోవిందమాంబ పంచవర్షములు నిండినదాయెను.

అంతట శివకోటయ్య తాను విద్వాంసుడగుటచే తను ఆయూర పాఠశాల లేనందునను గోవిందమ్మకు దానే యక్షరాభ్యాస మొనరించి యింటచదువు నేర్పుచుండెను. ఆమె కుశాగ్రబుద్ధి కలది గావున తండ్రి యొకటి చెప్పిన రెండుగా నేర్చుకొనుచుండెను.

ఆమె తలిదండ్రుల యాజ్ఞానువర్తినియై సదా వారి ప్రేమకు గురియై యుండెను. ఆమె తోడిబాలికలతో నాడుకొనబోయినచో వారియెడ మిక్కిలి ప్రేమతో నడుచుకొనుచుండెను. నవ్వులకైనను అసత్యమాడెడిదికాదు.

ఇంటికెవరైన బిచ్చగాండ్రువచ్చినచో లేదనుమాట రానీయక యున్నదాని నొసంగి పంపుచుండును. ఆయూరికి యేసన్యాసికాని, యోగిగాని వచ్చినచో వారిని బిలుచుకొని వచ్చి సత్కరించి పంపెడిది.

ఆమె సద్గుణములజూచి తలిదండ్రు లట్లుండ ఆయూరి పిన్న పెద్దలు, అమ్మలక్కలు అబ్బురపడుచుండిరి. ఆమె జన్మించిన దాదిగ శివకోటయ్యయింట జూచువారికి "నిత్య కళ్యాణము పచ్చతోరణము" అనునట్లుండెను. ఈవిధముగ ఆమె సర్వజనాకర్షణియై పెరుగుచు పండ్రెండు సంవత్సరములు నిండిన కన్యయై లక్ష్మీదేవివలె యింట దిరుగుచుండెను. ఆమెను జూచుటకు శివకోటయ్య బంధువులు సదావచ్చి పోవుచుండిరి.

శివకోటయ్య గోవిందమ్మకు పెండ్లిచేయ గోరుట

—:o:—

గోవిందమ్మకు పండ్రెండేండ్లు దాటగనే యామె తల్లి శివకోటయ్యతో నాథా! మనబిడ్డగోవిందమ్మకు పదమూడవయేడు పడినది. ఆమెకు వివాహప్రయత్నము చేయకుండుట సరికాదు. తగిన వరుని విచారింప ప్రయత్నింపుడు. మనమే వరుని నిశ్చయించినను శ్రీయును, కులమును, రూపును.

ప్రాయము, శుభలక్షణము, బంధుత్వము విద్యాశేయముల గలవానినే చూడవలసి యుండును. ఇక మీరు ఆలస్యము చేయవలదని పలుమారు చెప్పెను.

అందుకు శివకోట్య మంచిదని తన బంధుమిత్రులలో దగనవానిని విచారించుచుండెను. ఎందరో తలిదండ్రులు తమకుమారులను బిలిచికొనివచ్చి గోవిందమ్మకు జూపించుచుండిరి. గోవిందమ్మ యెవరిని జూచినను తనకు నచ్చలేదని చెప్పుచుండెను. ఎందరో విశ్వబ్రాహ్మణయువకులు రూపగుణ సంపదలతో నొప్పువారువచ్చి గోవిందమ్మ తమను వరింప నందున తిరిగిపోవుచుండిరి.

ఒకనాడు శివకోటయ్య తన భార్యతో మాటాడుచు గోవిందమ్మను పిలిచి "తల్లీ! మాకు యెంతకాలమోసంతానము లేకుండెను. ఎందరి దేవతలనో ప్రొక్కితిమి. అనేక క్షేత్రముల కేగితిమి. దివ్యతీర్థముల సేవించితిమి. పుణ్యనదీ సంబుల ప్రగుంకులిడి వచ్చితిమి. ఏమియుప్రయోజనము లేకపోయెను. అంత శ్రీ లక్ష్మీనారాయణుల ననేకవిధంబుల ప్రార్థింపగా శ్రీ లక్ష్మి స్వప్నమున దర్శనమిచ్చి తానే మాయింట పుత్రికయై జన్మింతునని చెప్పి మాయమ్మపోయెను. ఆమె వాక్కులు ఫలవంతయులాయెను, ఆమె మాయింట రమ్మ పేరుతో జన్మించినది. అమ్మా! నీవు శ్రీలక్ష్మిప్రొద్దలబ్ధయగు నీకుతరిగినరుని దెచ్చి పెండ్లి చేయుపలెనని యొంతరినో వెదకి తెచ్చితిమి కాని నీవు ఒక్కసారిగూడవరింపకురటివి ఇక మాచేత గాకున్నది. ఎన్ని దినములని నీవు బెండ్లిచేయకయుండగలము. "అమ్మా! నీవే నీకు దగినవరును యెన్ను

కొనుము. అతనికే నిన్ను యిచ్చి పెండ్లి చేసెదము'' అని చెప్పగా గోవిందమ్మ పలుకక వంటయింటిలో యేమో పని యున్నట్లు పోయెను.

గోవిందమ్మ తన భర్తను తానే నిర్ణయించుకొనుట

గోవిందమ్మ తలిదండ్రులు తన వివాహవిషయమై చిగురులుపడి చింతాక్రాంతులై యుండుటకు దానుగూడవిచార పడదొడగెను. అకటా! నావలన తలిదండ్రుల కెంతయో బాధగ నున్నది. నేనేమి చేయగలను. నాకు భగవంతుడే దిక్కు శ్రీ లక్ష్మీకాంతుని యానతిపై రమాదేవి తానే నా రూపమున జనించినట్లు నాతలిదండ్రులనిరి. అటులై న లక్ష్మీకి భర్త కావలసినవాడు నారాయణమూర్తికదా. ఇతరు లెట్లగుదురు. ఓ శేషతల్పా! ఆదిమధ్యాంతములు లేనివాడా ఆశ్రితజనరక్షకా! నేను నిన్ను ఆశ్రయించితిని. నిన్నే నా భర్తగా నెన్నుకొంటిని. అన్యుల నేగ్గలనై న జూడజాలను. నీవు వచ్చి నన్నువరించి పెండ్లియాడిన సరి లేకున్న నేనిట్టులే అవివాహితనై బ్రహ్మచారిణిగానుండ నిన్ను వేరొక జన్మమునై న భర్తగా చేపట్టుదునే కాని యీ జన్మమున యితరులను పెండ్లాడజాలను అని మైమరచి నిదురపోయెను.

ఆనాటిరాత్రి ఆ గోవిందమ్మకు శ్రీ లక్ష్మీవల్లభుడు స్వప్నమున దర్శనమిచ్చి ''గోవిందమ్మ! నీవు విచారింప పలదు నీకు దగినభర్తను నేనేకాని యితరు లెట్లగుదురు నేనే నీభర్తను కాగలను. అందుకు లక్ష్మీనీరూపమున మానవుల

యింట జన్మించినట్లు నేనుకూడ గలియుగమునందు మానవు డనై జన్మించియున్నాను. నేనే నిన్ను పెదకికొనుచు వచ్చి పెండ్లియాడెదను. ఇంతటితో నీ విచారమును మాని నీ జననీ జనకులకు నానిర్ణయమును తెలిపి చింతింపవలదని చెప్పుము'' అని పలికి తిరోహితుడయ్యెను.

అంతలో గోవిందమ్మకు మెలకువ వచ్చినది తన యెదుట ఎవ్వరును లేకుండిరి. ఆమె ఆశ్చర్యపడి నిక్కముగ ఆనారాయణమూర్తియే తన్ను వివాహమాడునని నమ్మెను శ్రీ గోవిందుని తప్ప యితరులను పెండ్లియాడుట ధర్మము కాదనుకొనెను. తెల్లవారిన తర్వాత తండ్రి తన వివాహవిష యము మాటాడినయెడల తాను గోవిందుని తప్ప నన్యుల వివాహమాడనని ఖండితముగ జెప్పెదను అటుపిమ్మట వారి యిష్టము ఈ నాసంకల్పము భగవంతుని సంకల్పము ఇందుకు తిరుగ లేదని నిశ్చయించెను.

గోవిందమ్మ తలిదండ్రులకు దనస్వప్న వృత్తాంతమును దెలుపుట

మరునాడు తెల్లవారగనె గోవిందమ్మ తన స్వప్న వృత్తాంతమును తలిదండ్రుల కెరింగింపదలచి మరల సిగ్గుచే మారకుండెను అంత శివకోటయ్య దూరపుచుట్టము తన కుమారునకు గోవిందమ్మ నిచ్చి పెండ్లి జేయుటకు పెండ్లి పెత్తనము వచ్చెను అపుడు పెండ్లికుమారుని జూచుటకు గోవిందమ్మను పిలుచుటకు దలిదండ్రు లిద్దరును బోయిరి.

తలిదండ్రులు పెండ్లికుమారుని విషయమును జెప్పబోగా గోవిందమ్మ "జననీజనకులారా! నావివాహమునకై మీకెందుల కింత యాతురత నాకు దగిన వరుని మీరు తేజాలరు నాయనా! నీవేకదా లక్ష్మీదేవి నీపుత్రికయై జన్మించినదని చెప్పితివి. అనగా శ్రీ లక్ష్మీ రూపమునను గొని మీకుమార్తెగా జన్మించినది. శ్రీ లక్ష్మీ శ్రీ విష్ణువును వివాహమాడ వలెనేగాని యితరుల నెట్లు పరణయమాడ గలదు. లక్ష్మీనగు నేను నారాయణునే పెండ్లియాడుదును గాని యితరుల గన్నెత్తియైన జూడనొల్లను ముందుగ వచ్చిన వారిని యేదో నెపమున బంపివేయుడనెను శివ కోటయ్య వెళ్ళి వారికి తామిపుడు గోవిందమ్మకు పెండ్లిజేయ దలపలేదనగా వారు తమయూరికి వెళ్ళిరి.

అంతట శివకోటయ్య గోవిందమ్మ కడకు వెళ్ళి "తల్లీ! శ్రీలక్ష్మీ మానవరూపమున మాయింట జన్మించినది సత్యము అలక్ష్మీయే నీవు యయిన నీవు మానవగర్భమున జన్మించితివి. మానవరాలవగు నీవు శ్రీమన్నారాయణుని యెట్లు పెండ్లాడ గలవు అది సంభవమగునా! నక్కయెక్కడ నాగలోక మెక్కడ అందనిపండు కట్టు జాచనేల. నాధ్యమగు కోరిక గోరదగును కాని అసాధ్యమగు కోరికలగోరరాదు కనుక బాగుగా యోచించి మనబంధువులలో నొకరిని తగినవానిగా జూచి తెత్తుము ఆయువకుని పరిణయమాడి మావిచారమును బోగొట్టుము. మీతల్లి నీవు అవివాహితవై యుండినందున గృసించి పోవుచున్నది" అనెను.

ఆమాటలకు గోవిందమ్మ సిగ్గుచుమాని ధైర్యము వహించి ఇటులనెను. నాయనా! నేను గోవిందుని వివాహ మాడగోరుట సాధ్యపడదా? ఎందులకు సాధ్యపడదు లక్ష్మిని గోవిందమ్మగా పుట్టించినవాడు తానుగూడ మానవుడయి లక్ష్మీకాంతుడు జన్మించి నన్ను వివాహమాడ రాగూడదా శ్రీలక్ష్మి గోవిందమ్మగా మానవలోకమున జన్మించుట ఎట్లు సాధ్యమైనదో అట్లే శ్రీ విష్ణుమూర్తి మానవాకారమున జన్మించివచ్చి నన్ను పరిణయమాడగలడు. వేయేల శ్రీరమా కాంతుడు నాకు స్వప్నమున దర్శనమిచ్చి తానేవచ్చి నన్ను వివాహమాడెదనని యానతిచ్చియున్నాడు. ఇది సత్యము ఇంతటినుండి మీరు నావివాహమును గూర్చిన బాధ్యత మీరు వహింపనక్కరలేదు అని ఖండితముగ మాటాడెను.

శివకోటయ్యకు విష్ణువు కలలోగనంబడుట

శివకోటయ్య గోవిందమ్మ మాటలకు బదులు చెప్ప లేకపోయెను. ఆమె పలుకులలో యదార్థముండునని యతనికి దోచెను. ఇక గోవిందమ్మను పెండ్లివిషయమై యేమియు ప్రశ్నింపరాదని తీర్మానించుకొనెను. అతడు తన భార్యకు కూడ గోవిందమ్మ పెండ్లివిషయమై యున్న విచారమును మరచి నెమ్మదిగ నుండుమనెను. ఆమెయు మంచిదని యూరకుండెను.

శివకోటయ్య యెంతోధైర్యము వహించి యుండెను కాని హృదయములో భయము లేకుండ పోలేదు. అతడు చేయునది లేక సదా భగవంతుని గూర్చి ప్రార్థనచేయుచు తన విచారమును బోగొట్ట గోరుచుండెను. అత డొకనాటి రాత్రి గోవిందమ్మకు దగినభర్త యెటుల లభించునా యని యోజించి యోజించి నిదురబోయెను. అతడు గాఢనిద్రా పరవశుడయి యుండగా శ్రీ రమారమణుడు స్వప్నమున దర్శనమిచ్చి ఇటులనెను. "శివకోటయ్యా! నీభక్తికి జాలసంతసించితిని. నీ పుత్రికయగు గోవిందమ్మ పెండ్లివిషయమై నీవును నీ భార్యయు చాలదిగులుపడి యుంటిరి. ఆదిగులును మానుడు. ఆమెను నేను త్వరలోవచ్చి పెండ్లియాడుదును" అని తిరోహితుడాయెను. అంతట శివకోటయ్య నిదురనుండి లేచి తన కలను గురించి భార్యకు దిగులుపడవలదని చెప్పెను. ఆస్వప్నఫలమునకై గనిబెట్టుకొని యుండిరి.

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పీఠవప్రకరణము

ఓపాఠకమహాశయులారా! మీరు పూర్వపు ప్రకరణమున శ్రీమహాలక్ష్మి లక్ష్మీకాంతుని సంకల్పము ననుసరించి శివకోటయ్యకు పుత్రికయైజన్మించెనని చదివితిరి. శ్రీమన్నారాయణమూర్తి తానేవచ్చి గోవిందమ్మను తన భార్యగా వరింతునని శివకోటయ్యకు స్వప్నమున గనంబడి చెప్పెను. కదా, ఆవలికథను తెలిపెదను. సావధానచిత్తులై వినుడు.

కందిమల్లయపల్లె

కందిమల్లియపల్లె రాయలసీమ యందలి గ్రామము అది యిపుడు కడపమండలమునచేరిన బద్వేలు తాలూకాలో జేరినది. ఇపుడందఱు కందిమల్లియపల్లెయని పిలుచుచుందురు.

కడపమండలము పూర్వము నుండియు మహాపురుషులకు జన్మస్థానముగ నున్నది. వేమనయోగి భక్తపోతన,

మున్నగు మహనీయు లాజిల్లాలో జన్మించినవారై, అందు లకెగాబోలు నారాయణమూర్తి యంశమున యవతరించిన వీరబ్రహ్మముకూడ కడపటియవస్థలో కడప మండలమునే జేరుకొనెను. అతడు గృహస్థాశ్రమమును నిర్వహించుట కందిమల్లయ్య పల్లెచేరి వడ్రంగవృత్తి నిర్వహించుచుండె నని మనము తెలిసికొనియేయుంటిమి. ఆరీతి వడ్రంగవృత్తి జేయుచు ఇంట దనకు సహాయము లేకుండుటచే వంటజేసి కొని భుజించుచు కేశసంస్కారములేక జూపరులకు బిచ్చి వానివలె గనంబడుచుండెను. కొందరాతని వెఱ్ఱి వీరయ్య, పిచ్చిబ్రహ్మము, అని పిలుచుచుండ నాతడు వారలజూచి నవ్వుచుండెను. అతడు తన గృహమున యమద్యష్టాంగా భ్యాస మొనరించుచుండెను.

వీరబ్రహ్మము ప్రజలకు దనమహిమ జూపుట

వీరబ్రహ్మము ప్రజలనునట్లు సదా పిచ్చివానివలె నేదియో యోజించుచు పరధ్యానముగ నుండెడివాడు. కైతులు తమకు సేద్యపు సామానుజేసి యిమ్మన్న సరి సమయమునకు జేసి యిస్తుననుచు గాలమును వృథాగడుపు చుండెను. వారు వీరయ్యా పగలంతయుపనిచేయక సోమరి వలె తిరుగుదువు ఇక రాత్రియన్న యసలే పనిచేయవు మాకు సామానులతో పనియుండునపుడు వానిని జేసి ఇయ్యకున్న నెట్లు అని మందలింప వారిని మీ సామాను కావలసినపు డడుగుదు, అపుడేయిచ్చెద ననుచు యెవరడి

గిన వస్తువును వారికి అదుగో అచ్చట సిద్ధము చేసి పెట్టితిని తీసికొని పొమ్మనుచుండెను. వారుపోయిచూచిన యావస్తువు సిద్ధముగ నుండెడిది. అదియుగాక ఆ సామానుకూడ యితర వడ్రంగుల కంటె బాగుగ జేయబడి యుండెడిది. అదిచూచి పైతులు వీరయ్య యెపుడును పనిచేయకయే మన పని ముట్లును యిచ్చుచుండును, అడెటుల వీలుపడును. ఇతని యండదేదియోశక్తియుండి నటులున్నది అని యనుగొను చుండిరి. గ్రామపెద్దలీసంగతిని దెలిసికొని యతడు పెఱ్ఱివాడు కాడనియు యోగపురుషుడేయై యుండు ననియు దలచిరి. అందఱును వీరయ్యకు "పెండ్లియైన బిచ్చి కుదురును." అనునట్లు అతనిని బెండ్లి చేసికొనుము, కావలసిన ధనమును మేమిత్తుము, ఇటుల ఒంటరిగ నుండవలదు. ఇటుల బ్రహ్మ చారివిగ నున్న నీవంశము నిలుచు పెట్లు అని తొందర పెట్టు చుండిరి.

వీరబ్రహ్మము పెండ్లి చేసికొని వత్తునని పోవుట

—:o:—

ఒకనాడు వీరబ్రహ్మము గ్రామపెద్దలను జూచితాను పెండ్లికూతురును వెదకుటకు బోవుచుంటిని పెండ్లి చేసుకొను వరకు రాను నాయింటిని గనిపెట్టి యుండుడనగా వారు మంచిది. నీవు యేవిచారమును లేక పొయిరమ్ము, నీకు ధనము వలదా. ధనము లేకున్న పిల్ల నెవరిత్తురు కావలసిన ధనమిత్తుము తీసికొనిపొమ్మనిరి.

అందుకు వీరబ్రహ్మము నాకు ధనమవసరము లేదు. ధనము లేకున్న పెండ్లి కాదా. నాకు భార్య కాగోరి యొక

కన్య నాకొరకు పరిలపించుచున్నది ఆమెను పెండ్లిచేసుకొని వత్తును. మీరు జింతింపవలదని గ్రామాధికారి వీరయ్యా! నీపిచ్చిమాటలు వదలవుగదా. మా మాటలు వినుము. ఈ కాలములో ధనము లేనివానిని గన్నెత్తియైన చూడరు 'ధన మూల మిదంజగత్' అనుట నీకు తెలియుదా యనిరి అందు కతడు నాకు ధనమక్కరలేదని వెళ్ళెను.

వీరయ్య దినమొక యూరికి బోవుచు కలసపాడు సోరుమామిళ్ళ బద్వేలు వనిపెంట దువ్వూరు మైదుకూరు మొదలగు గ్రామముల దాటి అల్లాడుపల్లె జేరెను. అచ్చట గొన్ని దినములుండి వీరభద్రుని సేవించి అచ్చటనుండి ప్రొద్దటూరి కేగి రామేశ్వరమున రామలింగని దర్శించెను. అచ్చటనుండి జమ్మలమడుగు చేరి పినాకినీ నదియందు స్నానమొనరించి ఆరాత్రి యందేగడిపెను.

వీరబ్రహ్మము పెదకొమెర్ల చేరుట

—:o:—

జమ్మలమడుగులోనుండి వేకువఝామున లేచి మరల పినాకినీనదిలోస్నానముచేసి యనుష్టానమునుదీర్చి సుమారు ఉదయము పదిగంటలకు పెద్దకొమెర్ల గ్రామమును జేరెను. ఆయూర విశ్వబ్రాహ్మణులున్నారని యత డెరింగియు వారి యింటికి పోక బావిప్రక్కనుండు సత్రములో బసచేసెను. అతడు గడ్డము పెట్టుకొని మాసినతలతోడను జీర్ణవస్త్రముల తోడను సత్రము ముంగిట గూర్చుండి యుండగా జనులు చూచి యెవరో పిచ్చివాడని కొందఱును యోగియని కొంద

ఱను బిచ్చగాడని కొందఱును పరిపరివిధంబుల జెప్పుకొను చుండిరి. ఆవార్త యూరిలోని పిన్న పెద్దల కందరికి దెలిసెను. అతనిని జూచుటకు కొందరు పెద్దవారును, వారివెంట చిన్న వారును వచ్చి పోవుచుండిరి శివకోటయ్యకూడ అత డెవరో విచారింతమని వచ్చుచుండ గోవిందమ్మకూడ యతనివెంట బోయెను.

శివకోటయ్య వచ్చి సత్రమునం దుండిన యోగిని చూచెను అతనితో యిటులనెను.

ప్రశ్నోత్తర సీసము

అనఘు మీ•దేయూరు? ♦ అన్ని యూరులు నావె
తలిదండ్రు లెవ్వరు! ♦ భ్రాతిపతులు
అన్నదమ్ములు లేరె? ♦ అందరు నావారె
పేరేమి? ఎన్నియో ♦ పేర్లునాకు
ఏవంశ మేతీరు? ♦ యెరిగింపరాదొకో?
బ్రహ్మ వంశము విశ్వ ♦ బ్రాహ్మణుండ
ఎందులకొచ్చితివి? ♦ ఎటకేగుచుంటివి!
దేశాలజూడనే ♦ దిరుగుచుంటి

అటులనై నను మాయింటి♦కరుగుదెమ్ము
వచ్చు సమయము వచ్చిన ♦ వచ్చువాడ
అతిథివై నేడు యే తెమ్ము? ♦ మంతెచాలు
గతుకుచో నేను కుదురదు ♦ కాదుపొమ్ము

చచ్చిన రెడ్డిని బ్రతికించుట

అట్లుండ పెద్దకొమెర్లలో ధనవంతుడగు రెడ్డియుండెను అతనికొక కుమారుడుండెను, ఆకుమారుని యల్లారుముద్దుగా బెంచుచుండిరి. అతనికి యుక్తవయస్సు వచ్చియుండగా వివాహము చేయదలపెట్టియుండిరి. అంతలో నాయువకుడున్నట్టులుండి మరణించెను. అంచుల కారెడ్డి యతని భార్యయు మిగుల దుఃఖించుచు అకటా లేక లేక ఒక పుత్రుడు జన్మించెను. అట్టిబాలుని చూడజాలక కాలమృత్యువు తన పొట్టనిడుకొనెను. ఇక యింతటితో మావంశమంతమైనట్లైననిపలు తెరంగుల వాపోవుచుండ చుట్టుప్రక్కలవారతని నోదార్పుచుండిరి.

అంత కొందరు పాడెకట్టి చచ్చినవానిని బరుండబెట్టి శ్మశానమునకు గొనిపోవుచుండిరి. వారు వీరబ్రహ్మమున్న సత్రము ముందు ఆపాడెను మోసుకొని పోవుచుండిరి. అది చూచి వీరబ్రహ్మము నాయనలారా! ఇదేటి ధర్మము. బ్రతికినవారిని గాటికి గొనిపోచుండిరి. ఈయూర బ్రతికినవారిని గూడ బూడ్తురాయనెను. అందుకు వారతడు పిచ్చివాడనియు పిచ్చివాని మాటలతో బనియేమియని కాటికిబోయి పాడెకు గట్టిన బ్రాళ్ళను విప్పినంతనె రెడ్డి కుమారుడు లేచి కూర్చుండి మీకు మతిపోయినదా? నన్ను కాటికి గొనిరానేల? అని దారిపట్టి తనయింటికి బోవుచుండెను.

అతడు పోవుచుండగా సత్రమునందు కూర్చుండియుండిన వీరబ్రహ్మము నాయనా! చచ్చియు బ్రతికినవాడవు.

శమ్మ. కూర్చుండుము. నీవు తొలిజన్మమున నా భక్తుడవై యుండినందున యీ ఆదినము నీవు మరణింతువని తెలిసికొని యిటకు వచ్చితిని. నిన్ను కాటికి గొనిపోయినపుడు చూచి నీవు బ్రతుకవలెనని సంకల్పించితిని. అటులనే బ్రతికివచ్చితివి ఇక నీకు భయము లేదు. శుభమగుగాక, పొమ్ము అనగా నత డింటికేగెను.

అంత కొంతసేపటికి గాటికి బీనుగను దీసుకొని వెళ్ళిన వారు తిరిగి యింటికి బోవుచు సత్రముకడ యుండిన యోగిని జూచి నమస్కరించి స్వామీ! మీమాట యథార్థమైనది. మా రెడ్డికుమారుడు బ్రతికినాడు ఇది మీప్రభావము తప్ప మరేదియుగాదు. అని నమస్కరించి వెళ్ళిరి.

అంత పెద్దరెడ్డి పరుగిడుచువచ్చి యోగిపుంగవునిపాద ములమీదబ్రవాలి "స్వామీ! మీయనుగ్రహమున నాచచ్చిన కుమారుడు బ్రతికి వచ్చెను. మీరు శ్రీమన్నారాయణ మూర్తియై మాయూరికి వచ్చితిరి. నావంశమును నిలిపిన మీకు నేనేమి చేయగలను. నాకు గావలసిన ధనమున్నది. ఆధనములో మీరుకోరినంత యిచ్చుటకు సిద్ధపడివచ్చితిని. దయయుంచి మాయింటికి వచ్చి మమ్మనుగ్రహింపుడు" అని పరి పరివిధముల బ్రార్థించెను అందుకా యోగీశ్వరుండు నాయనా నాకు నీధనముతో బనిలేదు నాకుగావలసినచో వలసినంత ధనము నాకురాగలదు. ఇంటికివెళ్ళి సుఖముగా నుండుము. నీకుమారునికిక భయము లేదు పొమ్మనెను ఈ యోగీశ్వరుని మహిమ నిముషములో గ్రామమంతయు వెల్లడియయ్యెను. శివకోటయ్య ఆశ్చర్యముతో యోచింపసాగెను.

బ్రతికినవానిని జంపి మరల బ్రతికించుట

—:o:—

పెద్దకొమెర్ల గ్రామమం దొక శివాలయముండెను ఆ శివునకు బ్రహ్మయ్యయను తంబళ (వాడు) పూజారియై యుండెను. అతడు విద్వాంసుడై భగవద్భక్తుడుగానుండెను అతడు సత్రములోని యోగిపుంగవుని యద్భుతశక్తిని మహాత్మ్యమును విని సత్రమును జేరి "స్వామీ! మీరు సత్రమునందుండుట మంచిదికాదు నేను శివాలయమున పూజారిని. నన్ను బ్రహ్మయ్య యందురు దయయుంచి శివాలయమునకు రండు మీకు గావలసిన సౌకర్యముల గూర్చెదననగా సరియని యతనివెంట శివాలయమున కేగినవాడాయెను.

మరునాడు పెద్దకొమెర్లలో నుండిన దుర్మార్గులు కొందరు క్రొత్తగా వచ్చిన యోగిని అవమానపరచి పరుగిడిపోవునట్లు జేయదలచిరి. ఈసన్యాసి చచ్చినవారిని బ్రతికించునట. ప్రపంచమునందు జరిగెడియెన్ని యో యద్భుతములను వింటిమి. ఎండఱనో దివ్యపురుషుల జూచితిమి ఒక్కరును చచ్చినవారిని బ్రతికించినవారు లేరు. ఒక భగవంతునకు దప్ప జచ్చినవారిని బ్రతికించు శక్తియుండదు ఇతడు భగవంతు డెట్లగును. ఎవరో పిచ్చిపుల్లయ్య మనయూరికివచ్చి అందరను మోసగింప నున్నాడు. ఇతడు ఇంద్రజాలము తెలిసినవాడుగ నుండును. బహుశా మాయవిద్య నేర్చియుండును ఇతని తంత్రములు సాగనియ్యరాదని నిశ్చయించిరి.

అంత వారొక పాడెను సిద్ధముచేసి బ్రతికియుండిన తమ మిత్రుని దానిపై బరుండబెట్టి యొక క్రొత్తగుడ్డనుకప్పి

తాళ్ళచే గట్టి నాలుగుప్రక్కల నలుగురు మోయుచుండ గొందరు గోడుగోడున యేడ్చుచు శివాలయమునందు వెళ్లు చుండిరి. ఈ కపట నాటకమునాడు వారి దుర్మార్గమును గ్రహించి వీరబ్రహ్మయోగి వారు శివాలయమును సమీపించుటకు ముందే బ్రహ్మయ్యతోగూడ వచ్చి చూచుచుండెను. అంతలో పాడెను మోసికొనివచ్చిరి. కొందరు స్వామీ! ఈయువకు డున్నట్లుండి మరణించెను. దయయుంచి యితనిని బ్రతికింపుడనిరి.

అందు కాతడు నవ్వుచు "ఔరా! ఈయువకుడు మరణించెనా! పాపము ఆయుస్సు తీరినది కాబోలు బ్రతికినవానిని బచ్చినవానిని జేయుశక్తిపరు లీ యూరనుండరని యిపుడు తెలిసికొంటిని పాపము అతడు చచ్చినాడు. కాటికి గొనిపొండు" అనగా వారు బిరబిర వెళ్ళిరి. అంత నాయోగి బ్రహ్మయ్యకు వారు పన్నిన యుక్తినంతయు జెప్పి వారికి బుద్ధివచ్చినట్లు చేసితిని. ఇక లోపలికి బోదమురమ్మనిపిలుచుకొనిపోయెను.

అంత గొంతసేపటికి యాదుష్టులు పాడెకు గట్టిన గ్రాటిని సడలించి తమ స్నేహితుని లెమ్మనిరి. అతడు దీర్ఘనిద్రజెంది యుండెను. అందరును యెంత లేపినను వాడు లేయకుండెను. అతని ముక్కుకడ చేతినిడి శ్వాసమాడనందున బచ్చెనని తీర్మానించిరి. అతనితలిదండ్రు లేమందురో యని దిగులుపడి దిక్కుల జూచుచుండిరి.

అంతలో ఆబచ్చినయువకుని వృద్ధజననీజనకులు వచ్చి కుమారుడు చచ్చియుండుటజూచి "ఓరి దుర్మార్గులారా!

పాపి ముండకొడుకులారా! అగనాకు మా కుమారుని జంపితిరి మీరు ఆయోగిపుంగవుని పరాభవింపవలెనని మాటాడు కొనుటవిని ఆపని చేయవద్దని చెప్పినను వినక చేసితిరి. మా వాడు మీతో జేరి ప్రాణముల బాసెను అకటా! మాగతి యేమి. వయోవృద్ధులము. మాకు గంజిపోయు దిక్కుకూడ లేదే, అని బిరబిర శివాలయమున కరిగి అందున్న యోగి పాదములపై బడి ''మహానుభావా! దుర్మార్గులు మిమ్మవమా నింపదలచిరి. మేమెంతయో మందల్చించితిమి సరిమేమేమియు జేయమనిరి. అటుపిమ్మట మాకు దెలియకుండ మాకుమారుని బిలుచుకొని పోయినటు లున్నది ఈ పాపిముండకొడుకు లీ గ్రామమునం దడుగువారు లేక సదాయిట్టి దుర్మార్గపుబనుల జేయుచునే యుందురు. వారివలన మాకుమారుడు మర ణించెను. అందువలన వృద్ధులమగు మేము దిక్కులేక జావ వలసి వచ్చినది. వారుభాగుగనే యున్నారు. కాని మా పుత్రుడు చచ్చియున్నాడు. వాడు తప్ప మాకు గంజిపోయు వారుకూడ లేరు. స్వామీ! ఇదంతయు నీకెగ్గుదలచినందున జరిగినది. ప్రాణములతో బాడెపై యూరక మరణించినట్లు నటించువాడు చచ్చుటకు గారణము వేరుండదు దయయుంచి వృద్ధులమగు మాపై గరుణగలిగి పుత్రభిక్ష పెట్టుమని కన్నీ టితో యాతని పాదముల గడిగి వదలకుండిరి.

అపు డాయోగిపుంగవుడు వారితో ఆపాడె నిటకు గొనిరమ్మనుడని చెప్పెను. వారు వడిగబోయి వారినిపాడెను స్వామి కడకు దీసికొనిరమ్మనగా వారు వెంటనే దాని నెత్తు కొని శివుని యాలయముముందు పెట్టి తలలువంచుకొని నిలిచి యుండిరి. అపుడాయోగి బ్రహ్మయ్యతోగూడ అక్కడికి

వచ్చిన తన కమండలములోని యుదకమును ఆ పీనుగు పై జల్లెను. ఆ యువకుడు వెంటనే లేచి "ఔరా! నేనిచ్చటి కెట్లువచ్చితిని" అని యోజన నభినయించుచుండ యాతని తలిదండ్రులు జరిగిన సంగతి వానితో ననిరి.

అతడు వెంటనే స్వామిపాదములమీదబ్రాలి తప్పును క్షమింపగోరి దుర్మార్గులమాటలవిని మీకపరాధము జేసినది నిజము. దానునితప్పు దండముతో సరియని మీ రెరుంగక పోలేదు. అని వేడుకొనగా ఆయోగి "తండ్రీ! ఇక మీదట దుర్మార్గుల జేరకుము. మహాత్ముల బరీక్షింపగోరకుము. నీతలి దండ్రుల బూజింపుము. నీకు శుభమగును పొమ్ము" అనగా నతడు లేచి నమస్కరించి తలిదండ్రులను ఇంటికిబిలుచుకొని పోయెను. దుర్మార్గులు చెప్పకనె పరుగిడిరి. వీరబ్రహ్మము బ్రహ్మయ్యతో గూడ శివాలయము లోపలికేగెను.

వీరబ్రహ్మము బ్రహ్మయ్య సంశయము తీర్చుట

ఒకనాడు పూజారి బ్రహ్మయ్య వీరబ్రహ్మము శివాలయమున గూర్చుండి యుండగా స్వామీ! మనుజవ ద్దైవ ధ్యానము శ్రేష్ఠమా? లేక బ్రహ్మజ్ఞానము శ్రేష్ఠమా? దయయుంచి తెలుపుడని ప్రార్థించెను. అందుకు యోగిపుంగవుడు బ్రహ్మయ్యా! బాగుగా వినుము.

తే-గీ. ఇతరులెట్టుల జేయుట ♦ హిత మొనీకు
వారికట్టులె జేయుము ♦ బాగుగాను

అట్టి గుణములు గలవాల ♦ డెట్టివార
లైన సుజ్ఞాను లనదగు ♦ వినుము నీవు,
ఇతరులను తనతోసమానునిగ జూచువాము త్వరలో
నన్ను అంతర్ముఖంబున నిర్గుణునివలెను, పరాన్ముఖమున సగు
ణునిగాను, ఊనచక్షువునకు రూపమువలెను, జ్ఞానచక్షువునకు
రూపరహితుడుగాను కనంబడి సంపూర్ణానందమునుగలిగింప
గలవాడను నేనే సుమా అజ్ఞానులు నన్ను ప్రేమతోగూడిన
భక్తిచే ధ్యానింతు రేని వారికి ప్రసన్నుండనై వారి కోరికల
నన్నింటిని దీర్పగలను. భక్తుల నా బిడ్డవలెజూచి రక్షింప
గలను. యోగులైనవై రాగ్యమూర్ధము నవలంభించినవారిని
మిత్రులుగాను, జ్ఞానమార్గావలంబులను సమానులుగను
జూతును. భక్తిమార్గముననుండు బిడ్డలును, వైరాగ్యహఠ
యోగాదిమార్గమునను నుండు వా రేజాతివారైనను, జ్ఞానులు
వృద్ధులైనను వారియందు ''అహము'' అనునది యుండదు.

తే-గీ. భక్తులకు ప్రేమయనునది ♦ బరగుచుండు
సిద్ధులకునుండు వైరాగ్య ♦ సిద్ధి మిగుల
ముక్తిపరులకు మానము ♦ ముక్తినొసగు
దెలివిగలవారు దీనిని ♦ దెలియగలరు.

తే-గీ. ప్రియములేనట్టి భక్తియు ♦ బేరుజెరుచు
వేదయోగము వైరాగ్య ♦ విధివెలయక
జగతి సవిమర్శనములేక ♦ జ్ఞానికాడు
అహము వీడని వాడేను ♦ యధము డవిని.

కనుక ఓ బ్రహ్మయ్యా! మరియొక సూత్రమును వినుము.

ఆ-వె. కనుక భక్తిజ్ఞాన ♦ కర్మఖ్యులను మూఁట
ఒక్కటొక్కటి గూర్చు ♦ నుర్వీమనకు
వలయు వానినెల్ల ♦ వడలక యొకఁ డైన
కలిగియుండువాడు ♦ ఘనుడుకాడె.

కనుక మానవులు వాయువేగమును మించిన వేగముతో బరుగిడు మనస్సును పరుగెత్తకుండ నిలిపి నేఁజూపిన లక్ష్యమును జూచిన చాలును. ఈ దినమున కిది చాలును. ఒకనాడు నా కాలజ్ఞానమును వినిపించెదను లెమ్ము. అనగా బ్రహ్మయ్య చిత్తమని యూరకుండెను.

పెదకొమ్మెర్లలో కాలజ్ఞానమును బోధించుట

—:o:—

ఒకనాడు క్రొత్తగావచ్చిన యోగిపుంగవుడు శివాలయములో తన కాలజ్ఞానమును బోధించునను వార్తలు వ్యాపించెను. ఆవార్తలుచెవినిసోకగనే గ్రామములోని పిన్న పెద్దలు వేళకుముందే శివాలయమును జేరిరి. శివకోటయ్య తన భార్యాబిడ్డలతో గూడ శివాలయమున కేగియుండెను. గోవిందమ్మ తలిదండ్రులకు సమీపమున యోగికి ఎదురుగా పద్మాసనము వేసికొని కూర్చుండియుండెను. అందరు వచ్చిరని చెప్పినంతట వీరబ్రహ్మము కాలజ్ఞానములోని విషయముల నిట్లు దెలుప మొదలిడెను.

కాలజ్ఞాన ద్విపద

శ్రీహరి యానతి ♦ జెప్పెద వినుడు
ఇహమున గలిలోన ♦ నికమీద జరుగు 1
వింతల వినిపింతు ♦ వేడ్క-గానుండ
చింతలమానియు ♦ స్థిరమతి వినుడు 2
ధర్మముడుల్లియు ♦ తారుమారగును
నిర్మలబుద్ధుల ♦ నిర్మలమగును 3
తలిదండ్రి తమలోన ♦ తగవులనాట
తలచును పుత్రుడా ♦ తగవుల దీర్ప 4
తల్లిని తండ్రిని ♦ దాసుల జేసి
కూళయై నిందింప ♦ గోరును వాడె 5
భూసురులెల్లరు ♦ బుద్ధులై చెడుచు
దాసులై పరసేవ ♦ భ్రాంతి జేయుదురు 6
బ్రాహ్మణేతరులెల్ల ♦ బ్రాహ్మలచూచి
అహహా! యటంచుచు ♦ అధముఁజేసి 7
పరిహసించినగాని ♦ పలుకకుండెదరు
సరియని గతిమాలి ♦ సైచియుండెదరు 8
బ్రాహ్మణేతరులెల్ల ♦ పాపులై చెడగ
బ్రాహ్మలై మాలలు ♦ పరిహసించెదరు 9
దేవాలయంబుల ♦ దిక్కు-చూడకను
దైవనిందల జేయ ♦ దలతు రెల్లెడల 10
బాలరుల్ దాసులై ♦ ప్రజల సేవింప
జెలగును ప్రజలలో ♦ జెడుగు లొన్నొన్నో 11

పంచముల్ శాస్త్రాల♦బాడుచునుండ
మించి సంతోషంబు♦మేదినీ సురులు 12
వినుచంద్రు భక్తిచే♦వేడుక నిలిచి
జనులు మాదిగల పూ♦జారి జేసెదరు 13

ఎద్దులగట్టక♦ నేగును బండ్లు
ఏద్దులు దున్నక♦యిద్దరపండు 14
వెంపలికిని దోటి♦వేసెడి జనులు
కొంపల బుట్టెరు♦కుటిలమానసులు 15
గండుశిలల్ మాంస♦ఖండముల్ గ్రక్క
దండిగ్రద్దలుతిని♦ధరణిపై నొరుగ 16
జనులు వింతగజూచి♦చాల మెచ్చుచును
కనుచుండ నెరుగుచు♦గంతులిడేరు 17

తైలము లేకుండ♦దీపాలు వెలుగు
జలముచేదివ్వియ♦చక్కగనుండు 18
నలువదినములు♦నరులుజూడగను
కలిగాశి పాడుగా♦గలదు నిజంబు 19

తల్లిమాటల విషంబు♦దారవాక్యములు
ఉల్లము రంజిల్ల♦నుండు తీపుగను 20

మట్ట ఆరనిబిడ్డ♦మాటలాడగను
మంటలాకాసమున♦మండదద్భుతముగ 21

కుక్కలు చంపును♦గుఱ్ఱాలబట్టి
కొక్కులు గుక్కల♦గూల్పగా గలవు. 22

పుట్టు ఓంకారంబు♦పుడమిలోనుండి
పుట్టగా వదలు♦భూమిపాడగును 23
పల్నాటకాకర♦పాదపంబునకు
కలుగును గాంచిత♦కాయలు జాల 24
బనగా నెపల్లెలో♦పాతరమీద
ఆనాడు మొలచిన♦యాచింత్రమాకు 25
వింతగాబూయు చా♦మంతి పూవులను
అంతట మల్లెపూ♦లయ్యేద యొసగు 26
దెల్లవారే తెంచి♦తేకువతోడ
పాలింత్రు జగతిని♦పాపాత్ములకట 27
అంతట గంధియు♦లతియు క్షిపరుడు
పంతంబుతోవారి♦బరుగిడ జేయు 28
అన్య దేశములలో♦అలమల్ పుట్టి
మన దేశ జనులకు♦మరి బాధ గూర్చు 29
ధర్మయుద్ధము కాదు♦తలవంగ నదియు
మర్మమతోవారు♦మహినిమా డ్చెదరు 30
విషవాయు వే తెంచి♦వెరపించి చాల
మసి జేయునకట♦మానవతతిని 31
వర్ణసంకరమగు♦వనితలు కటుకు
చరియింత్రు మగవారి♦జత లేక తామె 32
సేవకావృత్తిని♦జేయుచువారు
భువిలోన మానంబు♦పోగొట్టుకొనియు 33

భక్తుల దిట్టుచు♦ భార్యలుపోయి
కోరినవారితో♦ గూడి యుండెదరు 34
విపరీతములు జూల♦ వెలయు నీకలిని
దేవుమాపుల లోనే♦ రేకెత్తు నెన్నో 35
దేవుడే మాయూర♦ దేజరిల్లెడిని
ఆవింతలన్ని♦ అందురు చూచి 36
హేళనము జేసిన♦ హింసలు గలుగు
పాలించ మిమ్ములబర తెంచినాను 37
నన్ను నమ్మినయెడ♦ నాశంబు లేదు
నన్ను నమ్మనివారు♦ నశియింప గలరు 38
అవల నినిపింతు♦ అరుగుడు నేడు
ఈ వేళ కిదిచాలు♦ యేగుడీ యనెను. 39.

అతడు ఆమాటలు పలుకినంతనె జనులెల్లరును భయ భక్తులతో స్వామికి నమస్కరించియిండ్లకేగిరి. శివకోటయ్య భార్యను బిడ్డను పిలుచుకొని తనయింటి కరిగెను.

గోవిందమ్మ యోగిని వరించుట

—:o:—

కాలజ్ఞానమును విని యింటికేగి రాత్రి భోజనము చేయునపుడు శివకోటయ్య యోగి చెప్పిన విషయములు నిక్కమోకాదో, అతడొక పిచ్చివానిరూపముతోనుండెను. అతనిమాసిన తలయు గడ్డము గుడ్డలజూచిన యసహ్యముగ నున్నాడనెను. అందుకు గోవిందమ్మ వెంటనే "తండ్రీ!

ఏమట్లనుచుండిరి, అతనిని నేజూడ లేదనుకొంటిరా, అతడు నాకు దివ్యమంగళ విగ్రహుడై కాన్పించెను. అతనికంటె సుందరరూపుని మీరు జూడలేరు. అతని జూచినప్పటి నుండియు నాకతని వివాహమాడవలెనను కోరిక జనించినది. అతడు కాలజ్ఞానమును వినిపించినపుడు ఆయన కెదురుగ గూర్చుండి యుండిన నన్నే జూచుచుండును. అతనిని దప్ప నే నితరుల బెండ్లాడను'' అని యూడి పలికెను.

ఇందుకు శివకోటయ్యబిడ్డా! అతడు దరిద్రుడు. అతడు దిక్కు లేనివాడట. కూటికిలేక యూరూరు దిరుగుచు మన యూరికివచ్చినాడు. అట్టివానినా నీవు కోరుట. ఎందరో ధనవంతులగు యువకులును, అందచందములలో నొప్పువిద్యావంతులును వచ్చినప్పుడు వారిని గన్నెత్తిచూడక పోతివి. ఇపు డొక సన్యాసిని పెండ్లియాడదలచుట బాగులేదనెను. గోవిందమ్మను తన యభిప్రాయమును మార్చుకొమ్మని చెప్పి ప్రొద్దుపోయినందున శయనింప బోయిరి.

ఆనాటిరాత్రి శివకోటయ్యకుశివాలయములోని యోగి సుందరాకారుండై దర్శనమిచ్చి ''శివకోటయ్యా! నన్ను సామాన్యునిగా భావింపవలదు నీబిడ్డనుకోరియే నేనీయూరికి వచ్చితిని గాని యూరకరాలేదు నామహిమ నీబిడ్డ కనిపెట్టి నది కాని నీవు తెలిసికొనలేదు నీబిడ్డకోర్కెను దీర్చుమని'' యదృశ్యుడాయెను.

ఉదయమున లేచినతోడనే తనకలనుగూర్చి భార్యకు చెప్పి గోవిందమ్మ శివాలయములోని యోగికే యిచ్చివివాహము చేయుదమని శివకోటయ్య పలికెను. అతడు విశ్వ

బ్రాహ్మణుడనని ముందే చెప్పినాడు. గోవిందమ్మాయు అతనినే ప్రేమించినది అమె యదృష్ట మెటులున్నదో చూతము. అమె కోరికలను నెఱవేర్చుటమనధర్మమని పలుక భార్యయు పలుకకుండెను.

శివకోటయ్య వీరబ్రహ్మము నాహ్వానించుట

శివకోటయ్య మరునాడు స్నానమొనరించి భార్యతో గూడ శివాలయమున కేగి యోగివర్యునిజూచి ''మహాత్మా! మిమ్ము మేము తెలిసికొనలేక పోతిమిగాని, మాపుత్రి గోవిందమ్మ తెలిసికొనినది. అదిచూడ మీకును అమెకును పూర్వ జన్మమునం దేదియో సంబంధముండెనని తోచెడిని. అమె మిమ్మొదప్ప నన్యుల వివాహ మాడనని పట్టుపట్టినది. మీరామె నంగీకరింపకున్నచో నామె బ్రహ్మచారిణిగ నుండ నిశ్చయించినది. కనుక దయయుంచి మీరామెను పరిణయ మాడ గోరుచుంటిమి. మాగృహమునకు రండు ముహూర్తమును నిశ్చయించి వివాహ మొనరింతు మనెను.

అందుకు వీరబ్రహ్మము అయ్యా! నేను దరిద్రుడను, దిక్కు లేనివాడను, అందరిచేతను వెఱ్ఱివాడనని యనిపించుకొనుచున్నాను. అట్టివానికి నీబిడ్డనిచ్చి వివాహ మొనరింతు నంటివి. ఇది నిజమా మీకును మీయిల్లాలికిని, మీరు మిక్కిలి మీకూతురునకును సమ్మత మేనా అయ్యా! అనెను. అందుకు శివకోటయ్య అయ్యా! మేమందఱమును సమ్మతించితిమి.

మమ్మ సంశయింపబనిలేదు. దయచేసి మా యింటికి రండు ఈ శివాలయమునందుండ నక్కరలేదు అని బ్రతిమాలెను.

అంత వీరబ్రహ్మము మంచిది, మీకు సమ్మతమైనచో వివాహమాడెదను. కాని యీదినము రాను. నేను మీతో యింతకుముందే "గతికిన అతకదు" అని చెప్పితిని. కనుక మీరేగి సుముహూర్తము నిశ్చయించి, అన్ని యేర్పాటుల నొనరింపుడు ముహూర్తదినమున వత్తుననగా వారు సంతోషముతో బోవుచుండిరి. అట్లు పోవువారిని యతడు మరల బిలిచి అంతకుముందు సిద్ధముచేసి యుంచిన యొక చిన్న మూట నిచ్చి తాను వచ్చి యడిగినపుడు దాని నిమ్మనెను వారు సమ్మతించి పోయిరి.

బ్రాహ్మయ్య చూచి స్వామీ! అదేమి, ఆ మూటను నిన్నటిదినము నాచే సిద్ధము చేయించితిరి, అది చెడియెందుకు బనికిరాక యుండెను. అట్టిదాని నిచ్చిన వారేమనుకొందురో కదా యనెను. అందు కాతడు నవ్వి తలయూచి పలుక కుండెను.

గోవిందమాంబా వీరబ్రహ్మముల వివాహము

శివకోటయ్య భార్యసమేతుడై వీరబ్రహ్మ ;మొసగిన మూటను గొనిపోయి యిల్లుచేరెను. ఆతడామూట నొక్క యట్టువమీద నిడి గోవిందమ్మను పిలిచి "అమ్మా! నీవివాహమును నిశ్చయించుకొని వచ్చితిమి, నీవు నిర్ణయించుకొన్న

వరునితో మాడాడి అతని సమ్మతమును వడసి వచ్చితిమి. ఇంక నీవిచారమును మానుము'' అనగా గోవిందమ్మ చిఱు నవ్వుతో దలవంచుకొని లోపలికేగెను.

ఆదినము మధ్యాహ్నమే శివకోటయ్య పురోహితుని రప్పించి గోవిందమ్మ పెండ్లి నిశ్చయించితిమి. సమీప ముహూర్తమును నిర్ణయింపుడని కోరెను. అతడు పంచాంగ మును చూచి లెక్కించి అయిదవనాడు మంచి ముహూర్త మున్నదని చెప్పెను. శివకోటయ్య ఆబ్రాహ్మణునకు దక్షిణ తాంబూలాదుల నొసంగి పంపెను.

ఆదినమే పెండ్లి ప్రతికల దయారుచేయించి తగిన మనుష్యుల నేర్పాటుచేసి తన బంధుమిత్రుల నాహ్వానింప బంపెను. ఇంటికి సున్నము కొట్టించి ఎఱ్ఱమట్టి పట్టెల దీర్పించెను. పెండ్లికి గావలసిన సామ్మ్రులను నూతన వస్త్రములను దెచ్చుటకు దగిన ఏర్పాటు కావించెను. వివాహము లైదు దినములు జరుపుటకు నిశ్చయించి అందుకు గావలసిన భోజన వస్తువుల దెచ్చుటకు గొన్ని బండ్లను పంపించెను.

ఇంటిముందు బండిగడలను నాటించి దిట్టమగు తడ కలతో విశాలమగు పందిరి వేయించెను. ఆపందిరిని పచ్చ తోరణములతోను, వివిధవర్ణ కాగితములపూలదండలతోడను అలంకరించెను. ఒక్కొక గుంజకు ఒక్కొక అరటికంబమును నాటించి కొంకాయచెట్టు పట్టల దెప్పించి కట్టించెను. ఆభూ

భాగమునంతయు చదును చేయించి నీళ్ళజల్లి దిట్టముచేసి గోమయముచే నలికించి పంచవర్ణముల ముగ్గుల దిద్దించి యుండెను. జనులు కూర్చుండుటకు మేదరి చాపల దెప్పించి వేయించెను. దానితో పెండ్లియింట నలంకరించుటబూర్తి యయ్యెను.

అవల కల్యాణమండపమును ప్రత్యేకముగనిర్ణయించి చక్కగ నలంకరించి మంటప మధ్యమున చక్కని పీటల వేయించెను. మంటపమునకు ముందుభాగమున హోమగుండమును, దాని కిరుప్రక్కల పురోహితులు కూర్చుండుటకు దగిన యాసనముల నేర్పాటు చేయించెను.

శివకోటయ్యపై పనుల జేయించుచుండ నతనియర్ధాంగి పెండ్లికి గావలసిన పిండివంటల సిద్ధము చేసెను. అంత వివాహదినమున కొకదినము ముందుగ శివకోటయ్య బంధు మిత్రులు బండ్లు కట్టించుకొని వచ్చి దిగిరి. అతడు ముందుగనె యెవరికి దగిన బసలను వారి కొసగు యేర్పాటుల జేసి నందున పనివారు వారికి దగిన బసల జూపించిరి.

మరుదినము వేకువనఝామునుండియు శివకోటయ్య మందిరమున మంగళవాద్యములు ప్రారంభమాయెను. శివకోటయ్య బంధువులతోడను మిత్రులతోడను బయలుదేరి మంగళ నినాదములతో శివాలయమునకేగి వీరబ్రహ్మము నాహ్వానించి పిలుచుకొనివచ్చి మంగళస్నానము జేయించి పట్టుపుట్టముల గట్టించిరి. అతనికి నుదుట విభూతిరేఖల దిద్ది

శాలకమును బెట్టిరి. అంతలో పెండ్లికూతురును చక్కగ నలం కరించిరి. వధూవరుల దోడ్కొనివచ్చి కల్యాణమంటపమున గూర్చుండబెట్టిరి.

పురోహితుడు గణపతిప్రార్థనతో ప్రారంభించి సమం త్రకంబుగ వివాహతంతు జరిగించుచుండెను. అంత నొక వెండిపళ్ళెరము దెచ్చి పెండ్లికుమారుని పాదముల నంది ంగా శివకోటయ్య భార్య వెండికలశముతో దెచ్చిన జల మును పోయుచుండ శివకోటయ్య వీరబ్రహ్మము కాళ్ళను గడిగి కన్యాదానము జేసెను. అంతట మంగళవాద్యములు మ్రోగించుచుండ వీరబ్రహ్మము గోవిందమ్మకు మంగళ సూత్రమును గట్టెను. బంధుమిత్రులును, యూరిలోని పెద్ద లైతులును వధూవరులకు వస్తువులను, వస్త్రములను, ధన మును చదివించిరి. శివకోటయ్య బ్రాహ్మణులకు భూరిదక్షిణ లొసంగ వారు వధూవరులను ఆశీర్వదించి గృహాముల కరిగిరి. శివకోటయ్య గ్రామవాసుల సత్కరించి పంపెను.

అంతట శివకోటయ్య బంధుమిత్రులను భోజనమునకు లెమ్మనగా నందరువచ్చి ఆకులముందు గూర్చుండిరి. వధూ వరులను ప్రత్యేక పీటలపై గూర్చుండబెట్టిరి. అపుడు వీర బ్రహ్మము మామగారిని పిలిచి తా నాడొసగిన మూట లోని పదార్థముల నందఱికు వడ్డింపగోరెను. అతడామాటను భార్యతో జెప్పగా ఆమె భర్తను లోపలికి రమ్మని కనులతో బిలిచెను.

అతడు లోపలికేగిన తోడనే యామె ''నాథా! నేను మీకు దెలియకుండ మొన్నటిదినమున యామూటను విప్పి చూచితిని అందు పాసిపోయిన యన్నములో పురుగులుండు టను చూచి మనకేలనని మరల గట్టిపెట్టితిని. మనము దానినెటుల వడ్డింపదగును'' అనెను.

అతడు వెంటనే యాసంగతి అల్లునకు దెలుపగా అతడు చిఱునవ్వు నవ్వుచు ''మామా! ఆమూటను దెచ్చి నాయెదుట విప్పిచూడుడు'' అనెను. అందు కతడు మరల లోపలికేగి మూటను దెచ్చి అల్లుని యెదుట నిడెను. అతడు తన యుద్ధరణితో కలశములోని తీర్థమును జేత్రిలో బోసి యామూటపై జల్లి ''మామా! మూటను విప్పుము'' అనగా శివకోటయ్య మూటను విప్పి చూచెను. ఆశ్చర్యము. ఆ మూటలో నానావిధములగు భక్ష్యభోజనము లుండెను. ఆ పదార్థములను ముందు వడ్డించి తర్వాత మీరు తయారు చేయించిన పదార్థముల దెమ్మనెను.

ఆ మూటలోని పదార్థముల దీసి దట్టలోనిడగా మరి యొక తట్టెడు మూటలో వృద్ధియగుచుండెను. ఆరీతిగా వచ్చినవారి యాకులన్నింటిలో వడ్డించినను ఆ మూటలోని పదార్థములు తగ్గకుండుట చూచి అందరును ఆశ్చర్యపడిరి. కడకు శివకోటయ్య చేయించినవంటలతో బనిలేకపోయెను.

అపుడు వీరబ్రహ్మము మామగారిని పిలిచి ఆయన తయారు చేయించిన వస్తువులలో గొంచెము కొంచెము తన

యాకున వడ్డించి మిగిలిన దానిని గ్రామములోని బీదవార లకు బెట్టుమనెను. అందు కతడు సమ్మతించి భోజనానంత రము బంధువులకు తాంబూలాది సుగంధవస్తువుల నొసంగి పవల బీదల రప్పించి అన్నదానమును చేయించి సంత సించెను.

ఈ విధముగా సకల జనామోదముగా వివాహమును ముగించి నాటిరాత్రి చక్కగా నలంకరింపబడిన శకటము మీద వధూవరుల గూర్చుండబెట్టి మెరవణి చేసిరి. ఆమరు దినము శివకోటయ్య బంధుమిత్రులను వారి గ్రామములకు బంపెను.

వీరబ్రహ్మము అత్తగారి గృహమున గొన్నిదినము లుండి తదనంతరము తన గ్రామమగు కందిమల్లయ్య పల్లెకు బోదలచెను. అపుడు శివకోటయ్య కుమార్తెకు అల్లునికి నానావిధ వస్తువస్త్ర భూషణాదు లొసగి పంపెను.

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

ఎనిమిదవప్రకరణము

ఓ పాఠకమహాశయులారా! గత ప్రకరణమున వీర బ్రహ్మము గృహస్థుకాగోరి కన్యాన్వేషణ మొనరించుచు పెద్దకొండమెర్ల గ్రామమును జేరుటయు ఆగ్రామమున జనులకు తన మహాత్మ్యమును జూపుటయే గాక చనిపోయిన రెడ్డిని పునర్జీవితు నొనరించి, బ్రతికిన వాని చనిపోవునట్లు చేసి మరల బ్రతికించుటయు, కడకు పెద్దకొండమెర్ల శివకోటయ్య కూతురు గోవిందమ్మను వివాహమాడి అత్తమామల యాన తితో భార్యాసమేతముగ కందిమల్లయ్యపల్లెకు ప్రయాణ మైన విషయములు దెలిసికొంటిరి. ఇక తర్వాత జరిగిన

వీరబ్రహ్మము భార్యాసమేతముగ కందిమల్లయ
పల్లెకు తిరిగి వచ్చుట

—:o:—

పెద్దకొండమెర్లనుండి వీరబ్రహ్మము వివాహానంతరము
అత్తమామల దీవెనలంది ధర్మపత్ని గోవిందమాంబతోగూడ

స్వనిర్మయగ్రామంబగుకందిమల్లయ్యపల్లెకువచ్చి స్వగృహ
మువ గోవిందమ్మతో గాపురము చేయుచుండెను. ఆగ్రామ
జనులందరు వీరయ్య ఒక యింటివాడైనందులకు సంతోషిం
చిరి. క్రొత్తకాపురము గనుక యేలోటుపాటులు లేకుండ
గ్రామపెద్దలేగాని, అమ్మలక్కలుకూడ వారి కేకొదువ
లేకుండ వలసిన వస్తువుల దెచ్చి యిచ్చుచుండిరి.

వివాహానంతరముగూడ వీరబ్రహ్మముతనతపోనియ
మముల వదలక సదా ధ్యానచింతనలోనే మునిగియుండెడి
వాడు. గ్రామస్తులు మనవీరయ్యకు పెండ్లియైననుపిచ్చికుదుర
లేదనుచుండిరి. వీరబ్రహ్మము వారిమాటల లెక్కచేయక
తన వడ్రంగపు వృత్తిని నిర్వహించుచు సంసారము చేయు
చుండెను.

వీరబ్రహ్మము గ్రామజాతర సమయమున తన మహిమ జూపుట

—:o:—

అంతట గొన్నాళ్ళకు గ్రామనాయకులు గ్రామజాతర
జేయదలచితిరి. అందుకు వలసిన ధనమును చందాలుద్వారా
వసూలు చేయదలచి వీరబ్రహ్మము యింటికికూడ యితర
యిండ్లవారివలెనే చందా నిర్మయుంచిరి. ఆరుసుము (తీరువ)
అతడు చెల్లింపవలసి యుండెను. అదియుగాక గ్రామాధి
కారి వీరబ్రహ్మమును జూచి "పెద్దమ్మ" కొక రథమును
సిద్ధము చేయుమనగా మంచిదని చెప్పెను.

గ్రామజాతర దినమువచ్చెను వీరబ్రహ్మము అప్పటి కిని యింటితీరువ చెల్లించలేదు. అదియుగాక గ్రామదేవత కొఱకు చేయుమన్న రథము ప్రారంభింపక వృథాకాలము గడుపుచుండెను. పగలంతయు దేవరమహావైభవముతోజగి పిరి. రాత్రి అమ్మవారిని పొలిమేరకు జేర్పవలసి యుండెను అందుకు గ్రామాధికారి తలారులను బిలిచి|వీరన్న యింటికి వెళ్ళి రథమును దీసికొని రమ్మనెను. తలారులుపోయిరథము నడుగగా వీరబ్రహ్మము చేయలేదు చేసి యిత్తునని నెను. తలారు లేగి యతనిమాటల గ్రామాధికారికి దెలుపగాఅతడు మండిపడుచు "ఔరా! వీరయ్య కెంతగర్వము పట్టినది, చందాధనము నీయకపోవుటయేకాక అమ్మవారి రథమును చేయలేదట, అకటా! రథము లేక అమ్మవారిని సాగనంపు కొట్లు." అని భయపడి తలారులతో వీరయ్యను పిలుచుకొని రమ్మనెను.

తలారులు పోయి పిలవగానే వీరబ్రహ్మము లేచి వచ్చెను. గ్రామాధికారి చూచి కోపముతో వీరయ్యా! నీకు మూడుదినములు ముందుగజెప్పినను రథమును జేయలేదట. ఇపుడు అమ్మవారిని సాగనంపవలసిన వేళయైనది. రథము లేకయాముసాగనంపు కొట్లు. ఇక గతియేమి? అమ్మవారికి కోపము వచ్చినచో గ్రామమునే నాశనము చేయునని నెను. అందుకు వీరబ్రహ్మము నవ్వుచు అమ్మవారు రథము లేదన్న నడిచిపోవును. అందుకు మనము భయపడనేల యనెను.

---

*సూచన—కడపజిల్లాలో గ్రామజాతరను 'దేవర' అనియు, గ్రామదేవతను 'పెద్దమ్మ' అనియు బిలుచుచుందురు

ఆ మాటలకు గ్రామాధికారి మండిపడుచు నీ పిచ్చి కూతల గూయకుము. అమ్మవారెట్లు నడిచిపోవును ఎక్కడ నైనను జూచితివా మాకేల అమ్మవారిని పొలిమేర దాటిం చుట నీపనియనెను. అందుకు వీరబ్రహ్మము మంచిదని అమ్మ వారి గుడియెదుట నిలిచి "ఏమేముండా! రథములేనిదినడుచ లేవా? పొలిమేర జేరబోయెదవా లేదా" యని గద్దించగా గుఱిలోని యమ్మవారు గునగున నడచి అందరికంటె ముందే పొలిమేర జేరెను.

అందరును నిశ్చేష్టులై దిక్కుతోచకనిలిచిరి. గ్రామా ధికారి చేతులు జోడించి "స్వామీ! అపరాధము చేసితిని. క్షమింపుడు. మీరు భగవదాంశ సంభూతులుగనున్నారు" అనగా! వీరబ్రహ్మము నాయనా! చింతింపకుము. జాతరను సాంత మొనరింపుము. భయములేదు. నేను వెళ్లెదనని యింటికి కేగెను.

పోలేరమ్మతో నిప్పు తెప్పించుట

ఒకానొకనాడు ఉదయమునలేచి యూరికి వెలుపల మండు చిన్న వనమునకు బోదలచి వీరబ్రహ్మము బయలు దేరెను. అతనికి చుట్టగాల్చుట అలవాటుగానుండెను. అతడు చుట్టను చేతబట్టి పోవుచుండగా పోలేరమ్మ గుడిదగ్గఱి గొందరు యూరిపెద్దలు కూర్చుండి మాటాడుచుండిరి, వారు వీరబ్రహ్మమును జూచినతోడనే లేచి నమస్కరించి 'స్వామీ!

రండు. కూర్చుండు' అని పిలువగా సరియని పోయి కూర్చుండెను. అతడు కూర్చుండి చేతనున్న చుట్టనుగాల్చి టకై అగ్నికొరకు బ్రయత్నించెను. అక్కడయుండిన వారి కడ నిప్పును జేయు సాధనములు లేకుండెను. దారిన బోవు వారిలో ఒకరిద్దరిని అడిగి చూచిరి. ఒక్కరును చుట్టను ముట్టించుటకు నిప్పును దేజాలకపోయిరి.

అపుడు అక్కడివారిలో నొకడు లేచి స్వామీ! మీ చుట్టను నాచేతికిండు మాయింటికిపోయి నిప్పున గాల్చికొని వత్తును, లేకున్న యొకనుగ్గునై నిప్పు నిడుకొని వత్తునని నెను. అందుకు బ్రహ్మము నవ్వుచు నాయనా! నిప్పుకొరకు నీవు యింటికి బోవలెనా! వలదు నిప్పును తెప్పించెదనుచూడుడని పోలేరమ్మ విగ్రహము తట్టు చూచి "పోలేరీ! చుట్టగాల్చి కొనుటకు నిప్పును గొనిరమ్మ్మ" అనెను. ఆ మాటకు వారు ఆశ్చర్యపడి చూచుచుండ గుడిలోని దేవతావిగ్రహము బాలిక రూపమున నుగ్గునైనిప్పులబెట్టుకొనివచ్చి వీరబ్రహ్మము చేతికిచ్చి గుడిలోనికి వెళ్ళెను. ఈవిచిత్రమును గ్రామజనులకు దెలిపిరి. ఆరీతి వీరబ్రహ్మము మహాత్మ్యములు దినదినము చుట్టుపక్కల గ్రామములకు వ్యాపించెను.

వీరబ్రహ్మము దినచర్య

—:o:—

వీరబ్రహ్మము వేకువనలేచి యూరికి ఉత్తరమున నుండు సింగరాయనిది యను చిన్న నదికేగి కాలకృత్యముల

నిర్వర్తించి ఆనదిలోనే స్నానము చేయుచుండువాడు. ఆవల నదియొడ్డున నుండు చిన్నవనములో నొక అశ్వత్థవృక్షము క్రింద నుండెడి యరుగుపై కృష్ణాజినము బరచి దానిపై పద్మాసనము వేసి కూర్చుండువాడు. ఆవల మధ్యాహ్నము వఱకు యోగభ్యాసమొనరించి ఆవలి పరమాత్మనుగురించి జపతపము లాచరించి యింటికివచ్చి భుజించి యించుక విశ్రమించును. ఆవల వడ్రంగము పనియుండిన దానిని చేయుచుండును. ఆవల సాయంకాలము మరల స్నానమొనరించి రాత్రి ప్రొద్దుపోవు వఱకు తపమాచరించుచుండును.

యీ రీతి కాలమును గడుపుచుండగా వీరబ్రహ్మము దేవాంశసంభూతుడనియు, దివ్యపురుషుడనియు చుట్టుప్రక్క గ్రామవాసులకు దెలిసెను. అనేకులు వచ్చి ఆతనిని దర్శించి పోవుచుండిరి. కొందఱు వీరబ్రహ్మము శిష్యులై యుండిరి. ఆతడు శిష్యులకు, అతిథి అభ్యాగతులకు దగిన వసతుల గలిగించు చుండెను.

వీరబ్రహ్మము భార్యసమేతముగ తీర్థముల సేవించుట

వీరబ్రహ్మము కందిమల్లయ్యపల్లెలో గోవిందమ్మతో సంసారయాత్ర జరుపుచుండ నాతనికి దేశక్షేత్రతీర్థయాత్రల కేగవలెనను తలంపు కలిగెను. తన యభిప్రాయమును గోవిందమ్మ కెరిగించెను. ఆమె నాథా! మీరొకరే తీర్థయాత్రల కేగెదరాయని ప్రశ్నించెను. అందు కతడు భార్యలేక జేయు

దివ్యక్షేత్ర తీర్థయాత్రలు నిష్పాయోజనమగును. కనుక మన మిద్దరము గలిసియే యాత్రల జేయబోదమని తీర్మానించెను.

ఒకానొక శుభదినమున భార్యాభర్తలు తీర్థయాత్రలకు బయలుదేరిరి. ఆయూరిలోని పిన్న పెద్దలును, శిష్యులును వారిని గొంతదూరము సాగనంపి తిరిగివచ్చిరి. అంత నా దంపతులు ప్రయాణము సాగించుచు—

సీసమాలిక

కందిమల్లయ్యపల్లెఁగదలి పోయినవారు
శ్రీకాళహస్తిఁజేరినారు
తిరుపతి కంచియుఁతిరుపత్కితీర్థము
చేరిఁమహాబలిఁపురమునవల
అంత జిదంబరఁమంచితంబుగ జేరి
నటరాజ సేవించిఁపటుతరముగ
కుంభకోణముజేరిఁక్రుంకి కావేరిలో
బృహదీశ్వరుని మహాఁబుద్ధి గొలిచి
రామేశ్వరముజేరిఁరామలింగేశుని
గొల్చి ధనుస్కోటిఁగ్రుంకులిడిరి
అచ్చటి తీర్థాలఁనన్నింటిలో మునిగి
నియతని యీ డర్భ శయను గాంచి
పుణ్యాత్మలంతటఁకన్యాకుమారికి
జన తీర్థములగ్రుంకిఁచనిరి మధుర
అచ్చట మీనాక్షిఁఅతిభక్తి సేవించి
శ్రీరంగమంతటఁజేరి యచట

శ్రీరంగధామునిఁ సేవింప భక్తిని
గమ్మర తిరుమలఁకదలివచ్చి
హంపివిరూపాక్షునఁతుల భక్తినిగొల్చి
తుంగభద్రానదిఁతోయములను
స్నానము నొనరించిఁచని పండరీనాథు
దర్శించి సేవించిఁధర్మనియతి
చంద్రభాగానదిఁసలిలంబులో గ్రుంకి
నాశిక జేరిఁనాసదీర
కాశీప్రయాగయుఁగయ హరిద్వారము
బ్రహ్మకపాలముఁబాగజూచి
అంత జగన్నాథఁమరిగి దేవునిగొల్చి
సింహాచలేశ్వరుఁజేరిగొల్చి
ప్రీతిదాక్షారామఁభీమేశు సేవించి
గోదావరీ కృష్ణఁగ్రుంకులిడిరి

తేటగీత మాలిక

కనకదుర్గను సేవించిఁపానకాల
నారసింహుని దర్శించిఁవారు పిదప
గూర్మపూజించి కోటప్పఁకొండకేగి
అచటినుండియు శ్రీశైలఁమరిగి వారు
మల్లికార్జును భ్రమరాంబఁమహితభక్తి
గొలిచి, పోయిరి బనగానఁపల్లెజేరి
లోమతములోని శిష్యులఁలోకమునగ
వారు ఓంకార ఈశ్వరుఁజేరిగొల్చి

పోయి యామహానందీశు♦బూజచేసి
అచటినుండి యహోబిల♦మరిగినార
సింహుదర్శించి♦మిక్కిలి♦సేవ జేసి
అచట నిలిచిరి కొన్నాళ్ళు♦యలపుదీర
గిద్దలూరును జేరిరి♦శ్రద్ధనచట
నుండు పాతాళనాగేశు♦మెండుగాను
పూజలొనరించి చేరిరి♦పొందుగాను
కందిమల్లయపల్లెను♦ఘనులువారు.

ఆరీతి తీర్థయాత్రల జేయుచు శ్రీశైలమున దారిబట్టి పోవుచుండ నొక విచిత్రము జరిగినది. ఆదంపతులు పోవుచుండ దారి ప్రక్కనయొక రోగపీడితుడగు బ్రాహ్మణుడు పడియుండెను. ఆతడు దాహము దాహము అని వాపోవుచుండెను. చుట్టుప్రక్క యెవ్వరును లేకుండిరి. ఔరా! ఆశ్చర్యముగనున్నది. ఇది నిర్జనప్రదేశము. అటవికులు సహితము లేకుండిరి ఇట్టిస్థలమునం దీతడుండుట వింతగనున్నది. ఇతడు మాయాపురుషుడై యుండునా యని యనుకొనుచు కొంత దూరమునకుండు జలాశయమున కేగి సహజదయార్ద్రహృదియుడగు వీరబ్రహ్మము తన కమండలమునిండ నీటిని గొని వచ్చి యాబ్రాహ్మణుని దాహము దీర్చెను. అపుడా బ్రాహ్మణుడు మెల్లగలేచి కూర్చుండి "నాయనా! నాదాహమును దీర్చి పుణ్యము నార్జించితివి. నీఋణము ఈజన్మమున దీర్చుకొన జాలను. త్వరలో నీకుమారుడనై జన్మించి నీఋణమును దీర్చెదను" అని శ్రీ గోవిందనామస్మరణ జేయుచు క్రిందవాలి విగతజీవు డాయెను. గోవిందమ్మ కందిమల్లయ్య పల్లెకు వచ్చినతరువాత భర్తకు ఆసంఘటన జ్ఞాపక పరిచెను.

గోవిందమ్మ గర్భమును దాల్చుట

అ విధముగా వీరబ్రహ్మము గోవిందమ్మతో గలిసి దేశయాత్ర తీర్థయాత్రల ముగించుకొని కందిమల్లయపల్లె జేరినతర్వాత గొన్నిదినంబులలో గోవిందమ్మకు గర్భమును ధరించిన సూచనలు పొడజూపెను. ఆమె సంతోషముతో దినములు గడుపుచుండ క్రమముగా నవమానములు నిండి పదవమాసము ప్రారంభించెను. వీరబ్రహ్మము తన కార్య క్రమము ననుసరించి నిత్యానుష్టాన జపతపము లాచరించు చుండెను

అంత నొక శుభదినంబున గోవిందమ్మ మగశిశువును ప్రబసవించెను. అపుడు వీరబ్రహ్మము నావార్త పెద్దకొమ్మ ర్లలోనుండు తన యత్తమామలకు దెలిపెను. వారును నామకరణము నాటికి కందిమల్లయపల్లెవచ్చిరి. అంత పదు నొకండవదినమున పురోహితుని రప్పించి శాస్త్రోక్తముగ నామకరణము ''సిద్ధలింగయ్య'' యని చేసిరి.

సిద్ధలింగయ్య ముద్దులుమూట గట్టినట్లుండెను. శిశువు దినదినప్రవర్ధమానుడై బాలచంద్రునిభాతి వృద్ధియ గుచుండెను. అంతట శివకోటయ్య గోవిందమ్మను చూచి ''అమ్మా! మాకు నీవుతప్ప ఇతర సంతానము కలుగలేదు కదా. ఇంతటితో మావంశము నిలిచిపోవును. కనుక నీ ప్రథమ సంతానమును మాకొసంగినచో బాగుండును. మా వంశము నుద్ధరించినట్లగును. నీభర్తతో యోచించి చెప్పు'' మనిరి. గోవిందమ్మ భర్తతో నావిషయమై యోచించెను. అందు కతడు సమ్మతించెను.

వీరబ్రహ్మమునకు కుమారీ కుమారులు జన్మించుట

సిద్ధలింగయ్యకు సంవత్సరముదాటిన తర్వాత శివ కోటయ్య భార్యాసమేతముగ వచ్చి ఆ బాలుని గొనిపోయి పెంచుకొనుచుండిరి. అంతలో గోవిందమ్మ రెండవగర్భమును ధరించెను. ఆగర్భమునందలి శిశువు క్రమముగ వృద్ధియగు చుండ పదవమాసమున గోవిందమ్మకు ప్రసవవేదన ప్రారంభమై శుభలగ్నమునందు పురుషశిశువును ప్రసవించెను. పది దినములు దాటగనె గోవిందమ్మ భర్తతో మన శిశువునకు పేరుపెట్టవలసి యున్నది కదా ఏపేరు బాగుండు ననెను.

అందుకు వీరబ్రహ్మము దీర్ఘాలోచన మొనరించి సతీ నీకు జ్ఞాపకమున్నదా, ఈబాలుని ముఖము మన మానాడు శ్రీశైలారణ్యమునదప్పియని బాధపడుచుండిన బ్రాహ్మణుని ముఖమునే పోలియున్నది. అతడు మరణించుచు మనయింట కుమారుడనై జన్మింతుననెను. అతడే యీబాలుని రూపమున జన్మించినట్లున్నది. అతడు మరణించునపుడు గోవింద నామస్మరణ జేయుచు నసువుల బాసెను. కనుక ఈబాలునకు "గోవిందయ్య" అను పేరు పెట్టుదమని యటులే నామకరణ మొనరించిరి.

ఆవల గోవిందమాంబ యిద్దరి కుమారులను గనెను. ఆకుమారులలో మూడవవానికి శివరామయ్య, నాల్గవవానికి ఓంకారమయ్య అనునామములనిడిరి. ఆవల మరికొంతకాల మునకు గోవిందమ్మ యైదవసారి గర్భమును ధరించెను.

ఒకనాటిరాత్రి గోవిందమ్మనిద్రించుచుండగా అల్లాడు పల్లెవీరభద్రస్వామి స్వప్నమున దర్శనమిచ్చి "తల్లీ! ఈసారి

నీ గర్భమునందు నాయంశమున మరల కుమారుడు జన్మించును. ఆశిశువునకు ''పోతులూరు'' అను పేరు పెట్టుడని యంతర్ధానమాయెను.

గోవిందమ్మ ఉదయము నిదుర లేవగనే భర్తను పిలిచి రాత్రిస్వప్నమున వీరభద్రుడుపలికిన మాటలనువినిపించెను అందుకు వీరబ్రహ్మము ''అవును. ఆ వీరభద్రుడే నాకును ఎన్నోదినముల క్రిందట తాను నాకుమారుడై జన్మింతు ననియు, ఆకుమారునకు బోతులూరను పేరు పెట్టుడనియు జెప్పియుండెను. కనుక మన మీసారి జన్మించు పుత్రునికా పేరు పెట్టక తప్పదు'' అనెను. ఆవలకొన్నిదినముల కేగోవిందమ్మ మరలకుమారునిగనగా నాశిశువునకు పోతులూరయ్య యనుపేరుపెట్టిరి. అంత మరికొంతకాలమునకు ఒకకుమార్తె జన్మింపగా ఆమెను వీరనారాయణమ్మాయని పిలుచుచుండిరి.

వీరబ్రహ్మము సంతానముతో జ్యేష్ఠపుత్రుడు పెద్ద కొమెర్లలో శివకోటయ్య దత్తపుత్రుడై పెరుగుచుండెను. గోవిందయ్యకు బద్వేలు సమీపగ్రామమందుకొలమలపేటలో గిరియమ్మ యను కన్యను తెచ్చి పెండ్లి చేసిరి. శివరామాచార్యులకుఉత్పలమరముఅను గ్రామమున నుండిన పాపమ్మ అనుకన్యను దెచ్చి వివాహ మొనరించిరి. ఓంకారమయ్య పెండ్లియనంతరము పోతులూరయ్యకు కొలములపేటయండే పార్వతమ్మ యను నామెను తెచ్చి పెండ్లిచేసిరి. ఆవల నందరకంటె చిన్నదియగు వీరనారాయణమ్మను సదాచారసంపన్నుడగు విశ్వబ్రాహ్మణ యువకునకిచ్చి పెండ్లి జేసి యుచిత వస్త్రాభరణముల నొసగి, భర్తవెంట కాపుర మొనరించుటకు అత్తగారింటికి బంపిరి.

భక్తులు మఠమును గట్టించుట

అంతట వీరబ్రహ్మము యేకాంతస్థలమున జేరి తప మాచిరించుటకు దగిన మఠమును నిర్ణయంపనూహించెను ఆ సంగతి యాతని శిష్యులును, భక్తులును తెలిసికొనిరి. వారు వెంటనే స్వామివారు నిర్ణయించిన చోట భూగర్భ మునందొక మందిరమును కట్టించి చుట్టు ప్రాకారమును నెలకొల్పి భక్తులకు శిష్యులకు గావలసిన సత్రములను, విడుదలనుగూడ కట్టించి పడమటనొక కొలనును త్రవ్వించిరి భక్తులు వీరబ్రహ్మముగా రేమికోరిన దానిని భక్తితో సమర్పించుచుండిరి. ఆరీతి యేవిచారమును లేక సదా దైవ చింతన జేయుచు మఠమున తానుతపమాచరించుకొనుటకై నిర్మింపబడిన మందిరమున యేకాంతమున తప మొనరించుచు కాలము గడుపుచుండెను. భార్యాపుత్రులు యేవిచారమును లేక తండ్రి సేవల జేయుచుండిరి. గోవిందయ్య పోతులూరయ్య బాగుగ చదివి యసమాన పాండిత్యములు సంపాదించి యుండిరి.

ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

తొమ్మిదవప్రకరణము

ఓ భక్తసోదరులారా! ముందు చదివిన ప్రకరణములోవీరబ్రహ్మము పెద్దకొమ్మెర్లనుండి భార్యాసమేతుడయి కందిమల్లయ్యపల్లెజేరి గృహస్థ ధర్మమును నెరవేర్చుచు తన మహిమల గొన్నిటిని జూపుటను దెలిసికొంటిరి. ఆవల గోవిందమ్మతో యాత్రలజేసి వచ్చెననియు జదివితిరి. వీరబ్రహ్మంగారి కెందరు పుత్రులు జన్మించినదియు మఠ నిర్మాణమును గురించియు దెలిసికొని యున్నారు. ఆవలి కథాక్రమము నీప్రకరణమున దెలిపెదను.

ఆనంద భైరవయోగి సిద్ధయ్యగా జన్మించుట

కడపజిల్లాలో బద్వేలు తాలూకాలో ముదుమాల యను గ్రామము కలదు. ఆ గ్రామమునందు మహ్మదీయులనేకులుండిరి. అందుఒక దూదేకుల లేక పింజారి తెగ

కూడ గొంద రుండిరి. ఆ దూదేకుల వారిలో పీరుసాహేబు ఆదంబీయను భార్యతో గాపుర మొనరించుచుండెను.

అతడు మహమ్మదీయమతస్థుడైనను హిందూమతము నకు విరోధి కాడు. హిందువులన్నను, హిందూమతమన్నను ద్వేషింపక ప్రేమించుచుండెను. అతడు బీరవాడై నను కుల వృత్తియగు దూదేకుల పనిని విడువక న్యాయ మార్గమున ధన మార్జించి యే లోపము లేకుండ కాపుర మొనరించు చుండెను. ఆదంబీ భర్తకు దగిన భార్యయనిపించుకొని పీరు సాబు కనుసన్నలతో మెలగుచుండెను. ఆదంపతులకు సంతానము లేదను లోపము తప్ప యితర విచారము లేకుండెను.

పీరు సాహేబు ఆదంబీతోకూడ మహమ్మదీయ యాత్రలజేసి వచ్చెను. అనేక పైగంబరులను, ఖాజీలను, ఫకీరులను సంతాన ప్రాప్తికై సేవించియు లాభము లేక పోయెను. ఇకమనకీజన్మమున సంతానము కలుగదని నిరాశ జెంది యుండిరి. అట్లుండగా ఒకనాటి రాత్రి పీరుసాబుగాఢ నిద్రలో నుండగా కాశీ విశ్వనాథుడు దర్శనమిచ్చి యిట్లు చెప్పెను. "నాయనా! పూర్వము నేను కాశీలో క్షత్రియ కుటుంబమున జన్మించితిని. ప్రమాదమున నేను గోహత్య చేయుట తటస్థించినది ఆ పాప పరిహారార్థము తీర్థయాత్రల జేయుచుండ మహాపురుషుడు దర్శనమిచ్చెను. అతనిపాదము లకు నమస్కరించి గోహత్యాపాపము బోవు మార్గము నుపదేశింపు మంటిని. అందు కాయన నాయనా! ఈ పాప మూరకపోదు. నీవు మహమ్మదీయుడవై జన్మించిన యా

పాపము పోవును. అని చెప్పగా నేను నీకు బుత్రుడనై జన్మింప దలచితిని.'' అని పలికి యదృశ్యుడయ్యెను.

అంతలో పీరుసాబు మేల్కొని స్వప్నవృత్తాంతమును ఆదంబీకి తెలిపి సంతోషించుచుండెను. అంత గొన్నిదినము లకు నిజముగ ఆదంబి గర్భవతి యయ్యెను. హిందూదేవుడు స్వప్నములో గనబడి తనయింట జన్మింతునని చెప్పినవిషయ మును యితర మహమ్మదీయులకు దెలిపిన ద్వేషింతురని ఎవరికిని దెలుపకుండిరి. అంతలో ఆదంబీకి పదియవ నెలలో మగ శిశువు జన్మించెను. పీరుసాహేబు సిద్ధపురుషుని యను గ్రహమున జన్మించిన శిశువునకు ''సిద్దయ్య'' యని పేరు పెట్టెను.

సిద్దయ్య బాల్యము

సిద్దయ్య చక్కని బాలుడై ఆబాల గోపాలముచే బ్రేమింపబడుచుండెను. అతడు దినదిన ప్రవర్తమానుడై యైదేండ్లు బాలుడయ్యెను. అపుడు పీరుసాహేబు విద్యావం తుడు కాకున్నను సిద్దయ్యకు జదువు నేర్పింపదలచెను. ఆ యూరియం దొక పీఠిబడియుండగ ఆబడిలో జేర్పించెను.

అతడు బాలుడయ్యు తోడి బాలురగలిసి యాడు కొనుటలేదు. ఉపాధ్యాయుడు చెప్పినదానిని శ్రద్ధతో విని నేర్చుకొనుచు దక్కంగల బాలురకంటె మిన్న యనిపించు కొనెను.

సిద్దయ్య ఉపాధ్యాయుడు లేనప్పుడొంటరిగ గూర్చుండి యేదో పరధ్యానముగ నుండువాడు. హిందువులన్నను హిందూ దేవాలయములన్నను అతనికి యిష్టము. అతడు మహమ్మదీయ వంశమున జన్మించెనేకాని యాచారము లన్నియు హిందూ బాలుర బోలియుండెను. ఎత డెల్లప్పుడును శివా! సాంబా! పరమేశ్వరాయని పలుకుచుండెను.

అదిచూచి తల్లిదండ్రులు చాల విచారపడుచుండిరి. వారు కుమారుని చూచి నాయనా! మనము మహమ్మదీయులము. హిందువుల ఆచారములను పాటింపరాదు. వారి దేవతలను గొలువరాదు. మన దేవతలులేరా? మసీదులులేవా అని మందలించినను వినకుండెను. సిద్దయ్య చదువను వ్రాయను చక్కగ నేర్చుకొనగలిగెను.

ఇతర మహమ్మదీయు లందరును పీరుసాబును నిందింప సాగిరి. నీవు మహమ్మదీయుడవై నీ పుత్రుని హిందువుగ తయారు చేయుచున్నావని నిందింపదొడగిరి. సిద్దయ్యను చూచి యితర తురక పిల్లలు ఎగతాలి జేయుచు దమతో పిల్లరవద్దని బహిష్కరించిరి. సిద్దయ్యకు మహమ్మదీయబాలు జ్ఞేను, మతమన్నను యిష్టపడకుండెను. అతడు తురక రనలతో నాడక హిందూ బాలురతో జేరుచు వారివెంట హిందూ దేవాలయమునకు బోవుచుండెను.

ఆయూరి మహమ్మదీయుల కదిసరిపడక పీరుసాహేబును చూచి "నీవు సిద్దయ్యను ఇక హిందువుల పాఠశాలకు బంపవద్దు. హిందూ బాలుర జేరనీయకుము. హిందువుల గుడికి బోయిన దండింపుము. అటుల జేయనిచో నిన్ను మతమునుండి

వెలివేయుదు'' మని బెదరించగా పీరుసాహేబు సిద్దయ్యను బడికి పంపక నిలిపెను.

సిద్దయ్యకు అంతలో పదునాలుగు పదునైదేండ్ల వయసు వచ్చెను. అతడు మహమ్మదీయుల పలుకులను లెక్కపెట్టక సదా దైవధ్యానములో మునిగియుండెను. అతడు తలిదండ్రులను జూచి మీరు మాంసము నింటికి దేరాదు. మాంసమును భుజింపకూడదు. అట్లుచేసిన నేను యింటిలో భుజంపనని పట్టుపట్టెను.

సిద్దయ్య సదా పరధ్యానములో నుండుటయు, దైవ చింతనలో నిమగ్నుడై యుండుటయును జూచి అతడు గొప్ప భక్తుడుగా మారిపోవునని హిందు మహమ్మదీయులుతలచిరి. సిద్దయ్యకు ముడుమాలలో నుండుట కిష్టపడక ఎక్కడికైన వెళ్ళి యొక గురువును సంపాదించుకొన తీర్మానించుకొనెను.

సిద్దయ్య వీరబ్రహ్మమును దర్శించుట

సిద్దయ్య సదా పరధ్యానములోనుండి హిందూ మత పద్ధతుల నవలంబించుటజూచి పీరుసాహేబతని తమమార్గము నకు ద్రిప్పదలచి పెండ్లిచేసిన సరిపోవునని యాప్రయత్నము చేయుచుండెను. ఆసంగతి గ్రహించి సిద్దయ్య ఎవరికి దెలుపక ఎచటకైనబోయి గురూపదేశమునుబొంద సంకల్పించి యుండగా ఒకనాడాయూరికి గొందరు భక్తులువచ్చి దేవాలయమునందుండుట జూచెను. అతడు వారికి నమస్కరించి ''అయ్యా! తామెచ్చటి కేగుచుంటిరి'' అని ప్రశ్నించెను.

అందుకా భక్తులు నాయనా! మాది చాలా దూర దేశము. కందిమల్లయ్యపల్లెలో దేవాంశ సంభూతుడగు సిద్ధ పురుషుడున్నాడని తెలిసినది. అతని మఠమును జేరి యాతని శిష్యులమై ఉపదేశమును బొందుటకు వెళ్లుచున్నామనిచెప్పిరి అందుకు సిద్ధయ్య స్వామీ నేనుకూడ మీ వెంట వచ్చెదను. నాకుగూడ అతనిచే ఉపదేశముచేయించుడని ప్రతిమాలెను అందుకు వారు నాయనా! నీవు బాలుడవు. ఇంకను గొన్నాళ్లు తలిదండ్రుల యాజ్ఞలో నుండుము. అంత గృహస్థువై యుండి తదనంతరము గురూపదేశమునకు ప్రయత్నింపు మనిరి. సిద్ధయ్య అయ్యా! అసంగతులన్ని చెప్పబనిలేదు. మీ రెపుడు ప్రయాణమై పోదురో చెప్పుడనగా వారు రాత్రి యీ గుడి యందుండి రేపు ప్రొద్దు పొడిచినతోడనే బయలుదేరుదు మనిరి. అంతట సిద్ధయ్య ఏమియుననక ఇంటికిపోయి రాత్రి ఎట్లో కాలముగడిపి తెల్లవారకముందె గుడికేగి చూడగా నందొక్కరును లేకుండిరి.

అందుకు సిద్ధయ్య చాలావిచారపడి. "ఔరా! భక్తులు నన్ను మోసగించిపోయిరి. వారి ననసేల? నేను ఆలస్యముగ వచ్చితిని కాబోలు వారు ప్రొద్దుపోవునని ముందే బయలుదేరి పోయియుందురు. నేను వేగముగ నడిచియో పరుగెత్తియో పోయిన వారిని గలిసికొన వచ్చునని యెవ్వరికి జెప్పకుండ పోయెను.

సిద్దయ్యను బ్రహ్మముగారి సతీసుతులు తిరస్కరించుట

ముడుమాల వదలి సిద్దయ్య భక్తుల గలసికొనపలెనని వాయువేగమున బరుగిడసాగెను. అతడు యీవనదశయం దుండుటచే యీయాసపడక పరుగెత్తుచు దారికడ్డమువచ్చిన వారినడిగి కందిమల్లయ్యపల్లెకు దారితెలిసికొనుచు, ఎవరైన భక్తులు మందు పోవుచుండిరా యని యడిగి లేదన్నచో నిరాశజెందుచు కడకు కందిమల్లయ్యపల్లె జేరెను.

అతడు ముడుమాలలో దనకు గనబడిన భక్తులకై సత్రము లన్నింటిని గాలించి చూచెను. ఒక్కరుకూడ కనుల బడలేదు. అందుకు సిద్దయ్య "ఔరా! ఆభక్తు లెచ్చటికి వెళ్ళిరి. నాతో కందిమల్లయ్యపల్లెకు బ్రహ్మముగారి శిష్యులగు టకు వెళ్ళుచున్నామని చెప్పిరికదా. వారిచ్చటికి వచ్చినట్లు లేదు. ఎచ్చటికి వెళ్ళియుందురు. వారు మాయమగుటజూడ వారు నన్నిటకు బోయిబ్రహ్మముగారి శిష్యుడవగుమని బోధిం చుట కట్లు వచ్చిన దివ్యపురుషులై నట్లున్నది. ఇదియు నా మేలునకే జరిగినది. అని మెల్లగా బ్రహ్మముగారి మఠమును సమీపించి సింహద్వారముకడ నిలిచెను.

సింహద్వారమున నిలిచిన సిద్దయ్య "ఔరా! నేను మమున్మదీయుడను, స్వామివారిని దర్శింప లోపలికేగుట కనుమతిఇత్తురోలేదో, అయినను భవగదాంశసంభూతుడగు గురువుకు కులమతభేదము లుండవందురు. ఏమైనకానిమ్ము. లోపల ప్రవేశింతును" అని మెల్లగా లోపలికేగి వ్యాఘ్రాసన ముపై పరబ్రహ్మస్వరూపముతో వెలుగుచుండిన వీరబ్రహ్మ

మును జూచి సాష్టాంగ నమస్కార మొనరించి లేవకుండెను అప్పుడు వీరబ్రహ్మము కనులదెరచి "ఆనందభైరవయోగీ వచ్చితివా?" అని మరల గన్నుల మూసికొని పలుకకుండెను.

సిద్దయ్య తన్ను బిలువలేదని లేయక సాగిలపడియే యుండెను. అంతలో గోవిందమ్మ వచ్చి మహమ్మదీయుడు. మఠమును బ్రవేశించెను. అతనిని వెలుపలి కేగుమనుడనెను. ఆమాటలకు గోవిందయ్య వచ్చి "ఓరీ మహమ్మదీయుడా! మాయు త్తరువులేక మఠమునెట్లు జొచ్చితిని. లేచిపోయెదవా లేదా యని గద్దించిపలికెను. సిద్దయ స్వామీ! మహమ్మదీయుడనగు నేను మనుష్యుడనే కదా. స్వామిని గురువుగా భావించి ఆయనపాదసేవసేయుటకు వచ్చితిని. నాకు తల్లియు దండ్రియు గురువు అన్నియు యాయనే. నాప్రాణమునైన బాసెదగాని గురుపాదసేవ నదలి పోజాలననెను. అంతలో పోతులూరయ్య వచ్చి "ఓరీనీచా! నీవు మ్లేచ్ఛుడవు గోవధ చేయుదువు. మతవిరోధివి. నాస్తికుడవు, నీసేవల మహాపురుషుడగు మాతండ్రి స్వీకరింపడు పోయెదవా లేదా!" యని మెడబట్టి వెలుపలికి గెంటెను.

సిద్దయ్య వీరబ్రహ్మము పాదములమీదబడి శిష్యునిగా గైకొనుమని ప్రార్థించుట

పోతులూరయ్య మెడబట్టి త్రోయగా సిద్దయ్యక్రింద బడి లేచి మరల బరుగిడుచు వెళ్ళి స్వామిపాదములపైబ్రవాలి "శ్రీమన్నారాయణావతార! అనాధరక్షకా! పతితపావనా

మిమ్ము నాగురుదేవునిగా భావించి మీపాదకమలముల సేవింపవచ్చితిని. మీరునిరాకరించినచో మీ పాదములకడ ప్రాణముల వదల సిద్ధపడితిని. మీరు నిక్కముగ నన్ను త్యజించినచో నామాటనునిలుపుకొనగలను మీకుమారులు నన్ను పలువిధముల దూషించి పెలుపలికి త్రోసిరి. కడపటి సారి మిమ్ములప్రార్థించుచుంటిని. మీనోటినుండి నన్ను శిష్యునిగా జేసికొనుటకు వీలుపడదని మాట వెలువడిన మరునిముషమేనామేనప్రాణములుండవని నమ్ముడు నాచావు బ్రతుకులు నేడు తేల్చవలసిన వారు మీరేన నెను.

వీరబ్రహ్మస్వామికి సిద్దయ్య తనకడకు శిష్యుడుకా గోరివచ్చునని తెలియును. అతడే తనకుదగిన శిష్యుడనియు, సిద్దయ్య ద్వారా అనేకులకు జ్ఞానోపదేశము చేయించవలసి యున్నదనియు తెలియును. అయినను సిద్దయ్య దృఢసంకల్ప మును పరీక్షించి తన కుమారులకును ప్రజలకును సిద్దయ్య గొప్పతనమును చాట నిశ్చయించెను.

అంతట స్వామి తన కుమారులగు గోవిందయ్య పోతు లూరయ్యను బిలిచి ''నాయనలారా! మీరీతనిపై కోపించి దుర్భాషలాడితిరి. మొడబట్టి వెలుపలద్రోసితిరి. మతాంతరు డని నిందించితిరి. అయినను అతడు నన్నే నమ్మియున్నాడు. అతని శాంతస్వభావమునుజూడుడు. మానవులకుగావలసినది ధైర్య శాంతగుణమే. అట్టిగుణములు ఈతనియందు మూర్తీభవించుచున్నవి. మీరిద్దరును శాంతమును గోలు పోతిరి అతడు మీకంటె ఎక్కువేకాని తక్కువవాడుకాడు. నాకు గుణము కారణము కాని కులముతోబనిలేదు. ఈతడు

నాకు దగిన శిష్యుడు. ఇతనిని మీరు మీసోదరునిగా జూచు కొను'' డనగా వారూరకుండిరి.

సిద్దయ్యను వెదకుచు పీరుసాహేబు వచ్చుట

ముడుమాలనుండి తెల్లవారకమునుపె సిద్దయ్య తల్లి దండ్రులకు జెప్పకుండ భక్తులను గలసికొనుటకు గుడికివెళ్ళి వారు లేనందున వారిని గలసికొను తలంపుతో పరుగెత్తి పోయెను. కందిమల్లయ్యపల్లె వఱకు పరుగెత్తి చూచినను భక్తులు లేరు పీరు సాహేబు సిద్దయ్య బయటికివెళ్ళియుండు నని కొంతసేపు కనిపెట్టుకొని యుండెను, ఎంతసేపటికిరానం దున గ్రామమునందు నాలుగుమూలల వెదకెను, సిద్దయ్య కనబడలేదు. అతడు దిక్కుతోచక బావులన్నిటిని వెదకి చూచెను. కనబడలేదు. సిద్దయ్యతల్లి కొమారుడు పోయెనని తీరని దుఃఖముతో మునింగెను.

పీరుసాబు భార్య నోదార్చి నేనుపోయి సిద్దయ్యను వెదకి తీసికొనివత్తును. నీవు భయపడకుము. సిద్దయ్య మరణింపలేదు. అతనిని జంపునంతటి పాపులు ఎవరును లేరు. అందరును మన పిల్లవానిని ప్రేమించువారే కాని ద్వేషించువారు లేరు అని ప్రక్కగ్రామములలో వెదకుటకు ప్రయాణమై పోవుచుండెను. అతడూరి వెలుపలికిబోవు నప్పటి కెవరో యిద్దరు భక్తులు కనబడిరి. పీరుసాబు వారిని జూచి ''అయ్యా! మీరేమైన యొక బాలుని జూచితిరా! అతనికి సుమారు పదునాలు గేండ్లుండు'' ననెను. అందుకు వారు ''అయ్యా! మేము కందిమల్లయ్యపల్లె మఠమునుండి

వచ్చుచున్నాము. అమరమున సిద్దయ్యయను బాలుని జూచి తిమి. అతడు వీరబ్రహ్మముగారి శిష్యుడై యున్నా" డనిరి.

ఆమాటలువిని పీరుసాబు కుమారుడు బ్రతికి యుండెనని సంతోషించి యింటికివెళ్ళి ఆదంబికి కుమారుని విషయము తెలిసినది భయపడవలదు. కందిమల్లయ్యపల్లెలో నున్నాడు. నేనుపోయి వానిని బిలుచుకొని వత్తునని ప్రయాణమై కందిమల్లయ్యపల్లెకు బోయెను.

పీరుసాబు సిద్దయ్యను పిలుచుకొని పోదలచి వచ్చుట

పీరుసాహేబు ముడుమాలనుండి పోయి కందిమల్లయ్యపల్లె జేరినతోడనే యొక్కడ వెదకకుండ బ్రహ్మముగారి మఠముకడకు వెళ్ళెను. సింహద్వారమును సమీపించి మహమ్మదీయుల కిందు ప్రవేశమున్నదో లేదో యని సంశయించెను. కాని అంతలో తనకుమారుడు స్వామికి శిష్యుడై యుండ తానేలపోరాదని కుమారుని జూడవలెనను యాతురత బాధించుచుండ ఎవరేమందురో చూతమని ధైర్యము వహించి లోపలికేగెను. అతడు లోపలికేగి చూచునప్పటికి సిద్దయ్య స్వామివారి పాదసేవ చేయుచుండెను.

అంతట పీరుసాబు స్వామికివంగి మూడుసార్లు సలాము చేసి అయ్యా! ఈబాలుడు నాకుమారుడు. మాకు పుత్రులు లేరని పరితపించుచు మా దేవతల నెందరనో ప్రార్థించియు లాభము లేకపోయినది. కడకు పరమేశ్వరుడు నాకు స్వప్నలోము దర్శనమిచ్చి నీకు గుమారుడవై జన్మింతునని చెప్పి

పోయెను. ఆవల గొన్ని దినములకు వీడు పుట్టెను లేక లేక పుట్టిన వీనిని అల్లారు ముద్దుగ జెంచితిమి. ఇతడు అందరిచే గుణవంతుడనిపించుకొనెను. అట్టివాడు వృద్ధజననీ జనకులను విడచి పరుగెత్తివచ్చి మీ సేవయొనరించుచున్నాడు. తాము దయయుంచి వీనిని మాయింటికి బంపి పుత్రభిక్ష పెట్టుడని ప్రార్థించెను.

అందుకు బ్రహ్మముగారు నాయనా! సిద్ధ డెక్కడనుండి నను నీకుమారుడే యగునుగదా అతడేలకో నాశిష్యుడుగా నుండునని పట్టుపట్టినాడు. ఎవరువలదన్నను వినలేదు. అతని ధైర్యము శాంతగుణములనుచూచితిని. అతడు గొప్పవాడగు సూచనలున్నవి. నాశిష్యుడగుటకు దగినవాడు. నీవు కుమారునిపైగల ప్రేమతో బలిచికొని బోవుటకు వచ్చితివి. నేను వలదనను. అతడు వచ్చిన పిలుచుకొని పొమ్ము నేను వలదనను, అని సిద్ధయ్యనుచూచి నాయనా! నీకొఱకు నినుగన్న తండ్రి వచ్చియున్నాడు అతనితో మాటాడుము. పొమ్ము, అని పీరుసాబుతో నీ పుత్రుని ప్రక్కకు బిలిచికొని పోయి మాటాడు మనెను.

సిద్ధయ్య తండ్రితో రానని చెప్పుట

పీరుసాహేబు సిద్ధయ్యనుజూచి నాయనా! రమ్ము నీతల్లి నీకు గొన్ని మాటలు చెప్పిపంపినది. ఆ మాటల దెలిపెద రమ్మనెను సిద్ధయ్య స్వామి యాజ్ఞకై చూచెను. స్వామి సిద్ధా! పొమ్ము తండ్రితోమాటాడిన తప్పులేదనగా సిద్ధయ్య తండ్రితో మాటాడుటకు వెళ్ళెను.

తండ్రి మఠమునకడనున్న యొక చెట్టుక్రిందగూర్చుండి కుమారుని దనయెదుట గూర్చుండ బెట్టుకొని ఇటులనెను. నాయనా! నీవు లేక లేక మాకుజన్మించిన ఏకైక పుత్రుడవు. మాఅన్ని ఆశలునీపై నిడి అల్లారుముద్దుగా బెంచితిమి. ముసలి తనమున మమ్ము దిక్కు-లేనివాని నొనరించి వచ్చుట పుత్ర ధర్మమా. ఇది చాల యన్యాయము దీనిని నెవరు మెచ్చరు కనుక నీవు నావెంట యింటికి వచ్చి నీకొరకై దుఃఖించి, దుఃఖించి మంచముపట్టి కృశించి చావ సిద్ధపడిన నీ తల్లిని బ్రబదికింపు మనెను.

అందుకు సిద్ధయ్య తండ్రీ! నీవీ మాయలోక విషయ లంపటుడవై మాటలాడుచున్నావు. ఈ లోకముతో నాకు బనిలేదు. నీవు తల్లిదండ్రి కుమారుని సంబంధమునుపలుమా ఱనుచుంటివి. నాతల్లి యున్నటులుండి మరణించినచో ఆమె వెంట నీవుకూడ మరణింతువా? నేను మరణింతునా? మరణిం పము. నేను చచ్చిన నావెంట మీరు చావరు. మన మందరముమరణించినపుడు మనయిల్లు, భూములు, ధనము మన వెంటవచ్చునా, కనుక ప్రపంచములో 'నా' యనునది లేదు. అహమనుభావమును మరచినవాడే మనుష్యుడు. మరువని వాడు పశువు. కనుక నాకు "నా" అనునది లేదు. నాతండ్రి నాతల్లి, నాయిల్లు, నావాకిలి నావికావు. నాకు వారితో సంబంధములేదు. నేనువారితో సహకరించి నాజీవిత్రమునుపాడు చేసికొన దలపలేదు. నేనుకోరునది సద్గతి. ఆసద్గతి పొందుటకు గురువవసరము అట్టి గురుసార్వభౌముడు ప్రాప్తించిన ఫల మున నాకు లభించినాడు, అతనివదలి నేనురానని. అపుడు నీవు యింటికి బోవచ్చునని నెను.

అందుకు పీరుసాబు నాయనా! గృహస్థుడవై యుండి నీధర్మముల నెరవేర్చినచో సద్గతులేల గలుగవునీ గురువు గృహస్థయి యుండలేదా! నీవును వివాహమాడి సంతాన వంతుడై తలిదండ్రుల సేవజేసిన చాలదా రమ్మా, నీ తల్లి నొకసారి చూడరమ్మనెను. అందుకు సిద్దయ్య తండ్రీ! మరల నాతల్లి యనుచుంటివి నాతల్లి నాకు లేదు నాకీ ప్రపంచమున నుండు పురుషులందరు తండ్రులే స్త్రీలందరు నాతల్లులే తక్కుంగల మానవులందరు నా సోదరులే నా గురుడు "మానవసేవయే మాధవసేవ" యని బోధించినాడు కనుక నేను గురూపదేశమును బొంది సర్వేశ్వరుని ధ్యానించుచు మానవసేవ జేయుదునేకాని కేనలము మిమ్మా సేవించుచు, వివాహమాడి సంసారసాగరమునబడి భార్యాబిడ్డలను తిమిం గలముల వలన గలుగు బాధలను ననుభవింపజాలను నన్ను బాధింపవలదు నా గురుదేవుడు నాకింకను ఏ యుపదేశ మును జేయలేదు గురుదేవుని పాదపద్మముల వదలి రాను పొమ్మా అని గురుసన్నిధిని కూర్చుండబోయెను.

పీరుసాహేబు

వీరబ్రహ్మంగారి హితోపదేశమును విని
సిద్దయ్యను స్వామివారికే వదలి పోవుట

సిద్దయ్య తండ్రిమాట వినక తన నిశ్చితాభిప్రాయ మును వెల్లడించి మరల స్వామి సన్నిధికేగి కూర్చుండెను. అపుడు పీరుసాబు చింతాక్రాంతుడై మరల స్వామి సన్నిధి

కేగి స్వామీ! నాకుమారుడు కడకు ననున్ను ధిక్కరించి మీకడకు వచ్చెను. నామాట వినలేదు. మీరైన వానికి దగిన మాటలజెప్పి నా వెంటవచ్చునట్లు జేయుడు. నాకు బుత్రభిక్ష పెట్టుడు. నాభార్య కుమారుడు తప్పిపోయెనని దుఃఖముతో గ్రుంకిపోయినది. ఆమె ప్రాణములగాపాడుడు. మీరు తప్ప మమ్ము గాపాడువారు లేరని పరిపరి విధముల ప్రార్థించెను.

అందుకు బ్రహ్మముగారు నాయనా! నీవు మాయా లోకమునందుంటివి. తండ్రియగు నీమాటనే ధిక్కరించినవాడు నామాటల మాత్రము వినగలడా? అతడు నన్ను గురువుగ భావించి యుండవచ్చును. నేనింకను నీకుమారుని శిష్యునిగా భావింపలేదు. అతనికి నేనింకనుగురూపదేశమొనరింపలేదు. అయిన సిద్దయ్య నాశిష్యుడగుటకు దగినవాడని నాకుతోచు చున్నది. అతడు నీవెంట వచ్చిన దోడ్కొని పొమ్ము. అని సిద్దయ్యనుచూచి నాయనా! ఇంటికిపోయి వృద్ధులగు నీ జననీ జనకులసేవ జేయుచుండుము. అందువలన నీకు సద్గతి కలుగ గలదు. నామాటవిని యింటికి వెళ్ళుమనెను.

అందుకు సిద్దయ్య స్వామీ! నేను ఇంటికి తిరిగి పోవు టకు మీపాదములకడకు రాలేదు, నాజీవితమంతయు మీకు సేవజేయుతలంపుతో వచ్చితిని. అంతటి నిశ్చితాభిప్రాయం జనించుట కేదియో కారణముండక తప్పదు. ఆకారణము ఊహింప లేకున్నాను. అంతటి శక్తియు నాకు లేదు. ఇది భగవంతుని సంకల్పమైయుండునా యనియు దోచెడిది. నేను మిమ్మువదలి త్రికరణశుద్ధిగా నాతండ్రివెంట బోదలపలేదు. అతడు నాపై యాసవదలి పోవలసినదే, ఒకవేళ మీరు నా తండ్రి నోదార్చదలచియో, లేకనాతనిదుఃఖమును బాపవలె

ననియో తలచి నన్ను శిష్యునిగా జేకొనని చెప్పిన చోనా పూర్వపాప ఫలమిట్లున్నదని భావించి, మరియొక జన్మమున నైన మీశిష్యుడ నగుటకు మీపాదములకడ జీవములదొర గెదను కాని యింటికి బోవుట కలలోని వార్త. మీరింకను నాశీలమును మనోనిశ్చయమును శంకించుచున్నట్లున్నది. వేయేల నాప్రతిరక్తనాళములోను, ప్రతిరక్తబిందువే కాక ప్రతియణువునందును మీపవిత్రనామాంకురములు ప్రజ్వరిల్లు చున్నవి. మీరు పరీక్షింపదలచిన చో నా హృదయమును, జీల్చి చూడవచ్చునుగాని నన్ను మరల యింటికి బొమ్మని మాత్రము చెప్పవలదు.

అపుడు వీరబ్రహ్మము పీరుసాహేబును చూచి "అయ్యా! నీకుమారుని తత్వమును గ్రహించితివా లేదా సిద్దయ్య చెప్పినట్లు అతడు నాశిష్యుడు కాగోరి వచ్చుటలో రహస్యమున్నది. అతడుకాని నీవుకాని దాని నూహింప జాలరు అని పీరుసాబు నొసట విభూతిని దిద్దెను. పీరుసాబు తానెవరో గ్రహింపలేనివా డాయెను. అపుడు స్వామి "అయ్యా! నేచెప్పడానిని చక్కగవినుము. సిద్దుడు నీకుమా రుడుకాడు. ఇతడు పూర్వజన్మమునం దొక క్షత్రియవంశ మున పరమేశ్వరుని సంకల్పమునజన్మించెను. అతడు యౌవన దశలో బ్రమాదమున గోవును చంపెను. ఆ పాపమును పోగొట్టుకొను మార్గమును బోధింపమని నాకడకు వచ్చి యుండెను. అపుడు గోహత్యాపాతక విముక్తుడవగుటకు నీవు మహమ్మదీయుడుగా జన్మించి నాకు శిష్యుడవైనచో సరి పోవునని చెప్పి పంపితిని. అప్పుడు నేను వీరంభొట్లయ్య యని పిలువబడు చుంటిని. సిద్దయ్య పూర్వపు పేరు ఆనందభైరవ

యోగి. అయ్యానందభైరవయోగి మరల శంకరుని సంకల్ప మున నీయింట జన్మించి నాకు శిష్యుడుగా వచ్చెను. ఇది పరమరహస్యము. ఇక బొమ్మ్ము" అని చెప్పగా పీరుసాబు లేచి నేలకువంగి మూడుసార్లు సలాముచేసి మహానుభావా! సెలవు అని తిరిగిపైన చూడక ముడుమాల దారిపట్టెను.

పీరుసాబు ముడుమాల కేగుచు సగము ప్రయాణము చేసిన తర్వాత బ్రహ్మముగారి యెదుట గూర్చుండి వినిన దంతయు మరచి మరల మనలోకమునకు వచ్చెను. సరిగురు దేవు డేమియో చెప్పెను అవన్నియు మరచితిని సిద్దయ్యను గూర్చి యేమియో చెప్పి నన్ను సమ్మతించినట్లు చేసెను. అదియుకాక సిద్దడును పట్టినపట్టును వదలలేదు. వాడెచ్చట నుండినను సరియే, సమముగ నుండిన జాలును ఇంటికిపోయి నాభార్య నోడార్చి బెంగను మాన్పించెదను. అపుడపుడు ఆమెను కందిమల్లయ్యపల్లెకు బిలుచుకొనిపోయి పుత్రుని జూపించుచుండెదనని యనుకొనుచు ముడుమాల జేరెను.

సిద్దయ్యకు బ్రహ్మోపదేశము చేయుట

ఒకానొక దినమున సిద్దయ్య బ్రహ్మంగారి పాదసేవ జేయుచుండగా బ్రహ్మంగారు ప్రేమతో నాయనా! ఇప్పటినుండి నీవిచారములన్నియు పటాపంచలై పోవును. నీవు నిజమగు భక్తుడవు. భక్తునకు సుఖదుఃఖములుండవు అతనికి బాహ్య ప్రపంచముతో సంబంధ ముండరాదు, నీకు బ్రహ్మోపదేశ మొనరింపవగు ముహూర్త మేతెంచినది నీవు స్నాన మొన

రించి పరిశుద్ధుడవైరమ్ము. రక్తమాంసపురీషములతో నిండిన నీదేహమును మంత్రములతో నింపి పవిత్ర మొనరించెద ననగా వెంటనే సిద్ధయ్య స్నాన మొనరించి విభూతిందాల్చి గురుదేవుని ప్రేమాల గూర్చుండెను.

అపుడు వీరబ్రహ్మముగారు సిద్ధయ్యను నాయనా! పద్మాసనము వేసికూర్చుండి నన్ను చూచుచుండుమని యతని తలపై తనచేతినిడి నొసట మూడుసార్లు తుడిచి నాయనా! నీపూర్వపు ప్రాలదుడిచి మరల ప్రావాసితిని నీనాలుకనుజాపు మని బీజాక్షరములలిఖించి వీపును తడుముచు నాయనా! నీకు పంచాక్షరిమంత్రోపదేశ మొనరించెదనని యాతని చెవిలో "ఓం హ్రీం క్లీం శ్రీం నమశ్శివాయ పరబ్రహ్మణే నమః" అను మంత్రమును మూడుసార్లు పలికెను.

సిద్ధా! నీచిత్తమును చెదరనీయకము నేజూపెడి లక్ష్యమును దృష్టిసారించి చూడుము ఆవల అంతర్లక్ష్యంబునుగని మనస్సును వాయువును స్థంభింపజేసి భ్రూమధ్యంబున దృష్టి నిలిపి పరంజ్యోతిని గనుము.

బహిర్లక్ష్యము

నాయనా! పైరీతి దృష్టిని యచంచల మొనరించినచో నాలుగు అంగుళముల మేరలో నైల్యంబనునధియు, ఆఱు అంగుళములలో ధూమ్రంబనునధియు, ఎనిమిదంగుళములలో నరుణకాంతియు, గోచరమగును. అదేజ్యోతియే మరల బండ్రెండంగుళముల దూరమున బీతవర్ణంబుగ నుండును. ఈనాలైదు వర్ణంబుల గనినంతనె నీశిరమునెత్తి యేకాగ్ర చిత్తుడవై చూచినచో చంద్రునివంటి వెలుగుతో జ్యోతి

కానంబడును అపుడు ఆఱుద్వారములను చేఁ బ్రవేశ్యచే బంధించి మనస్సును జ్యోతిలో లీన మొనరించిన ప్రణవ నాదము వినదగును దీనిని మరువక సాధనము జేయుము.

మధ్యమ లక్షణము

ఆవల అచంచల దృష్టితో మరికొంతసేపు చూచిన సూర్య చంద్ర నక్షత్ర ప్రకాశంబును, మెరుపుతో గూడిన పంచభూతములు గోచరమగును అటులనే మరికొంతసేపు చూచుచుండిన యా జ్యోతియందు పంచవిధ ఆకాశంబులు గనంబడును. ఆ పంచవిధ ఆకాశంబులగని తన్మయత్వము జెందుటయే మధ్యమ లక్షణము.

అంతర్లక్ష్యము

తదుపరి యేకదృష్టితో ముక్కు చివరభాగమును జూచినచో ఆ జ్యోతి రసంబున కాశ్రయమై గోచరించును ఆ జ్యోతియే భ్రూమధ్యమున సచ్చిదానంద చిహ్నాములకు సాక్షి స్వరూపంబై బయటికి కనబడుచుండును. ఆ రీతి భ్రూమధ్య జ్యోతియందు 'పరమాకాశ్హైరణ్య' ములను రెండును స్ఫటికవర్ణమునవాయుస్థాపనమందుండి వెలువడును అపు డది జీవతారక మనిపించుకొనును ఆ తారకయోగము ననుదినము నభ్యసించినచో స్థిరత్వము సిద్ధించును స్థిరత్వము

సూచన—1 నిరవధికంబనునదియు 2 గాఢాంధకారమును 3 కాలాగ్నింబోలిన పరాకాశంబును 4 తత్వాకాశంబును 5 అనంతకోటి సూర్యప్రకాశంబులు పంచవిధాకాశంబు లనంబడును.

సిద్ధించినచో అంతరాత్మ పరమాత్మతో నేకమగునట్లు జేయ నగును. ఈ యోగంబువలన సాధింపరానిది లేదు. ఇది అంతర్లక్ష్యంబనంబడును.

కనుక సిద్ధా! పై పద్ధతుల ననుసరించి నీవు తారక యోగము నభ్యాస మొనరించుచుండుము. మఱమున నీకు ప్రత్యేక వసతి గల్పింతును. అచ్చటి కితరులురారు. నీవు యోగాభ్యాసము, భగవధ్యానమునం దొనరించిన పిదప నాకడ నుండుము. నీకు మరికొన్ని యితర విషయములనేర్పు చుందు ననగా సిద్ధయ్య గురువు నానతి చొప్పున జేయు చుండెను.

సిద్ధయ్యకు సృష్టి రహస్యముల దెలుపుట

ఒకనాటిరాత్రి బ్రహ్మముగా రేకాంతమున గూర్చుండి సిద్ధయ్యతో నాయనా! నీకిదినము సృష్టి రహస్యముల దెలి పెద వినుమనెను. సమస్త ప్రపంచము ప్రకృతి జనితమై యున్నది. అన్నిటికిని మించిన యొకశక్తియున్నది. దానిని ఆదిశక్తి యంచురు. ఆశక్తివలన సమస్తమును గలిగినవి. భూమ్యాకాశములు, త్రిమూర్తులును, సూర్యచంద్రాది గ్రహములు అష్టదిక్కులు, సమస్త జీవకోటియు, సర్వవస్తు సముదాయము వేయేల మనకు గోచరమగు సర్వమును, నీవును నేనును ఆదిశక్తివలన జన్మించినవారమే.

ఆశక్తి పరమాత్మ నాశ్రయించును. ఆ పరమాత్మ సర్వవ్యాపకమై యుండును. అట్టి దానికి.

తే-గీ. లేదు దోషంబు గుణమును♦లేదు రోగ
లేదు లోప, మతీతంబు♦నదియు సర్వ
వ్యాపకంబగు నద్దాన♦భక్తులెల్ల
జూడ నొప్పును యది ''పరం♦జ్యోతి'' యనగా

ఆరీతి యుద్భవించిన విశ్వము అనంతప్రకాశ యుత మను పరంజ్యోతి ననుసరించి యుండు మబ్బును బోలి తన్నాశ్రయించిన ప్రకృతియందు ప్రతిఫలించును. అట్టి ప్రకృతి నుండియే.

తే-గీ. బ్రహ్మ విష్ణు మహేశులు♦బరగివారు
ముగ్గురు గాంచిరి ''త్రి♦మూర్తు'' లనుచు
సృష్టిస్థితిలయ కారక♦దృష్టితోడ
అన్నిటికిని యతీతులై♦యలరుచుండి.

ప్రకృతాంబ అనగా ఆదిశక్తి సంజనితులగు త్రిమూర్తులు యామెచే నిర్ణయింపబడిన కార్యత్రయము (సృష్టి, స్థితి, లయ)ల జేయుచుందురు.

సిద్దయ్యకు భూలోక మర్మముల దెలుపుట

సర్వశక్తియుతమగు 'ఓం' అను శబ్దమును ప్రకృతి యందె జన్మించినది. ఆశబ్దమునుండి,

తే-గీ. అట్టి ఓంకార శబ్దము♦నందుబుట్టె
ఆకసము, వాయు, వగ్నియు♦నవల జలము,
భూమి, యనునవి పంచ♦భూతములని
పిలువబడు భూమినుండియే♦గలుగు నన్ని

ఆ భూమినుండియే అఖిల జీవుల కాధారమగునట్టి యాహారము పుట్టును. ఆ యాహారమునకు పంచభూతముల సహాయముచే నానావిధ ప్రాణు లుత్పన్న మగుచున్నారు ఒకొక్కక ప్రాణికి దానికిదగిన ప్రత్యేక దేహము లేర్పడును ఆదేహమున పరబ్రహ్మ ప్రాణమను శక్తిని ప్రవేశపెట్టును ఆప్రాణశక్తి దేహమున ప్రవేశించిన మరుక్షణమునుంచియే దేహము వృద్ధిజెంద మొదలిడును.

అట్టి పంచభూతాత్మకము వలన జన్మించిన సమస్త ప్రాణికోటిలో మానవులు మొదటితరగతిలో జేరుచున్నారు యెందులకనగా మానవున కితర ప్రాణికోటి కొసగని జ్ఞాన మొసగబడినది. అట్టి జ్ఞానమును సద్వినియోగ మొనరించు కొని విజ్ఞానులై ఆత్మానాత్మ వివేకమువలన ఆపరబ్రహ్మ మును కనుగొనవచ్చును. అట్టివారు ధన్యులనబడుదురు. ఆధన్యత ఊరకరాదు. అందుకు యోగాభ్యాసము కావల యును. ఆయోగాభ్యాసము గురువు సహాయమునగాని రాదు నాయనా! యోగాభ్యాసమును గూర్చి మరియొకసారి వివరింతును. ఇపుడు హంసగాయత్రీ జపమును గుఱించి తెలిపెదను ఆ జపమువలన పరబ్రహ్మమును గనుగొనవచ్చును.

సిద్దయ్యకు గాయత్రీ జపమూలము నెఱింగించుట

నాయనా! సిద్దా! గాయత్రీసూత్రమును ధరించినవారే గాయత్రీ మంత్రమును జపింపనర్హులనిభావింపవలదు. ఇపుడు గాయత్రీ సూత్రము (జన్నిదము)ను అందరును ధరించు

కాలము రానున్నది కేవలము జన్నిదమును వేసుకకును, యితరుల నెగతాళీ యొనర్చుటకును ధరించిన వారిని జూచి గాయత్రీ దేవ్యోపాసకులని భ్రమింపవలదు. గాయత్రీదేవి నుపాసింప శక్తిగలవారు దానిని ధరించిన ఫలముగలదు కాని లేకున్న గొన్ని దారములనుదగిలించుకొనినలాభమును మాత్రమే పొందగలరు ఆమర్మము దెలియక వేడుకార్థము జన్నిదము ధరించువారు కేవలము పాపమును కొని తెచ్చి మూటగట్టి భద్రపరచినవారగుదురు.

కనుక నీవు గాయత్రీ సూత్రమును ధరింపగోరవలదు అది లేకనే నీవాదేవి నుపాసింప వచ్చును. మెడలో నూలు పోగులు లేకపోయెనేయని విచారింపకుము, కనుక నీవు స్థిర చిత్తుడవై నేజెప్పు దానిని వినుము.

మన దేహమునందు జీవాత్మకలదు అదిప్రాణవాయు వుతో గలసి హంసరూపమున 'రేచక పూరక'ము లను వానితో దిరుగుచుండును మన హృదయమునుండి ప్రాణ వాయువు ముక్కురంధ్రముల ద్వారా బయటికి పండ్రెండంగు ళములదూరము వ్యాపించినచో నది "రేచకము" ఆప్రాణ వాయువే అచట నర్థనిముషము లయ్యెనై బహిఃకుంభ మని పించుకొని మరల యుచ్ఛ్వాసముపలన హృదయమును జేరు టకు లోపలికి బోవును. అపు డది "పూరకము" అపుడది అంతఃకుంభకము అనబడును ప్రాణవాయువునందు జైతన్య శక్తులును మానవసాదులును మిళితమై యుండుటచే దానిని "హంస" యను పేరును వీలుతురు పూరకమున హం అను వర్ణమును రేచకమున సం అను అక్షరమును గలవు పూరక రేచక సంయుతమగురూపము 'సోహం' అనబడును. అదియే

గాయత్రి. ఆగాయత్రిని, ప్రతిదినము ఇరువదియొక వేయి ఆఱువందల హంసలు సంచరించుచుండును అట్టి యజప గాయత్ర్యనుష్టాన నియతుడగు భక్తుడు తన జన్మమును సార్థక మొనరించు కొనును.

వీరబ్రహ్మము సిద్దయ్యను గృహసును కాగోరుట

నాయనా! గృహస్థాశ్రమ ధర్మములనాచరించు వారు 'ధర్మార్థ కామమోక్షములు' అనుచతుర్విధ పురుషార్థముల కర్హులై యుందురు అట్టి గృహస్థు లిహపరలోకములలో గూడ సుఖింతురు గృహస్థు తదితర యాశ్రమవాసులకు కల్ప తరువు వంటివాడు గృహసు పిత్రుదేవతలకు జేయుకర్మలు, తిలోదక దానములు మున్నగువానివలన వారిని దృప్తిపర చును గృహస్థు సంవత్సరమున కొకసారి అనగా పిత్రుదిన మున పిండప్రదానము చేతను, తిలోదక దానముల వల్లను పిత్రుదేవతల దృప్తిపరచును అందుకు బిత్రుదేవతలు సంత సించి వానికి సుఖమును గలిగింతురు. మానవుడు సదా తన కర్మఫలమువలన వివిధ యోనులయందు బుట్టి చచ్చు చుండును అట్టి మానవుడు కర్మనుభవదతి స్వాతంత్ర్యముగ జీవింపజాలడు.

కనుక నీ విపుడు మానవజన్మమున నున్నావు ఈ జన్మము దొరుకుట కష్టము ఇపుడు నీవునునావలనేగృహస్థా శ్రమమును స్వీకరింపక తప్పదు. ముందు గృహస్థువై ఆధర్మ ములనిర్వర్తించిన చోతర్వాతవానప్రస్థ,సన్యాసాశ్రముల

కర్ష్ణాడ వగుదువు కనుక నీవు ఇపుడే వారినిసేవించి వివాహ మూడి జననీజనకులను ఆనందసాగరమున నోలలాడించుము. గృహస్థు కేవలము అన్నింటిని తనపైన వేసికొని విపరీత కార్య ములకు గడంగక తామరాకుపైనుండు జలబిందువువలె జరించుచుండవలెను. ఈ నాయాజ్ఞ ననుసరించి తలిదండ్రుల కడ కేగుమనెను.

సిద్దయ్య గురువు ఆజ్ఞను మీరజాలక గృహస్థు కాదలచుట

—:o:—

అంతట సిద్దయ్య స్వామీ! మీయానతి మీర నే నెంతటివాడను. మీయిష్టము ననుసరించి తలిదండ్రుల జేరి వారికి సేవజేయుచు వివాహమూడి వారికి సంతసము గలి గించెదను. నేను పోయినతోడనే యీమహమ్మదీయుని పీడ వదలెనని సంతసింపక సదా మీకరుణామృతమును నాపై జల్లుచు నన్ను తరింపజేయు భారము మీదే. నేను మిమ్ము వదలిపోయినను పోకున్నను నొకటే. నాదేహముమాత్రము ముడుమూలలో నుండును కాని నాప్రాణము మీపదముల నాశ్రయించి యుండుట నిక్కము. నేను ప్రతిదినము రాక పోయినను వారమున కొకసారియైన వచ్చి మీపాదసేవ చేయ కుండజాలను. పాలముంచినను నీటముంచినను మీరేగతి యని స్వామి పాదములకు సాగిలబడి సెలవుగైకొనిపోయెను.

సిద్దయ్య ముడుమూల కరిగి, యింటికి వెళ్ళినతోడనే జననీజనకుల పాదములకు నమస్కరించెను. అతనిని జూచిన తోడనే తల్లి "నాయనా! ఎపుడు వచ్చితివి అన్నమెచ్చట

తింటివి. అయ్యో! కడుపు లోపలికి పోయినదే రమ్మా. ఇపుడే వంట సిద్ధముచేసితిని. తండ్రీ నిన్ను జూచుభాగ్యము లభించినందులకు అల్లాకు పదివేల సలాము'' లనెను.

అంతట సిద్దయ్య స్నానముచేసి గురుధ్యానానంతరము భుజించి కూర్చుండెను. సిద్దయ్య వచ్చిన సంగతి విని బంధు మిత్రాదులు వచ్చి చూచి చాల సంతసించిరి. అంతట పీరు సాబు తన బంధువుల ఇంటిబిడ్డను తెచ్చి వివాహమొనరింప దలచెను. ఆకన్యక తలిదండ్రులును సమ్మతించిరి. ఒక శుభ దినమున అచ్చాంబీ సిద్దయ్య వివాహమును వైభవముగ జరిపిరి. వివాహానంతరము సిద్దయ్య భార్యసమేతముగ వెళ్ళి గురువును దర్శించి కానుకల సమర్పించి ఆశీస్సులబొంది తిరిగి వచ్చిరి.

సిద్దయ్య గృహస్థయ్యు గురువును విడువజాలక పలు మారు ఆయన సేవజేయుటకు బోవుచుండెను. ఒక్కొక్కసారి పోయిన నెలలతరుబడి గురువును వదలి రాకుండుటచే పీరుసాబు భార్యతోగూడ వెళ్ళి ఇంటికి దోడ్తెచ్చుచుండెను.

ఓమ్

శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పదవప్రకరణము

ఓ భక్త సోదరులారా! మీరు ముందటి ప్రకరణమున ముడుమూలలో సిద్దయ్య దైవాంశవలన జన్మించెనని తెలిసి కొంటిరి. ఆవల సిద్దయ్య చిన్నతనమునుండియే భక్తిమార్గ మునుబుట్టుటను జదివితిరి. తదనంతరము అతడుకందిమల్లయ్య పల్లెకు ఒంటరిగపోయి బ్రహ్మముగారిని దర్శించి, వారికృపను సంపాదించి కడకు ప్రియ శిష్యుండై బ్రహ్మోపదేశమును బొందినది గ్రహించితిరి. ఆవల గురువు నానతి మీరజాలక ముడుమూలకేగి వివాహితుడై తలిదండ్రుల సేవజేయుచుండె నని చదివితిరి. ఆవల జరిగిన చరిత్రమును దెలిపెద వినుడు.

వీరబ్రహ్మము ఉత్తరదేశ సంచారము వెడలుట

వీరబ్రహ్మస్వామి గృహస్థాశ్రమ మందుండియే జను లకు ధర్మమార్గోపదేశ మొసరించుచుండెను. చాలదూరదేశ ములనుండియు అనేకులువచ్చి స్వామివారిశిష్యులై మతమును

గనిపెట్టుకొని యుండిరి. కొందఱు జ్ఞానోపదేశమును బొంది తమ నెలవులకుంబోయి సన్మార్గమున గాలముగడుపుచుండిరి. ముడుమాలనుండి ముఖ్య శిష్యుడగు సిద్దయ్య పలుమారు వచ్చి స్వామిని సేవించి పోవుచుండెను. అట్లు కొంతకాలము జరిగిన తర్వాత శ్రీ స్వాములవారొక దినము సిద్దయ్యను చూచి "సిద్దా! నాకు ఉత్తరదేశసంచార మొనరింపవలెనని బుద్ధిపుట్టినది. అందుకుతగిన సన్నాహమొనరింపుము. సపరివారముగ బయలు దేరవలె" ననగా సిద్దయ్య స్వామియాజ్ఞ ననుసరించి ప్రయాణమునకు సర్వము సిద్ధము చేయించెను.

ఒక శుభదినమున వీరబ్రహ్మేంద్రస్వామి సపరివారముగ బయలుదేరెను. స్వామి యంగరక్షకుడును ప్రియ శిష్యుండునగు సిద్దయ్య స్వామి ప్రక్కనుండెను. అందరును కందిమల్లయ్య పల్లెనుండి కదలి గిద్దలూరు, కంభము, మార్కాపురము లాదిగాగల గ్రామములలో మజిలీల చేయుచు జనులకు సన్మార్గముల బోధించుచుండిరి. స్వామి వారు వచ్చుసంగతి దెలిసికొని గ్రామవాసులు మంగళ వాయిద్యములతో నెదురేగి యాహ్వానించి పిలుచుకొనిపోయి తగిన విడిది నేర్పాటు జేయుచుండిరి. స్వామివారికి బిక్ష నేర్పాటుచేసి సగౌరవముగ సాగనంపుచుండిరి. ఆలాగు ప్రయాణము చేయుచు గుంటూరు, విజయవాడ, ఖాజీపేట మున్నగు పట్టణములు దాటి కతిపయి దినంబులలో గోలు కొండ రాజ్యములోజేరిన సికిందరాబాదు జేరిరి.

అచ్చట తాత్కాలిక మఠమును గుదిరించుకొనిరి. ప్రజలు స్వామిని యాహ్వానించి తగురీతి సన్మానించిరి. విశ్వ బ్రాహ్మణులు తండోప తండములుగవచ్చి స్వామినిదర్శించి

భక్తులకుదగిన యేర్పాటు జేయుచుండిరి. ఒకనాడు సికిందరా బాదు విశ్వబ్రాహ్మణులందరుసభగావించి స్వామివారికిగొప్ప ఉత్సవము జేయ తీర్మానించుకొనిరి. ఆ సంగతి విని పట్టణ వాసులు గృహములను నగరమును చక్కగ నలంకరించిరి. ప్రతి వీధికి రెండుప్రక్కల పచ్చతోరణములు గట్టించిరి. గృహములకు వివిధ వర్ణముల కాగితముల మాలలతో నలకరించి వీధుల చక్కగ శుభ్రము చేయించిరి. స్వామి వారిని పల్లకిమీద గూర్చుండ నియమించి నగర ప్రధాన బాటలయందు ఉత్సవము జేసిరి.

ఒకనాడొక విశ్వబ్రాహ్మణ పండితుడు స్వామి కడ కరుగుదెంచి "స్వామీ! నేనొక విషయము తెలిసికొనవలె ననుబుద్ధి జనించుటచే మీకడకు వచ్చితిని. ఆవిషయమును వివరించి నా చిరకాల సంశయముల దీర్చవలెనన గా స్వామి నాయనా! నీకోరిక నెరుంగుదును. నీవు "లక్ష్యత్రయముల" వివరముల దెలిసికొనదలచి వచ్చితివిగదా యన యతడు తన మనస్సులో దలచినదాని నెట్లు దెలిసికొనెనని యచ్చెరు వందెను. అంతట స్వామి యా విశ్వబ్రాహ్మణుని జూచి నాయనా! ఇటువచ్చికూర్చుండుమనెను. అతడు వచ్చిసమీప మున గూర్చుండగనే స్వామి సిద్ధా! నేను నీకుకందిమల్లయ్య పల్లె మఠమునందొకనాడు లక్ష్యత్రయముల గూర్చి చెప్పి తిని. అదినీకు జ్ఞాపకమున్నదో లేకో తెగిసికొనవలెను. ఏదీ! ఆ వివరముల నతనికి దెలుపుము చూచెద ననెను. అంత సిద్ధయ్య "లక్ష్యత్రయముల" గూర్చిచక్కగనుపన్యసించగా ఆ విశ్వబ్రాహ్మణుడు సంతసించి నిజగృహంబున కరిగెను.

హైదరాబాదు నవాబు స్వామిని ఆహ్వానించుట

అంత మరునాడు విశ్వబ్రాహ్మణ పండితుడు హైదరాబాదునకేగి నవాబును దర్శించి "సర్కార్! కందిమల్లయ్య పల్లె మఠాధిపతియగు వీరబ్రహ్మేంద్ర స్వాములవారు సపరివార సమేతముగ సంచారము బయలుదేరి యిపుడు మన సికిందరాబాదు వేంచేసిరి. అతడు పతితులకు జ్ఞానోపదేశమొనరించిపావనులుగ చేయుచున్నాడు. అతడు భగవంతుని యవతారమని లోకము భావించుచున్నది. స్వామివారి మహాత్మ్యమునెరింగి మహమ్మదీయుడగు సిద్దయ్య హిందూ ధర్మముల ననుసరించి వారికి ముఖ్య శిష్యుడై యున్నాడు. నేను స్వామిగారిని నాసంశయముల దీర్పగోరగా నతడు తన శిష్యుడగు సిద్దయ్యతో నాసంశయముల దీర్పించెను. అదియు గాక మరియొకవిచిత్రమును దెలిపెద వినుడు. నేనుమనస్సున స్వామివారి నడుగదలచిన దానిని వారు ముందే దెలిసికొని నాకు శిష్యునిచే బోధింపజేసిరి. మీరుకూడ స్వామిని దర్శించుట మంచిది" అని చెప్పెను.

అపుడు నవాబు వీరబ్రహ్మేంద్రస్వామి వారిని జూచి యాతని మహాత్మ్యమును దెలిసికొన గోరెను. కాను సికిందరాబాదుకు వెళ్ళుటకంటె శ్రీ స్వామివారిని హైదరాబాదు కాహ్వానించుట మంచిదనిభావించెను. అతడువెంటనే నగరమంతయు వివిధగతుల నలంకరింప నుత్తర్వులజేసెను. ఆహ్వాన పత్రమును తయారు చేయించి తన పండిత సభలో ప్రధాన పండితునివెంట గొందఱు పెద్దమనుష్యుల బోయి

స్వామివారిని హైదరాబాదుకు ఆహ్వానించి రండని చెప్పెను రాజాజ్ఞ ననుసరించి పల్లకిని చక్కగ నలంకరించి సేవకులచే మేనాను మోయించుకొని సికిందరాబాదున కేగి స్వామివారిని దర్శించి నవాబు ఆహ్వాన పత్రికను సమర్పించిరి.

శ్రీ స్వామివారు హైదరాబాదునకు బోవుట

రాజపండితుడు హైదరాబాదునుండి రాజభటులచే బల్లకిని మోయించుకొని సికిందరాబాదునకు వచ్చిచేరెను. అతడు స్వామివారి సన్నిధికేగి వినయపూర్వకముగ నమస్కరించి నవాబుగా రొసగిన యాహ్వాన పత్రమును జదివి వినిపించి స్వామివారు చూపిన యాసనముపై గూర్చుండెను.

అంతట స్వామి సిద్ధా! మనము హైదరాబాదునకు బోవలసియున్నది. సర్వమును సిద్ధమొనరింపుడనగా సిద్ధయ్య స్వామి యుత్తరవును పాలించి సిద్ధమొనరించితినని మనవి చేసెను. అంతట వీరబ్రహ్మముగారు నవాబు పంపిన డోలీకలోగూర్చుండగా తక్కినవారు పల్లకివెంట వీరబ్రహ్మేంద్ర స్వామివారికిజై! యనుచు జయనినాదము లొనరించుచు బోవుచుండిరి. పల్లకిముందు నవాబుచే బంపబడిన మంగళ వాయిద్యములును, విజయదుందుభులు నగుబోతు మున్నగు వాయిద్యములు చెలరేగి మెల్లగ పల్లకి సాగుచు హైదరాబాదు ప్రధానద్వారమును సమీపించెను.

స్వామివారు నగరద్వారమునుసమీపించుచుండెనని తెలిసికొని నవాబు మంత్రి మున్నగువారితోగూడయెదురేగి

స్వామిని ప్రసూన మూలచే నలంకరించి రాజభవనమునకు బిలిచికొనిపోయి వారికొరకు సిద్ధము చేయించిన వసతిగృహ మునబ్రవేశపెట్టి వారిపూజాదులకు గావలసిన సమస్తవస్తువు లను దెప్పించి స్వామివారిని పరీక్షింప దలచి దీపారాధనకు గావలసిన తైలములను బంపకుండెను.

శ్రీ స్వామి నవాబుకు ధనమహిమ చూపుట

అంతట స్వామివారు స్నానమొనరించి మడివస్త్రములు ధరించి యనుష్టాన మొనరించి సిద్ధా! పూజకు సర్వము సిద్ధపరచితివా యనెను. అందుకు సిద్ధయ్య గురుదేవా! నవాబు వారు దీపారాధనలేకుండ పూజలొనరింపగోరినట్లున్నది యనెను అందుకు స్వామి "ఔను. అతను మనల పరీక్షింపదలచియే యటులొనరించెనని నే నెరుంగుదును." అని రాజభటునితో దీపారాధనకు గావలసిన నూనెను తీసుకొని రమ్మనెను. ఆ భటుడేగి నవాబుగారిని దర్శించి, "ప్రభూ! స్వామివారు దీపారాధనకు గావలసిన నూనెదెమ్మని" రనెను. అందుకు నవాబు సరియని యొక మూత గల పాత్రనిండుగ జలమును నింపి యిచ్చి తీసుకొని పొమ్మనెను. ఆసేవకుడు దానిని తీసి కొని పోయి పూజామందిరము ద్వారముకడనుండి తైలమును దెచ్చితిననెను.

అపుడు స్వామి నాయనా! నీవు నవాబుగారితో పూజ జరుగుచున్నది. తీర్థ ప్రసాదములసేవించుటకు స్వామి మిమ్ము

రాగోరెనని చెప్పిరమ్మ్ని" అనెను. ఆ సేవకుడరిగి రాజుతో జెప్పగా నతడు శుచియై పూజా మందిరముకడకు వచ్చెను. అతని జూచి స్వామి "రాజా! నీవు పంపిన నూనె పాత్రము నందలి నూనెతో నీవేద్యముగ దీపమును వెలిగింపవలెను దీపపు సెమ్మెలో వత్తులను మాత్రము వేయించితి"నను.

ఆ మాటలనువిని నవాబు తబ్బిబ్బులై, బిక్కమొగము వైచి దిక్కుల జూచుచు జేతుల నలుపుచు దలవాల్చెను. అదిచూచి స్వామి "నాయనా! ఎందులకు సంశయించెదవు. ఇది పరీక్షా సమయము కదా. ఆలస్యముచేసిన పూజాసమయము మించును. ఆ నూనెతో నీవు దీపముల వెలిగింపు మనెను. అంతట నవాబు చేయక తప్పదు. కానిమ్మని తానుపింపిన పాత్రములోని నీళ్ళను దీపపు సెమ్మలనిండుగ బోసి అగ్గిపుల్లను గీచి వత్తులను ముట్టించగా నత డాశ్చర్య పడునట్లు సాధారణ నూనె పోసిన దీపముకంటె యెక్కువ కాంతితో వెలుగుచుండెను.

అపుడు స్వామి "నాయనా! నీ పరీక్ష ముగిసినదా" యనెను. అపుడు నవాబు స్వామిపాదములకు నమస్కరించి క్షమింపగోరి తనహృదయమును నిర్మల మొనరించు కొనుట కట్లుచేసితినని చెప్పెను. అందుకు స్వామి తనలో నవ్వుకొని పూజను ముగించి నవాబుకు తీర్థ ప్రసాదముల నొసగి నాయనా! వీనిని అంతఃపురము నందలి నీవారికందరికిని యిమ్ము. నీవు భోజనానంతరము వచ్చినచో కాలజ్ఞానమును వివరించి నీ సంశయము లన్నింటిం దీర్చెద" ననెను.

స్వాములవారు నవాబునకు కాలజ్ఞానము దెలుపుట

అంత నవాబు భోజనమైనతోడనే కొంతసేపు విశ్ర మించి ఫలహారమును గొని యొక సేవకునిబిలిచి ఓయీ నీవేగి స్వామి యేమి చేయుచున్నారో చూడుము. వారు నిద్రించుచుండిన తొందరచేయక రమ్ము. ఒకవేళ వారూరక కూర్చుండియుండిన "ఆజ్ఞయైనచో నవాబు దర్శింప గోరు చున్నా"డని చెప్పుము. ప్రత్యుత్తరమునకై కాచికొని యుండుననెను. ఆ సేవకుడు స్వామి బసకువెళ్ళి మరలవచ్చి ప్రభూ! స్వామివారు తనశిష్యుడగు సిద్దయ్యను గూర్చుండ బెట్టుకొని మాటలాడుచుండగా నేనేగి సలా మొనరించి మీ పలుకుల మనవి చేసితిని. వారు మిమ్మురాగోరుచున్నా రని చెప్పెను. అపుడు నవాబు పాదచారియైవచ్చి నేలనుదాకి మూడు సలాము లొనరించి నిలుచుండెను. అపుడు స్వామి రాజా! కూర్చుండుము. కాలజ్ఞానములోని కొన్నిసంగతులను మాత్రమే వివరింతుననగా నవాబు పద్మాసనము వేసి కూర్చుండెను. స్వామి యిట్లు చెప్పదొడంగెను.

సీ. ఓ రాజ! వినుమేను వీరభోగ వసంత
రాయుడై జన్మింతు డంబుమీర
అతడు పుట్టకముందు అద్భుతంబులు గల్గు
చిత్ర విచిత్రమై చెలగునవియు
గండకీ నదిసాల గ్రామాబు భేలన
మొనరించి మాటాడు జనులతోడ

శ్రీ లక్ష్మి నావెంట♦జేరియుండగ వాణి
నంగడిలోనిడి♦యమ్మ చుంద్రు
తే-గీ. అన్న! ముస్సీనదియు బొంగి♦అక్కటకట
హైదరాబాదు నంతయు♦హాత మొనర్చు
అంత నీసంతతిలో నిద్ద♦రవని మిగిలి
యుద్ధరింతురు రాజ్యంబు♦యోగ్యులయ్యి 1
తే-గీ. నీదురాజ్యంబునందున నెగడు చుండు
యడవులన్నియు మీకిచ్చు♦యధిక ఫలము
పల్లెటూరులు మారు♦పట్నాలు గాక
చీమకు ర్తియు నగరమై♦చెలగగలదు 2
తే-గీ. కనకమిక మీదక ఱవగు♦కనులబడదు
బుద్ధిహీనులు ప్రబలులై♦భూమియందు
గుళ్ళదో చెడివారలు♦కోవిదులయి
సాధు పుంగవులంబట్టి♦చంపగలరు. 3
క. తూరుపు దేశంబున నా
గరకత యభివృద్ధి జెంది♦కనుచుండగనే
తరుగుచు దురదృష్టంబై
పరితాపము జెందగలరు♦ప్రభువర వినుమీ 4
తే-గీ. గోవులొసగు మోక్షంబు♦కొంకణమున
కులము గోత్రములన్నియు♦కూడదనుచు
పరిణయంబుల జేతురు♦పాపమనక
అంతరించును నీరాజ్య♦మంతమునను

అయినను నీవు భయపడకుము. నీదేశమున నీవారే యల్లరులకేపి గోబ్రాహ్మణ స్త్రీ శిశు నరహత్యలనుచేయు దురు. మత కలహాములు ప్రబలును. అధికారులు అన్యాయ కార్యములజేసి నీ రాజ్యము నంతమొందింతురు. అని మరి యనేక వింతలు జరుగుననియు వానినెల్ల మరియొక దినము బోధింతును. ఈ దినమింతటితో జాలించితిననగా నవాబు లేచి మరల సలా మొనరించి తన యంతఃపురమునకు బోయెను.

అసూయాపరులగు తన శిష్యులకు దగిన పాఠము నేర్పుట

వీరబ్రహ్మస్వామి హైదరాబాదు ముకామును వదలి మరల ప్రధాన మఠమగు కందిమల్లయ్యపల్లెకు ప్రయాణమై పోదలచెను. అతని శిష్యులలో కొందఱు రహస్యముగ సమావేశమై స్వామిని గూర్చి యిట్లనుకొనిరి, మన గురుదేవుడు భగవదవతారమని నమ్మి వచ్చితిమి భగవదవతారమైనచో వారికి పక్షపాతబుద్ధి యుండునా సిద్దయ్యతో గలిసి మన మాయన సేవజేయుచుంటిమి మఠమున కార్యములన్నింటిని మనమే చూచుకొనుచుంటిమికాని సిద్దయ్య యూరకస్వామి కడ గూర్చుండియుండును. గురువు సిద్దయ్యను ప్రేమించినట్లు మనల జూచుటలేదు. అతనిని తన ప్రక్కన గూర్చుండ బెట్టుకొని గౌరవించుచుండును. కనుక ఈగురువును వదలుటయే మంచిది'' అని తీర్మానించుకొనిరి.

ఆ సంగతి స్వామివారికి తెలిసెను. అతడు వారిని మందలించక తగిన పాఠము నేర్పదలచెను. హైదరాబాదునుండి బయలుదేరి పోవునపుడు స్వామి దారిప్రక్కన ఒక చచ్చి క్రుళ్ళి పురుగులుపడిన కుక్కను పడియుండునట్లు చేసి యుండెను. అందరును ఆ చోటికి బోయినంతనే స్వామి సిద్దయ్యను తప్ప తక్కిన శిష్యుల జూచి ''శిష్యులారా! మీరందరు నాప్రియశిష్యులుకదా, నాయాజ్ఞల జవదాటకున్నారు ఇపుడు నేను మిమ్ము గోరిన పనిని చేయువారు నాప్రియశిష్య లనిపించుకొందురు కాని తక్కినవారు కపట శిష్యులనబడుదురు. అదిగో ఆ చచ్చిన కుక్కను జూడుడు మీరుదానిచుట్టుగూర్చుండిదానిమాంసమునుదినవలెనని నెను.

శిష్యు లామాటల విని యొకరిమొగమొకరుచూచు కొనుచు పలుకకుండిరి. ఒకడుకూడ ముందుకు రాడాయెను. అపుడు స్వామి సిద్దయ్యనుచూచి ''సిద్దా! నాప్రియశిష్యులు నామాటల లక్ష్యపెట్టకుండిరి నీవైన యాకుక్కమాంసమును దినుము'' అనుచుండగనే సిద్దయ్య చిత్తమని పోయి స్వామి నామమును స్మరించుచు కుక్కమాంసమునంతయుదిని మరల స్వామికడకు వచ్చెను. అపుడు గురువు ఆశిష్యుల జూచి నాయనలారా! ఇపుడు మీరే నాకు సిద్దయ్య ప్రియశిష్యుడో మీరు ప్రియశిష్యులో నిర్ణయింపుడనెను. అందుకు వారందరు సిగ్గుచే దలవంచుకొని పలుకకుండిరి.

అపుడు స్వామివారు వారిని జేరబిలిచి నాయనలారా మీరహస్యపుటాలోచనలోని యర్థమేమి? మీరు నన్ను మానించితిరి. సిద్దయ్యపై అసూయతో నతని ద్వేషించుచుండిరి తప్పులెన్నువారు తమతప్పు లెరుగరన్నట్లు మీరు

సిద్దయ్య గౌరవింపబడుటను .జూచి యోర్వ లేకుండుటకంటె
సిద్దయ్యవంటి అచంచల గురుభక్తి మనయందున్న దాయని
యోచింప బనిలేదా సిద్దయ్య గురుభక్తి విలువ లేనిది అతని
భక్తికిని మాభక్తికిని పోల్చిచూచిన మీది బూటుక పుభక్తి
యని చెప్పకనే చెప్పినటు లగుచుండ లేదా. అట్టి మీవంటి
శిష్యులు నామతమునందుండుటకంటె మీగృహముల కేగుట
మంచిది. ఇకమీదట యితరులను ద్వేషింపక నా ధర్మోప
దేశముల భక్తితోవిని సిద్దయ్యను మించుటకు ప్రయత్నింపు
డనెను.

కుష్టురోగిని స్వర్ణదేహు నొనరించుట

ఆరీతి ప్రయాణముసాగించుచుండ మార్గమధ్యమున నే
రాత్రి యయ్యెను. సమీపమునం దేగ్రామమును గనంబడ
లేదు. అపుడు స్వాములవారు బాటప్రక్కన కొంతదూరమున
గొన్ని పెద్దపెద్ద వృక్షములజూచి నేటిరాత్రి యీవృక్షముల
క్రింద గడుపుదమనెను. అందరు సమ్మతించి అచ్చటికి బోయి
ఒక విశాలమగు వటవృక్షము క్రింద విశ్రమించిరి.

అంతలో "ఓపరమేష్టి! మమ్మేల సృష్టించితివి? మేము
కుడువకూడు కట్టుటకుగుడ్డ లేక బాధపడుచు తోడిబ్రాహ్మణ
కుటుంబములు మమ్ము నీచముగ జూచుచుండ మా గ్రామ
మునువదలి దినమొకయూరుగా బిక్షకులమైతిరుగుచుంటిమి.
అదియు జూడలేక నా యీనిజభర్తను కుష్టురోగినొనరించి
తివి. ఆరోగము తీవ్రరూపము దాల్చినది. ప్రక్కగ్రామమును

జేరదలచి పోవుచుండ నాభర్త నడువ లేక పోయెను. అంతలో రాత్రి యయ్యెను. అకటా! మూడుదినములుండి అన్నము లేక అలమటించుచున్నాము. మమ్ము గాపాడువారు లేరు కదా!''

ఆమాటలు బ్రహ్మంగారి చెవులబడెను. సిద్ధా మనకు బనికలిగినది. రమ్ము పోదమని యొక శిష్యుడు దీపమును చూపుచుండ నా దీనారావము వచ్చిన చెట్టుక్రిందికి పోయిరి.

ఆ చెట్టు క్రింద ఒక స్త్రీ కుష్టురోగియని విసుగుకొనక యాతని శిరమును తన తొడపై నిడుకొని కన్నీరు గార్చు చుండెను. స్వామివారాపెను జూచి ''అమ్మా! మీ కథ యంతయు, నాకు దెలిసినది నీ పతిభక్తి, పతివ్రతాత్వము సాటిలేనిది నీ భర్త పూర్వపాపఫలము ననుభవింపవలసి యుండెను, అందులకే యీతని కుష్టురోగము బాధించు చుండెను. ఇకనీవన్ననో పరమపతివ్రతవు. అందులకే మీరు నాకు గనబడితిరి. నీపతివ్రతాత్వమే నీభర్తను కాపాడ మున్నది దుఃఖింపకుము'' అని తన కమండలములోని జల మును చేతియందు బోసికొని యాకుష్టురోగిపై జల్లెను.

అంత గొంతసేపటికికుష్టురోగము తీవ్రరూపముదాల్చి బాధించుచుండ మాటాడుటకు శక్తిలేకపడియుండిన బ్రాహ్మ ణుడు స్వర్ణదేహుడును, సవయోవనుడునునై లేచి తన

యెదుట శ్రీమన్నారాయణమూర్తివలె ప్రకాశించెడి వీర బ్రహ్మముగారికిసాగిలపడి తండ్రీ! నేటికి మీదర్శనభాగ్యం లభించుటచే నేను పరమపావనుడనైతిని. మీరు నాపాలిటి కల్పతరువై వచ్చితిరి. ఇక నాకేకొరతయులేదు. నాజన్మం తరించినది, మమ్మాశ్వీరదింపుడనెను.

అందుకు వీరబ్రహ్మము దంపతులను గూర్చుండమని "సంతానప్రాప్తిరస్తు, ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు" అని దీవించెను. ఆనల నాయనా! మీదేయూరు. ఎచటికి బోవుచుంటిరనగా వారు దేవా! మాది కాంచీపురమునసమీపమునసుండు "మునిపల్లె" కడుపుకూటికై దేశాటనము వచ్చితిమి. ఇపుడు మీదర్శన భాగ్యమువలన మాదారిద్ర్యము నశించినట్లే మేము మరల మునిపల్లె జేరబోదుమనెను. అందుకు స్వామి మావెంట రండు మీగ్రామమునకు బోవచ్చునన్నగా వారు సమ్మతించిరి. ఉదయమున లేచి అందరును ప్రయాణమై పోయిరి.



ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర

పదునొండవ ప్రకరణము

ఓ ప్రియసహోదరులారా! మనము పదియవ ప్రకరణమున శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కందిమల్లయ్యపల్లె మఠమునుండి సపరివార సమేతముగ ఉత్తరదేశ సంచారము వెళ్ళిన విధి చదివితిమి. ఆ సంచారమున, హైదరాబాదు నవాబు వకు తన మహాత్మ్యమును జూపి తన కాలజ్ఞానమును కొంత వరకు వినిపించినదియు, శిష్యులకుదగిన గుణపాఠమును నేర్పి దుష్టురోగి యగు బ్రాహ్మణుని బాగుచేసెననియు చదివితిమి. ఇకముందు జరుగు విషయముల దెలిసికొందము.

వీరబ్రహ్మము మరల తన మఠమును చేరుట

హైదరాబాదునువదలినవీరబ్రహ్మముగారు ఒకొక్క దినముఒకొక్కగ్రామమునమజిలీచేయుచుఅచ్చటిజనులకు నీతిమార్గము బోధించుచుండెను. ప్రతిగ్రామమునను హరి

యుపన్యాసముల వినినంతనే స్వామివారి శిష్యులుగ మారి పోవుచుండిరి. ఆ రీతి ఉత్తర దేశమునందలి ప్రతి గ్రామము లోను వారికి శిష్యులేర్పడిరి కొందరు తమ సంసారము వదలి బ్రహ్మముగారి శిష్యులై వారివెంట బోవుచుండిరి.

ఆరీతి ప్రయాణము సాగించుచు కుముద్వతీనది తీర మున నుండు *''అల్లాటపల్లె''కు వచ్చిచేరిరి. అచ్చట సపరి వార సమేతముగా కుందునదిలో స్నానమాచరించి శ్రీ వీర భద్రస్వామిని దర్శించి, కొన్నిదినములుండి తర్వాత కంది మల్లయ్యపల్లె జేరిరి.

సిద్దయ్యకు పునర్జన్మ జన్మరాహిత్యముల వివరించుట

కందిమల్లయ్యపల్లె జేరిన పిమ్మట ఒకనాడు స్వామి సిద్దయ్యను బిలిచి నాయనా! ఈ దినమున నీకు పునర్జన్మ, జన్మ రాహిత్యములగూర్చి వివరింతును శ్రద్ధతో వినుమని చెప్పదొడంగెను.

సిద్దా! జీవకోటిలో మానవజన్మ ముత్తమమైనది. మానవులలో పాపాత్ములు పుణ్యాత్ములునని రెండు తెగ లవారున్నారు.

తే-గీ. అవని! పాపాత్ములను వారలన్య జనుల
జూచి యెరుగవ్వారు కాసింతమచ్చుకేని

---

* సూచన.—ఇపుడు అల్లాటపల్లె 'అల్లాడుపల్లె' యని పిలుచుట వాడుకయై యున్నది.

చేయ లేరింత పుణ్యంబు శ్రేయమనుచు
సాధువులబట్టి హింసింతు శాంతి లేక.

అట్టి పాపాత్ములకు మాత్రమే పునర్జన్మకలదు. అనగా పాపమొనర్చిన మానవులు మరల మానవులై జన్మింతురని భ్రమింపవలదు. మానవులై తా మొనరించిన పాపకార్యముల ఫలితముగా నరకమునకుబోయి నరకబాధల ననుభవించి భూమిపై మరల నీచ యోనుల యందు జన్మించి కష్టములకు గురియై యుందురు. అట్టివారు జీవాంకురముగల విత్తు మొలచి చెట్టై మ్రానై పడిపోయి మరల తన విత్తునుండి మొలచునట్లు పాపాత్ముడు సదా పుట్టుచు గిట్టుచుండును. దీనినే పునర్జన్మ యందురు.

తే-గీ. ఇతరు లేరీతి జేయుట హితమొ నీకు
వారి కట్టుల జేయును వారిగాగ
అహితము వీడి సర్వదా అందరకును
పుణ్యపురుషులు జేతురు పూజలనఘ!

పుణ్యపురుషులు సదా జన్మరాహిత్యము నభిలషించి భగవంతుని చింతనలో తమ జీవితమును గడపి దేహమును వదలినచో మోక్షమున కేగుదురు. అట్టివారు మరల మానవ యోనిని జన్మింపరు. అట్టి మోక్షసాధనకు యోగాభ్యాసమవసరము. ఆ యోగాభ్యాసమునకు గొన్ని పద్ధతులు గలవు. ఆ పద్ధతులనే యోగాసనము లందురు. ఆ యోగాసనముల వివరింతును వినుము.

యోగాసనపద్ధతులు

—:o:—

వీరాసనము

నాయనా! యోగాసనముల జేయువారు ఒక ప్రత్యేక గదిలో దన యిష్టదైవము లేక గురుదేవుని పటమునిడుకొని దానిముందు దర్భాసనమును పరచి దానిపై పులి లేక జింక

చర్మమును వైచి దానిపై నొక లావుపాటి గుడ్డను సహా
తము పరచి ప్రారంభింపవలెను.

ఇక వీరాసన మెటుల వేయవలెనన్నగా పైన వివరం
చిన ఆసనముపై గూర్చుండి ఎడమపాదమును కుడితొడ
యందును, కుడిపాదమును ఎడమ తొడమీదను నిడుకొని
దేహమును వంచక చూడ్కులను ఎదుటనుండు పటముపై
బడునట్లు చేయవలెను.

ఈ పద్ధతివలన మనస్సు చలింపకుండుటయే గాక
హృదయ రోగములను నిర్మూలించి ముఖసర్చస్సును, వైర్య
మును ఆయుస్సును పెంచును.



స్వస్తికాసనము

పై యాసనమున గురుదేవుని చిత్రమున కభిముఖముగ గూర్చుండి కాళ్ళను ముందుగ చాచి ఎడమకాలిని మడచి పాదమును కుడితొడ నానుకొనునట్లును, తర్వాత కుడికాలిని మడచి ఎడమతొడ నానుకొనునట్లుంచి దేహమును గాని తనుగాని వంగక చేతులును వంగనీక మోకాళ్ళపై హస్తము లుండునట్లు చేయవలెను.

ఈ యాసనమును సులభముగ సాధింపవచ్చును. దీనివలన యారోగ్యాభివృద్ధి యగుటయే గాక జపసిద్ధియు జేకూరును.



పద్మాసనము

ప్రథమమున జింకచర్మముపై గాళ్ళ నిడుపుగ చాచి కూర్చుండి ఎడమపాదమును కుడితొడ దాకునట్లును, కుడి

పాదమును యెడమతొడ తాకునట్లు పెట్టి శిరమును దేహ
మును వంచక చేతులకు చక్కగ చాపి హస్తములను
మోకాళ్ళ దాకించి కూర్చుండవలెను.

కమలమువలె గనిపించుట చేదీనికి బద్మాసనమనియు
గమలాసనమనియు బేళ్ళ గలవు. ఇది గృహస్థులకు ముఖ్య
మైనది స్త్రీలుకూడ దీని నభ్యసింపనగును.

ఈ ఆసనమువలన మనము బీల్చు శ్వాసగతి మంద
గించును. దాని ద్వారా కుంభకసిద్ధి కలుగును. దీనివలన
రక్తము బాగుగా ప్రసరించును. ఇది సర్వరోగముల నివా
రింప శక్తిగలది.





మతాంతర పద్మాసనము

మతాంతర పద్మాసనమును వేయువారు ఎడమ పాద మును కుడి తొడమీదను, కుడి పాదమును యెడమ తొడ మీదను వెలికలనుంచి ముక్కు చివరభాగమును జూచుచు దంత మూలమున జిహ్వాను జొనిపి గడ్డమును ఒమ్మును వాకించిమందగతితో వాయువును పూరించుచుండిన జాలును,

ఇది సర్వరోగముల హరించును. రక్తము సర్వాంగ ములకును వ్యాపించి మనశ్శుద్ధి నొనరించును.

యోగాసనము

యోగాసనము సులభ సాధ్యమైనదే. హంస దండమును మోకాళ్ళ క్రింద నిడుకొని కాలివ్రేళ్ళను భూమిపై మోపినిలిపి యూరువుల మధ్య చేతులు జొప్పించి పిక్కలబట్టుకొన్నచో యోగాసన మగును.



కూర్మాసనము

ఈ యాసనమును వైచినపుడు కూర్మాకారమున గనబడుటచే దీనికి గూర్మాసనమను పేరు గలిగినది.

ఆసనమున కిరుప్రక్కలనుండు పిరుందులకు రెండు మడమలను బాగుగా తాకించి మోకాళ్ళను భూమిని దాకునట్లుంచవలెను. ఈ యాసనమును జేయునంతసేపు దేహమును వంగనీయరాదు.

ఈ యాసనము నభ్యసించిన వారికి వాతరోగములు రావు. వీర్యమును గట్టిపరచి ఊర్ధ్వగతింబట్టించును. ఇది శరీరమునకు బలమును, కాంతిని కలిగించును.



ఉత్థానకూర్మాసనము

ప్రథమమున ముందు చెప్పినట్లు పద్మాసనమును వేసి కూర్చుండవలెను. ఆవల కుడి యెడమ మోకాళ్ళ సందుల

ద్వారా రెండు హస్తములదూర్చి అరచేతులు భూమికి దగలకుండ నిలిపినపుడు కుక్కుటాసన మగును.

ఆరీతి కుక్కుటాసన మందుండి రెండుచేతుల మెడను దాకించి పట్టుకొని వెనుకకు వ్రాలిన ఉత్తాన కూర్మాసన మగును.

ఈ యాసనమువలన పద్మాసన, కుక్కుటాసనముల వలన గలుగు లాభములన్నియు గలుగును.

8

- భద్రాసనము

నాయనా! ఎప్పటివలెనె వ్యాఘ్రాసనముపై గూర్చుండి అండము క్రిందనుండు నరముల ప్రక్కన రెండు మడమలను యేప్రక్క మడిమను ఆ ప్రక్క యూది చేర్పవలయును. ఆవల రెండు హస్తముల ప్రేళ్ళను యొకదానిలో మరియొక దానిలో జేర్చి కడుపున కానించియొత్తి పట్టుకొని కూర్చుండిన భద్రాసన మనంబడును. దీనికి గోరక్షాసనమను మరియొక పేరుగలదు. దీనివలన సకలరోగములును నివారణయగును.

సిద్ధాసనము

సిద్ధాసనము నభ్యసింప గోరువారు ఎడమకాలి మడ
మను మూలాధారము నందుంచి, కుడివాలి మడిమను
లింగము క్రింద నదిమిపట్టి శిరస్సు, కంఠము భుజద్వ్యయముల
వంచక చక్కగా నిలబెట్టి భ్రూమధ్య భాగమును దిలకించు
చుండవలెను.

ఆ-వె. ఇందువలన గలుగు♦నింద్రియ నిగ్రయ
దేహబలము మిగుల♦దేజరిల్లు
నెగడు యోగులకును♦నిర్మల చిత్తంబు
సిద్ధ! దీనసకల♦సిద్ధియగును.

దీనిని కొందరు యోగులు సిద్ధాసనమనియు, వజ్రాసన మనియు, గుప్తాసన మనియు బిలుతురు.



మహాంతర సిద్ధాసనము

మహాంతర సిద్ధానమునగా ఎడమ మడిమను లింగ మూహైనిలీ. ఆ మడిమవిూదనే పుని మడిమనుంచి నాళ్ళాక మును బాబుతుండిన జాణను.

తే॥ వీని కర్ణాసనంబని మనుపు బిల్వ
యా క్తి మహాక్తాసనంబని రెూగులవిరి
గురుడు గులాచ్ఛనంబ సెగూర్చ సిదిలము
మా క్తి మూర్గము సిద్ధయ్యు భక్తులకును.



సింహాసనము

సింహాసన మనగా యండములక్రిందనుండెడి నరమూ
లను తొడలయొక్క వెనుకవైపు తాకించి కుడి యెడమ
మడిమల మార్చియుంచి, కుడి యెడమ చేతుల వ్రేళ్ళను
మోకాళ్ళపై సవ్యముగా వెడల్పుగనుంచి వంగకుండ
యూసీనులై, నోటిని దెరచి భ్రూమధ్య భాగమందలి చిద్బిం
దువును జూచుచుండవలెను. ఇది బంధత్రయములసమావ
ేశమొనరించును.



కు క్కు టా స న ము

ఎడమ కుడి పాదములను క్రమముగా తొడ దాడుము
తొడలయం దుంచవలెను. అవల వెనుక ప్రక్కగ కుడిచేత
నడుమ తొడవిూదనుండు కుడికాలి బొటన వేలిని ఎడమ
చేత కుడి తొడపైనుండు యెడమకాలి బొటన వేలినిపట్టు
కొని తొమ్మునకు నాలుగు అంగుళముల దూరము గడ్డము

V.R. NARAYANA MEMORIAL LIBRARY Acc. No. Date

నుంచి మొక్కి చివర భాగమును చూచుచుండిన పద్మాసన మగును.

తదుపరి చేతులను తొడపిక్కలు సందునదూర్చి అర చేతులను నేలపై తాకియుకుండ వ్రేళ్ళపై నూర్చుండిన దొ గుక్కుటాసన మగును.

తే॥గీ. సూర్యరశ్మికి దిదింరంబు పాయునట్లు
దీనివలనను వ్యాధులు తీరిపోవు
వ్యాసగతి మందగించును జాలవలకు
కుంభ బుద్ధియు గల్గును కోరినట్లు
రక్త మొగబ్రొక దేహము శక్తి నొసగు
బలము సూర్యుని మనభూజములు నెంతో
పెరుగు శశియు బొడవగు కరయుగంబు
కుక్కుటాసనమున దీరుగొక్కు లెల్ల.



గోముఖాసనము

మన యెడమకాలి మడమ కుడిపీపు తట్టును, కుడి కాలి మడమ యెడమపీపు వంకను గిలించి, కటిభాగము క్రింద మోకాలుమీద మోకాలును బిగించి, ముందు చెప్పిన కూర్మాసనమువలె భూమిని చాకకుండను దేహమును వంగనీయక భ్రూమధ్యమును జూచుట గోముఖాసనమనంబడును.

తే-గీ. మూలబంధము సిద్ధించుటము క్తి గలుగు
హాను భగందర రోగముటమానవులకు
ధాతనౌ మిక్రయాసిద్ధిటదనరు మవకు
పాణ, మాపాన వాయువుల్ టబాగుపడును
చిత్తశాంతియు జేకుటుక్రశేయమగును.



ధనురాసనము

ఎడమచేత కుడికాలిపేళ్ళనుబట్టి కుడి చేత కుడికాలిని యల్లెక్కాటిని లాగినట్లు కుడిచెవి వరకును లాగి విడువవలెను. అదేరీతిగ కుడిచేత కుడికాలిపేళ్ళను బట్టుకొని ఎడమచేత కుడి కాలిపేళ్ళ నిడికొని యల్లెక్కాటిని లాగినట్లు ఎడమ చెవివరకు లాగి విడిచిన ధనురాసనమును ఇటులనే మార్చిమార్చి చేయుచుండవలెను.



మయూరాసనము

వాయువా! కష్టసాధ్యమగు ఆసనములలో మయూరాసనమొకటి. రెండు చేతుల మణికట్టుల జేర్చి ఆ యాచేతి వ్రేళ్ళను వెడల్పుగ విప్పి నెమలి కాలివ్రేళ్ళవలెనుంచి, రెండు మోచేతులను బొడ్డున కిరుపార్శ్వముల మూడి చేతుల బలమునై దేహమును నిలిపి, కాళ్ళమజాచి ముఖము నిట్టి

మొదటి నుండి వై వచిత్రమును జూచిన మయూరాసన మగును.

తే-గీ. ఇదియు జోరాగ్ని బుట్టించి వృద్ధిపరచి
విషమునై వసు హరియించు వింతగాను
కేంద్రగుల్మ, జలోదర వెడుగుసంత
వాత్తపిత్త కఫంబులు బాగుపరచు
సకల రోగములను మాన్పు శక్తి గలదు
యగునుగద "మయూరాసన" మన్ని విధుల.



కపాలాసనము

ఎవరుగాని వ్యాఘ్రాసనమున తలనిడి రెండు అర చేతులను జేర్చి తల యొరగకుండ జూచుచు మెల్లగ రెండు కాళ్ళను పైకి జూపవలెను. ప్రారంభదశలో గోడనుగాని తదితర ఆధారమును జూచుకొని యభ్యసించుట మంచిది. దీనిని కపాలాసనము లేక శీర్షాసనమని పిలుతురు—మరి

కొండలు విపరీతకరణీ, వృషాసనము, అధోముఖాసనము. ఖగాసనము అనియు జెప్పుదురు.

తే-గీ. అభ్యసింపు మాసత్ర॥యంబుచాలు
ప్రథమ దినమున ఋణముతో॥మొదలు పెట్టి
క్రమము తప్పక దిన మొక॥ఋణము బెంచి
సీమమున దివదినమును॥జాముసేపు
చేయ జఠరాగ్ని హెచ్చును॥శీఘ్రముగను
సకల రోగాల జెందును॥జయము గూర్చు
ప్రాణయామ సిద్ధించు॥ప్రాకటముగ
అనఘు! మృత్యుంజయుండౌదు॥వవని నీవు



ముక్తాసనము

ముక్తాసనము నభ్యసింప గోరువారు ముందు ఎడమ కాలి మడిమచే మూలాధారమును మూసి కుడిపాదమును ఎడమ తొడమీదబెట్టి అటులనే ఎడమకాలి మడిమచే లింగస్థానము నదిమిపట్టి కుడికాలి మడిమ క్రింద వరిచిపట్టి యుండుట ముక్తాసన మనబడును.



టిట్టిభాసనము

టిట్టిభాసనమును జేయువారు మొదట భూమిపై
నిజీన కృష్ణాజినమునై భోర్లవరుగుగొని, మునుము శరీరమును
వెలికి ముండజేసి తలను దాకించుచు, తర్వాత నుచేతులు
భూమిపై నిడి చేతులనూతి మోకుజి భాగము గ్రిక్కి
యువలయము

అర్భకాసనము

ఇది యోగాసనము లన్నిటిలో కడుసులభమైనది. బాలురుకూడ చేయవచ్చును. అందులకే దీని కీపేరు కలిగినది. రెండు పిరుందులను పాదములను నేలను తాకునట్లుంచి రెండు మాకాళ్ళ నడుమ గడ్డమునుంచి కరద్వయముల కాళ్ళను బంధించిన అర్భకాసనమగును. పిరుదులను భూమి తాకకుండ కూర్చుండి యైనను దీని నభ్యసింపవచ్చును.

పశ్చిమతాణువాసనము

ఈయాసనమును వేయువారు ముందుపాదములజక్కగ
మూచికూర్చుండవలెను అటుపిమ్మట రెండు చేతులతోరెండు
కాలిబొటన వ్రేళ్ళనుబట్టి మోకాలి చిప్పల రెండింటినిదాకు
నట్లు లలాటమునుంచినచో పశ్చిమతాణువాసనమగును.

తే-గీ. అన్న! శ్చిమతాణువా।సనము వలన
పశ్చిమపుదారి పడచును।పవనమంత

బరగు జఠరాగ్ని కదుపంతఁ పల్చనగును
పూర్వరోగాళి మాయఁ జోవ్ప నిజము

శూర్వకాండవాఖ్యానము

ఈ ఆశ్రమమునకు మొదట మిగుళ్ళకు శూర్వాగమునకు కాపుపట్లు పుడిచి పుడమలను పిరుందుఁ దాపునట్లుంచి రెండు చేతులతో దలను, మోచేతులతో కడుపును నుంచిపట్టినడి మీదు వంగనీయకుండిన చో శూర్వకాండవాఖ్యానమగును.



కామదహనాసనము

కామదహనాసనమును అభ్యాసము చేయుటకు మొదట కాలిబ్రేళ్ళను మోకాళ్ళను భూమి దాకకుండ పిరుదులను రెండు మడిమలపైనూని కూర్చుండి యోగదండమును మోకాళ్ళ నడుమ జొప్పించి చేతులనిడి భ్రూమధ్య భాగమును జూచుచుండవలెను.

నాయనాసిద్దా! ఇట్టి యోగాసనము లింకను బెక్కులు గలవు. ఇపుడు, నీకెఱింగించినవి ముఖ్యమైనవి. మఱియొక దినము హానిని వివరించెదను. ఱేపటినుండి నీవు నాతోగూడ నీ యాసనముల జేయుచుండుము. ఇవ్వటికె చాల ప్రొద్దు పోయినది. నీగదికేగి విశ్రాంతి గొనుమనగనే సిద్దయ్య గురు దేవుని పాదముల గన్నుల కద్దుకొని నమస్కరించి తన గది జేరెను.

ఓమ్

శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పంద్రెండవప్రకరణము

ఓ భక్తజనములారా! గత ప్రకరణంబున శ్రీ వీర బ్రహ్మేంద్రస్వాములవారు ఉత్తరదేశ సంచారము నుండి తిరిగి కందిమల్లయ్యపల్లె మఠమును జేరెననియు ఆవల ప్రియ శిష్యుడగు సిద్దయ్యకు ముఖ్యమగు యోగాసనముల వివరించి టయు జదివి తెలిసికొంటిమి. ఇకముండు జరుగువిషయముల దెలిపెద వినుడు.

వీరబ్రహ్మము దక్షిణ ఆంధ్రదేశమున
సంచార మొనర్చుట

ఉత్తరాంధ్రదేశమున సంచరించి కందిమల్లయ్యపల్లె జేరిన కొన్నిదినములకు వీరబ్రహ్మస్వామికి దక్షిణాంధ్రదేశమున సంచార మొనరింపవలెనను తలంపు కలిగెను. ఆత డొక దినము సిద్దయ్యతో నాయనా! నాకు మరల దేశసంచా

ము వెడల బుద్ధిపుట్టినది. ఈసారి దక్షిణాంధ్ర దేశమున
ర్యటించి త్వరగా తిరిగి వత్తము. ప్రయాణమునకు సర్వము
ద్ధము సేయింపు మనెను.

గుడువు నానతి ప్రకారము సిద్ధయ్య అన్నియు సిద్ధము
సేసెను. ఒక శుభదినమున వీరబ్రహ్మము సపరివారసమేత
ుగా కందిమల్లయ్యపల్లెను వదలి గిద్దలూరు, కంబము
ున్నగు గ్రామములలో వేదాంతోపన్యాసముల నొసంగి
కాలజ్ఞానమును దెలిపి మహానందికి బోవుచుండగా దిగువ మెట్ట
యను గ్రామమువచ్చెను. అది వేసవికాలమగుటచే అచటికి
చ్చినప్పటికి స్వామివారికి దప్పికయ్యెను. సిద్ధయ్యతో
ట్రాగుటకు నీళ్లు లభించునేమో చూడుమనెను.

విశ్వబ్రాహ్మణుడు స్వామిని పరీక్షించుట

అపుడు సిద్ధయ్యతో దిగువమెట్టలో విశ్వబ్రాహ్మణు
ండిరాయని విచారించెను. ఒక యిల్లుమాత్ర మున్నదని
ప్పిరి ఆ యింటికి వెళ్ళి అక్కడ కొలిమిలో పెద్ద మూస
రుండు యినుమును కరిగించుచున్న విశ్వబ్రాహ్మణునిజూచి
"అయ్యా! మాస్వామిగారి కొకడు దాహమగుచున్నది.
తడు మీ కులమువాడే కనుక ఒకపాత్రతో నీళ్ళనిమ్మని
డిగెను. అందు కతడు 'తాను జేయుపనిని వదలిపోజాలక
మీయింట నీటి కొసగువా రెవరును లేరు. పొము" అని

సూచన:—ఆపుడు దిగువమెట్టయొక రైలుస్టేషనుగా
న్నది. అచ్చటికి మహానంది సుమారు మూడుమైళ్లుండును.

పలికెను. అందుకు సిద్ధయ్య అయ్యా! ఇల్లు యిదియే కద దాహం మడిగినవారికి నీళ్ళనిచ్చిన పుణ్యమేకాని పాపమా కాదుకదా. జగద్గురువునకు దాహము తీర్చలేదా యనెను

అందుకు కమ్మరి మాయింట నీళ్లులేవు కావలసి యిదా మూసనిండుగ కరిగిన లోహద్రావక మున్నది అతడు జగద్గురుపుకదా అటులైన యీ కాగెడి యినుపద్రవమును త్రాగుమను మనెను. ఆ మాటలు బ్రహ్మముగారికి విన బడెను. అతడు వెంటనేవచ్చి కొలిమిలోని మూసనుదీసికొని లోహద్రావకము గుటగుటత్రాగి "అయ్యా! ఇదిచాలదు మీ యింటనుండిన యినుమునంతయు కరిగించి యిచ్చి గాని నా దాహము తీర"దనెను.

అది చూచిన కమ్మరి గడగడ వడంకుచు స్వామిపాద ములమీద తలనుంచి "స్వామీ! క్షమింపుడు. అజ్ఞానము మీకపచార మొనరించితిని. నన్ను మీ శిష్యునిగా నెంచి క్షమింపుడు" అని యా దినము స్వామిని ఆయూరనిలి ఛిక్ష చేయించెను, స్వామినిపూజించి సపరివార సమేతముగా సత్కరించి తనకుదగిన మంత్రోపదేశ మొనరించి శిష్యునిగా జేర్చుకొనుమని ప్రార్థించెను. అందుకు స్వామి నాయనా ఇపుడు సమయముకాదు. మేము రాత్రి గుడిలో బసచేయు దుము, నీవు అక్కడికి వచ్చినచో నీకును తదితరులకును సాంఖ్యయోగమును బోధించెదననెను. అవిశ్వబ్రాహ్మణుడు స్వామిగారికి యతని పరివారమునకును రాత్రి విందు చేయించెను.

స్వామి సిద్ధయ్య మొదలగువారిని రమ్మని సాంఖ్య యోగమును వివరించుట

దిగువ మెట్ట గుడిలో వీరబ్రహ్మముగారు సిద్ధయ్యను విశ్వబ్రాహ్మణుని తక్కిన శిష్యులను గూర్చుండ బెట్టుకొని సాంఖ్య యోగమును వివరించుచుండెను. ఆ యూరిలోని మాదిగ కక్కయ్య అను నతడు స్వామి మూసలోని కాగిన ఇనుమును బ్రాహ్మణ సంగతినివిని అతనిని జూడవలెనని వచ్చెను అతడు మాదిగవాడు కనుక గుడిలోని కేగుటకు వీలుపడనం చున గుడిగోడనానుకొని నిలిచి స్వామి చెప్పెడి దానినంతయు వినుచుండెను.

వీరబ్రహ్మముగారు సృష్టికి పూర్వము నాశరహిత మగు ప్రకృతి వెలయుచుండె ననియు యందుండియే త్రిమూర్తులు సృష్టింపబడి సృష్టి స్థితిలయ కార్యముల చేయు చుండిరి. అని చెప్పిన తర్వాత భూతవిమర్శను, షట్ చక్రవిధా నములోని మూలాధారము, స్వాధిష్టాన, మణిపూరక, అనా హత, విశుద్ధ, ఆగ్నేయచక్రముల రహస్యములు సహస్రార చక్రము సహస్ర దళములతో నొప్పి అందు ''ఓం'' అను ప్రణవ అక్షరము ప్రకాశించుచున్నది, కనుక మన దేహా మందుగల షట్చక్రములలోనుండు అధిదేవతలను అంత ర్లక్ష్యముద్వారా చూడవలెనని చెప్పెను.

కక్కయ్య దేహములోని అధిదేవతలను జూచుట భార్య గర్భమును జీల్చుట

—:o:—

స్వాములవారు సిద్దయ్య మున్నగువారికి దెలిపిన సాంఖ్యయోగ రహస్యములను గోడప్రక్క నిలిచిన కక్కయ్య విని "ఔరా! మనదేహములోనే అధిదేవత లున్నారని స్వామి చెప్పుచుండెను. అదినిజమేయైయుండును, కరిగిన ఇనుమును గుటగుట క్రాపిన మహానుభావుడు అబద్ధముల జెప్పడు. కనుక స్వామి మాటల నిజా నిజముల దెలిసికొనవలెను. ఈ ప్రయోగమును నాభార్యయందే చేసి చూచెదనని పోయెను.

కక్కయ్య ఇంటికేగునప్పటికి రాత్రి సుమారుపదిగం టలుదాటెను. అప్పటికి అతనిభార్య గాఢనిద్రలోనుండెను. అపు డతడు తగిన సమయమదేనని తోలును గోసెడికత్తిని గొని తన భార్య గర్భమును ఛేదించి హృదయ భాగమున నుండు అధిదేవతలను జూడదలచి రెండు చేతులతో జర్మ మును జీల్చి చూచెను. అతనికి రక్తము మాంసముతప్ప తది తర మేమియు గనంబడక పోయెను.

అపు డతడు "అకటా! బూటకపు స్వామి మాటలను నమ్మి అగనాకు నా భార్యను జంపితిని. నా భార్య హృదయ మున ఒక్క దేవుడుకూడగనంబడుట లేదు. అకటా! దేవతలు కనబడకపోయిరి. భార్యమరణించెను. స్త్రీహత్యాపాతకము నన్ను నరకకూపమున బడద్రోయక పోదు" అని పరిపరి విధంబులు దుఃఖించుచుండెను.

వీరబ్రహ్మముగారు కక్కయ్య భార్యను బ్రతికించి యిద్దరికి అధిదేవతలను జూపుట

కక్కయ్య యింటిలో గోడుగోడున దుఃఖించుచుండ చుట్టుప్రక్కలవారు విని గుంపులుజేరి జరిగిన సంగతి దెలిసి కొని పోయి గుడిలోనుండు స్వామివారికి దెలిపిరి అప్పుడు స్వామి తనలో "ఔరా! కక్కయ్య మూఢభక్తి నేమన వలయును. నామాటలనమ్మి భార్యను జంపుకొన్నాడు" అని వచ్చిన మాదిగల వెంట బోవుచు సిద్దయ్యను మాత్రము రమ్మనెను.

స్వామి సిద్దయ్యతోగూడ కక్కయ్య ఇంటికి వెళ్ళెను అతడు లోపలికి పోవునప్పటికి కక్కయ్య భార్యపీనుగు బూది బడి "అకటా! కపట సన్యాసుల బోధలనువిని నిన్ను జంపితిని నాకేల యీదుర్బుద్ధిపుట్టెను నీహృదయమునందొక దేవుడు కూడ కనంబడకుండెను. ఎవరినితిట్టి యేమిప్రయోజనము? నాబుద్ధి గడ్డితిని నిన్ను జంపితి నంతయే కాని వేరుకాదు." అని పరిపరి విధములవాపోవుచు దలగొట్టుకొనుచుండెను. అపుడు కక్కయ్యా! భయపడకుము అని స్వామి హెచ్చరించెను.

ఆ శబ్దమును విని కక్కయ్య తిరిగి చూచి లేచి "అయ్యా! నీవుగుడిలో జెప్పుచుండిన మాటలనమ్మి నాభార్య గర్భమును జీల్చి నీవుచెప్పిన యధిదేవతలను జూడదలచితిని. ఒక్క దేవుడుకూడ కనబడలేదు. నీవు వట్టి అబద్ధాల కోరువ్రగ నున్నావు. ఇపుడు నాగతియేమి?" అని కోపముతో మాటాడెను.

వీర బ్రహ్మము కక్కయ్యను చూచి "నాయనా! నీభార్య హృదయమున దేవతల జూడగోరి యామె గర్భమును జీల్చితివి కదా, తొందరపడవలదు. నీకు దేవతలను జూపింతు"నని సిద్దయ్యను వెలుపలికి బొమ్మనితలుపు మూసి కక్కయ్యపై కమండలములోని జలమును ప్రోక్షించెను. అపుడతనికి జ్ఞానదృష్టి కలిగెను. అపుడు స్వామి కక్కయ్య భార్య హృదయమున యేభాగమున యేయధిదేవతయుండునది చెప్పి ఆదేవతలను చూపిదేవతలు కనబడుచుండలేదా యని యడిగెను. అంతకతడు "స్వామి కనబడుచున్నారు" అనునంతలో మరల నతనిపై జలమును జల్లెను. అపుడతనికి జ్ఞానదృష్టిపోయి యెప్పటివలె నుండెను.

అపుడు కక్కయ్యస్వామీ! మీరు నిజముగ భగవదవతారమే. మిమ్ముగన్న దేవుని జూడనక్కరలేదు. అకటా యిపుడు నాకీ స్త్రీహత్యాపాపము బోపుపెట్లు? నాకుదీనివలన వరకము తప్పదుకదా యనెను అపుడు స్వామీ కక్కయ్యా! నీభార్యపై నిందుట గుడ్డను కప్పుమనెను. అతడు వెంటనే గుడ్డను కప్పెను అపుడు స్వామి మరల దనకమండలములోని జలము నామెపై ప్రోక్షించి కక్కయ్యా! రమ్ము" అని వెలుపలికి బిలుచుకొనిపోయి తలుపును మూసెను.

ఇరువురును బయిటికివెళ్ళి తక్కినవారితో మాటాడుచుండగా తెల్లవారెను. కక్కయ్యభార్య "అయ్యా! తెల్లవారినదే యింతసేపునిద్రించితిని, నాభర్తకోపగించునేమో" అనితలుపును దెరచుకొనివచ్చెను. కక్కయ్య ప్రతికివచ్చిన భార్యను కాగలించి మరల స్వామిని స్తుతించెను. ఈచిత్ర

మును చూచి అందరును ఆశ్చర్యపడి స్వామి దేవుడేసుమా యనుకొనుచు బోయిరి.

వీరబ్రహ్మము కర్ణాలు జేరుట

ఆవల వీరబ్రహ్మస్వామి మహానందిలో గొన్నిదినము లుండి మహానందీశ్వరుని సేవించుచు అడవిలోనుండు యా నాది చెంచువారికి కాలజ్ఞానమును వినిపించుచుండెను ఆవల బయలుదేరి యొక శిష్యునితో నవాబుకు తనరాకను గురించి చెప్పిపంపెను ఆవార్తవిన్నతోడనే నవాబు సపరివారముగ బయలుదేరి మంగళవాద్యములతో నెదురేగి స్వామిని పిలుచుకొనివచ్చి ప్రత్యేక వసతి గృహమున దించెను.

ఆరాత్రి నవాబు స్వామి బసకేగి స్వామీ! నా యీ రెండు ప్రశ్నలకు ప్రత్యుత్తరముజెప్పి నాసంశయమును దీర్పు డనగా మంచిదనెను, అంతట నవాబిట్లు ప్రశ్నించెను.

తేటగీత

నవాబు—స్వామీ! సర్వేశుధ్యానించుసమయమేది?
స్వామి—అన్నివేళల ధ్యానింపనగును వినుము
నవాబు—పుత్రులేలేక మోక్షంబుపొసగగలదె?
స్వామి—పొసగు జ్ఞానసుతుడులేకపొసగదదియు.

అంతట నవాబు సంతోషముతో నంతఃపురమున కేగెను.

నవాబు స్వామి శక్తిని పరీక్షించుట

మరునాడు నవాబు స్వామివారిని దర్శించి స్వామీ! మా యశ్వశాలలో గర్భమును దాల్చిన గుఱ్ఱమున్నది. అది నేడో రేపో యీనునట్లున్నది. దాని కడుపులో యేపిల్ల యున్నదో, ఆపిల్లరంగు మొదలగు వానిని దెలుపుడనెను. అప్పుడు స్వామి నవాబుతో ఆగుఱ్ఱమును దెప్పింపు మనెను. నవాబుసేవకుని బంపి అశ్వమును దెప్పించిచూపెను. అప్పుడు స్వామి గుఱ్ఱమును జూచిచూచి ప్రభూ! ఈగుఱ్ఱముగర్భమున నాలుగుగిట్టలు తెలుపురంగులో నున్నట్టియు, నొసట తెల్లని చుక్కయే కాక పూవన్నె చివరగల తోక గలిగిన మగ గుఱ్ఱపుపిల్ల యున్నది. ఇది సత్యమనెను.

అప్పుడు సభాసదులు దీనినిమనమెట్లునమ్మవచ్చుననిరి అందుకు నవాబు స్వామి దీనిని మేమెట్లు నిజమని తెలిసికొన గలము. అదియెప్పుడు యీనునో కదా యనెను. అందుకు వీరబ్రహ్మముగారు గుఱ్ఱము కనబడకుండ తడికల నాలుగు ప్రక్కల కట్టించి గుడ్డల గట్టిపుమనెను. నవాబు అట్లనే చేయించెను. అప్పుడు స్వామి గుఱ్ఱము చెవిబట్టికొని తడికలలోనికి దీసికొనిపోయి ఒకగంటపిమ్మట తానుజెప్పిన చిహ్నములుగల మగగుఱ్ఱపు పిల్లనుదెచ్చి రాజా నీగుఱ్ఱముగర్భమందుండి పిల్లను దీసితిని. ఇదిగో పంచకల్యాణి గుఱ్ఱపు పిల్లయనగా సభికులెల్లరుచూచి ఆశ్చర్యపడిరి.

అంతట స్వామి ఆగుఱ్ఱపు పిల్లను మరలలోపలికిగొని చని యొకగంట పిమ్మట నొక బెత్తముతోగొట్టి "ఊం లేచి

"వీరబ్రహ్మముగారు కమ్మాలునవాబు గుఱ్ఱమురొక్కగర్భ
మున నాలుగుకాళ్ళు, నొసట, తోక చిరవభాగమున తెల్ల
మచ్చలుగల పుంచకళ్ళాణి పిల్లకలదని చెప్పిరి"

బయటికి పొమ్ము'' అనెను. అపుడు గుర్రము సకిలించుచు బయటికి వచ్చెను. స్వామి నవాబుతో గుర్రపుపిల్లనుమరల నెప్పటివలె దాని గర్భమునం దిడితిని తల్లిగుర్రముపదిదిన ములలో దాని గనును భయమువలదని పలికెను.

అపుడు నవాబుతో గురుదేవా! నన్ను క్షమింపుడు. మిమ్ము పరీక్షించితిని నన్ను కోపమున శపింపవలదు. నన్ను మీశిష్యునిగా జేసుకొనుడు. నా రాజ్యమున మీరు దేనిని కోరినను యిత్తుననెను అందుకు బ్రహ్మముగారు ''బిడ్డా! నాకు కోపములేదు. నీసంశయము తీర్చుకొనుటకు ప్రశ్నించుటయు పరీక్షించుటయు తప్పుకాదు. నిన్ను నాశిష్యునిగా జేసికొంటిని ఈరాత్రి నీకు నాయుపదేశమును చేసెదననెను.

ఆవల నవాబు స్వామివలన యుపదేశమును పొంది శిష్యుడై పదిదినములు నిలిపి మిక్కిలి గౌరవించుచుండెను. ఒకనాటిరాత్రి నానావిధముల పువ్వులచే నలంకరింపబడిన పల్లకిమీద కూర్చుండబెట్టి ఉత్సవము చేయించెను. అచట నుండి స్వామి నంద్యాలకు బోవలెననగా నవాబు వారిని బహువిధములసన్మానించి సపరివారముగ వాయిద్యములతో నంద్యాలకు సాగనంపెను.

నంద్యాల విశ్వబ్రాహ్మణులు స్వామిని గౌరవింపక పోవుట

కర్నూలు పట్టణమును వదలి వీరబ్రహ్మముగారు సపరివారముగ నంద్యాల చేరి యందొక సత్రమున దిగిరి నంద్యా విలశ్వబ్రాహ్మణులు చాల ధనవంతులు, ఇతరులను

లెక్క పెట్టెడివారు కారు. వీరబ్రహ్మము శిష్యులతోను పరివారముతోను వచ్చెననియు తెలిసియు వారు స్వామినిదర్శించుటకు రాకపోయిరి. స్వామివారి దగ్గఱ ధనముగాని యితర పదార్థములు గాని లేవు ఎక్కడికి వెళ్ళినను అయ్యూరివిశ్వబ్రాహ్మణులు గూంచించి భిక్షలజేసి సత్కరించి పంపుచుండిరి ఇక నందాల్ల విశ్వబ్రాహ్మణులన్న ధనమదముచే స్వామిని లక్ష్యపెట్టక యెదురు తిరిగి నిందావాక్యములాడి యవమాన పరిచిరి.

అపుడు వీరబ్రహ్మము సిద్దయ్యను వెంట నిడుకొని స్వయముగ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుని యింటికేగి "అయ్యా! విశ్వబ్రాహ్మణ కులపు మీ అయ్యూరికివచ్చిన యతనిని బలుకరింపకపోయితిరి. మీరురాకున్నను నేనే మీకడకు వచ్చితిని. గృహస్థులును ధనవంతులును నగు మీరు మాకు భిక్షలజేసి గౌరవింపకున్న ఇంకెవరు గౌరవింతురు? మేము ధన ధాన్యములతో సంచారము చేయుట లేదు. మా ధనముతో మేము పర్యటింపవలెనన్న అవసరమేనా? ఈ నా శిష్యుడగు సిద్దయ్యయే ఒక పూటకి పుట్టెడు బియ్యపు టన్నమును దినును. నాశిష్యు లిట్టినా నెవరేమి చేయుదురనెను.

అపుడు విశ్వబ్రాహ్మణ సంఘాధిపతి "ఏమీ! ఈశిష్యుడొకడే పూటకు పుట్టెడు బియ్యమును అన్నమును తినగలడా? నేను పుట్టెడు బియ్యమును నండించెదను. అతనితో దినిపింపుము. అతని సంగతి నిజముగా తెలియగలదు" అనిపుట్టెడు బియ్యముతో అన్నమునండించి రాశిగా పోయించి తినిపింపుము చూచెదమనెను. అంతలో తక్కిన విశ్వబ్రాహ్మణ సంఘమంతయు నచ్చటికి కదలివచ్చెను.

సిద్దయ్యచే పుట్టెడు బియ్యపు అన్నమును తినిపించుట

అపుడు వీరబ్రహ్మముగారు "సిద్దా! ఆకలిఅకలియను చుంటివికదా! ఇదిగో పుట్టెడు బియ్యమును వండించి రాశి బోయించిరి, పోయి తిను"మనెను. సిద్దయ్య వెంటనే స్వామి పాదములకు నమస్కరించి రాశిముందు గూర్చుండి మెతుకు మిగలకుండ తిని "అయ్యా! ఆకలి తీరలేదు. అర్ధకడుపుకు పెట్టి చాలించిన పాపము తప్పదు" అనెను.

అతని మాటలకు ఆశ్చర్యపడి విశ్వబ్రాహ్మణు లందరును ఇది వీరబ్రహ్మముగారి శక్తి తప్ప యితరము కాదని వీరబ్రహ్మముగారికి నమస్కరించి "స్వామీ! మా ధన మదము మమ్మల్ను చేసినది. మీశక్తి యిపుడు తెలిసికొంటిమి. అతడిక ఎంత అన్నము పెట్టినను భస్మము చేయుచూగున్నాడు. అతనికొకనికె కడుపునిండ అన్నము పెట్ట లేకుండుట తక్కిన మీ శిష్యులకు పెట్టగలమా" యనిరి.

అపుడు స్వామి కమండలములోని నీళ్ళను చేత పోసికొని సిద్దయ్యపై ప్రోక్షింపగా నతడు శాంతించి లేచెను. అపుడు విశ్వబ్రాహ్మణ సంఘము స్వామివారిని వేరొకబసకు గౌరవముగ బిలిచికొనిపచ్చి దినమొక ఇంటివారు బిక్ష జేయించుచుండిరి.

శ్రీ వీరబ్రహ్మము అహోబిలమును చేరుట

ఆ విధముగా వీరబ్రహ్మేంద్ర స్వామి నంద్యాలలో గొన్ని దినములుండి విశ్వబ్రాహ్మణులకు క్రమముగా తత్వోపదేశము, సృష్టిని నిర్మాణక్రమము, సృష్టి రహస్యము మొదలగు విషయముల బోధించెను. తన విరచితమగు కాలజ్ఞానమును వినిపించి వారికి మంత్రోపదేశ మొనరింపగ వారందరును స్వామివారికి శిష్యులైరి అంత స్వామి అహోబిలమునకు బోవలెనని ప్రయాణముకాగా వారిని బాగుగా సన్మానించి గౌరవముగ సాగనంపిరి.

శ్రీ స్వామి నంద్యాలనుండి సపరివారముగ బయలుదేరి ప్రతి గ్రామమునను నిలిచి జనులకు ధర్మమార్గముల బోధించుచు కాలజ్ఞానమును వినిపించుచు, తగినవారికి మంత్రోపదేశ మొనరించుచుండెను. ఆర్లగడ్డ (శిరువెళ్ళ) రుద్రవరము మున్నగు గ్రామములదాటి అహోబిల క్షేత్రము జేరి దిగువ అహోబిలమున మకాముచేసెను.

అక్కడ శ్రీ నరసింహస్వామి తొల్లి హిరణ్యకశిపుని పొట్ట జీల్చి చంపెననియు, ఆరక్తమొక కోనేరయినదనియు జెప్పుదురు. ఎందలి కోనేటిలోని జలము రక్తవర్ణముగనుండుటకుగారణమదియే యని చెప్పుదురు. స్వామివారును శిష్యులును ఆ కోనేటిలో జలకమాడి గుడిలో స్వామిని దర్శించి ఎగువ అహోబిలమున స్వామిని సేవించిరి. ఆ నరసింహస్వామిని "ఓబులేశుడు" అని పిలుతురు. అందమును ఆ గుడి శిల్పనై పుణ్యమున కచ్చెరువంది, అచ్చటి ఉక్కుస్తంభమును జుట్టిరి.

అచ్చటనున్న చలువఱాతిపై నిలబడి నారాయణా! యని చప్పటలుగొట్టిన చేతుల మధ్యనుండి రక్తబిందువులు పడునందురు. అచ్చటి అరణ్యములలో చిత్రములన్నిటిని జూచి ఏనాదులకు మంచిమార్గములం బోధించి మర్కల దిగువ అహోబిలమునకు వచ్చిరి.

బ్రహ్మారక్కసి గర్వభంగ మొనరించుట

అహోబిలమునుండి స్వాములవారు ప్రయాణమైపోవు చుండగా మార్గమధ్యమునందే చీకటిపడి రాత్రియయ్యెను. అపుడు సిద్దయ్య స్వామీ! రాత్రి చీకటిలో ప్రయాణము చేయుట మంచిదికాదు. అదిగో అచ్చట వటవృక్షమును అచ్చటనే బావియుండునట్లున్నది. ఈ రాత్రి అచ్చట మజిలీ చేయుదమనెను. అందుకు స్వామి సమ్మతింపగా అందఱును పోయి మట్టిచెట్టుక్రింద దిగిరి. వంటవారు మంచినీటి బావి యున్నంచున వంటజేయుట మొదలుపెట్టి రెండు గంటలలో వంటల సిద్ధము చేసిరి.

వంట సిద్ధమైనది కాని భుజించుటకు విస్తళ్లు లేక పోయెను. అపుడు సిద్దయ్య కొండటి శిష్యులను చెట్టెక్కి-మఱి ఆకుల గోయమని చెప్పెను. అమాట విన్నంతనె కొండఱు చెట్టెక్కి ఆకుల గోయుచు తొడిమయూడిన చింతకాయవలె "తుపతుప" గ్రిందపడి మూర్ఛలో నుండిరి.

అపుడు సిద్దయ్య స్వామికడకేగి జరిగిన సంగతి జెప్పి చెట్టులో ఏదో భూతమున్నట్లున్నదనెను. ఆ మాటలు విని

స్వామి యోచించి సిద్ధా! అట్టి భూతములు మనల నేమియు జేయజాలవు. ఇదిగో నా వెండిబెత్తమును చేతబట్టుకొని నీవే వృక్షము నెక్కుము. ఆ చెట్టునైనున్న బ్రహ్మరాక్షసినీపైకి వచ్చును. అపుడు దానిపై నీచేతనున్న బెత్తమును తాకింపుము. అపుడది నీకులోబడును. దానిమాటలవిని బెత్తమును వదలినచో నిన్నుకూడ క్రిందబడునట్లు త్రోసి మూర్ఛ నొందించును. అది నీకు వశముకాగానే కొప్పునబట్టి క్రిందికి లాగికొనివచ్చి యిచ్చటికి దెమ్మనెను.

సిద్దయ్య వెంటనేస్వామియాజ్ఞానుసారము వెండిబెత్తమును బట్టుకొని చెట్టెక్కి అందిన యాకులను గోసి క్రింద వేయుచుండెను. అపుడు బ్రహ్మరాక్షసి యాతని మీదికి రాదలచి బెత్తమునుజూచి భయపడి నిలిచెను. సిద్దయ్యబెత్తముతో దాని దగ్గఱకేగి తలపై నిడబోగా బ్రహ్మరాక్షసి వెంటనే భూలోకసుందరిగా మారిపోయి "ప్రియా! నిన్నును నీధైర్యమును పరీక్షింపదలచి బ్రహ్మరాక్షసివలె గనంబడితిని. నీధైర్యమునకు మెచ్చితిని. రమ్మనావిడిదికి పోయి సుఖింతము. నాకు దగిన పురుషుడవు లేక పరితపించుచుండ నీవు లభించితివి. నీవు నాతో ఇంద్రభోగము ననుభవింపవచ్చును ఆ బెత్తమును పారవేసిరమ్మ" అని పలికెను.

అందుకు సిద్దయ్య మంచిది. ఇదిగో వచ్చుచున్నానని పోయి దాని తలపై బెత్తము నిడినతోడనే యది తనశక్తిని గోలుపోయి సిద్దియ్యకు లోబడెను. అపుడతడు దానికొప్పును బట్టి లాగుచు క్రిందికి దించి స్వామి దగ్గఱకు యీడ్చుకొని పోయెను.

బ్రహ్మరాక్షసినిజూచి స్వామి ''ఓసీ! నీకింత గర్వమా అందరివలె మమ్మునుకూడ బాధింపవచ్చితివా. ఇన్ని దినములు జనులను జంపినట్లు మమ్ము జంపదలచితివాఁ జొరా! నీవెందరి ప్రాణముల గొంటివోకదా, నేటితో నీగర్వమడగించెద''నని విభూతిని దానిపై జల్లెను. అపుడది స్వామిపాదములపై బడి స్వామీ! మీరు భగవంతునివలె నున్నారు. సామాన్యులకు నన్ను జయించు శక్తిలుగదు, నేటితో నా గర్వమడగినది. ఇక నాకు తరుణోపాయమును జూపుడని ప్రార్థించెను.

అందుకు స్వాములవారు ''ఓరక్కసీ! నీకిపుడు తరించు మార్గమునుజూప వీలుపడదు. నీవింకను కొన్నిదినములిచ్చటనే శక్తిహీనురాలవై పడియుండవలెను. ఇకమీదట నీవు మనుష్యులజంపకూడదు. నీవు బొత్తిగ జీవహింసల మానుము నీకు ఆహారమెట్లనని భయపడవలదు. నీకు ఆకలిదప్పులు లేకుండ జేసెదను'' అని విభూతివి మంత్రించి దాని నోటిలో వేసెను.

అంతట బ్రహ్మరాక్షసి స్వామీ! నాకు సద్గతి ఎపుడు కలుగునో సెలవిండనెను. అందుకు వీరబ్రహ్మంగారు నీవలన నీకు శాసవిమోచనము గలుగు యోగములేదు. కొన్నిదిన ములలో ఈమార్గముగా ఈశ్వరమ్మ యను భక్తురాలు తన శిష్యులతోగూడ సంచారము చేయుచువచ్చును. ఆమె నీకు తరుణోపాయ మార్గమును తెలుపును పొమ్మనగా యది పోయెను. అంత అందఱును భుజించి ఆ చెట్టుక్రింద రాత్రి యంతయు హాయిగ నిద్రించిరి.

వీరబ్రహ్మము పుష్పగిరికి బోవుట

ఆమరునాడు ఉదయమే ఆమట్టి చెట్టునుండి బయలు దేరి గ్రామములలోనిలిచి జనులకు ధర్మోపన్యాసముల వినిపించుచు చాగలమర్రి, మైదుకూరు, ఖాజీపేట మున్నగు గ్రామములలో ప్రకాశము చేయుచు పుష్పగిరి యను బ్రాహ్మణ అగ్రహార మునకు బోయెను.

బ్రహ్మముగారు బండిలోకూర్చుండి యుండిరి సిద్ధయ్య బండిముందు నడచుచుండెను. తక్కిన శిష్యులు ఇరుప్రక్కలను వేదాధ్యయనము చేయుచుండిరి. సేవకులు బిరుదులను ధరించి బరాబరు చేయుచుండిరి. కొందరు "జగద్గురు వీరబ్రహేంద్రస్వామివారికి జై" యను నినాదముల జేయుచుండిరి. సాధారణముగ యెప్పుడు స్వామి వెంట నుండు వాయిద్యగాండ్రు ముందు మంగళవాయిద్యముల వాయించుచు బోవుచుండిరి.

ఆ నినాదములను విన్న యగ్రహారీకులలో పండితులు యా వాయిద్యములను, వేదాధ్యయనములను విని అడ్డము వచ్చి "ఎవరుమీరు? మాయగ్రహారమున ఎవరునుబండిలో కూర్చుండి పోగూడదు. గ్రామమును దాటి పోవువరకు దిగి నడిచి పోవలసినదే, బ్రాహ్మణులు పాడవలసిన వేదపారాయణమును మీరు చేయరాదు" అని అడ్డగించిరి.

అప్పుడు ముందుండిన సిద్ధయ్య వారినిజూచి "అయ్యా! నాపేరు సిద్ధయ్య నేను దూదేకులవాడను. నేను మాజగద్గురువునకు ముఖ్యశిష్యుడను. మీరు బ్రాహ్మణులు అన్నియు

చెలిసినవారు అల్లుండియు మమ్మ్ల వేదాధ్యయనము చేయ గూడదనియు, బండిలో గూర్చుండి స్వామివారు పోగూడ దనియు వాదించుచున్నారు. మాబండిలో గూర్చుండి దారిన బోవుచుండ అడ్డగించుట ధర్మముకాదు. వేదాధ్యయనము జేయుటకు మాకధికారము లేదందురు. భూమియందు జన్మిం చిన ప్రతిమానవునకు వేదాధ్యయన మొసరించు హక్కును శ్రీమన్నారాయణమూర్తియే గలిగించియున్నాడు" అనెను.

అందుకు బ్రాహ్మణోత్తములు నవ్వుచు బాగున్నది. విశ్వబ్రాహ్మణుడు బగద్గురువట, తనికి ముఖ్య శిష్యుడు మహమ్మదీయుడట. తురకవాడు వేదములబదువవచ్చునట, ఇటులని వేశాస్త్రములో నున్నదోకదా. సరి, మీ గురువు దిగివచ్చి మాతో వాదించి మమ్మ్ల గెలిచినచో బండిలో గూర్చుండి పోవచ్చును. అటుగానిచో పోగూడదనగా వీర బ్రహ్మము బండినుండిదిగి "అయ్యా! నీతో వాదించుటకు వచ్చితిని. రండు చూతము" అనెను.

స్వాములవారు పుష్పగిరి బ్రాహ్మణుల జయించుట

అంతట బ్రహ్మణులందరు పండిత సభగావించిరి. బ్రహ్మముగారు చాతుర్వర్ణములు లేవనియు, బ్రహ్మచే సృష్టింపబడిన మానవులందఱకు వేదములనభ్యసించు అధికార మున్నదనియు ఆధారముతో రుజువుచేసెను. ఎన్నివిధముల నిరూపించినను స్థానబలముగల బ్రాహ్మణులు తమ వితండ వాదమును విరమించుకొనక యొకే పట్టుపట్టిరి. అపుడు

వీరబ్రహ్మముగారు వీరితో సామముస మాటాడుటవలన ప్రయోజనము లేదని వారి యగ్రహారమును రొక దృష్టితో జూచెను.

అపుడు పుష్పగిరి అగ్రహార మంతయు దగులుపడి మంటలు మిన్నుముట్టెను. ఆబాలగోపాలము ''కుయ్యో! మొర్రో'' అని మొరలిడుచు సభ జరుగుచోటికి వచ్చి అగ్రహారము తగులుపడినది. ఇక గొంతసేపులో భస్మముకాగల దనిరి. ఆవార్తల విన్నతోడనే బ్రాహ్మణు లెక్కడి వార క్కడిలేచి పరుగిడుచుండ బ్రహ్మముగారుచూచి ''అయ్యా! అగ్ని నార్పుట కంద ఱిచ్చటికి బరుగిడనేల? ఇచ్చటనుండి డానె నార్పలేరా!'' అనెను.

అందుకు భూసురులు ''అయ్యా! మరల మీరువితండ వాదమానకు బూనితిరి. ఇచ్చటనుండి అగ్ని హోత్రుల జల్లార్చు కొట్లు'' అని యడుగ స్వామి ''మీగృహములను దహించెడి అగ్నిహోత్రుని శాంతింప జేసితిని. భయపడవలదు'' అను చుండగా అగ్ని చల్లారెను. ఇండ్లన్నియు యెప్పటివలె నుండెను.

బ్రాహ్మణులు వీరబ్రహ్మముగారికి ఉత్సవము జేసి గౌరవించుట

ఆకసమువంటి మంటలు బ్రహ్మముగారు పలికినట్లు చల్లారిపోవుటజూచి బ్రాహ్మణులు అతడు నిక్కముగ మహా పురుషుడగునని నమ్మి వినయ విధేయలతో నమస్కరించి

తమ తప్పుల మన్నింపగోరిరి. అంతట స్వామివారిని సపరివారముగ నాలుగుదినములచ్చటనె నిలువమని ప్రార్థించిరి. వీరబ్రహ్మముగారు వారికోర్కెలను నిరాకరింపక నిలచెను. బ్రాహ్మణులు నాలుగు దినములు స్వామివారికిని, అతనిపరివారమునకును విందులగావించుచుండిరి. ప్రతిదినము స్వామి వారికి దివ్యజ్ఞానోపదేశమొనరించుచు నుపన్యాసములనిచ్చుచుండెను. ఒకదినము సిద్దయ్యనుజూచి "సిద్దా! ఈదినము నీవు షట్చక్రనవచక్ర విధానమునుగూర్చి యుపన్యసింపుమనగా సిద్దయ్య స్వామిపాదములకు నమస్కరించి యుపన్యసింప మొదలిడెను. అతని యుపన్యాస ధోరణింజూచి భూసురులు వింతపడి శ్రద్ధతో వినుచుండిరి.

ఉపన్యాసానంతరము బ్రాహ్మణులు తామంతకుముందే కమలాపురమునుండి తెప్పించిన మల్లెపూలదండతో రథమునలంకరించి వీరబ్రహ్మేంద్ర స్వాములవారిని యుత్సవముజేయించిరి. ఆయుత్సవమును జూడగోరి చుట్టుప్రక్క గ్రామములలోని జనులు గుంపులు గుంపులుగవిచ్చేసిరి. ఆదినము రాత్రి చూచుటకు ప్రతిసంవత్సరముజరుగు శ్రీ చెన్నకేశవ స్వామి గరుడోత్సవమునుమించియుండెనని జనులు అనందించుచుండిరి.

ఉత్సవము ముగియగనే జనులు తమగ్రామముల కేగుచుండ జూచి స్వామివారు వారితో కాలజ్ఞానమును వినిపింతును, వినిపొండనగా అందరును నిలిచిరి. అంతట అగ్రహారీకులు స్వామికి విందుచేసిరి, అందఱి భోజనములైన పిమ్మట వేదికపై గూర్చుండి కాలజ్ఞానమును వినిపించెను. ఆవల జను

లందరును తమ గ్రామమున కేగిరి. స్వామి తన బసకేగి విశ్ర మింపదలచెను. బ్రాహ్మణులాతని బసవరకు సాగనంపి సెలవు దీసికొనిగృహములకు మరలుచుండస్వామి "భూసురులారా! మేము వేకువజామున లేచి ప్రయాణమై కడపకు బోదుము. సెలవు నిండనగా వారు మంచిదని పోయిరి.

సిద్దయ్య అల్లాడుపల్లె వీరభద్రస్వామిని సేవింపకోరుట

రాత్రి స్వామివారు విశ్రమింపబోగా సిద్దయ్య స్వామి పాదము లొత్తుచు "స్వామీ! అల్లాడుపల్లె ఇక్కడికి సమీ పముగదా. నాకు వీరభద్రస్వామిని దర్శించి సేవింపవలెనని బుద్ధి పుట్టినది. నాయందు దయయుంచి రేపు ఉదయము బయలుదేరి అల్లాడుపల్లెలో మజలీచేయునట్లు ఆజ్ఞయిండు" అనగా స్వామి సిద్దా! అట్లే కానిమ్మని యానతినిచ్చెను.

ఉదయము అందరును మేల్కొనిరి. అపుడు సిద్దయ్య స్వామివారి బండిని సిద్ధముచేసి అల్లాడుపల్లె దారిన నడిపింపు మని బండివానితో జెప్పెను. అతడుమంచిదని బండిని అల్లాడు పల్లె మార్గముగా నడిపించుచుండ అందరును స్వామి బండి వెంట బోవుచుండిరి. అటు బోవుచు సుమారు పదిగంటలకు వీరభద్రస్వామి గుడిని జేరి సత్రములో బసచేసిరి.

వంటలవాడువంటల జేయుచుండస్వామిసపరివారముగ కుముద్వతీ నదికేగి స్నానమొనరించి, స్వామి అనుష్ఠాన మును పూర్తిచేసి మరల వీరభద్రస్వామి గుడికి వచ్చెను. అప్పటికి అర్చకుడు స్వామిని పూజించి యుండెను.

వీరబ్రహ్మము సిద్దయ్యతోగూడ పరివారమున కంతయు నామ్వి దర్శనము చేయించి తీర్థప్రసాదముల నిప్పించెను.

అంతలో వీరబ్రహ్మస్వామి అల్లాడుపల్లెకు వచ్చెనని విని చుట్టుప్రక్కలనుండి జనులు తండోపతండములుగ వచ్చి స్వామిని దర్శించిరి. స్వామి అందఱును కూర్చిలచ్చటనేనిలిపి అందఱకు భోజన సదుపాయముల నొనరించెను. భోజనానంతరము జనులకు ధర్మముల నుపదేశించి కాలజ్ఞానమును వినిపించి వారి గ్రామములకు బంపెను. అంతట తెల్లవారు. నప్పటికి కడప చేరవలెనని చెప్పగా సిద్దయ్యబండిని సిద్ధము చేయించెను. అందరును చీకటిలోనే ప్రయాణము సాగించు చుండిరి.

వీరబ్రహ్మమును చోరు లడ్డగించి కొల్లగొట్ట చూచుట

అల్లాడుపల్లెనుండి అర్ధరాత్రివేళ ప్రయాణమై పోవు చుండిరి. స్వామివారిబండి ముందేగుచుండెను. ఆబండిముందు సిద్దయ్య పోవుచుండెను. కొంతదూర మేగిన తర్వాత నొక తమ్మచెట్ల వనమువచ్చెను. అందు దాగియుండిన తొమ్మిది మంది గజదొంగలు దండధరులై వచ్చి బండి నాపుమని గద్దించి పలికిరి. సిద్దయ్య స్వామీ! ఎవరో బండి నడ్డగించి పోనీయవలదనుచున్నారనెను. అపుడుస్వామి బండిలో నుండి "ఎవరు వారు?" అని గద్దించెను.

"ఎవరు బండిలోనుండి గద్దించునది? మేము చోర నాయకులము. మేము తొమ్మిదిమందివచ్చితిమి. మాయాజ్ఞ

లేక ఒక అడుగైన బోజాలరు. మీరగ్గఱనుండిన ధనమును సొత్తులను మర్యాదగా మాకిండు, లేకున్న మీ ప్రాణములు నిలువవు. మాకు వెరచి యీదారిన యెవ్వరును ప్రయాణము చేయుట లేదు. చాలదినములనుండి మా బారిన యెవ్వరును బడలేదు. ఈదినము మీరు వచ్చితిరి. మా యదృష్టమూ పండినది.'' అని గర్జించి పలికిరి.

చోరులకు గన్నులు కవపడక పోవుట

బండిలో కూర్చుండియుండిన స్వామివారు ఆమాటలు విని ''ఎవరువారు? దొంగలనాయకులా? గజదొంగలా? మిమ్ము అడ్డగించినవారు లేరా? మీరు తొమ్మిదిమందివచ్చిన నేను మిమ్ములమించిన గజదొంగలను పదుముగ్గురను మ్రింగి యున్నాను. గర్వపడక బండినివదలి దూరముగా బొండు'' అని పలికెను.

అందుకు దొంగలు బండిలోనుండిన స్వామిని చూచి ''ఓహో! మాకు తెలిసినది. సన్యాసివేషము వేసికొని అమాయక జనులకు జ్ఞానోపదేశమను పేరుతో మాయ మాటలజెప్పి వారితో లాగినధనమంతయు ఇపుడు మాకీయ కున్నచో నిన్ను వదలము, ఏది నీవు దాచిన ధనమును చూపెదవా లేదా? యనిరి. అందుకు స్వామి నవ్వుచు నాయనలారా! నాదగ్గరనున్న ధనము ఇతరులకు గనబడు నదికాదు. నాధనము దాచిన స్థలమును గనుగొను శక్తి మీకు గలదా? ఆశక్తి యున్నచో వెదకి తీసికొనుడని

కమండలములోని జలమును చేతిలో బోసికొని వారిపై జల్లెను.

ఆనీటిచుక్కలు వారిపై బడినతోడనే వారికి కన్నులు గానరాక పోయెను. అపుడు దొంగలు "మహానుభావా! మిమ్ము సాధారణ సన్యాసియని తలచి నోటికి వచ్చినట్లు మాటాడితిమి. మమ్ము క్షమింపుడు. మేము గ్రుడ్డివారమై పోతిమి ఇకమీద మేమీ చోరవృత్తిని విడిచి కష్టపడి పని చేసి జీవింతుము. ఈ మాట తప్పదు మాయందు కరుణ యుంచి మాకు దృష్టినొసంగుడనిప్రార్థించిరి. అపుడు స్వామి మరల కమండలములోని జలమును వారిపై జల్లగా వారికి దృష్టి వచ్చినది కాని వారి తలలు వంగియుండెను. క్రింది చూపేగాని పై జూపులేకుండిరి. అపుడు స్వామి వారినిజూచి "చోరులారా! మీరిన్ని దినములుచేసిన పాపకార్యముల ఫలము అనుభవింపక తప్పదు. మీ జీవితమంతయు మీకు కింది చూపే కాని మీది చూపులేదు పొండు" అని బండి వానిని తోలుకొని పొమ్మనెను.

కడప నవాబు స్వామికి సమ్మానపంపుట

శ్రీవీరబ్రహ్మముగారు దొంగలనుతమదారినే పొమ్మని రాత్రియంతయు ప్రయాణముసాగించి ఉదయము కడపపట్టణమునుజేరి యూరి బయటనుండు సత్రములో బసవేసిరి. వీరబ్రహ్మేంద్ర స్వాములవారు వచ్చినవార్త కడప నలు మూలలలో వ్యాపించెను. ఆసంగతి కడపనవాబునకు చెప్పిరి.

అతడు ముడుమాల పీరుసాబు దాఖల్ చేసుకొన్న ఆర్జీని చెప్పించి వీరబ్రహ్మంగారిని తన ఎదుట హాజరు కావలెనని తాకీదు పంపెను.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి.

మా రాజ్యములోని ముడుమాల గ్రామవాసియగు చూదేకుల పీరుసాబు మీ మీద ఫిర్యాదు చేసియున్నాడు, మీరు అతని పుత్రుడగు సిద్దయ్యకు మంత్రము ప్రయోగించి శిష్యునిగా జేసికొని దేశముల ద్రిప్పుచుంటిరట అదిగాక సిద్ధయ్యను హిందువుగా తయారు చేసితిరట. ఇందుకై మిమ్ము విచారించి తగిన దండన విధింపదలచితిమి. ఇందుకు తామే స్వయముగవచ్చి తగిన సంజాయిషీ యీయవలెనని కోరడమైనది.

ఇట్లు.

కడప నవాబు.

ఆసమ్మనును తీసికొనిజవానులు బ్రహ్మముగారికడకేగి వారికిచ్చిరి. స్వామి దానిని చదువుకొని సిద్దా! మీతండ్రి నాపై ఆర్జీ దాఖలు చేసెనట నేను నిన్ను మాయచేసి శిష్యునొనరించుకొని హిందువుగా మార్చి దేశముల ద్రిప్పుచుంటినట. అందుకు నవాబు నన్ను తన దర్బారునకు వచ్చి తగిన సంజాయిషీ యీయగోరుచున్నాడు. ఇవిగో సర్కారుసమను అని చూపెను.

అందుకు సిద్దయ్య స్వామీ! నవాబుమిమ్ములసంజాయిషీ కోరుచున్నాడా. ఆతని కంతగర్వమా, కానిండు, మీరు పోవలదు, నేనేవెళ్ళి తగిన సంజాయిషీయిచ్చి అతనిని మీ

కడకు పరుగెత్తుకొని వచ్చునట్లు చేసెదనని జవానుల వెంట రాజదర్బారుకు బోయి సగౌరవముగ సలాముచేయక నిలు చుండెను.

అది నవాబుచూచి "ఓయీ! నీకు రాజదర్బారులో నడచుకొనవలసిన పద్ధతి తెలియనట్లున్నది. నవాబును చూచినతోడనే వంగి సలాముచేయుట పద్ధతి. నీకు అదికూడ తెలియదా? శుద్ధమూర్ఖునివలెనున్నావనెను. అందుకు సిద్ధయ్య రాజా! నా సలామునకు మీరు అర్హులుకారు నాగురవగు వీరబ్రహ్మేంద్రస్వామివారు తప్ప నాసలామును భరింపలేరు. మీక్షేమమును గోరియే మీకు నేను సలాము చేయలేదు. నేను మీకు సలామొనరించిన, మీరును మీసింహాసనమును భస్మమై పోగలరు. దానిని పరీక్షి జేయగోరుదురేని చేయవచ్చును. ఒక పెద్ద గుండును తెప్పించి పెట్టుడు చూపెదననెను.

అపుడు నవాబు సేవకులచే నొక పెద్దతొగుండును తెప్పించి దర్బారు బయలున పెట్టించెను. అపుడు సిద్ధయ్య దానియెదుట నిలబడి గురువును మనస్సున ధ్యానించి ఆ గుండుకు వంగి సలాము చేయగనే యది పటాలుమని పగిలి చిన్న చిన్న ముక్కలైపడెను.

నవాబు వెంటనే లేచివచ్చి సిద్ధయ్యకు సలాముచేసి "అయ్యా! నీశక్తిని తెలియజాలకపోతిని. ఇక మీగురువుగారి శక్తి యెటులుండునో కదా. సరి నేను మీగురువుగారిని దర్శించి వారిని నాభవనమునకు గొనిరాదలచితిని. పోదము రమ్మని సిద్ధయ్యవెంట పాదచారియైపోయెను.

వీరబ్రహ్మముగారిని చూచినచే నవాబు నేలకు వంగి మూడుసార్లు సలాముచేసి చేతులుగట్టి నిలుచుండి ''స్వామీ! నన్ను క్షమింపుడు. మీమహిమ తెలియక వీరుసాబుదాఖల్ చేసిన అర్జీపై చర్య దీసికొనదలచి యట్లు మీకు తాకీదు పంపితిని. నాయందు దయయుంచి మాయింటికివచ్చి మా గృహమును పావనమొనరించి నన్ను శిష్యునిగా జేసికొన వలెన నెను.

అందుకుస్వామి సమ్మతించెను. నవాబు వెంటనే ఒక పల్లకిని తెప్పించి స్వామిని కూర్చుండబెట్టుకొని మంగళవాద్యములతో దన రాజమందిరమునకు బిలుచుకొనిపోయితగిన సౌకర్యములు నొనరించెను. ఆరీతి మూడుదినములు నవాబు తన మందిరమునందిడుకొని ప్రతిదినము రాత్రి స్వామివలన సకలధర్మములను తెలిసికొనెను. స్వామివారు నవాబును చూచి నాయనా! మతములు వేరుకాని మానవులు వేరుకారు ప్రతి మానవునకు భగవంతుడు ఒకేవిధమగు ఆత్మ నొసంగి యున్నాడు. ఒక్కొకరు తమ యాత్మను చెడుదారిన నడుపు దురు, కొందఱు సన్మార్గమున నడిపి గురూపదేశము బొంది తరింతురు, ఏమతమువాడై ననుతరించుటకువీలున్నది, సర్వేశ్వరునికి వివిధమతములు లేవు, అతనిమత మొక్కటే. సిద్ధయ్య మహమ్మదీయుడై నను హిందూమతమును తనంతకుదానె స్వీకరించెను, గాని నేనతని మాయచేసి హిందూమతమున కీర్తిని కోరలేదు. అతడు మనస్ఫూర్తిగ నా శిష్యుడు కాగోరి కడకు ముఖ్యశిష్యుడై యున్నాడనెను.

నాయనా! అందఱకు దేవు డొకడే. హిందువు కాని మహమ్మదీయుడుకాని, మరేమతస్థుడుకాని కడకు చేరవలసి

వది యొక్కేస్థలము. అదియే మోక్షము. ఆమోక్షమునొసంగు వాడు సర్వేశ్వరుడేనని తెలిసికొనుము. నీవుకూడ అందర వలెనే చపలచిత్తుడవై నేను, నాయిల్లాలు, నాపుత్రులు, నారాజ్యము అని భ్రమింపకము. అందఱును ఒకదినము మరణింపక తప్పదు. మరణించినతరి నీజీవాత్మవెంట నీదేహ మురాదు. కనుక నీవు ప్రాపంచిక విషయలోలుడవు కాక పరమేశ్వరునిజేరు యుపాయము నాలోచించుకొనుమనెను.

అందుకు నవాబు స్వామీ! నేనుమూర్ఖుడను నాయందు దయయుంచి నాకు తామే తరుణోపాయమును దెలుపుడు అని ప్రార్థించగా వీరబ్రహ్మము నవాబుకు మంత్రోపదేశ మొనరించి తన శిష్యునిగాస్వీకరించెను. ఆరాత్రి నవాబునకు కడమ ప్రజలకును కాలజ్ఞానమును వివరించి వేకువజామున ప్రయాణమై సపరివారముగా సిద్ధవటమునకు బయలుదేరెను.

వీరబ్రహ్మము సిద్ధవటమును జేరుట

వీరబ్రహ్మముగారు బండిలోగూర్చుండియుండ యెప్ప టివలెను సిద్ధయ్య బండికిముందుగా బోవుచుండెను. తక్కిన పరివారమంతయు ముందు నడచిపోవుచుండిరి. మరునాడు ఉదయమున సుమారు 8 గంటలకు సిద్ధవట గ్రామమును జేరి పినాకినీనది గట్టుననుండు శివాలయమున దిగిరి.

సిద్ధవటముకడ్రివహించు నదికి దక్షిణగంగయనియు పేరు కలదు. ఆగ్రామము చేరిన తర్వాత వంటలవారిని

నదిలో స్నానముచేసి వంటచేయగోరిరి. వీరబ్రహ్మస్వామి తాను స్నానఘట్టమున కేగి స్నానసంధ్యాద్యనుష్ఠానములనెర వేర్చి శివుని యాలయమున జపము చేయుచుండెను.

అంతలో సిద్దయ్యకూడ దక్షిణగంగలోమునిగి శుచియై యొడలినిండుగ విభూతిరేకల దిద్ది మెడలో రుద్రాక్షమాలను ధరించి సాక్షాశంకరుడు దిగివచ్చెనా యనునట్లు నదిగట్టున కూర్చుండి జపమొనరించు చుండెను. ఆసమయమునకుతగి నట్లు సిద్దవటము నవాబుగారి ముఖ్యభటులు నదికేగి గట్టున విభూతిరేఖలదాల్చి రుద్రాక్షమాల కంఠమునమెరయజష వమాల ద్రిప్పుచుకన్నుల మూసికొనియున్న మహమ్మదీయుని గాంచి ఆశ్చర్యపడి "ఔరా మహమ్మదీయుడు హిందువుల వలె విభూతిదాల్చి జపము జేయుచున్నాడు. ఇది మహమ్మదీయులకు అవమానకరము. ఇతనినిబట్టి నవాబుకడకు గొని పోద"మనికనిపెట్టుకొనియుండిరి. అంతలోసిద్దయ్య జపమును చాలించి లేచెను.

అతడు లేచినతోడనే భటులాతని రెండుచేతులనుబట్టి మా నవాబుగారు మిమ్ము బిలుచుచున్నారని కొలువుకూట మునకు బిలుచుకొనిపోయి నవాబు క్రమ్మోలనిలిపి "సర్కార్! ఇతడు మన ముసల్మాను జాతివాడు. హిందువులవలె విభూతి దాల్చి జపము చేయుచుండ బట్టి తెచ్చితిమి. ఇతడు ఇస్లాం మతమున కవమానము నాపాదించుచుండె" ననిరి.

అందు కతడు సిద్దయ్యనుచూచి ఓయీ! నీ వెవరని యడిగెను. అందుకు సిద్దయ్య భయపడక "అయ్యా! మాది బద్వేలు సమీపమునను ండు ముడుమాలగ్రామం, నాతండ్రిని

వీరుసాహేబని పిలుతురు. నాపేరు సిద్దయ్య నేను మహమ్మదీయమతములో నొకశాఖయగు దూదేకుల కులమువాడను. కందిమల్లయ్యపల్లె పీఠాధిపతియగు జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వామివారిశిష్యుడను. స్వామితోగూడ దేశసంచారము వెళ్ళియుంటిని. ఈదినము ఉదయము స్వాములవారు యీగ్రామమునకువచ్చి శివాలయమున సపరివారముగ దిగియుండగా నేను నదిలో స్నానముచేసి జపము జేసికొనుచుండగా వీరు నన్ను గొనివచ్చిరి. నిరపరాధులనుబట్టితెచ్చుట మీ పరిపాలనలో ముఖ్య ధర్మముగ నున్నది కాబోలు."

అనుచుండగనే నవాబు కోపముతో గ్రుడ్లెర్రజేసి "ఓయీ! నీవు గర్వీగానున్నావు. రాజసన్నిధినివచ్చినతోడనే రాజుకువంగి సలాము చేయవలెననికూడ తెలియని మూర్ఖుడవుగ నున్నావు. అదియుగాక మహమ్మదీయుడవై హిందు మతగురువునగు శిష్యుడవై నందున నిన్ను శిక్షింపవలసియున్నది. ఏమి జవాబిత్తువో చెప్పుమనెను.

నవాబుగారిని చూచి సిద్దయ్య నవ్వుచు "అయ్యా! నే నే గురువును సేవించిన నీకేమి? నిన్నును నన్నును సృష్టించినవాడు సర్వేశ్వరుడు నీవు మహమ్మదీయ వంశమున జన్మించి సత్యదూరుడవై ఇతరమతముల ద్వేషించుచుంటివి. నేనుకూడ మహమ్మదీయ వంశమున జన్మించితిని, చిన్న తనమునసె సత్యమును గ్రహించితిని. అందుకు దగినసద్గురుని చేరి తరుణోపాయమునకై పాటుపడుచుంటిని నీవలె పరమత ద్వేషినికాను. సర్వమత సామరస్యమును గోరుచు భగవంతుని పాదపద్మముల సేవించువాడను, నా మతముతో నీకు

బనిలేదు. నీ మతముతో నాకక్కరలేదు కాని మతమును ద్వేషింపను అమిూద నేను నిన్నుచూచి సలాముచేసి గౌర వింపలేదని యాగ్రహపడచుంటివి. అదియును నీమేలుకొరకే సనిభావింపుము. నేనే నీకుసలాము చేసియుండినసీవు భస్మమై పోయియుందువు. నాసలామునుగాని, నమస్కారమునుగాని భగవంతుడును, నా గురుదేవుడును భరింపగలరు కాని నీవంటి వాని చేత కాదని యూరకుండెను.

నవాబు సిద్ధయ్యను పరీక్షించుట

అందుకు నవాబు ఓయీ! నోటికి వచ్చిన దెల్ల బ్రేలు చుంటివి.నీ సలామును ఒకటి కాదు పదింటినైన నను నేను భరింపగలను. నియిష్టమువచ్చినన్ని సలాముల జేయుమనెను సిద్ధయ్య "రాజా! నిజముగ నీవుభరింపజాలవు. నేను సలాము చేసిన నీవేమగుదువో నే చెప్పజాలను. ఏమైన విపరీతము జరిగిన దానిని గ్రహ్మరింప నాకు శక్తి చాలదు అపుడు నా గురువు రావలసియుండును. అటుతర్వాత నీ యిష్టమనెను.

అందుకు నవాబు ఓయీ! నీమాటలకు భయపడుటకు నేను హిందువుడనుకాను నీ మంత్రములకు మూమిడికాయలు కాలుసనుకొంటివా? నీఇంద్రజాలపు మాటలకు నేను మోస పోవువాడను కాను. నీ యిష్టము వచ్చినట్లు చేసికొమ్మని ఖాతిమనగా సిద్ధయ్య నవాబునుచూచి "నీయందంత శక్తి యున్నదా. కానిమ్మ" అని భూమినిలాకి ఒక సలాము

చేయగనే నవాబు * ''హా'' యని యరచి నేలబ్రవాలెను. అంతట సిద్దయ్య కొలువుకూటమునుండి బయలుదేరి శివాలయమున కేగిరి.

సిద్దవటము నవాబు వీరబ్రహ్మము శిష్యుడగుట

అంతటనవాబు మరణించెనని యతని భార్యా బిడ్డలు దుఃఖించుచుండఅతనివరుజీ, మున్నగువారుశివాలయమునకు పరుగెత్తిజరిగిన విషయమును వీరబ్రహ్మముగారికి నివేదించి నవాబును లేపి పుణ్యమును గట్టుకొమ్మని ప్రార్థించిరి.

అపుడు స్వామి నవ్వుచు గమండలముగొని బయలుదేరి కోటలోనికి బోయి కొలువు కూటములో బడియుండిన నవాబుపై గమండలములోని నీళ్ళనుజల్లగా వెంటనేనవాబు లేచి ''సిద్దయ్య యెక్కడ? ఈతడెవరు?'' అని ప్రశ్నింపగా వజీరు అతని భార్య జరిగిన విషయము దెలిపి ఈ మహాను భావుడు సిద్దయ్య గురువగు వీరబ్రహ్మేంద్ర స్వామియని చెప్పిరి.

అపుడు నవాబు స్వామివారి పాదములపై బడినమస్కరించి దివ్యపురుషుల నెగతాళిజేసిన ఫలమనుభవించితిని. నా గర్వము నశించినది. నన్ను మీ శిష్యులలో నొకనిగ జేసికొని నాకు జ్ఞానోపదేశము చేయుడని ప్రార్థించి స్వామి

---

*సూచన—ఈ యుదంతమును పలువురు పలువిధములు జెప్పుదురు. మే మీ విధము ననుసరించితిమి.

వారిని సపరివారముగా కోటలోనికి రాగోరెను. అందుకు స్వామివారికిని, సిద్ధయకును పరివారమునకును దినమొక రీతిగా * 'విందుల' జేయించుచుండెను ఆరీతి స్వామివారు కోటలో నుండిన నవాబును శిష్యునిగ జేసికొని యనేక బహుమతులు వడసి గ్రామమును వదలెను.

వీరబ్రహ్మముగారు కందిమల్లయ్యపల్లె జేరుట

—:o:—

వీరబ్రహ్మేంద్రస్వామి సిద్ధవటమునుండి బయలుదేరి ఏకశిలానగరమున కేగి కోదండరామస్వామిని సేవించి అచ్చటి నుండి శ్రీ కాళహస్తీశ్వరుని దర్శించి తిరుమలకేగి శ్రీవేంకటేశ్వరుని దర్శనము చేసికొని, తిరుత్తని, ఘటికాచలము మున్నగు క్షేత్రముల దర్శించికించికేగెను. అక్కడ మూడు దినములుండి కంచి వరదరాజస్వామిని, ఏకామ్రేశ్వరుని దర్శించి కండిమల్లయ్యపల్లెకు రాదలచి బయలుదేరి 'నగరపాడు' అను గ్రామమున మజిలీ చేసెను.

నగరపాడు చిన్న జమీందారి గ్రామము. అందు జగ్గయ్య యను జమీందారుండెను. అతనికి సర్వసంపదలుండెనుగాని పుత్రులు లేకుండిరి. అతడు సంతాన ప్రాప్తికై యెన్నో క్షేత్రముల దర్శించి చేయవలసిన వ్రతముల జేసెను

---

*సూచన—ఇచట కొందరు ఒక కథను చెప్పుదురు. ఆ సంఘటన వేరొకచోట జరిగినందున యిచ్చట మేము వదలితిమి.

గాని సంతానము గలుగలేదు. జగ్గయ్య వీరబ్రహ్మముగారు తమ యూరికి వచ్చినని విని వారిని దర్శించి సపరివారముగ తననగరుకు దోడ్కొనివచ్చి యుచితరీతిని సత్కరించి తనకు పుత్రసంతానము కలుగునట్లు ఆశీర్వదింపుడని ప్రార్థించెను.

అందుకు స్వామివారు ఒక రాగిరేకుపై యంత్రమును లిఖించి యిచ్చి దానిని పూజామందిరమునందిడి పూజించు చుండిన గొన్నిదినములలో బ్రహ్మజ్ఞానియు భవిష్యత్కాలజ్ఞు డగు సుపుత్రుడు జన్మించునని చెప్పెను. ఆపుత్రునకు 'రంగ రాజు' అను పేరిడి యతనికి యుక్తవయస్సు వచ్చినతోడనే తానొసగిన యంత్రమునుగూర్చి చెప్పి పూజించుచుండుమని చెప్పుము అని జగ్గయ్యకు మంత్రోపదేశ మొనరించి, కాల జ్ఞానమును వినిపించి జగ్గయ్యచే సత్కరింపబడి యాత డొస గిన కానుకలను గ్రహించి బయలుదేరి కతిపయదివసములకు మరల కందిమల్లయ్యపల్లె జేరెను.



ఓమ్

శ్రీ పోతులూరి

వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పదమూడవ ప్రకరణము

ఓ భక్తులారా! గత ప్రకరణమున శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారు దక్షిణాంధ్ర దేశ సంచార మొనరించుచు జూపిన చిత్ర సంఘటనల నెల్లజదివితిరి కడపట సిద్ధవటము నుండి నగరపాడునకరిగి జగ్గయ్యకు పుత్రసంతానప్రాప్తికై యొక యంత్రమును ప్రసాదించి సపరివారముగ మారల గంది మల్లయ్యపల్లె జేరెనని చదివితిరి. ఆవలి కథను చదివి తెలిసి కొనుడు.

వీరబ్రహ్మము తన యవతారమును జాలింప గోరుట

—:o:—

వీరబ్రహ్మేంద్రస్వామి గందిమల్లయ్యపల్లె జేరిన తర్వాత తన యవతారమును జాలింప దీర్మానించుకొనెను అప్పుడు తన పుత్రులలో జ్యేష్ఠుడగు గోవిందయ్యను రమ్మని "నాయనా! నేను త్వరలో నాయవతారమును జాలించెదను ఆవల నాస్థానమును సేవాక్రమించి పీఠాధిపత్యమును వహింప

వలెను. నావలెనే నీవును జనులకు దత్తోపదేశ మొసగించు చుండుము.

నాయనా! నీకు పురుషార్థముల విపరింతును వినుము. సత్యాసత్యముల దెలిసికొని పరోపకార చింతనము గలిగి యుండుట సమాజ మనబడును.

న్యాయ మార్గానువర్తియై ధనము నార్జించుచు నాశ్రమ దీక్షను వహించి తుమయను దానిని గలిగియుండిన పురుషార్థముల బడయనగును.

త్రిగుణ సనుస్యూతమగు ప్రకృతికి లోబడని సుజ్ఞాన ముచే గలిగిన ప్రజ్ఞతో భూత భవిష్యద్వర్తమాన కాలవిష ముల దెలిసికొని వర్తించువాడు పతమేశ్వరాంశ సంభూతు డనబడును.

నాయనా! పరబ్రహ్మకు స్త్రీ పురుష భేదములుండవు, ఆ పరబ్రహ్మ లోకసంరక్షణార్థమై మూర్తిత్రయరూపముల బొందెను. ఆ మూర్తిత్రయమే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మూర్తిత్రయమునకు భేదమేమన మూర్తిత్రయము ప్రకృతితో గూడినది. పరమాత్మ ప్రకృతితో సంబంధము లేనిది ఒక దేవాలయమున విగ్రహమును బ్రతిష్టించి, ఉత్సవసమయములలో ఉత్సవ విగ్రహముల నూరేగింతురు. ఆ మూల విగ్రహమునకును యుత్సవ విగ్రహములకును రూపము భిన్నమై యుండును. అట్లుండినను మూల విగ్రహమునకు ఉత్సవ మొసరింపక వేరురూపమునను౦డు యుత్సవ విగ్రహములకు ఉత్సవ మొసరించుటకు కారణము మూలవిగ్రహమునకును, ఉత్సవ విగ్రహములకును రూపభేదముతప్ప భావ

భేదము లేదనియే. అట్లనే త్రిమూర్తులకును పరమాత్మకును భేదము లుండవు.

కుమారా! నీకింతకుముందే విజ్ఞానమార్గోపదేశము గావించితినిగదా. నాయనా! నీకు గొన్ని దినములలో పరమేశ్వరియే నీకు కుమార్తెయై జన్మించును. ఆమె శక్తిస్వరూపురాలు. ఆమెయు రాబోవు విషయముల దెలిసికొని మానవులకు తత్త్వోపదేశం బొనరించి మిక్కిలి తేజస్సుతో ప్రకాశింపగలదు. తండ్రీ! నాయవతారము నంతమొందించుటకు దగిన సమాధిని నిర్మింప మొదలిడుము పొమ్మని తాను జపమొనరించుకొన లోపలికేగెను.

వీరబ్రహ్మము అవతారమును ముగించుట

ఒకనాటి రాత్రి స్వాములవారు భార్య గోవిందమాంబను బిలిచి దేవీ! నీకు గొన్ని రహస్యముల దెలుపవలసియున్నది. నేను వచ్చెడి వైశాఖ శుద్ధదశమి భానువారము మధ్యాహ్నమున జీవసమాధి యగుదును. నేను కడపటి నారిగా సిద్ధని బరీక్షించి వాని శక్తి సాటిలేనిదని లోకము గుర్తించునటుల జేయదలచినాను. ఆదినమున సిద్ధయ్యను కంచిమల్లయ్యపల్లెలో నేకుండ జేయవలెను. అందుల కతని మీరు బనగానెపల్లెకు బోయి పుష్పాల దెమ్మంటినని చెప్పి బనగానిపల్లెకు బంపవలెను. ఇది పరమరహస్యము సుమా! యనెను. అందుకు గోవిందమ్మ మంచిదని పెళ్ళెను.

అంత గోవిందమ్మ వైశాఖ శుద్ధ నవమి నాటి రాత్రి సిద్దయ్యను బిలచి నాయనా! రేపు మధ్యాహ్నమున స్వామి వారు అవతారమును జాలింతురట. ఆవేళకు నిన్ను బనగాని పల్లెకు పోయి పూజాద్రవ్యముల గొనిరమ్మనిరి. వేకువజాము వనె ప్రయాణమై పొమ్మనెను. అందుకు సిద్దయ్య యేమియు యోజింపగనే తల్లీ నా గురువు నాసతి నెరవేర్తును అనివెళ్ళి విశ్రమించెను.

సిద్దయ్య పరుండెను గాని నిద్రపట్టలేదు. కడపటిసారి గురుదేవుపదముల వర్ఛించుచు పువ్వుల దెచ్చెడి భాగ్యముతన కబ్బెనని యపరిమితానందముతో నుబ్బిపోయెను. కడకతడు నిద్రపట్టక తనకాలమును కందిమల్లయ్యపల్లెలో గడుపుట కంటె బనగానపల్లెకు ప్రయాణమై పోయిన పువ్వుల గొని ముందే రావచ్చునని యనుకొనెను. గురుదేవుని యాజ్ఞ గైకొనిపోవుదమని వీరబ్రహ్మము నిద్రించు గదికి వెళ్ళి చూచెను, అతడు నిద్రించుచుండ నిద్రాభంగ మొనరింప రాదని వారిపాదములకు నమస్కరించి ప్రయాణమైపోయెను.

వీరబ్రహ్మము జీవసమాధి యగుట

సిద్దయ్య మరునాడనగా వైశాఖశుద్ధ దశమినాడు బన గానపల్లెకు పువ్వుల దెచ్చుటకు పోయినదే బ్రహ్మముగారు గోవిందమాంబను గోవిందయ్యను బిలచి "నేను నా ప్రియ శిష్యుడగు సిద్దుడు రాకముందే సమాధి జేరవలెను. పాపము వాసిద్దని నేను సమాధియగు నపుడు దగ్గఱ లేకుండచేసితిని

అదియు వాని మేలుకొరకే చేసితిని. అతనికీర్తి యాచంద్ర తారార్కముగా నిలుచుగాత, నేను సమాధియైన గొంత సేపటికి సిద్ధనివలన మీకొక విచిత్రవిషయము తెలియగల" దనెను.

ఆవల గోవిందయాచార్యుని బిలచి నాయనా! నేను సమాధియైనను మీతల్లితో బసుపు కుంకమతీయవలదనియు కాళ్ళమెట్టులు గాజులు యామె ధరించియే యుండుమని చెప్పుము ఆమెను యిప్పటివలెనె పూజ్యురాలుగ జూడ వలెను. ఈవిషయమును గూర్చి యెవరైన యామె నాక్షేపించినచో వారు నాశనమగుదురు. ఇది సత్యము.

ఆవల నామతమునందు సూర్యచంద్రాదులుండునంత వఱకు పూజలు జనుగుచునే యుండును. ఈవిషయమై అనుమానపడవలసిన పనిలేదు. అంత గొంతకాలమునకు నా వంశము నిలిచిపోవును. కాని నీసహోదరియగు వీరనారాయణమ్మ సంతతి వృద్ధియై యావంశమువారు నామతమున కధికారులై యుందురు.

నాయనా! గోవిందయ్యా! నీకు ఈశ్వరమ్మ, పార్వతమ్మ శంకరమ్మ, గోవిందమ్మ మరియు గిరిరాజమ్మ యనుయైదు గురుకుమార్తెలు జన్మింతురు. ఆకుమార్తెలలో జ్యేష్ఠురాలగు ఈశ్వరమ్మ మీకొఱతలన్నిటి తీర్పగలదు, ఇక నేను జెప్పవలసిన దేవియులేదు. నాసమాధిలో పెద్ద యఖండము నిండుగ తైలమును బోసిదిట్టనుగు వత్తినితడిపి వెలిగించుడు సమాధియగుటకు ముహూర్తము సవిూపించుచున్న దనెను.

అపుడు గోవిందయ్యా తండ్రీ! మీచేతి కొండిబెత్తమును ముద్దుటుంగరమును, యోగదండము, కమండలము పాదు

కలను నేను తీసికొని యుపయోగింపవచ్చునా యనెను. అందుకు స్వామివారు నాయనా! అవి సిద్ధయ్యసొమ్ము. అతడు తప్ప వాని నుపయోగించుట కితరు లనర్హులు పాపము వాడు పండ్రెండు సంవత్సరములు నా పాదసేవచేసినందులకు నేనేమియు జేయకపోతిని. అందులకే వీనిని వానికని ప్రత్యేకించితిని అతడు వచ్చినతోడనే వానినిందు. అపుడే ముహూర్తము సమీపించెను ఇదిగో నేను సమాధిలో గూర్చుంటిని దీపమును వెలిగించి మాతను బిగింపుడని కలియుగము 4694 కు సరియగు క్రీ. శ. 1594 వైశాఖశుద్ధ దశమి భానువారమునాడు అవతారమును ముగించెను.

సిద్ధయ్యకు వీరబ్రహ్మము ఋషిరూపమున గనంబడి బనగానిపల్లెకు బోకుండ జేయుట

—:o:—

వీర బ్రహ్మేంద్రస్వామి తాను జీవ సమాధి కాబోవు సమయమునకు సిద్ధయ్యను తనకడ నుండకుండ జేయదలచి సుమారు 8 గంటలలో అటు అమడల దూరముండిన బనగానిపల్లెకు బోయి పూజకు పుష్పముల దెమ్మని గోవిందమ్మతో చెప్పెను. గురుదేవుని యాజ్ఞయన్న యగ్నిగుండమునైన బొచ్చుటకు వెనుదీయని సిద్ధయ్య యెనిమిదిగంటలలో నారామడ దూరము వెళ్ళి స్వామి సమాధి జేరుముహూర్తమునకు రాగలనా యను యోజన చేయకయే గాలివేగమున బోవ్రచుండెను.

అతడు ఉదయము ఎనిమిదిగంటలగునప్పటికి సుమారు పదిమైళ్ళు నడువగలిగెను. ఇ కను యేబదిమైళ్లు నడచినగాని బవగానిపల్లె చేరలేడు అక్కడ బువ్వుల గోసికొని బయలు దేరినచో మకల వరువదిమైళ్ళు నడచినగాని కందిమల్లయ్య పల్లె చేరలేడు. అందుకు వీరబ్రహ్మంగారు తన శిష్యు మూరక కష్టపడుటనియు, అతని బనగానిపల్లె బోకుండ డేయుటయే మంచిదని తానొక ఋషి రూపమున సిద్ధయ్య పోళ్ళు దారికడ్డముగవచ్చి "నాయనా! బనగానపల్లెకుపోయి వచ్చుటకు మూట యిరువది మైళ్ళగును గదా! నీవింకనుపది మైళ్లు పూర్తిచేయలేవు. నీగురువు సమాధియగు ముహూర్తమునకు అంతదూరము పోయి రాజాలవు సికిక నాలుగైదు గంటలే వ్యవధియున్నది. నేనొక మాట చెప్పెదను వినుము నీవు నీ గురుదేవుని నమ్మినవాడవైనచో ఈ యడవిలో ముండ్లులేని యాకుల మూడు పిడికెళ్లు గోసికొని మూట గట్టి గొంపోయిన యవి కందిమల్లయ్యపల్లె చేరునప్పటికి నీ గురువు కోరిన పుష్పములుగ మారలేవా" అని చెప్పి యదృశ్యుడయ్యెను.

ఒకచేత ఖడ్గమును రెండవ చంకలో దాటియాకుల గ్రంథమును గలిగి యదృశ్యుడై పోయిన ఋషి పుంగవు డెవ్వరై యుండునాయని యోచించి, గురుదేవుడే ఆవిధముగ వచ్చియుండునని తలచి బనగానిపల్లెకు బోవుట మాని యడవిలో ముండ్లులేని ఆకులను మూడు పిడికెళ్లుగోసి మూటగట్టి శరవేగమున కందిమల్లయ్యపల్లె చేరుటకై నడుచుచుండెను.

అతడు కొంతదూర మేగునప్పటికే యొండ యెక్కువయ్యెను. అదారిప్రక్కన యొక బావి కనబడగా సిద్ధయ్య

మూటను బావిగట్టున పెట్టి బావిలో స్నానముచేసి గురు దేవుని నామజప మొనరించి గట్టును జేరులోపల మూటలో నుండి సుగంధ వాయువు వచ్చెను. అతడు ఆశ్చర్యముతో మూటను విప్పి చూడగా ఆమూటలో నానా వర్ణ పుష్ప ములు సుగంధ వాయువులను వెదజల్లుచుండెను. సిద్దయ్య "ఓరా! ఆ ఋషిపుంగవుని వాక్యములు ఫలించెను" అని దానిని తీసికొని బయలుదేర నుండగా యున్నటులుండి యతనివద్దకొక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చెను.

సిద్దయ్య ఆబ్రాహ్మణునిచూచి "స్వామీ! మీరెచ్చట నుంచి వచ్చితిరి, ఎటకేగు చుంటిరి" అని ప్రశ్నించెను. ఆ బ్రాహ్మణుడు నాయనా! నేనుకందిమల్లయ్యపల్లె పరిసర గ్రామములలో భిక్షకై పోయియుంటిని. అంతలో కంది మల్లయ్యపల్లెలో వీరబ్రహ్మముగారు జీవసమాధియగుదురని విని యచటికేగి వారుసమాధియగుట చూచివచ్చితిని" అను చుండ సిద్దయ్య "హా గురుదేవా!" అని యరచి మూర్ఛిల్లి లేచి చూచునప్పటి కా భూసురుడును లేకుండెను.

సిద్దయ్య కందిమల్లయ్యపల్లెకు తిరిగి వచ్చుట

ఓరా! నాగురుదేవుడు బ్రాహ్మణ రూపమున వచ్చి వెళ్ళెను. అతని లీల లసంఖ్యాకములు. నేనాలస్యము చేయ రాదు. నాగురుదేవుడు నిజముగ సమాధిలై యుండిన చో నీపూలమాలచే సమాధినైన పూజింపగలనని పువ్వుల మూటతో బరుగిడుచు బోయి కందిమల్లయ్యపల్లెజేరి మఠ సింహద్వారమును చేరెను.

ఆ సింహద్వారము బంధించబడి యుండెను. అప్పుడు సిద్దయ్య బిగ్గరగా తలుపు తట్టినంతనే యొక పరిచారకుడు వచ్చి "అన్నా! గురువుగారు జీవసమాధియైరి. అమ్మగారు నిన్ను లోపలకి రానీయఖలదని యాజ్ఞ చేసిరి. ఇకనీవుగ్రామమునకు బోపచ్చును. అమ్మగారి యాజ్ఞ గురువు నాజ్ఞగా భావించుట మన ధర్మమని" తలుపుల బంధించెను.

అప్పుడు సిద్దయ్య "హా గురుదేవా! నీవు భూగర్భ గృహమును జేరినప్పటినుండియు నన్ను బలుకరించువారు లేకపోయిరే నాగతి ఇంతయేనా? నన్ను యధోగతి పాలు గావించుటకు నేనే యపరాధము గావింపలేదే కడకు సమాధిని దర్శించుటకును, నేదెచ్చిన పుష్పములచే బూజించుటకు కూడపిలు లేకుండ జేసితివే. నీవు కనుమరుగై నంతనె నాకిట్టి దురవస్థగలుగునని ఎన్నడును దలపనైతిని. అకటా! నాతల్లి గోవిందమ్మకు నాపై యింత కనికరము లేకుండ బోవుటకు గారణమేమి? ఒకప్రక్క తండ్రిదూరమైనందులకు దుఃఖించుచుండ రెండవప్రక్క తల్లియు దూరమగుచున్నది. తలిదండ్రులకు దూరమై నే బ్రతుక నేల?

అని పరిపరి విధంబుల యోచించి సిద్దయ్య ప్రాణముల బాయుటకు దీర్మానించుకొని యందున్న తాతిగుండునకు దల మోదుటకు ప్రయత్నించి అంతలో "చీ! నేనెంతయవివేకిని. ఇది ఆత్మహత్యయగును కదా పిటికి పందలు ఆత్మహత్యకు గడంగవలెనేకాని నాబోటివారికి తగదు. నాగురుపునుగలిసికొనుమార్గము నాగురువే దెలిపియుండెను. అనియే యుంచి దని సింహద్వారము నెదుట పద్మాసనమువేసి కూర్చుండి పంచప్రాణముల బంధించి మనోమారుతంబుల నొకటిజేసి

షడాధారములు భేధించి సహస్రారమున నిల్పి కుంభకమున పరబ్రహ్మములో జేగుటకు నిర్ణయించెను. అతడు ఉచ్వాస నిశ్వాసములు బంధించి కూర్చుండిన సంగతి గోవిందమ్మకు దెలిపిరి.

గోవిందమ్మ సిద్దయ్యకు సమాధిని జూచుట కాజ్ఞ యిచ్చుట

సిద్దయ్య పరబ్రహ్మలో నైక్యమగుటకు దపమొనరించు చుండెనని విన్నంతటనే గోవిందమ్మ పరుగిడుచువచ్చి సింహద్వారమును దెరచి "నాయనా సిద్దా! నీ ఘోరతపమును జాలింపుము. నీగురుదేవుని సమాధిని బూజింప బొమ్మని నీ యాత్మశుద్ధిని బరీక్షింపగోరి ఇట్లు చేసితినే కాని లేకున్న నీకిందు ప్రవేశ మొసంగకుందునా. నిన్ను అడ్డగించునంతటి వారెవ్వరును లేరు. నీగురుదేవుడు కడపటివఱకు నీరాకకై వేచియుండెను. అంతలో సమాధియగు లగ్నమునచ్చుటచే నిక ప్రయోజనము లేదని సమాధిలో గూర్చుండెను. పొమ్మని నీవు తెచ్చిన పువ్వులచేసమాధినిబూజించిరమ్మనెను. అపుడు సిద్దయ్య విదురనుండి మేగోకన్నవాని చందమున గనుల దెరచిచూచి "తల్లీ! లోకమాతా! నీకుమారునిపై దయ కలిగెనా" యని పాదములపై బడెను. అపుడు గోవిందమ్మ సిద్దా! ఏల ఆలస్యము చేసెదవు. త్వరగా లోపలికివెళ్ళి సమాధిని పూజింప బొమ్మనగా సిద్దయ్య లేచి పుష్పముల మూటను దీసికొని లోపలికి వెళ్ళెను.

సిద్దయ్యకు వీరబ్రహ్మము దర్శన మొసగుట

సిద్దయ్య సింహద్వారమునుదాటి సమాధి గృహము నకు పరుగిడి పువ్వులను సమాధిపై జల్లి సాగిలబడి "గురు దేవా! నేజేసినపనేరమేమి నాకు కడసారిదర్శన మీయకుండ బనగాపల్లె కేగు కారణమునుజూపి నేను వచ్చులోపలనె యవతారమును మరుగుపరచితివే కడపట కొక మాటయైన జెప్పకపోతివే. ఇక నేనేమి చేయవలెనో నాకు దెలియకున్నదికదా. ఈ యంధకారమున బడియుండుటకంటె నీ యాత్మలో నాయాత్మను లయంబొనరించెదగాకయని పంచ ప్రాణములబిగించి గురుదేవునిలో నైక్యము కాగోరెను.

అపుడు "సిద్దా! ఆ ప్రయత్నమునుండి విరమించు కొనుము. సమాధిపై బిగించిన మాతను దెరువుము" అను శబ్దము వినంబడెను. అపుడు సిద్దయ్య లేచి ఇది గురుదేవుని కంఠస్వరమువలెనున్నది. ఆ మహానుభావుడు నాకు దర్శన మిచ్చునేమో చూచెదగాక యని సమాధి మూత నూడదీయగా వీరబ్రహ్మముగారు బయటికివచ్చి సిద్దా! నీకు బ్రహ్మోపదేశమొనరించితిని. అయినను నీవీ మాయాప్రపంచమును దాటలేకున్నావు. ఈ ప్రాపంచిక సుఖదుఃఖములను మరచిపొమ్ము. మాతల్లి! గోవిందమ్మకును, నీసోదరుడగు గోవిందయ్యకును జెప్పవలసినవిషయములనన్నింటిని చెప్పియే యున్నాను. ఇక నీకు క్రొత్తగా చెప్పవలసినదేమియు లేదు. ఇదిగో కడపటిసారిగా నీకు దివ్యదృష్టి నొసంగితిని. నావిశ్వ రూప సందర్శన మొనరించుకొనుమన సిద్దయ్య "రమా

రమణా! ఆధిమధ్యాంత రహితా! నీహృదయ కమలమున సర్వ ప్రపంచమును గనుచుంటిని. ఇక మీరూపము నుపసంహారించుకొనుము. నేను ధన్యుడనైతిని" అనునంతలో విశ్వరూపమును చాలించి "నాయనా! ఇదిగో నా వెండి బెత్తము, శిఖాముద్రిక, యోగదండము, పాదుకలను దీసికోని పొమ్ము" అనుచుండ సిద్దయ్య స్వామిపాదములపై శిరమును మోపి నమస్కరింప "సిద్దా! నీకోరికలు నెరవేరుగాక, సుపుత్ర ప్రాప్తియగుగాత" అని దీవించి సమాధిలో కూర్చుండగా సిద్దయ్య సమాధిమూతను బిగించి బయటికి వచ్చెను.

సిద్దయ్య గోవిందమ్మతో సెలవు దీసికొని ముడుమాల జేరబోవుట

సిద్దయ్య సమాధిగృహమునుండి వెండిబెత్తము, శిఖామ్రుద్రిక, యోగదండము, పాదుకలను గొనివచ్చి గోవిందమ్మకు నమస్కరించి తల్లీ! గురుదేవుడు దర్శనమిచ్చుటయే గాక యీ నాలుగు వస్తువులనిచ్చి ఆశీర్వదించి ముడుమూల కేగుమనెను. ఇక మీరును గోవిందయ్యగారును ఆశీర్వదించి యనుజ్ఞ యిచ్చినచో నాగ్రామమున కేగెదను. అంతలో గోవిందయ్యవచ్చెను. ఇద్దరును సిద్దయ్య నాశీర్వదించిరి. అపుడు గోవిందమ్మ లోపలకేగి కొంత ధనమును

కొన్ని యాభరణములను మూటగట్టి తెచ్చి "నాయనా! ఇదిగో యీ మూటను తీసికొనిపొమ్ము అపుడపుడు వచ్చి పోవుచుండుము" అనగా సిద్దయ్య సమస్కరించి బయలు దేరెను.

అతడు వీరబ్రహ్మముగా రొసగిన వస్తువులను, గోవిందమ్మగా రొసగిన కానుకలను గొనిపోవుచుండెనని గడ దొంగలగు పెద్దబుచ్చినాయుడు చిన్నబుచ్చినాయుడు అను వారు దారి నడ్డగించి యీవస్తువుల నపహరింపవలె నని సిద్దయ్యకడకు వచ్చిరి.

అంతలో గొంతదూరమున గుట్టమీదై నెక్కివచ్చు వీరబ్రహ్మంగారు కనిపించుటచే వారు భయపడి పరుగెత్తిరి. సిద్దయ్యకు వారెందుకు వచ్చిరో, ఎందులకు బరుగిడిరో తెలిసికొనవలెనను యూహ జనింపలేదు. అతడు తలవంచుకొని గురుదేవుని నామస్మరణ జేయుచు బోయి ముడుమాల గ్రామమును జేరి తలిదండ్రుల దర్శించి కాలమును గడుపుచుండెను.

ఓమ్

శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పదునాలవప్రకరణము

ఓ భక్తసోదరులారా! గడచిన ప్రకరణమున మనము వీరబ్రహ్మముగారు దక్షిణాంధ్రదేశమున సంచారముముగించి వచ్చి గందిమల్లయ్యపల్లెమఠమును జేరినవిమ్మట జీవసమాధి కాగోరి సిద్ధయ్యను బనగానపల్లెకు బొమ్మని అతడు రాక ముందె అవతారమును మరుగుపరచుటయు, అతడు సిద్ధయ్యకు అనేక లీలలజూపుటయు, కడప సమాధినుండి బయటికివచ్చి సిద్ధయ్యకు దర్శనమిచ్చి ముడుమూలకు బొమ్మని యనుమతి నొసగగా అతడు ముడుమాలను జేరెనని చదివితిమి. ఇకముందు జరుగబోవు సంగతులను దెలిసికొందము.

గోవిందమాంబ మునిమడుగు విశ్వబ్రాహ్మణుల శపించుట

సాధారణముగ వీరబ్రహ్మము మఠమున నుండగా అతని చిన్నకుమారుడు పోతులూరయ్య సంచారము జేసి శిష్యులకడసాంవత్సరిక చందాలనువసూలను చేసికొనివచ్చుట

వాడుకగ నుండెను. వీరబ్రహ్మముగారు జీవసమాధియగు టకు ముందే పోతులూరయ్య సంచారము పోయియుండెను. అతడు సంచార మొనరించుచుండగనే తండ్రి జీవసమాధి యయ్యెనను వార్త వ్యాపించెను. అతడు తండ్రిని కడపటి సారి చూచు అదృష్టము లేకపోయెనే యని దుఃఖించుచు సంచారమునాపి వెంటనే కందిమల్లయ్యపల్లెకు తిరిగివచ్చెను.

అతడు తల్లివలన సమస్త విషయముల దెలిసికొని కొంతవఱకు యూరడిల్లి సమాధిమూతనుదీసి తండ్రినిదర్శించి మరల టిగింతునని నెను. అందుకు తల్లి నాయనా! పోతులూరు తండ్రిని జూడవలెనను ఆతురతతో సమాధిమూతను తీయ కుము, తండ్రి సమాధిలో తపమాచరించుచుండును. నీవు తపోభంగ మాచరించినవారికి గోపమువచ్చి శపింపవచ్చును అపు డాశాపఫలము లనుభవించుట కష్టము అనగా పోతు యూరయ్య ఆ ప్రయత్నమును విరమించుకొనెను.

పోతులూరయ్య కొన్నిదినములు గడచిన తర్వాత మరల సంచారము బయలుదేరి 'మునిమడుగు' అను గ్రామ మున మజిలీ చేసెను. ఆయూరి విశ్వబ్రాహ్మణులు అతని యెప్పటియట్లు గౌరవింపకపోయిరి. అందు కతడు వారిని కారణ మడుగగా వారు "అయ్యా! మీతండ్రి మరణించి నను మీతల్లి మంగళసూత్రమును దీసి గాజులను విసర్జింప కున్నది పై గా పసుపు కుంకుమ పూలను ధరించుచున్నది ఇది లోక విరుద్ధము మన కులమునకే యప్రతిష్ట గ నున్నది ఇప్పటినుండియు మేము మీకు శిష్యులుగా నుండి కానుకలు నీయదలప లేదు. పెనుకకు బొండనిరి.

అమాటలను విని పోతులూరయ్య ఒకప్రక్క కోపము ఒకప్రక్క అవమానము బాధించుచుండ తనలో "ఔను, ఈసమస్య తేల్చవలసినదే. లేనియెడల ప్రతియూరి శిష్యులు ఈప్రశ్న నేవేయుటకు మొదలుపెట్టిన వారికి సమాధానము చెప్పుట కష్టము" అని క్రోధముతో గందిమల్లయ్యపల్లె కేగినతోడనే ఇంటనున్న ఖడ్గమును దీసికొని తల్లిని జూచి తనకు మునిమడుగులో జరిగిన యవమానమును చెలిపి, వారి వలెనే ప్రతియూరు శిష్యులు ఆక్షేపించిన వారికి సమాధానము చెప్పుట కష్టమగును. కనుక నీవు లోకాచారమునను సరించి మాంగల్యముదీసి, గాజులు బగులగొట్టి పసుపు కుంకుమ, పుష్పాలు మొదలగు మంగళకరమగు పస్తుతుల ధరించుట మానెదవా లేదా? తగిన సమాధాన మొసగనిచో నీ తల భూమిపై బడగలదనెను.

అందుకు గోవిందమ్మ కన్ను లెర్రజేసి మునిమడుగు ప్రక్క-జూచుచు * "మునిమడుగు విశ్వబ్రాహ్మణులు ముద నష్టమగుదురుగాక." అని శపించెను.

పోతులూరు సమాధిమాత దీయుట

అవిధమున శపించిన గోవిందమ్మ పోతులూరునుజూచి వాయనా! నీకు మతిబోయినదా యేమి నీ తండ్రిసమాధిలో

---

* సూచన :—గోవిందమ్మ శపించి నప్పటినుండియు మునిమడుగు విశ్వబ్రాహ్మణ సంఘము క్రమముగ క్షీణించి పోయినది.

తప మొనరించుకొనుచున్నాడు. తన శిష్యుడగు సిద్దయ్యతో మాటాడి యతనికి దన పెండి బెత్తమును, కిఖామ్ముద్రికను, పాదుకలు మున్నగువాని నిచ్చి ముడుమాలకు బోయి రాజ యోగమున కాలము గడుపుచుండుమని యాజ్ఞాపించెను, నీ కనుమానముగా నున్న యతనికడ కేగి విచారించి చూడు మని పంపెను.

ఆమాట విని పోతులూరయ్య వెంటనే బయలుదేరి ముడుమాల కేగి మఠమునకు జరుగుచున్న యగౌరవమును గూర్చి విశదముచేసి ఈ అపనింద నెట్లు భాపుకొనగునో చెప్పుమనెను. అందుకు సిద్దయ్య "గురుపుత్రులు మాయింటికి వచ్చినందున మాగృహము పావనమాయెను. ముందు మా సత్కారములు స్వీకరింపుడు తర్వాత గురుదేవుని గూర్చి వివరింతు" ననెను అందుకు పోతులూరయ్య "అన్నా! ముందు నా సంశయమును దీర్పుము ఆవల నీసత్కారములు బొందుదును, లేకున్న నాకేమియు వల" దనెను.

అందుకు సిద్దయ్య "అన్నా! పోతులూరయ్యా! అన్నియు దెలిసిన నీవు నన్నిట్లు లడుగదగునా? జగద్గురువగు మన తండ్రినిగూర్చి యేల సంశయింతువు? తల్లి చెప్పినది చాలక మరల నాకడకు రానేల? తండ్రి సమాధిలో తపమాచరించు చున్నాడు మాధుల మాటలకు భయపడనేల? ఈనామాట లను నమ్ముము" అని తెలిపి అతనిని పలువిధముల సత్కరించి బహూకరించి సగౌరవముగ కందిమల్లయ్యపల్లెకు సాగ నంపెను.

పోతులూరయ్య కందిమల్లయ్యపల్లెకు తిరిగివచ్చెను. ఇల్లు చేరియు అతనికి మనస్సు నిలువకుండెను. అందరును తండ్రిపై

గల ప్రేమ భక్తివలన అతడు జీవించియున్నాడని భ్రమపడు చుండ ప్రియశిష్యుడగు సిద్దయ్య మాత్రము వేరువిధముగ జెప్పనాఁ నాసంశయమును నేనేతీర్చుకొనవలెనుగాని యిత రుల మాటల నమ్మి యూరకుండరాదు. ఎవరెన్ని చెప్పినను నేను నాకన్నులార నాతండ్రి తపమాచరించు చుండుట జూచువరకు యెవరిమాటలను వినవని ఎంచకు చెప్పినను వినక ఒకి కర్రను దీసికొనిపోయి సమాధిమూతను దీసి ప్రక్కన బెట్టెను.

వీరబ్రహ్మంగారు పోతులూరయ్యకు కనించుట

—:o:—

ఆరీతి సమాధిమూతనుతీసిన పోతులూరయ్య లోపల జూచెను. సమాధిలో అఖండలము దేదీప్యమానముగ వెలుగుచుండెను. ఆవెలుగులో తండ్రి కన్నుల మూసికొని పద్మాసనము వేసి కూర్చుండి తపమాచరించుచు దన్ను దానెరుంగక యచంచలుడై యుండుట జూచెను. అప్పటి కిని యతని యనుమానము తీరలేదు. అతడు తండ్రి మరణించెను, అందులకే కదలకున్నాడు. "రోటతలనిడి రోకటి పోటుకు వెరువరాదు" ఏమైన కానిమ్మని సమాధిలోపల జొచ్చి "నాయనా! నాయనా!"యని రెండుసారులుపిలిచెను. అందుకు ప్రత్యుత్తరము లేకుండ జూచి వీరబ్రహ్మము గారి గడ్డమునుబట్టి యూచుచు తండ్రీ! యని పిలిచెను.

అప్పుడు వీరబ్రహ్మేంద్రులవారు కన్నుల దెరచిరి. ఆ కన్నులనుండి విద్యుల్లతనుమించినప్రకాశములు వెలువడెను.

అపు డతడు ''పాపీ! నాకు తపోభంగ మొనరించితివి. ఈపాప పరిహారార్థము నీవు పండ్రెండు సంవత్సరములు అరణ్యవాస మొనరింపక తప్పదు. పండ్రెండేండ్లు దాటగనే మరల నా మఠమునకు తిరిగివచ్చి నాసన్నిధియందే సమాధియగుము. ఇక నాలస్య మొనరింపక సమాధిమాతను బిగించిపొమ్ము'' అని మరల గన్నుల మూసికొనెను.

అపుడుపోతులారయ్య వెంటనే సమాధిమాత నెప్పటి యట్లు బిగించి గడగడ వడంకుచు దల్లికడకేగి ''అమ్మా! తీమించుము. నాతండ్రి మరణించెనా లేదా యని తెలిసికొన కుండ కేవలము మీమాటలనమ్మి యూరకుండుటకు నాబుద్ధి సమ్మతింపక పోయెను. అందువలన నాసంశయమును దీర్చి కొన తీర్మానించి క్రమతో సమాధిమాతనుదీసి చూచితిని. తండ్రి గడ్డమునుబట్టి యూచి వారిని బిలిచితిని. అపుడు వారు కోపోద్దీపులై ''ఓరీ! నాతపమునకు భంగము వాటిల్ల జేసితివి. ఆపాపమును బోగొట్టుకొనుటకు పండ్రెండు సంవత్సరములు అరణ్యవాస మొనరించి తదనంతరము వచ్చి నాసన్నిధిలోనే సమాధియగుమని మరల దపమాచరించుటకు గన్నుల మూసికొనగా సమాధిమాత నెప్పటియట్లు బిగించి వచ్చితి'' నను.

భార్యా సమేతుడై పోతులూరయ్య
అరణ్యవాసము జేయ బోవుట

పోతులూరయ్య తండ్రి కోపమును వినిపించినంతనే గోవిందమ్మ మొదలు నటీకిన వృద్ధమువలె గూలబడి

"నాయనా మేము చెప్పిన దేగాక సిద్దయ్యతోగూడ చెప్పించి
తిమి. మామాటవినక తండ్రిగారి సమాధిమూతను దీసి
వారికి గోపమును తెప్పించినదేగాక శాపమును బొందితివి.
మీతండ్రిగారు ప్రేమస్వరూపుడు. ఇప్పటివరకు అయసగా
రొక్కరినిగూడ శపించిన పాపమున బోలేదు. పతిత్తులెల్ల
పరమ పావనులుగ మాఱ్ఱెడి నీతండ్రిగారి కెంత కోపము
తెప్పించితివో, లేకున్న నిన్నెంతగనో ప్రేమించెడి తండ్రి
శపించుటకు గారణములేదు. నీకర్మఫల మిట్లు నిన్ను జేయిం
చినది. తండ్రి శాపము తప్పదు. అనుభవించియే తీరవలెను.
నాయనా! నీవు యేకాకివై అరణ్యమున కేగుటకు నేను
సమ్మతింపను. నీ వెంట నేనుకూడ వచ్చెదను. మీ అన్న
గోవిందయ్య కూడ ఇంటలేదు. ఏమి చేయుదము? ప్రయా
ణమునకు మంచి ముహూర్తమును చూడుమనెను.

అందుకు పోతులూరయ్య "తల్లీ! నావెంట మిమ్ము
గొనిపోవుటకు తండ్రియాజ్ఞలేదు. కనుక నీవు నావెంట
రాకూడదు. నీవు వచ్చిన మఱ్ఱమును జూచుకొను వారుం
డరు. తండ్రిగారి సమాధి పూజల క్రమము తప్పక జరుగు
చుండవలెను. అనుదినము చుట్టుప్రక్క గ్రామములనుండి
భక్తులు శిష్యులు వచ్చుచుందురు. వారికి తగిన సమాధా
నము చెప్పుటకు మీరు లేనిచో బాగుండదు. కనుక మీ
రిక్కడనే యుండుడు. నేను మాత్రమే అరణ్యవాసము చేసి
వత్తునన్నను.

ఆమాటలను పోతులూరయ్య భార్య పార్వతమ్మ
విన్నను. అమ్మ నాథా! ఏమి అరణ్యవాసమా! అందుననుమీ
రొక్కరే బోవుటకు సిద్ధపడుట న్యాయమా? అర్ధాంగినగు

నన్ను వదలిపోవ్రట న్యాయమగునా? నన్ను బిలచికొని పోవుటకు మామగారి యాజ్ఞ పనిలేదు. భర్త భార్యనువదలి పోరాదనియు, భార్య సదా పతి ననుసరించవలెనే గాని భర్తనువదలి యుండరాదని మామగారెన్నిమో సార్లు చెప్పుచుండ వింటిని కనుక మీరేమైన ననుడు, మిమ్ములవిడచి నేనొక దినముకూడ యింటనుండ నొల్లను. నన్ను వదలి పోయినచో మీరు నన్ను ప్రాణములతో మరల జూడజాలరని పలికెను.

అపుడు పోతులూరయ్య భార్యనుచూచి తన్వీ! నీవు నాతోగూడ వచ్చుటకు మాతండ్రిగారి యనుమతి యవసరము. అయినను మాతండ్రికి బదులు మాతల్లిగారి యనుమతినైన బొందుము. అమె సమ్మతింపనిచో నీవు నాపెంట వచ్చుటకు వీలుపడదనెను. అప్పుడు పార్వతమ్మ అత్తగారిని చూచి "తల్లీ! నా సతీధర్మమును నిర్వర్తించుటకు మీరాయను మతి గావలసి యున్నది. నాయందు దయయుంచి నాభర్త పెంట వనవాస మొనరించుటకు అనుజ్ఞ యిండ" నెను.

అంతలో సమీప గ్రామములకు వెళ్ళియుండిన గోవిందయ్యగారును విచ్చేసిరి. జరిగిన సంగతుల దెలిసికొని తమ్ముని యవివేక కార్యమునకు గడంగదు వగచుచు తండ్రి యాజ్ఞ మీరుట కెవరికిని సరిగాదని తమ్ముడు మారుదలితోగూడ వనముల కేగుటకు సమ్మతించెను. పోతులూరయ్య భార్యతోకూడ అడవులకు సంతోషముతో ప్రయాణ మయ్యెను.

పోతులూరయ్య భార్యతోగూడ లింగాల కొండలో బర్ణశాల నిర్మించుకొని యుండుట

పోతులూరయ్యయు పార్వతమ్మయు తల్లితోడను గోపిందయ్య తోడను సెలవు తీసికొని యిరువురును వారి పాదంబులకు నమస్కరించి దంపతులిద్దరును వీరబ్రహ్మేంద్ర స్వామి సమాధికిమూడుసార్లు ప్రదక్షిణ మొనరించి సాష్టాంగ నమస్కారము లాచరించి సింహద్వారమును దాటి బయటికి వచ్చిరి.

అంతలో పోతులూరయ్య భార్యతోగూడ వనవాసమేగుచున్నాడని విని కందిమల్లయ్యపల్లె జనులేగాక చుట్టుప్రక్క గ్రామప్రజలును వారిని జూడవచ్చిరి. ప్రజానీకము మంగళ వాయిద్యములతో వచ్చి దంపతులకు కర్పూర హారతు లొసంగి పుష్పమాలలను వేసి "పండ్రెండు సంవత్సరములు వనవాస మొనరించి మరల మాకు దర్శన మొసగ భగవంతుని ప్రార్థించుచుందుము" అని నమస్కరించిరి.

అంత పోతులూరయ్య పార్వతమ్మతో గూడ కందిమల్లయ్యపల్లెను వదలి "ఎద్దడుగు" కనమదారి నల్లమల మహారణ్యమునుబ్రవేశించెను. అచ్చటబిలమున్నేరాయని గుడిజేరి కొన్ని దినములుండిరి. అచ్చటనుండి బయలుదేరి అహోబిలముజేరి కొన్నిదినములు గడిపి యచ్చటనగ్రామములలో ధర్మముల బోధించుచు మహానంది యడవికి బోయిరి. అచ్చట మహానందీశ్వరుని సన్నిధిలో నాల్గు దినములుండి ఓంకారఘుమ్మ జేరిరి. అచ్చట ఒకటి రెండు దినములుండి

సమీపమున దప మొనరించుటకు దగిన నెలవును జూచుకొని పర్ణశాలను నిర్మింప దలచిరి.

అంతలో యడవిలోనుండు చెంచువారు "స్వామీ! మీరు తంబళ్ళపల్లె రామాపురమునకు దగ్గఱగా నుండు 'లింగాలకొండ' సమీపమున బర్ణశాల నిర్మించుకొన్న చో బాగుండు" నసగా పోతులూరయ్య లింగాలకొండకేగి పర్ణ శాల నిర్మించుకొని తపమాచరించుచు కాలము గడుపు చుండెను.

పోతులూరయ్య ఏరువ పెద్దన్నను తన శిష్యుడుగా జేసికొనుట

పోతులూరయ్య లింగాల కొండలో ఒక మహోన్నత మ్రుకింద పర్ణశాల నిర్మించుకొని పార్వతమ్మతో గూడ యరణ్యవాస మొనరించుచుండెను. అట్లుండ నొకనాడు ప్రక్కనుండిన రామాపురమునుండి యొక బాలుడచ్చటికి వచ్చెను. ఆ బాలుని రూపు రేఖా విలాసమును జూచినదే యేలకో పోతులూరయ్యకు వానియం దపార ప్రేమ జనిం చెను. అతడు వెంటనే నాయనా! ఇటురమ్ము. నా ప్రక్కన గూర్చుండుము" అని తన ప్రక్కన గూర్చుండ బెట్టుకొని యిటుల నెను.

నాయనా! నీవు బాలుడవు. అడవికి యొంటరిగ రావచ్చునా? ఇట క్రూరమృగములు తిరుగునని తెలియదా నీవు యొక్కడనుండి వచ్చితివి. నీ తలిదండ్రు లెందున్నారు. నీ విషయము దెప్పుమనెను. అందుకు ఆ బాలుడు స్వామీ

ఇక్కడికి సమీపమున రామాపురము మా స్వగ్రామము నేను బలిజ కులమున జన్మించితిని. మాయింటివేరు వీరువ వారు నన్ను పెద్దన్నయని పిలుతురు. నాకీ యడవిలో దిరుగుట యలవాటైనది, నాకు వడా యే దివ్యపురుషునైన సేవించి తరింపవలెనను బుద్ధి జనించుటచే యీ యడవికి మొవ్వైన సిద్ధపురుషులువత్తురాయని పలుమారు తిరుగుచుంటిని.

ఒకనాడు ఈ యడవిలో తిరుగుచుండగా ఒక ముని పుంగవుడును, అతని శిష్యుడు గడ్డము సాయబుకనంబడిరి. నేను ఆముని పాదములపైబడి నన్ను శిష్యునిగా చేసికొని పెంట గొనిపొమ్మని పలువిధముల ప్రార్థించితిని, అందు కా మహాత్ముడు నాయనా! నీవు నాకు శిష్యుడవుకాదగినవాడవే అయిన నేను నిన్ను శిష్యునిగా స్వీకరింపజాలను. నేనిక్కడ నిలుచుటకు వీలులేదు, కొన్నిదినములలో కందిమల్లయ్య పల్లెనుండి వీరబ్రహ్మముగారి చిన్నకుమారుడగు పోతులూరయ్య తనభార్యయగు పార్వతమ్మతో వనవాసమువచ్చును అత డిట పర్ణశాల నిర్మించుకొని కొంతకాల ముండును. అపుడు నీవు అతనికి శిష్యుడవై అతనివలన జ్ఞానోపదేశము బొందుమని చెప్పి శిష్యునితోగూడ మాయమైపోయెను.

అప్పటినుండి నేను ఒక్కొక్కనాడు ఒక్కొక దిశకు పోయి ఆ మహానుభావుడు ఎప్పుడు వచ్చునాయని వెదుకుట అలవాటైనది. ఈ దినము యిక్కడికి రాగా మీ దర్శన మైనది. మిమ్ములజూచినప్పటినుండియు ఆనాడు చెప్పిన ముసీశ్వరునిమాటలు జ్ఞాపకమువచ్చినవి. ఆపోతులూరయ్య గారు మీరేయైయుందురా యనియు తోచుచున్నది. తండ్రీ

మీరు పోతులూరు స్వామియై యుండినచో నన్ను శిష్యు
నిగా స్వీకరింపుడనెను.

అపుడు పోతులూరయ్య ఆశ్చర్యపడి పెద్దన్నకు తండ్రి
గారు దర్శనమిచ్చి నా శిష్యుడగునట్లు సంకల్పించినటు
లున్నది. తండ్రియాజ్ఞ ననుసరించి ఇతనిని శిష్యునిగా స్వీక
రింపక తప్పదు. అయినను ఇతడు బాలుడు. ఇతనిని శిష్యు
నిగా జేసికొన్న యితని తల్లిదండ్రు లెంత దుఃఖింతురో
ఇతనికి జ్ఞానోపదేశ మొనరించిన ఇక సంసారమునకు బనికి
రాడు. ఇతనిని కొంత కాలముతలిదండ్రులనుసేవించిన పిదప
రమ్మని చెప్పి పంపదల చెను.

పోతులూరయ్య వీరుప పెద్దన్నను కొన్నాళ్లు తలిదండ్రులకడ నుండగోరుట

పోతులూరయ్యగారు పెద్దన్నను చూచి నాయనా
నీవిపుడు బాల్యావస్థనుదాటి యౌవనావస్థ వచ్చుచున్నావు
ఇది గురుసేవకును, జ్ఞానోపదేశమునకును సరియగు దశ కాదు
నీవిపుడు పదా ఐననీజనకుల సేవించుచు వారు గోరి తెచ్చిన
కన్యకను వివాహమాడి కొంతకాలము గృహస్థుడవుగా
నుండుము. గృహస్థాశ్రమ దీక్షను క్రమముగా నెరవేర్చి
తర్వాత నాయాశ్రమమునకురమ్ము. అపుడు నిన్ను నాప్రియ
శిష్యునిగా నొనరించుకొని జ్ఞానోపదేశ మొనరింతును.
నీనిచ్చట బండ్రెండుసంవత్సరములుండునుకదా, ఎందులకు
భయపడెదవు నిన్ను చూచినప్పటినుండియు నాకేలనో నన్నైన

యపరిమిత ప్రేమజనించినది. ఇప్పటికి జ్ఞానోపదేశముమాట మరచి నీ తలిదండ్రులకడ కేగుమని చెప్పెను.

అందు కాయువకుడు మహానుభావా! యెన్నిదినములు నుండియో మీరాకను గనిపెట్టుకొనియుంటిని ఇపుడు వచ్చి శిరి. ఇక మీపాదములను వదలిపోజాలను. నా తలిదండ్రుల వలన మీకే యపనిందయురాదు. కావలయునన్న ఇపుడే పోయి నాతలిదండ్రుల యాజ్ఞ బొందివత్తును. నాకు సంసారమున్నై భ్రాంతి బొత్తిగ లేదు. మీరేమి చెప్పిననుసరే, నేను మాత్రము మిమ్ములవదలి పోజాలను. నన్ను మీపాదసేవకు నిగా జేసికొనక తప్పదనెను.

అంతలో వారి సంభాషణ వినుచుండిన పార్వతమ్మ పటకుటీరమునుండి బయటికివచ్చి "నాథా! ఈబాలుడంతగ బతిమాలుచుండ వాని కోర్కె నేల దీర్చరాదు. శిష్యునిగా స్వీకరించి జ్ఞానోపదేశముచేయుడు. అతడు జ్ఞానోపదేశమును బొందినను గృహస్థుగానుండవచ్చును అతడు కొంతకాలము రాజయోగినుండి తదుపరి మనదగ్గరకు రావచ్చునుగదా" యనెను. అందుకు పోతులూరయ్యయటులైన నేనితనిని శిష్యునిగాస్వీకరించితిని. ఇతనికి జ్ఞానోపదేశము నొనరింపుమనెను అపుడు పార్వతమ్మ పెద్దన్నా! స్నానముచేసి గురుపాదములకు నమస్కరించి నాకడకరమ్ము, జ్ఞానోపదేశ మొనరింతు ననగా పెద్దన్న యామె చెప్పిన ప్రకార మొనరింపగా పార్వతమ్మ యతనికిజ్ఞానోపదేశ మొనరించెను. అంతట పోతులూరయ్య నాయనా! నీవునాప్రియశిష్యుడవైతివి. కనుక గురువు నాజ్ఞ ధిక్కరించక మీతలిదండ్రులకడ కేగి ముందు గృహస్థుడవు కమ్ము. ప్రతిదినము ఆశ్రమమునకు వచ్చి పోవుచుండు

మనగా మంచిదని వారి పాదపద్మములకు నమస్కరించి రామాపురమునకు బోయెను.

పోతులూరయ్య జలగుండమును జేరుట

పోతులూరయ్య లింగాలకోన పర్వతాలలో నొన్నాళ్లుండెను. ఆకాలమంతయు ఏరువ పెద్దన్న పేరునకు రామాపురమున నుండబోయెనే కాని ప్రతిదినము వచ్చి స్వామివారి సేవ జేయుచు వారికి కావలసిన వస్తుసముదాయమును తెచ్చి యిచ్చుచుండెను. ఏరువ పెద్దన్న వివాహితుడయిన పిమ్మటగూడ గురుసేవ మానలేదు. సంసారమును తామరాకుపై నీటిబిందువువలె సాగించుచుండెను. అతని తల్లిదండ్రులు కాని భార్యకాని పెద్దన్నను లింగాలకొండను పోవద్దని యాటంక పరుపలేదు. అందులకు పెద్దన్న లోపమిక్కిలి సంతసించుచుండెను.

ఒకనాడు పెద్దన్న చెట్టుక్రింద జింకచర్మముపై బరుండియుండిన పోతులూరయ్యగారి పాదము లొత్తుచుండెను. అపుడు స్వామి పెద్దన్నను చూచి నాయనా! ఇచ్చటనుండి నాయాశ్రమమును మార్చవలయునని యున్నాను. ఇక్కడికి గొంతదూరమున జలగుండమున్నదికదా. అక్కడ నీటివసతి బాగుండుననివింటిని. నీయభిప్రాయ మేమియనెను. అందుకు పెద్దన్న మీకా సంకల్పమున్నచో నటులనే జేయుదుము. నన్నేగి పటకుటీరమును నిర్మించిరమ్మన్నవచ్చెదను. ఇక్కడ కంటె జలగుండమున మంచి వసతులుండుటసత్యమే ననెను.

అంతట పెద్దన్న ముందుగనేగి తగిన స్థలమును నిర్ణయించి దానిని బాగుచేసి ఒక పర్ణశాలను నిర్మించి గురువు కడకువచ్చి పర్ణశాలసిద్ధమయ్యెనని చెప్పెను. అపుడు పోతులూరయ్యయు పార్వతమ్మయు శిష్యుని భక్తిశ్రద్ధలకు సంతసించుచు నాయనా! అటులైన మనము బయలుదేరి పోవుదమని యనెను. అపుడు పెద్దన్న వస్తువులన్నిటిం జేర్చి తలపైనిడుకొని ముందుబోవుచుండ స్వామి పార్వతమ్మతో వెనుకనడుచుచు జలగుండమున కేగిపర్ణశాలలోజేరిరి. పెద్దన్నయు వారిని సేవించుచు నచ్చటనేయుండెను.

పోతులూరయ్య కమ్మిపాపన్నకు దహనక్రియ లొనరించుట

ఒకనాడు పోతులూరయ్య భార్యతోకూడ జలగుండమున స్నానముచేయుటకువెళ్ళెను. ఏరువపెద్దన్న మాత్రము పటకుటీరమును గనిపెట్టుకొని యుండెను. ఆపదంతులిద్దరును జలగుండమును సమీపించినంతట నందొక గుడిసెకనబడెను వారాగుడిసె దగ్గఱకేగి "ఎవరు లోపల నుండునది" అని ప్రశ్నించిది.

అపుడు గుడిసెలో నుండిన యొకవ్యక్తి బయటికివచ్చి వారిద్దరికి నమస్కరించి స్వామీ! నాగ్రామమిచ్చటికిగొంత దూరమునన్నది. అయినను నేనాగ్రామము నివసించుట లేదు. తలిదండ్రులు దారాసుతాదులు పరలోకమున కేగిరి. అచ్చట నాకు 'నా' యను వారులేరు. అందువలన నేను

సంపార జీవితమునై రోతజనించి సర్వమును త్యజించి యీ గుండమునకడకేతెంచి యడవికట్టెల చేర్చి చితనేర్పరచితిని ఆచితి నంటించి యీయగ్నిలో బడి మరణించుటకు సిద్ధపడి యుండగా యున్నటులుండిపోయొక ఋషి కనంబడెను. ఆమహానుభావుని చూచి నమస్కరించి చేతులజోడించి నిలువగా ఆయన ''శుభమగుగాక'' యని యాశీర్వదించెను.

అందుకు నేను ''పరమేశ్వరావతారా! నా కెక్కడ శుభము. అగ్నిలోబడి మరణింపనుండ నాకుమీరాదర్శనమైనది మీరు కనబడకుండినచో యీపాటికి నేను పరలోకమునం దుండియుండెడివాడను. ఇపుడుగాకున్న మరికొంతసేపటికైన నేనీచిచ్చునంబడి మరణింపక తప్పదు. ఈస్వల్పకాలమున నాకు గలుగు శుభము లేముండును. మీయాశిస్సులువృథా కాగలవు'' అనినంతనె యామునిపుంగవుడు ''తండ్రీ! నా యాశీస్సులు వృథాకావు నీ కీర్తిగ మరణములేదు. అది యిపుడు జరుగదు.'' అయినను ముందు నీవిషయమును జెప్పు మనెను.

అందుకు నేను అమునీశ్వరునితో ''తండ్రీ! నాగ్రామ మిచ్చటికి ఆమడదూరముకూడ లేదు. నా వంశము విశ్వ బ్రాహ్మణ వంశము. నాతలిదండ్రులేకాశ దారాసుతాదులు కూడ నన్ను బాసిపోయిరి. వేయేల ఆగ్రామమునండేగాక మరి యేయూరను నాకు 'నా' యను వారులేరు. నా పేరు కమ్మ పాపన్న యందురు. నాకు వయసుకూడమీరినది. పని జేసి జీవించుటకు శక్తిలేకున్నది. కడుపుకూటికై యితరుల నాసింపనేల. నేను బ్రతికియెవరి నుద్ధరించవలెను. అందుకే యగ్ని దేవునకు నా దేహమును సమర్పింపదలచితి వంటిని

అంచుల కాయోగీంద్రుడు ''నాయనా! నీవిపుడు మరణింపవీలుపడదు ఇచ్చట నెయొక గుడిసె నిర్మించుకొని అడవిలోని కాయలను, ఆకులను ఫలములను దిని దేవుని ప్రార్థించుచు కాలము గడుపుచుండుము. అంతలో గందిమల్లయ్యపల్లెనుండి వీరబ్రహ్మము చిన్నకుమారుడు పోతులూరయ్య భార్యతోగూడ పండ్రెండుసంవత్సరములు వనవాసమొనరించుటకు వచ్చును. అతడు వచ్చినపుడు ఈవిషయమునుజెప్పి చితినిబేర్చుకొని యాతనితోదహనసంస్కారమును జేయించుకొనుము. అతడు తప్పక నీకోర్కె తీర్పగలడు. అందువలన నీకు సద్గతి గలుగును. ఆవల గొంతకాలమునకు మరల జగద్రక్షణార్థము వీరబ్రహ్మము అవతరించును. అప్పటికి నీవు కూడ జన్మింతువు. ఆమహాత్ముడు నీకు దరుణోపాయమును జూపునని యదృశ్యుడయ్యెను.

ఆమునిమాటలనమ్మి ఒకగుడిసె వేసుకొని యిచ్చటనే పోతులూరయ్యగారు భార్యాసమేతముగ యెపుడు వత్తురాయని కనిపెట్టుకొని వారికొరకేజీవించుచున్నాను. తామెవరో మహాత్ములుగ కనబడుటయే కాక భార్యాసమేతులయియే తెంచిరి. ఆపోతులూరయ్యగారును పార్వతమ్మగారును మీరేనై యుండినచో దయయుంచి నాకగ్ని సంస్కారమొనరింపుడు అని పరిపరి విధముల ప్రార్థింపగా పోతులూరయ్య వింతపడి యిటులనెను.

పాపన్నా! నేటితో నీతపము ఫలించినది. ఆమునీశ్వరుడు చెప్పిన పోతులూరయ్యను నేనే ఈమె నాభార్యపార్వతమ్మ. నేనొనరించిన పాపకార్యమువలన నాతండ్రివలననే శపింపబడి పండ్రెండు సంవత్సరములు వనవాసము చేయు

వచ్చితిని. కొంతకాలము లింగాలకోనలో నుంటిని. ఏలనో అచ్చటనుండి యిచ్చటికి రావలెనని బుద్ధిపుట్టుటచే యీ నా ప్రియశిష్యుడగు ఏరువ పెద్దన్నను వెంటబెట్టుకొని వచ్చితి ననెను.

ఆ మాటవిన్నంతనే కమ్మిపాపన్న గంతుల వేయుచు త్వరలో చితినిబేర్చి దానిపై బరుండి "స్వామీ! మీకార్య మును నిర్వహించి పుణ్యముకట్టుకొనుడు" అనగా పోతులూ రయ్య వెంటనే చితికి నిప్పంటింపగా పాపన్నసరలోకమున కరిగెను.

అంతట పోతులూరయ్య భార్యా శిష్యసమేతముగా స్నానమొనరించి తన పర్ణశాలలో నివసించుచుండెను.

పోతులూరయ్య ఏరువ పెద్దన్నను
కందిమల్లయ్యపల్లెకు బంపుట

పోతులూరయ్య ఒకనాడు శిష్యునిబిలిచి "పెద్దన్నా! నీవు కందిమల్లయ్యపల్లె మఠమున కేగి అక్కడనున్న మా తల్లికి అన్నగారికి మాక్షేమముల దెలిపి వారి క్షేమసమాచా రముల దెలిసికొనిరమ్ము" అని యానతిచ్చెను. ఏరుప పెద్దన్న గురువర్యా! మీయాజ్ఞ మేరకు నేను బయలుదేరి పోవు చున్నాను ఆశ్రమమున జాగ్రత్తగనుండుడు. నేను త్వరలో వత్తునని ప్రయాణమై పోయెను.

ఏరువ పెద్దన్న కాలినడక సాగించుచు రెండుదినము లలో గందిమల్లయ్యపల్లెను జేరి మఠమునకు బోయి గోవిం దమ్మగారికి నమస్కరించి "తల్లీ! నాపేరు యేరువ పెద్దన్న నేను శ్రీ పోతులూరయ్యగారి శిష్యుండను. మాగురువుగా రును మాతల్లియు తంబళ్ళపల్లెకు సమీపమునసుండు "కమ్మి పాపన్న జలగుండము" కడ పర్ణశాలలో క్షేమముగా నున్నారు. నన్ను మఠమునకేగి మీయందరి క్షేమసమా చారముల దెలిసికొని రమ్మనగా వచ్చితి ననెను.

గోవిందమ్మ కొడుకు కోడలి క్షేమసమాచారముల విని యానందించి పెద్దన్నను స్నానముచేసి రమ్మని యతడు వచ్చులోపల వంట సిద్ధముచేసి భుజింపజేసి మార్గాయాస మును దీర్చుకొనుట కొక గది చూపెను. ఏరువ పెద్దన్న విశ్రాంతి దీసుకొని స్వామివారి సమాధిని దర్శనము చేసికొని సేవింపబోవుటకు సెలవడిగెను.

అందుకు గోవిందమ్మ పెద్దన్నా! నీవు రెండుదివసు లిచ్చటనే యుండుము. నీ వెంట నేనును పోతులూరయ్య యాశ్రమమునకు వత్తును. నీబడలికయు రెండు దినములకు గాని దీరదనగా నతడు సమ్మతించెను. గోవిందమ్మ మఠ మును గోవిందయ్యను జూచుకొను చుండుమని సపరివార ముగా తంబళ్ళపల్లెమార్గముగా ప్రయాణము చేయుచుండిరి. ఆమె నాలుగుదినములలో తంబళ్ళపల్లెజేరెను. ఆ గ్రామ వాసులు మఠమునుండి గోవిందమ్మవచ్చెనని యామెను పలు విధములసత్కరించిరి. ఆదినమంతయు ఆగ్రామమందె నిలిచిరి

ఆ యయూరి ప్రజలు ఆమెకును ఆమె పరివారమునకును భోజన సదుపాయము లొనరించిరి.

ఆమరునాడు గోవిందమ్మ కమ్మిపాపన్న జలగుండము నకు బోయెను. తల్లి వచ్చుచున్నదని తెలియగనే పోతులూ రయ్య భార్యాసమేతుడై యెదురేగి యిరువురును యామెకు నమస్కరించి పటకటీరమునకు దోడ్తెచ్చి పెద్దన్నతోవారికి దగిన యేర్పాటు చేయగోరగా నతడు గురునాజ్ఞ నెరవేర్చెను.

గోవిందమ్మ కొడుకును కోడలిని మఠమునకు రాగోరుట.

గోవిందమ్మతని పరివారముతో గొన్నిదినములుండెను పోతులూరయ్య పార్వతమ్మను తల్లియాజ్ఞ లోనుండయామెకు సపరిచర్యల జేయుచుండుమని తాను శిష్యులకు ధర్మోపదేశ ముల జేయుచుండెను. ఒకనాడు గోవిందమ్మ పుత్రునిజూచి నాతండ్రీ! మీరీ యరణ్యమున బడుకష్టముల నాకన్నులార జూచుచుంటిని. ఇంతవరకు జేసిన వనవాసము చాలును, తండ్రి యానతిని మీరక నిన్ని సంవత్సరములు భార్యతో యిడుముల బడుచుంటివి. ఇక గొంతకాలమే మిగిలియున్నది కనుక నామెంట మీరిక మఠమునకు రావలెననెను.

అందుకు పోతులూరయ్య తల్లీ! ఎందులకోసివిట్టిమాట లాడుచుంటివి. తండ్రిగారు శ్రీహరి యవతారము. ఇక నీవు శ్రీలక్ష్మివై యీరూపమున యవతరించితివి. అట్టి నీవునన్ను తండ్రి యానతిని మీరవలెనని బోధించుట న్యాయమా? నేనిపుడు తండ్రి మాటను మీరి పండ్రెండు సంవత్సరములు

వనవాసము చేయక నీవెంట మఠమునకు వచ్చినచో నీప్రజ లిక వారి తలిదండ్రుల పలుకుల నాదరింతురా? నేనై వారికి తండ్రి మాటలను ధిక్కరింపుడని బోధించినవాడ నగుదును కదా, నీకుమారు డట్టి పాపకార్యమును చేయజాలడు. ఇక మీద నన్ను పండ్రెండేండ్లు దాటకముందే మఠమునకు రమ్మని పిలువవలదు.

తల్లీ! మీకింకొక సంగతి జెప్పెదను. తండ్రి సమాధియై మరణించెనని తలచుట పొరబాటు. అతడు సమాధిలో తప మాచరించుచు నే నీయరణ్యమునకు రాక పూర్వమే కొన్ని లీలలజూపి నన్ను గూర్చియు, నాయరణ్యవాసమునుగూర్చియు చెప్పియున్నాడు. అతడు లీలామానుష విగ్రహుడు సుమా. అతని లీలలు శ్రీకృష్ణుని లీలలవలె నున్నవి. అత డిపుడు సమాధిలో నుండెనో మనప్రక్కనుండి మన సంభాషణ వినుచుండెనో నేజెప్పజాలను.

అమ్మా! తండ్రి యద్భుతలీలల వర్ణింపజాలను. అందు లకును నిదర్శనము ఈశిష్యుడగు ఏరువపెద్దన్నకమ్మిపాపన్న కథలు సాక్ష్యమిచ్చుచున్నవి. ఇటువంటి లీలల నింకను నెన్నింటిని జూపెనో జూపునో నాకు దెలియదు.

క. అందుగల డిందు లేడని
సందేహము వలదు, తండ్రి సర్వదిశలలో
బొందుగ తిరుగుచు నుండెను
యిందే నేనుందు, రానుయేగుము తల్లీ!

ఇప్పటికే నేనొక యపరాధ మొనరించి తండ్రిగారికి గోపము దెప్పించి శాపగ్రసుడనైతిని. ఇపుడు మరల శాప విమోచనకాలము గడువకముందె మఠమును జేరిన చో మరి యొక శాపమునకు గురికావలసివచ్చును. నన్ను తప్పామార్గ మునకు ద్రిప్ప బ్రయత్నించినందులకు నీ కే శాపమిచ్చునో మనకు దెలియదు. కనుక నాపై ప్రేమచే నన్ను తప్పామార్గ మునకు ద్రిప్ప బ్రయత్నించి తండ్రికోపమునకు గురియై శాప గ్రస్థవు కాకుము. నాయందు దయయుంచి తిరిగి మఠమునకు బొమ్ము. మఠమున నీవు లేనందున శిష్యులును భక్తులును పరి తపించుచుందురు. అన్నగారు సంచారము బోవలసియుండును ఇరువురును మఠమున లేకుండిన ఎట్లుండునో నీవే యోజిం పుము. పుత్రప్రేమ నిన్నింతదూరము రప్పించినది. తల్లీ! నా మఠము నాపుత్రులు నను భ్రాంతి ఎందులకు. ఇపుడుగాకున్న మరికొంతకాలమునకు మనము మరల దండ్రిపాదములకడకు బోవలసియుండ నాపై నీకేలభ్రాంతి. శాప మొసగునపుడే నాతండ్రి శాపవిమోచనమును గూడ సూచించియున్నాడు. "నాయనా! నీకు బండ్రెండేండ్లు వనవాసము తప్పదు. ఆ కాలము దాటిన తర్వాత నీవు మరలవచ్చి కొంతకాలము మఠముననుండి నాసన్నిధిలోనె సమాధికావలె"నని బోధిం చెను. కనుక నేను పండ్రెండు సంవత్సరములు పూర్తియైన పిమ్మట మఠమునకు రాగలను. నీవు దయయుంచి మఠమున కేగుమనగా గోవిందమ్మ బదులు చెప్పలేక పరివారముతో గదలి కందిమల్లయ్యపల్లెకు బోయెను.

క్రొత్తకోట కృష్ణారెడ్డి పోతులూరయ్య వస్తువుల నపహరించుట

కమ్మిపాపన్న జలగుండమునకు గొంతదూరమునందు క్రొత్తకోటయను గ్రామము కలదు. అందు కృష్ణారెడ్డియను గజదొంగయొకడుండెను. అతడు దొంగలనాయకుడై చుట్టు ప్రక్కలనుండు గ్రామములలోని ధనవంతులను దోచియు, అడవులలో బ్రయాణముచేయు బాటసారుల గొల్లగొట్టియు మిక్కిలి ధనమును గూర్చుకొని యందొక కోటను నిర్మించి యొక జమీందారువలె దనయధికారమును జరుపుచుండెను. అతనికి భయపడువారే కాని బదులు మాటాడువారే లేకుండిరి.

అతని దొంగల మఠాలో మిక్కిలి నేర్పరులుండిరి. అందరకంటె "ఇంజేటి చెంచన్న, సంగాని అచ్చమ్మ" అను వారు మాయవాదులై కృష్ణారెడ్డి దయకు బాత్రులైయుండిరి. చెంచన్న ఎట్టి బలవంతులైనను భయపడక వారినిలోబరచు కొనుచుండెను. ఇక అచ్చమ్మ స్త్రీలను మాయజేసి ధన ముతో గూడ కృష్ణారెడ్డికి గూర్చుచుండెను.

ఒకనాడు ఇంజేటి చెంచన్న అడవిలోదిరుగుచు కమ్మి పాపన్న గుండమునకడకు పోయెను. అచ్చట పర్ణశాలలో నుండిన పోతులూరయ్యను అతని భార్య పార్వతమ్మను జూచెను. ఆ గుడిసెలో విలువగల వస్తువులుండుటయే గాక పార్వతమ్మ వెలగల చీరలను యాభరణములను గలిగి యుండినట్లు గ్రహించెను.

అతడు వెంటనే క్రొత్తకోట కేగి రెడ్డిగారిని చూచి "రెడ్డిగారూ! నేనీదినమున కమ్మిపాపన్న గుండము కడకు బోతిని. అక్కడ ఎవరో గడ్డమయ్య గుడిసె వేసుకొని యున్నాడు. అతనిదగ్గర విశేషముగ ధనముండినటులున్నది ఆదియుగాక అందొక స్త్రీయున్నది. ఆమె మిక్కిలి వెలగల చీరను అనేక బంగారుసొమ్ములను ధరించియుండెను. అబ్బో ఆచీరను ఆసొమ్ములను వర్ణింప వీలుపడదు. వేయేల నేన ట్లుండ మీరు గూడ వర్ణింపజాలరు. ఆచీరలు సొమ్ముల మనరెడ్డిసానికి దెచ్చియిచ్చిన బాగుండును." అని కష్ణా రెడ్డికి యాసల గల్పించి ప్రోత్సహించెను.

అపుడు కృష్ణారెడ్డి చెంచన్నా! నీవు చెప్పుమాటలు నిజమైనచో నీవు అచ్చమ్మతోగూడ బోయి వారిని నిలువు దోపు దోచి వారి వస్తువుల నన్నిటిని గొనిరండు. మీకు గావలసిన పరికరములను సహాయమును దీసికొని పొండనగా అచ్చమ్మ రెడ్డిగారు! వారిని దోచుటకు మాకేసహాయమును వలదు మాశక్తి మీకు దెలియదా? ఇంతకంటె మహాశక్తి గలవారిని గూడ కొల్లగొట్టితిమి. ఆ గడ్డమయ్య మాకొక లెక్కయా? మీ యాజ్ఞయైనచో వారి విలువగల వస్తువుల నన్నిటిని నిమిషములో దెచ్చి మీ కర్పింతుమనెను.

అంతట ఇంజేటి చెంచన్న సంగాని అచ్చమ్మను మరి యిద్దరు బలాఢ్యులను వెంటనిడుకొని బయలుదేరి చీకటిపడు నప్పటికి కమ్మిపాపన్న గుండమునుజేరిరి. అచ్చటపోతులూ

రయ్యగారిని చూచి "అయ్యా మేము బాటసారులము. మాగ్రామమునకు బోవుచుండ చీకటిపడినది ఈ యడవిలో పగలే ప్రయాణము చేయుట జనులు భయపడుచుందురు. ఇపుడు రాత్రియైనది. ప్రయాణము సాగింపజాలము. దయ యుంచి ఈరాత్రి యిచ్చట నిలుచుట కాజ్ఞ యిండనగా పోతులూరయ్య మంచిది, ఈరాత్రియే కాదు కేపటిదినము కూడ యిండే యుండి విశ్రాంతి దీసికొని పోవచ్చునని నెను.

ఆ రాత్రి వారచ్చటనె నిలిచిరి. పార్వతమ్మ వారికి గూడ వంటజేసి యందరితో గూడ గూర్చుండబెట్టి వడ్డించెను. ఇంజేటి చెంచన్న అచ్చమ్మవారియనుచరులు తృప్తిగభుజించిరి. భోజనానంతరము పోతులూరయ్యగారు వారికి గొన్ని ధర్మములను బోధించెను. ఆవల వారిని యందొక చెట్టు క్రింద బరుండుడనగా వారు కొంతదూరమునకుండు చెట్టు కడకు బోయి నిదుర నభినయించిరి.

అంతట అర్ధరాత్రివేళ అచ్చమ్మ లేచి మెల్లగబోయి వారిమీద మచ్చుపొడిని జల్లెను. ఆపొడి ప్రభావమేమో కాని అందరు తెలివిలేకుండ బడిపోయిరి. అపుడు ఇంజేటి చెంచన్న తక్కినవారితో బోయి పోతులూరయ్యగారి కర వాలమును, వారి సొత్తులు వస్త్రములుగల పెట్టెను దీసికొని వచ్చెను. అందరును కొంతదూరము వెళ్ళి పెట్టెను బగుల గొట్టి యందలి ధనమును, వెలగల వస్త్రములను మూటగట్టు కొని క్రొత్తకోట కేగి కృష్ణారెడ్డి స్వాధీన మొనరించిరి.

కృష్ణారెడ్డి పోతులూరయ్య వస్తువులను తెచ్చియిచ్చుట

మచ్చుమందు ప్రభావముచే మెలకువరాక అందరును సూర్యోదయమువరకు నిదిరించుచునే యుండిరి. తూర్పు కొండ నుండి సూర్యు డుదయించు చుండగా నాతని కిరణములు పర్ణశాలకడ నిదురించువారిపై బడెను. అపుడందరు లేచి చూచునప్పటికి రాత్రివచ్చిన నలుగురు బాటసారులు లేకుండిరి. అందుకు వారు మనము నిద్రించుచుండగా లేపుట మంచిది కాదని వేకువజామున వారి యూరికి బోయి యుందురని యనుకొనిరి.

అంతలో పార్వతమ్మ కుటీరములోని కేగి చూచి "అయ్యో! మనవస్తువుల నన్నింటిని యెవరో దొంగలు ఎత్తుకొని పోయి యున్నారు ఒక వస్తువుకూడ లేదు" అనుచుండ ఏడువ పెద్దన్న యాశ్చర్యపడి ఏమియు దోచక యోజించుచు నిలబడియుండెను. అంతలో కాలకృత్యములు ముగించి పాపన్న గుండములో స్నానమొనరించి పోతులూరయ్య గారు పటకుటీరమునకు వచ్చిరి. అపుడు పార్వతమ్మ పెద్దన్న స్వామీ! రాత్రి మనము నిద్రించిన తర్వాత యెవరోదొంగలు మన వస్తువుల నొక్కటిగూడ లేకుండ యెత్తుకొని పోయి యున్నారు. ఏమిచేయుదమనిరి.

అమాటల విన్నంతనె "ఔరా! అంతటి ధైర్యశాలియు సాహసపరుడును, నిర్భాగ్య డాయెనోదరుడును, తన గోతి

తాను ద్రవ్వుకొన్న పాపియెవ్వడు? పోతులూరయ్య యన్న వానికి తెలియదు కాబోలు'' అని కన్నులమూసికొని యీక సమువంక జూచి ''పెద్దన్నా! మన వస్తువులన్నియు క్రొత్త కోట కృష్ణారెడ్డి తన యనుచరులబంపి దొంగతనముగ యెత్తుకొని బోవునట్లు చేసియున్నాడు. మనవస్తువులన్నియు వాని కోటలో దాచియున్నాడు. ఆ వస్తువులన్నియు నాకు గనంబడుచున్నవి. నీవు బోయి మన వస్తువులను తెచ్చి యిమ్మనంటిననుము. ఈయకున్నచో దానివలన తనకు ముప్పు తప్పదని చెప్పు'' మనగా పెద్దన్న చిత్తమని యాలస్యము చేయక బయలుదేరి పోయెను.

పెద్దన్న క్రొత్తకోట జేరునప్పటికి సుమారు మధ్యాహ్నము మించెను. అతడు కృష్ణారెడ్డి యింటికి బోవునప్పటికతడు భుజించి తాంబూలము వేసికొనుచుండెను. కృష్ణారెడ్డి ఏరున పెద్దన్నను చూచి ''ఓయీ! నీవెవరు? ఎందులకు వచ్చితివి?'' అని ప్రశ్నించెను. అందుకు పెద్దన్న ''అయ్యా! నాపేరు ఏరువ పెద్దన్నయందురు. కమ్మ పాపన్న జలగుండ ముదగ్గర పర్ణశాలలో నివసించు పోతులూరు స్వామివారి శిష్యుడను. నిన్నటిరాత్రి మీయనుచరులు వచ్చి స్వామివారి వస్తువులను సొత్తులను దొంగిలించి తెచ్చి మీకిచ్చియున్నారు. ఆవస్తువులన్నియు మీకోటలో రహస్యస్థలమున దాచబడినవి ఆవస్తువుల నన్నిటిని దీసికొనివచ్చి స్వామివారికి సమర్పింప గోరుచున్నా'' రనెను.

ఆ మాటల విన్నంతనే కృష్ణారెడ్డి తోకద్రొక్కిన త్రాచువలె యెగిరి దూకి కన్ను లెర్రజేసి "ఏమీ! ఆపోతులూరయ్య యెవరు? అతని కింతగర్వమా? నేను దొంగలను పంపి అతని వస్తువులను తెప్పించి కోటలోదాచితినా? ఎవరు చెప్పిరి? నేను దొంగనా? ఆమాట ఇంకొకసారి యన్న నీవే మగుదువో యోచించుకొని మాటాడుము. మాకోటలో అతని వస్తువులు లేవు ఏమైన మాటాడిన యతనికి శాంతి జేయింతు" ననెను.

అందుకు పెద్దన్న శాంతము వహించి "కృష్ణారెడ్డి గారూ! తనకోపమె తనకుశత్రువని చెప్పుటవిన లేదా? పోతులూరు! స్వామి శక్తి తెలియక వారిని దుర్భాషలాడకుము. జగద్గురువు. అవతారపురుషుడునగు శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామివారి చిన్నకుమారుడే మా గురువు పోతులూరుస్వామి, తండ్రి శాపమునకు గురియై పండ్రెండేండ్లు వనవాసము చేయవలసివచ్చి భార్యతోగూడ కమ్మిసాపన్న గుండముకడ ఆశ్రమ మేర్పాటు చేసికొనియున్నారు. నిన్నటి రాత్రి వారి వస్తువులు దొంగలింపబడినవి. స్వామి యోగ దృష్టితో చూడగా ఆవస్తువులన్నియు మాకోటలో దాచినట్లు తెలిసినది. అతనితో మీకు విరోధము పనికిరాదు. అతడు భయాపగుడు. ఆయనే మీకడకు వచ్చి జరిగిన పొరబాటును చెప్పి ఆభరణములను తక్కినవారి వస్తువులను గొనిపోడల చెను. పండ్రెండేండ్లు వనవాసదీక్ష ముగియకముందు గ్రామ

ములలో నడుగిడరాదు. అందువలన రాజాలక నన్ను పంపె
ను దయయుంచి వారి వస్తువుల దెచ్చియిచ్చి వారిని తీమా
పుణ గోరుట మంచి'' దనెను.

ఆమాటలకు కృష్ణారెడ్డి పక పక నవ్వుచు పెద్దన్నా! పిల్లికి జ్వరమువచ్చె ననుమాటల నీగురువు నేర్పించెను కాబోలు. ఆ గురువులకు దగిన శిష్యుడవే దొరికితివి. ఇట్టి మాటల నింకెక్కడనైన మాటాడినచో నీపండ్లూడ గొట్టు దురు. మీగురువు వచ్చియుండిన యతనిని స్తంభమునకు కట్టి కొరడాతో గొట్టించియుందు ననులోపల కృష్ణారెడ్డి వీపున ఎవరో కొరడాతో గొట్టినట్లుకాగా అబ్బా! ఎవరు వీపున గొట్టిరని తిరిగి చూచెను.

అపుడు పెద్దన్న రెడ్డిగారూ! పోతులూరుస్వామి శక్తి దెలిసికొంటిరా? నామాటలు నమ్మ్రాడు. మహాత్మ్యులతోపగ వలదు. ఆమహానుభావుని వస్తువుల నిచ్చినచో వారిదయకు భాత్రుడవు కావచ్చును. అందువలన నీకెంతయో మేలు గలుగును. ఆమహానుభావునిశిష్యుడవైనచోనీకే కొరతయు లేకుండ జేయగల శక్తిగలవాడనెను.

అపుడు కృష్ణారెడ్డిపిచ్చివాడా! నన్నుగూడ పిచ్చివాని నొనరింపజూతువా? తన తండ్రికే యపకారమొనరించి యాతని శాపమువలనపండ్రెండుసంవత్సరములు వనవాసము వచ్చినవానిని మహాత్ముడని పొగడుచున్నావు. ఆతడు గుణ వంతుడై యుండిన తండ్రి శాపమెందుల కిచ్చును. అతడు

తండ్రి నెదిరించిన దుర్మార్గుడు. అట్టి దుర్మార్గ చక్రవర్తికి నీవెట్టుల శిష్యుడవై తివో నాకు దెలియకున్నది. అది చాలక నన్ను గూడ అతని శిష్యుడగమ్మను చుంటివి. అతడు దివ్య పురుషుడును, యోగదృష్టి గలవాడయినచో దొంగలను ముందే తెలిసికొని జాగ్రత్తపడియుండవచ్చునే అది చేత కాక దొంగతనము చేయని నన్ను దొంగయని భావించి, ఆవస్తువుల నిప్పించుకొనిరమ్మని చెప్పుట యతనీ యవివేకపు తనమగును. అతనిని తెలియక మాటాడుచున్నాడు. అట్టి మాటలాడినచో యాతని గుడిసే పటాపంచలుగ జేయింతు నని చెప్పుము పొమ్ము అని గద్దించి పలికెను.

అంతలో గోటలోని జనులు పరుగిడుచువచ్చి రెడ్డి గారూ! ఉన్నటులుండి మన కోటగోడలు కూలిపడుచున్నవి కొందరి గృహములుకూడ కూలిపడినవి. మీరూరక జూచు చుంటిరేమి. మన గ్రామమంతయు నాశనమగు కాలము వచ్చినటులున్నదని మొరలిడజొచ్చిరి. కృష్ణారెడ్డి పరుగిడి పోయి పడుచున్న కోటగోడలను చూచి భీతల్లి ఇది పోతు లూరయ్యగారి ప్రభావమై యుండునేమో. నేనిపు డేమి చేయుదునని యోజింపుచుండెను.

అపుడు ఏరువ పెద్దన్న కృష్ణారెడ్డి! ఇపుడై నమీమూర్ఖ మునువదలి స్వామివారి సొమ్ములను వారి కర్పింతునని మన స్సునం దనుకొనుడు మీకోటగోడలు యథాప్రకార మేల కావోచూతమనగా కృష్ణారెడ్డి "పెద్దన్నా! నీపలుకులవినక

పోతని స్వామికి అపకారము చేసినది సత్యమే. వారి సొత్తు లను వారికి దెచ్చియిత్తుననగా కోటగోడలు మరలయెప్పటి యట్లుండెను. ఆచిత్రమునుజూచి జనులాశ్చర్యపడుచుండిరి.

అంతట కృష్ణారెడ్డి మంగళవాయిద్యములు రప్పించి పోతులూరయ్యగారి యాభరణాలను ఒక్కటికూడ పోకుండ తెప్పించి పళ్ళెరములలో బెట్టించెను. ఆసొమ్ములకుదోడు మరి కొన్ని బంగారు వస్తువులను పట్టుచీరలను దెప్పించి వానిని గూడ పళ్ళెరములలో బెట్టించి ఇంజేటి చెంచన్న, సంగాని అచ్చమ్మమున్నగువారితో నాపళ్ళెరమును మోయించుకొని మంగళవాయిద్యములతో ఏరువ పెద్దన్నతో మాటలాడుచు కమ్మి పాపన్న గుండమును జేరుకొనిరి. పెద్దన్న "అదిగో! పోతులూరుస్వామియు భార్యతమ్మగారును నిలిచి మనల జూచుచున్నా" రనగా కృష్ణారెడ్డి పరుగిడిపోయి వారిపాదము లకు నమస్కరింపగా "కృష్ణారెడ్డి! నాయనా! దిగులు పడ కుము. నీకు శుభమగుగాక" అని దీవించిరి.

అప్పుడు కృష్ణారెడ్డి కరములజోడించి "మహానుభావా దాసునితప్పు దండముతో సరి. మీ యాభరణములను మొదలగు వస్తువుల నెవరు దొంగిలించిరో వారిచేతనే మీ వస్తువులను మోయించుకొని తెచ్చితిని. స్వీకరింపుడు" అని పళ్లెములను వారిముందు పెట్టించెను. తమ యాభరణములు గాక క్రొత్త సొమ్ములను పట్టుగుడ్డలను చూచి నాయనా! ఇవి మా వస్తువులు కావు తీసికొని పొమ్మనిరి. అందుకు రెడ్డి

స్వామీ! ఆ వస్తువులను నేను మీకు సమర్పించుటకు తెచ్చి తిని దయయుంచి స్వీకరింపుడు, స్వామీ నేటినుండి నాదు కార్యపు పనులను మానితిని మీపదములనంటి చెప్పచున్నాను నాయందు దయయుంచి నన్ను శిష్యునిగా జేసికొనుడని ప్రార్థించెను. స్వామి సమ్మతించెను.

అంతలో భార్యతమ్మ వంటసిద్ధముచేసి అందరికి వడ్డించెను. అందరును స్వామి ప్రసాదమును తృప్తిగా భుజించిరి. భోజనానంతరము పారందరిని విశ్రాంతిగైకొమ్మని తర్వాత కృష్ణారెడ్డిని తక్కినవారిని యాశీర్వదించి తమగ్రామమునకు బొమ్మనగా అందరును నమస్కరించి సంతోషముతో బోయిరి.

పోతులూరుస్వామి మేమీదపల్లె జేరబోవుట

—:o:—

కమ్మిపాపన్న జలగుండము దగ్గర స్వామిగారు కొన్ని దినములు మాత్రమే యుండిరి. ఆ దినములలో కృష్ణారెడ్డి స్వామిగారి నపుడపుడు దర్శించి వారికి గావలసిన సౌకర్యములు జేయుచుండెను. ఆరీతి గొన్నాళ్లుండి పోతులూరయ్య తన యాశయమును మరియొక పోటికి మార్చనలెనని సంకల్పించుకొనెను. అతడు పార్వతమ్మను జూచి తల్లీ! నీవు నావెంట వనవాస మేతెంచి చాలకాలమైనది. ఇదిచాలును పండ్రెండు సంవత్సరములు ముగియుకాలము సమీపించు

చున్నది. కనుక నీవిక మఠమునకు బోయి మీ అత్తగారికి సేవ చేయుచుండుము. అంతలో నేనుకూడ రాగలననగా యామెయు సమ్మతించెను. అపుడు పెద్దన్నను చూచి "పెద్దన్నా! మీతల్లిని కందిమల్లయ్యపల్లెకు జేర్చి ఇక్కడి క్షేమవార్తలను తల్లికి అన్నగారికి జెప్పి అక్కడి క్షేమసమాచారముల దెలిసికొనిరమ్మనెను.

అపుడు పెద్దన్న పార్వతమ్మను బిలుచుకొని కాలినడకన కందిమల్లయ్యపల్లెకు బోయెను. పోతులూరయ్య యెంటనే రిగ కాలము గడుపుచుండెను. మరల వారముదినములలో పెద్దన్న కమ్మసాపన్న గుండముకడకు వచ్చి మఠములోని వార్తల స్వామికి దెలిపెను.

పోతులూరయ్య పెద్దన్నతో మనమీ చోటునుమార్చి యింకొక చోటికి బోదలచితిని. ఇరువురము బోయి తగిన స్థలమును జూచివత్తమా యనగా పెద్దన్న మంచిదనెను. ఇరువురు బయలుదేరి యాశ్రమమునకు దగినచోటును వెదకుచు మలమీదపల్లెసమీపమున యడవిలో నొక పర్ణశాలను జూచి యచ్చట నిలువ దలచిరి.

అపుడు పోతులూరయ్య శిష్యునితో నొకపర్ణశాలను తయారుచేయుమనెను. పెద్దన్న వెంటనే యొక సమప్రదేశమును జూచి యందలి రాళ్ళను చిన్నముక్కలను దీసివేసి తగిన పరికరముల సేకరించి యొక కుటీరమును నిర్మించెను. ఇరువురును అందే నివసించుచుండిరి.

పోతులూరయ్య జాలేరమ్మను శిక్షించుట

పోతులూరయ్య శిష్యునితోగూడి ఆశ్రమమునేర్పాటు చేసికొనియుండగా మలమీాదిపల్లె జనులు ప్రొద్దుటకుముంచి నీళ్లు లేక అచ్చటి కొలనుకు వచ్చి మంచినీళ్ళను గొనిపోవు చుండిరి. అప్పటి నీళ్ళకు వచ్చినవారు గ్రామమునకేగి అడవికి మొవరో స్వామి వచ్చినాడనియు శిష్యునితోగూడ గుడిసెలో నున్నాడనియు జెప్పిరి. అంతట మలమీాదిపల్లెనుండి జనులు వచ్చి స్వామిని దర్శనము చేసికొని యనుదినము వారికి గావలసిన పండ్లను, పాలను దెచ్చి యిచ్చి పోవుచుండిరి. కొందఱు పెద్దవారువచ్చి స్వామివారు చెప్పెడి ధర్మోపదేశములను వినుచుండిరి. కొందఱు వారికి శిష్యులై జ్ఞానోపదేశమును బొందుచుండిరి.

ఆ యాశ్రమము సమీపమునం దొక చిన్నగుడియుండగా అగుడియందే దేవుని ప్రతిష్టించిరని యడిగెను. అప్పుడు మలమీాదిపల్లె శిష్యులు "స్వామీ! ఆగుడిలో పోలేరమ్మ యను అమ్మవారున్నది. ఆమెకు మేము జంతువులబలి యియ్యనిచో గ్రామజనులకు బొబ్బల బుట్టించియు, అమ్మ వారు, మొదలగు రోగములు గల్పించి బాధించుచుండును. అమె బాధల పడలేక జనులు బాధపడుచున్నారని చెప్పిరి.

అప్పుడు పోతులూరయ్య "ఔరా! పోలేరమ్మ అంత శక్తిగల దేవతగా నున్నదా! దేవతయైన జనులకు ఈతి

బాధలురాకుండ కాపాడవలెనుగాని లేనివ్యాధులనుగల్పించి బెదిరించి బంతువుల బలినియ్యగోరుట యెందులకు, ఎవరో క్షుద్రదేవతగా నున్నది. కానిమ్ము, నేనేగి యీ మొశక్తిం పరీక్షించెదగాక" అని యెంటరిగ నాగుడికేగి విగ్రహమును జూచి నీవెవరని ప్రశ్నించెను.

అందుకు పోలేరమ్మ గ్రుడ్లెర్రజేసి "ఏమి, నేనెవ్వరానేనెవరైనది దెలిసికొనని మూఢుడా! నాయెదుట నిలువ పొమ్ము, నాదృష్టిని భరింప నీచేతకాదు. పోలేరమ్మ శక్తి నెరుంగక ఇటకు వచ్చితివి. ఊరకపొమ్ము" అని పలికెను

ఆమె మాటలవిని పోతులూరయ్య నవ్వుచు "ఏమీ పోలేరి! నీవంతటి శక్తిపరురాలవా? అబ్బో నీ సాహసమును దెలియకవచ్చితిని. అయిననుసీవిపుడు నన్నేమిచేయదలచితి" వనెను. అందుకు పోలేరమ్మ "ఓయీ! నీవు నన్ను జూచి భయపడక ఎదిరించి మాటాడుచుంటివి. నేనన్న నీకు లక్ష్యము లేనట్లున్నది. నేను దలచిన నిన్నేమైన జేయగలను. నీవు భక్తితో నన్ను బూజించి బంతుబలి నొసంగినచో నీగతి వేమగునో నేజెప్పజాల" నని గద్దించి పలికెను

అపుడు పోతులూరయ్య ఓహో నీవంతటి శక్తిగల దానవని నేనెఱుంగకయే నీశక్తిని దెలిసికొనవలెనని వచ్చితిని, నీచేత నేమగునో చేయుము చూతమనెను. ఆమాటలకు పోలేరమ్మ "ఇన్నిదినములైనది, ఎవ్వరును నన్నెదిరించినది లేదు. నేడు నీకు అంత్యకాలము వచ్చినటులున్నది. ఇదే

చూడుము, దేహమున బొబ్బలులేచి మంటలెత్తగలవు'' అనుచుండగనే పోతులూరయ్య దేహమునిండ బొబ్బలు పుట్టి దేహమున మంటలెత్తుటకు ప్రారంభించెను.

పోతులూరయ్య ఆబొబ్బలను మంటలను భరించుటయే గాక మీదుమిక్కిలి నవ్వుచు ''పోలేరీ! నీవు చేయగలదింతయేనాయరేమైనాయున్నదా! ఉండినచో ఇప్పుడే చేయుము. ఆవల చేయజాలవు. నాకు బొబ్బలపుట్టించినట్లె జనులకును పుట్టించి వారిచే భోజనములను, జంతుబలిని గొనుచున్నావు కదా. నీవు దేవతవనిపించుకొని జనులను బాధింపవచ్చునా. అది దేవతా న్యాయమా. మంచిమార్గమున తపోబలముచే వారికి సద్గతుల గలిగించి, నీవును తరించుట మంచిది కదా. ఎందుల కీనీచచేష్టల జేసి జనుల బాధింతువు. ఇప్పటినుండి నైన నీ దుర్మార్గమును వదలి గుణవంతురాలవై జనులకు మేలుచేయుచుండుమని చెప్పెను.

ఆ మాటలకు పోలేరమ్మ ''ఓరీ! నీ వెవడవు, నిన్ను మాటాడనిచ్చినకొలది ఇష్టమువచ్చినట్లు ప్రేలుచున్నావు. ఇపుడు నేను నీదేహమున బొబ్బలనుమాత్రమే పుట్టించితిని. ఎక్కువ మాటాడినచో రక్తము గక్కించెదను, నా బారిన బడక బరుగెత్తిపొమ్మ'' నెను.

అందుకు పోతులూరయ్య నవ్వుచు ''ఓసిక్షుద్రురాలా! నిన్నుజూచి భయపడి పరుగెత్తి పోవుటకు వచ్చినవాడను కాను. నీప్రగల్భములు నాకడబనికిరావు. తలుపుల ప్రింగు

వారికి అప్పళములు చాలునా, నిన్ను శిక్షించి పోవుటకు వచ్చిన నన్ను బెదరింప జూతువా. నీచురాలా! పెద్దవారు చిన్నవారను తారతమ్య మెరుంగక మాటాడనిచ్చిన మితి మీరి మాటాడ దొడంగితివి. నీగ్రుడ్డి బెదరింపులకు బెదరు వారులేరు. అనుచుండగనే పోలేరమ్మకు కన్నులు గ్రుడ్డివై కనబడకపోయెను. అపుడు పోతులూరయ్య పోలేరీ! ముండా నిన్నిందే బంధించితిని. గ్రుడ్డిదానవై పడియుండు" మనెను.

అపుడు పోలేరమ్మ గ్రుడ్డిదగుటయే కాక అటునిటు కదలజాలక "స్వామీ! మీరెవరో దైవాంశ సంభూతులుగ మున్నారు. సామాన్యమానవునిగా భావించి మీకపరాధ మొనరించినందులకు నాగర్వభంగ మొనరించి బంధితురాలి నొనరించి శిక్షించుటయే కాక కన్నులుగానరాకుండజేసితిరి. నాయందు దయయుంచి క్షమించి నాకు నా దృష్టినొసంగి బంధముల బాపుడు. మీయాజ్ఞ ననుసరించి నడుచుకొను చుందును అని పరిపరివిధంబుల ప్రార్థించెను.

అపుడు పోతులూర్యయ్య "ఓపోలేరీ! ఇకమీదట నీవు జనులను బాధించి జంతువుల బలిగొనుట మానవలెను. సజ్జను లను ఏప్రతిఫలము గోరక కాపాడుచుండుము. దుర్మార్గులను బాధించి మంచిమార్గమునకు ద్రిప్పుచుండుము. నీకు దృష్టి నొసంగి బంధముల దొలంగించితిని" అనుచుండగనే పోలే రమ్మకు దృష్టికలిగి కదలదొడగెను. అప్పటినుండి పోలేరమ్మ జనులనుబాధింపక క్షుద్రతనమునువదలియుండెను. అచ్చటి

నుండి పోతులూరయ్య తిరిగి తన కుటీరమునకు బోవుచు "పోలేరీ! నాయాశ్రమమునకు బోవుచుంటిని జాగ్రత్త" యని వెళ్లెను.

పోతులూరయ్య వనవాసకాలము దాటినంతన కంబిమల్లయ్యపల్లెకు బోవలచుట

మొలమిూదిపల్లెనుండిన జనులు పోతులూరయ్య పోలే రమ్మ శక్తిని పొగొట్టిన సంగతి వినివచ్చి "మహానుభావా! ఎండకాలమున యీకొలను ఎండిపోవుటచే బ్రాంతులకునీళ్లు లేక బాధపడుచుందుము. దయయుంచి యీకొలను నిండ సదా జలముండునట్లు చేయుడని ప్రార్థించిరి. అపుడు పోతు లూరయ్య మంచిదని చూచి యొకహస్తిన త్తి పారవేయగా అందుండి జలధార వెడలి కొలనునిండి ప్రవహించు చుండెను. జనులు ఆశ్చర్యపడి స్వామిని స్తుతింపసాగిరి.

అపుడు పోతులూరయ్య నాయనలారా! పండ్రెండు సంవత్సరములు దాటినవి, వనవాస దీక్ష ముగించితిని. ఇక బ్రహ్మమఠమున కేగెదను. మీరు సుఖంబుగా నుండుడని దీవించెను. ఆమాటలవిని పోలేరమ్మ "స్వామీ! నన్నుగూడ మీవెంట గొనిపొండు. బ్రహ్మక్షేత్రమున సమాధినిచూచి తరించెద" ననగా స్వామి సమ్మతించెను.

అంతట మరునాటికి కందిమల్లయ్యపల్లెనుండి శివ రామయ్యకుమారుడు దక్షిణామూర్తి వచ్చిపండ్రెండు సంవత్సరములు దాటినందున మిమ్ము మఠమునకు బిలుచుకొని రమ్మని పంపిరి. లోకమాత గోవిందమ్మ సమాధియైనదని చెప్పెను.

అంతట పోతులూరయ్య ఏరువ పెట్టిన్నను, పోలే రమ్మును వెంటబెట్టుకొని దక్షిణామూర్తివెంట గందిమల్లయ్య పల్లెకు బోవుచుండగా "శూతుసిద్ధుపల్లె" జేరునప్పటికిరాత్రి యయ్యెను. ఆరాత్రియందునిలిచిరి. ఆరాత్రి దక్షిణామూర్తికి వీరబ్రహ్మము స్వప్నమున దర్శనమిచ్చి "నాయనా! నీవు మఠమునకు రావలదు. ఇక్కడనే సమాధిగమ్ము" అని యదృశ్యుడై పోయెను. ఆసంగతి దక్షిణామూర్తి వెంటనే పోతులూరయ్యగారికి జెప్పి నేను బ్రహ్మను జేరబోవు చున్నానని పరమపదించెను. పోతులూరయ్య ఆవార్తను మఠమునకు దెలిపిరమ్మని పెద్దన్నను బంపెను.

ఏరువ పెద్దన్న మఠమున కేగి గోవిందయ్యగారికి దక్షిణా మూర్తి సమాధియైనవార్త దెలిపెను. అప్పుడు గోవిందయ్య శివరామయ్యను పెద్దన్న వెంటబోయి సమాధిని చూచి పోతులూరయ్యను బిలుచుకొని రమ్మనెను. శివరామయ్య మంచిదని పెద్దన్నవెంట బయలుదేరి శూరుసిద్ధుపల్లె జేరెను. శివరామయ్యగారితో పోతులూరయ్యను తండ్రియాజ్ఞ ననుస

రించి దక్షిణామూర్తి సమాధి యయ్యెనన్నగ శివరామయ్య మంచిదని పోతులూరయ్యతో మరల మఠమునకు వచ్చెను.

పోతులూరయ్య పోలేరమ్మనుచూచి "పోలేరమ్మా! నీవు బ్రహ్మమఠమునకు రాను వీలుపడదు. ఈ వేషచెట్టు కడ నుండుము. కొంతకాలమునకు నీకు క్షుద్రపూజలు మాసిపోయి సాత్వికపూజలు జరుగును. అపుడు నీవు మఠమును జేరుము" అనగా పోలేరమ్మ విధిలేక యందు నిలువగా, పోతులూరయ్య పెద్దన్నతో బోయి మఠమును జేరి సమాధికి మూడు ప్రదక్షిణముల జేసి నమస్కరించి గోవిందయ్య పాదములకు నమస్కరించి మఠములోని మందిరమునకు బోయెను.

ఓమ్

శ్రీ పోతులూరి
వీరబ్రహ్మంగారి జీవితచరిత్ర

పదునైదవప్రకరణము

ఓ ప్రియభక్తులారా! గతప్రకరణమున వీరబ్రహ్మేంద్రస్వామి సమాధియైన తర్వాత వారి చిన్నకొమారుడు పోతులూరయ్య సమాధిమూతను దీసి తండ్రి తపమును భంగమొనరించి శాపమును బొందెనని చదివితిరి. అతడు భార్యతో బండ్రెండుసంవత్సరములు వనవాసము చేయుచు అనేక యద్భుతముల జూపినది తెలిసికొంటిరి. కడపట వనవాస దీక్షను నెరవేర్చి శిష్యుడగు పెద్దన్నతోడను పోలేరమ్మతోడను కందిమల్లయ్యపల్లె మఠమునకు వచ్చెను గదా. ఇపుడు ఆవలికథను దెలిసికొందము.

ఈశ్వరమ్మచరిత్ర

వీరబ్రహ్మంగారి వంశము శాఖోపశాఖలై నది దినాభివృద్ధి జెందుచుండెను ఆవంశీకులలో వీరబ్రహ్మము సమాధియైనతర్వాత గోవిందమ్మయు, తడనంతరము దక్షిణామూర్తి

సమాధియై యుండిరి. బ్రహ్మమఠమునకు గోవిందయ్యగారు అధిపతులయి పీఠాధిపత్యమును వహించియుండిరి.

గోవిందయ్య జ్యేష్ఠపుత్రిక పేరు ఈశ్వరమ్మ. ఈమె యన్న వీరబ్రహ్మముగారికి మిక్కిలి ప్రేమ. అందువలన యాయన సమాధి కాకమునుపే జ్ఞానోపదేశమును జేసి యుండెను. ఆవల గోవిందయ్యగారు కూడ తనపుత్రికారత్న మునకు యోగామార్గంబుల నెన్నియో తెలిపియుండెను. ఆమె కారక, సాంఖ్య, అమనస్కములు తెలిసి రాజయోగ మహిమంబుల నెఱింగియుండెను. ఆమె పంచముద్రలను దెలిసికొని, శాంభవీముద్ర సభ్యాస మొనరించుచు బాల యోగినియై ప్రకాశించుచుండెను.

ఈశ్వరమ్మ తండ్రికి చైతన్యము గలిగించుట

గోవిందయ్య ప్రతిదినము రాత్రి భోజనానంతరము ఆత్మావలోకనము జేయుటకై నిండుగ వస్త్రమునుగప్పికొని పులిచర్మముపై బరుండుట వాడుక యైయుండెను. అతడొక నాడు రాత్రి పంచేంద్రియముల నడంచి, ఉచ్ఛ్వాస నిశ్వాస ముల బంధించి పరమాత్మావలోకన మొనరించుచుండెను. మరునాడు ప్రొద్దెక్కువరకు కదలక బడియుండెను. ఆత్మావ లోకన మొనరించుచు ప్రొద్దెక్కువరకు లేయకుండుట నిత్య కృత్యమని యెవరును వారిని పలుకరింపకుండిరి.

అంతలో మధ్యాహ్నమాయెను. గోవిందయ్య మేల్కొన లేదు. అపు డందరనుమానపడి ముసుగుతొలిగించిచూచిరి. అతనికి మెలుకవ రాకుండుటయేగాక ఉచ్ఛ్వాస నిశ్వాస ములు పూర్తిగా నిలిచియుండెను. అపు డందఱును పర మాత్మావలోకన మొనరించుచు పరమపదించెనని గొల్లు మని యేడ్వ దొడంగిరి.

అపుడు ఈశ్వరమ్మపరుగెత్తుకొనివచ్చి వారినిమఃఖింప వలదని తండ్రిని తేరిపారజూచి "తండ్రి జీవించియుండ దుఃఖం చెదచేల" అని యనుచు యింటిలోనికి బరుగిడి ఒక పెద్ద పల్లెము నిండుగ కణకణమనుచుండెడి నిప్పులను గొనివచ్చి తండ్రి శిరము ప్రక్కనబెట్టి ఎక్కువగసాంబ్రాణి పొడుమును దెప్పించి నిప్పులపై వేసెను. అపుడు సాంబ్రాణిపొగనిండు కొనుటచే గోవిందయ్యగారి జ్ఞానేంద్రియములకు వ్యాపించు టచే తన్మాయత్వము వదలి లేచి గూర్చుండెను.

అతడు లేచితలప్రక్కన సాంబ్రాణిపొగను గమనించి యీపని చేసిన దెవరనియడిగెను. అందుకు వెంటనే యీశ్వ రమ్మ తండ్రీ! మీతన్మాయత్వమును బోగొట్టుటకు నేనీపనిని జేసితిని. అందరును మీరు మరణించినట్లు భావించి గోల పెట్టుచుండ మరణింప లేదని ధైర్యముచెప్పి యీ విధి నను సరించితినన యతడు సంతసించెను.

రంగరాజు వీరబ్రహ్మము వంశమున వివాహమాడుట గోరి బయలు దేరి వచ్చుట

ఇంతకుముందు వీరబ్రహ్మముగారు దక్షిణదేశక్షేత్ర ముల దర్శింపబోయి వచ్చుచు నగరపాడు జమీందారగు జగ్గయ్య కొక బీజాక్షరముల లిఖించిన రాగిశాసనము నొసగి దానిని బూజించుచుండిన చో సంతానహీనుడవగు నీకొక పుత్రుడు జన్మించుననియు, ఆ బాలునకు రంగరాజు అను పేరు పెట్టుమనియు, అతడు దివ్యపురుషుడుగా నొప్పుననియు చెప్పి యాశీర్వదించిన సంగతి మనము చదివేయున్నాము. ఆ మహానుభావుని మాటల ననుసరించి జగ్గయ్యకు బుత్రుడు జన్మించెను. ఆ శిశువునకు జగ్గయ్య రంగరాజని పేరిడి యుండెను.

రంగరాజు దినదిన ప్రవర్ధమానుడై సకలవిద్యలనేర్చి బ్రహ్మేంద్రస్వామి వాక్యపటిమవలన గొప్ప యోగిగామారి పోయెను. అతడు యుక్తవయస్కుడు కాగానే వీరబ్రహ్మ ముగా రొసగిన తామ్రశాసనమును పరీక్షించి దానిలో తన వివాహము విషయమై ప్రాసినట్లుర్థముండినట్లు గ్రహించెను అతడా తామ్రశాసనమును దీసికొని "తండ్రీ! నేను కండి మల్లయ్యషల్లెకేగి వీరబ్రహ్మేంద్రస్వామివారి వంశములో జన్మించిన కన్యకను వివాహమాడి వత్తును. దయయుంచి సెలవిమ్ము" అనగా జగ్గయ్య సమ్మతించెను.

అంతట రంగరాజు కందిమల్లయ్య మఠమును జేరి పీఠాధిపతియగు గోవిందయ్యవారిని గలిసికొని తనరాకకుగార ణము చెప్పి తామ్రశాసనమును జూపి జగద్గురుని యాజ్ఞను పాలింపగోరెను. అందుకు గోవిందయ్యయు తక్కినవారును "అయ్యా! మీవాక్యములు సత్యమే కావచ్చును. మేము విశ్వబ్రాహ్మణులము మీరన్నత్రియులు, మనకు వివాహ సంబంధమెట్లు కుదురును. మనల జూచిన పరులు పరిహసింపరా? ఈప్రయత్నము మాని మీరాయూరికి బోవుటయుత్తమమైన పని యనిరి."

రంగరాజు పోతులూరయ్య కాలజ్ఞానమును దెచ్చుట బనగానిపల్లెకు పోవుట

ఆ మాటలకు రంగరాజు అయ్యా! మీరు జగద్గురు కుమారులయ్యు వారి పలుకులకు ధిక్కరించుటకు న్యాయము కాదు. ఆ మహానుభావుని అగౌరపరచినటులగును. మీరు కులభేదముల బాటించి యిటులనుచున్నారేకాని వేరుకాదని తోచుచున్నది. అందరి రూపములు వేరుకాని యాత్మలు భిన్నరూపములు కావు మీతండ్రియు కులభేదముల బాటింప లేదని మాతండ్రి జగ్గరాజుగారు. చెప్పియున్నారు. నేను శ్రీవీరబ్రహ్మముగారి యంశమున జనించినవాడనే కాని వేరు కాదు. మీవంశమునందు వివాహమునకు దగిన వయస్సు

వచ్చిన కన్యక నొసంగుటవలన మీతండ్రిగారికోరిక నెరవేర్చి నవారగుదురు. ఈవిషయము వారు కాలజ్ఞాన గ్రంథమున వ్రాసియుందురు. ఆ గ్రంథముల జూతము తెండనెను.

ఆ మాటలకు పోతులూరుగారు రంగరాజా! కాలజ్ఞాన గ్రంథములు మాయింట లేవు. అవి బనగానపల్లె గరిమిరెడ్డి అచ్చమ్మగారి యింట పాతరలోనున్నట్లు చెప్పిరి. ఆగ్రంథములను మేము చూడలేదనెను. అందుకు రంగరాజు ఆ గ్రంథముల దెత్తము రండనగా పోతులూరయ్య సమ్మతించెను. ఇరువురును బయలుదేరి బనగానపల్లెకు బోయి భూమిలో బూడియుండిన పాతరపై మట్టినితీసి మూతనుతీసి చూడగా తాటాకు గ్రంథములు పాతరనిండుగా కనబడెను. అపుడు పోతులూరయ్య ఒకగ్రంథమును తీసినంతనే మిగిలినగ్రంథములన్నియు కనబడకపోయెను. అపుడు పోతులూరయ్య సాహసవంతుడు గనుక లోపలదిగుటకు బ్రయత్నింపగా లోపల పుస్తకములకు బదులు అనేక గ్రాచుపాములు పడగలెత్తి బుసకొట్టుచు నాలుకల జాచుచు దోకలపై నిలిచి యాడుచుండెను. ఆసంగతి పోతులూరయ్య రంగరాజుకు జెప్పగా ''అయ్యా! ఆమహానుభావుని లీలలు ఎనకర్థము గావు. మనకీయవలసిన గ్రంథమును మాత్రమిచ్చి తక్కినవానిని పాములజేసెను. మీసాహసమును మాని పాతరమూతను బిగింపుడపగా నతడటులనే యెప్పటివలె మూతనిడి మట్టినికప్పెను. ఇరువురును నాతాళపత్రగ్రంథములతో గందిమల్లయ్యపల్లెకు వచ్చిరి.

అగ్రంథమును విప్పి గోవిందయ్యగారు చదువగా అందు ''చచ్చిపోయిన దారభ్యం చొచ్చి యుల్కివచ్చిన దారభ్యం, చొరకలోతు జూచిన దారభ్యం, చంద్రగిరి చెంతజేరిన దారభ్యం, చేయరాని యకృత్యాలు చేయ బోకు, సింహాసనమునకు సిద్ధమైయున్నది సీతాదేవి స్థిరమై యున్నది. ఇది సిద్ధమగువారిచే సిద్ధించును'' అను దేవరహస్యపు బలుకు లుండెను. గోవిందయ్య ఆపలుకుల జదివి తన కేమియు బోధపడలేదనెను.

అందుకు రంగరాజు అయ్యా! అవి మీకు అర్థము కావు ఆమాటలలోని భావము నాకీయవతారమున వివాహ ప్రాప్తిలేదనియు, తానగ్నిగుండమున కాహుతి గావలెననియు ఈశ్వరమ్మ సమాధి కావలసియున్నదనియు వ్రాయబడియున్నది. ఇంకను కొన్ని నిదర్శనము లున్నవి. వినుడని చదివి వినిపించి తాను నగరపాడు జేరి యగ్నిగుండ ప్రవేశమొనరింతునని లేచి ''నాకు దాహముగా నున్నది. జలమును దెప్పింపు'' డనెను. పోతులూరయ్య తన కుమార్తె నీలమ్మతో మంచినీళ్ళను తెచ్చి యిమ్మనెను.

అమె లోపలికేగి యందినీటి పాత్రను దెచ్చి రంగరాజుగారికి రెండుచేతులతో నందిచ్చెను. అతడా పాత్ర నందుకొని ''అయ్యా! ఈ నీలమ్మను నాకిచ్చి పెండ్లిచేయుమురా'' యనెను. అపుడు కాలజ్ఞానములో లిఖింపబడినట్లు మరుజన్మమున జరుగును లెండని గోవిందయ్య పలికెను.

అపుడు రంగరాజు "సీలమ్మ నీట గలియును" అని సీళ్ళను త్రాగుచుండగా సీలమ్మ మరణించెను. అదిచూచి వారందరును నిజముగా రంగరాజు వీరబ్రహ్మంగారి సంకల్పమున జన్మించిన దివ్యపురుషుడని భావించి యాశ్చర్యపడిరి.

రంగరాజు ప్రయాణమైపోవుచు పోతులూరయ్యగారిని చూచి "అయ్యా! నేనేగి అగ్నిగుండమును జొత్తును. అపుడు మీరువచ్చి అగ్నిగుండమును బూడ్పించి దానిపై శివలింగమును ప్రతిష్ట చేయించి మీ వంశీకులే పూజలు సలుపునట్లుచేయు" డనెను అందుకు పోతులూరయ్య మేము చాలదూరమున నుందుము మీరు అగ్నిగుండమున ప్రవేశించిన సంగతి మాకెట్లు తెలియగలదనెను. అందుకు రంగరాజు తా నగ్నిగుండమును ప్రవేశించు సమయమున యాకస మ్మెరబారుటయు సూర్యుడు కళాహీనుడై కనిపించుననియు, ఆరెండు నిదర్శనముల చూచినచో మీరు నగరపాడు జేరరావలెననియు చెప్పెను. మీరు అగ్నిగుండము కడకువచ్చి నాపేరుపెట్టి పిలిచిన మీకు నిదర్శనమును చూపెదనసెను.

రంగరాజు అగ్నిగుండమును ప్రవేశించుట

—:o:—

రంగరాజు కందిమల్లయ్యపల్లెనుండి నగరపాడు జేరి జరిగిన విషయములదెలిపి తాను యగ్నిప్రవేశమునొనరింపనలెను, అగ్నిగుండమును తయారు చేయింపుడని తండ్రితో

శెప్పెను. జగ్గయ్య ఒక విశాల ప్రదేశమున యగ్నిగుండ మును త్రవ్వించి శ్రీగంధపుకట్టెల బేర్పించెను. అంతట రంగరాజు తానే గంధపు కట్టెలకు నిప్పంటించి అగ్నిజ్వా లలు పై కెగురుచుండ తలిదండ్రులకు నమస్కరించి యా గుండమున దూకి పరమాత్మను జేరుకొనెను.

ఆ సమయమున కందిమల్లయ్యపల్లెలో ఆకసము రక్తవర్ణముగ గనబడుచుండగా సూర్యుడు కళాహీనుడై కనంబడెను. అప్పుడు పోతులూరయ్య "రంగరాజుగారు అగ్నిగుండ ప్రవేశ మొనరించిరి" అని చెప్పి ప్రయాణమై కాలజ్ఞాన గ్రంథమును శివలింగమును దీసికొని నగరుపాడు జేరెను. అప్పటికి అగ్నిగుండములో జ్వాలలు తగ్గి నిప్పులు మాత్ర ముండెను. అప్పుడు పోతులూరయ్య గుండము ప్రక్కన నిలుచుండి "ఓ వీరబ్రహ్మావతారుడగు రంగ రాజా! ఏదీ, నీనిదర్శన" మనెను. అప్పుడు వెంటనే కణకణ మను నిప్పుల మధ్యనుండి బంగరుకడియమును గలహస్తము నెత్తి ఓంకారశబ్ద మొనరించెను.

అంతట పోతులూరయ్య రంగరాజు తలిదండ్రులతో జరిగిన విషయములన్నియు జెప్పి యగ్నిగుండమును బూడ్పించి యందొక యరుగును గట్టించి శివలింగమును ప్రతిష్టించి కాలజ్ఞాన గ్రంథము నందిడెను. అపుడు ప్రజలు ధనమును ప్రోగుచేసి యొక మందిరమును గట్టించిరి. పోతు లూరయ్య ఆశివలింగమునకు ఒక విశ్వబ్రాహ్మణుని యర్చ

కునిగా నియమించి కందిమల్లయ్యపల్లెకు వచ్చి నగరపాటి వింతలను దెలుపగా నందరును యాశ్చర్యపడిరి.

రంగరాజును ప్రేమించిన ఈశ్వరమ్మ
బ్రహ్మచారిణీ దీక్ష బూనుట

పోతులూరయ్యగారు నగరపాటి వింతలను జెప్పగా ఈశ్వరమ్మ విని "ఔను, రంగరాజుగారి కీయవతారమున వివాహయోగము లేదనియు, తనకు బ్రహ్మచర్య విధిని గూడ కాలజ్ఞాన గ్రంథమున లిఖింపబడి యుండుటచే తాను బ్రహ్మచారిణిగ నుండ దీర్మానించుకొంటిని" అని తండ్రితో జెప్పి తాను మరియొక జన్మమున రంగరాజును వివాహ మాడెదనని నెను.

ఈశ్వరమ్మను పెండ్లియాడుటకు విశ్వబ్రాహ్మణ యువకు లెందరో వచ్చిరి కాని గోవిందయ్య మా ఈశ్వరమ్మ యీజన్మమునం దెవరిని వివాహమాడనని బ్రహ్మచారిణియై నది. దీర్ఘప్రయత్నమును మానిపొండని పంపుచుండెను. అంతట గొన్నిదినములకు గోవిందయ్యగారు తగినసమయము వచ్చినదని సమాధియైపోయెను.

అపుడు ఈశ్వరమ్మ తండ్రిగారికి వేరొక మఠమును నిర్మించి సమాధిపై నొక మందిరమును నిర్మించి ప్రాకార మును ముఖమంటపాదులను నిర్మించి ఆ మఠమునకు తానే

యధికారివై బ్రహ్మచర్య నియమి వనలంభించి యోగా
భ్యాస మొనరించి యనేక శిష్యులకు జ్ఞానోపదేశ మొపరిం
చుచు కాలమును గడుపుచుండెను. ఆమెను భక్తులనేకులు
వచ్చి కొలుచుచుండిరి.

ఈశ్వరమ్మ తన మేనమామను కుష్టురోగిని
కమ్మని శాప మొసగుట

ఆరీతి కొంతకాలము జరిగిన మీదట ఒకానొకదినము యీశ్వరమ్మ మేనమామ కందిమల్లయ్యపల్లెకు వచ్చెను అందరును యతని వాహ్వానించి గౌరవించుచుండిరి. అతడును గొన్నిదినములు కందిమల్లయ్యపల్లెలో నుండగోరెను.

అతడు పోతులూరయ్యతోను తక్కినవారితోనుచాల యనోన్యముతో మెలంగుచుండెను. అతడు పలుమారు ఈశ్వరమ్మకడ కేగిలేనిపోనిమాటలాడుచుండెను. ఆమాటలు ఈశ్వరమ్మకు నచ్చకుండినను మేనమామయని వినివిననట్లు నటించుచుండెను.

ఒకనాడు ఈశ్వరమ్మ యొంటరిగనుండుటగని యతడు దగ్గరకు పోయి తన్ను ప్రేమింపుమని యడిగెను. అందు కామె నేను బ్రహ్మచర్య వ్రతదీక్ష ననుసరించుచున్నాను. ఇది మా తండ్రిగారి సంకల్పము. నీవు కామాతురుడవై

పాపపు మాటలాడకుము అని హెచ్చరించెను. అత డామె మాటలను లక్ష్యము చేయుక వెంటనే యామె కరమును బట్టి బలాత్కార మొనరింప నుద్యమించెను.

అపుడు ఈశ్వరమ్మ కనులెఱ్ఱజేసి దేవీస్వరూపమా యనునట్లు గనంబడుచు "ఓరీ! దుర్మార్గా! మేనమామయని చనువిచ్చి మాటూడి గౌరవించినందులకు నాకే యపచారము జేయదలచితివి. ఛీ! నీముఖముచూడరాదు నీకు పెద్దరోగము రాను" అని శపించెను.

అమరునాటి నుండియే యతనికి పెద్దరోగము (కుష్ఠు వ్యాధి) సంప్రాప్తమయ్యెను. అతడు యీశ్వరమ్మను తన శాపమును ప్రమ్మరింపుమని ప్రార్థించెను. అందు కామె తప కంతటి శక్తి యింకనురాలేదు కనుక ఆరోగమును ననుభవింపవలసినదే యనెను.

ఈశ్వరమ్మ యాభరణములను రేకలకుంట పాలెగాడు దొంగిలించుట.

కందిమల్లయ్యపల్లెకు గొన్నిమైళ్ళలో నల్లమలలో జేరిన యరణ్యప్రదేశమున్నది. అందు "ఎద్దడుగు కనుమ, రేకలకుంట" మున్నగునవి గజదొంగలకు ప్రసిద్ధి చెంది యుండెను. అందు కొండరు పాలెగాండ్రను బందిపోటుదొంగ

లకు నాయకుడై యెద్దడుగు కనుమలగుండా పోవుబాటసారులను కొల్లగొట్టుచుండిరి. రాత్రి యటుండ పగలుకూడ బాటసారులు రేకలకుంట ఎద్దడుగు కనుమలద్వారా ప్రయాణము చేయుటకు భయపడుచుండిరి. ఒక్కొక్కసారి బాటసారులందరు ఒక గుంపుగా జేరి ప్రయాణము చేయుచుండిరి. అప్పుడుకూడ దొంగలు దోచుచునే యుండిరి.

ఒక పాళెగాడు సేర్వరులగు దొంగలను బిలచి కండిమల్లయ్యపల్లెకుబోయి బ్రహ్మముగారి మఠమును దోచుకొని రమ్మనెను. అందుకు దొంగలు భయపడి మఠములో దొంగతనము చేయుట మంచిదికాదు. ఆ ప్రయత్నము వదలమని హెచ్చరించినను పాళెగాడు వినక మీరు తప్పక మఠమును దోచుకొని రావలెను. అచ్చట మఠశిష్యులిచ్చినధనమును విశేషముగ నుండును. ఆ ధనమును తెచ్చినచో మీరొక సంవత్సరము దొంగతనము చేయవలసిన పనియుండదనెను.

అపుడా చోరులు పాళెగాని మాటలకు బదులుచెప్పలేక వీనిమాని కానిమ్మని బయలుదేరి బోయిరి. వారు చీకటి పడునప్పటికి కండిమల్లయ్యపల్లె జేరి భక్తులవలె వేషమును దాల్చి మఠముచుట్టు తిరుగుచు ఎవరులేని సమయమును గనిపెట్టి సింహద్వారముద్వారా లోపలికేగి దాగియుండిరి. మఠమునకు వచ్చుచు బోవుచుండిన శిష్యులలో యా దొంగల నెవరును గమనించలేదు. రాత్రి ప్రొద్దుబోగా నెచ్చటి వారచ్చట నిద్రించిరి.

అందరును గాఢనిద్రాపరవశులై యుండగా దాగి యుండిన దొంగలుపెల్లగ లేచి గోవిందయ్యగారిలోపలిగదిని ప్రవేశించి అందున్న పెట్టెల నెత్తుకొనిపెల్లగసింహద్వారపు గడియతీసి బయటికి దాటిరి. వారు కొంతదూరము బోయి పురుగు స్థలమునుజేరి పెట్టెలను బగులగొట్టి చూడగా కాల ధనము, విలువగలయాభరణములు, పెలగల చీరలు తదితర గుడ్డలు నుండెను. వారు వాని వన్నిటిని చిన్నచిన్న మూట లుగకట్టి ఒక్కొక్క కొక్కొక మూటను తలపై నిడుకొని బాటసారులవలె ప్రయాణము చేయుచుబోయి యా వస్తు వుల నన్నిటిని పాళెగాని స్వాధీనము చేయగా నతడు వానిని జాగ్రత్తగ తన ఇంటి పెట్టెలలో దాచెను.

ఉదయమున ఈశ్వరమ్మ లేచి గదిలో జూడగా ఒక పెట్టెయు లేకుండెను. ఆమె అందఱినిలడిగి చూచెను. అంద రును తమకేమియు దెలియదని చెప్పిరి. అపుడు ఈశ్వరమ్మ యోగదృష్టిలోజూచి "కేకలగుంటపాలెగాడు మనమఠమున దొంగతనము చేయించినాడు. అదుర్మార్గుడు బాగుపడునా! అపాలెగాడును దొంగలును దీర్ఘరోగములచే బాధపడి నశింతురు గాక! ఆ సొమ్ములు, ధనము, గుడ్డలు పెట్టెలలో నున్న వున్నట్లె కాలిబోవుగాక!" అని శపించెను.

ఈశ్వరమ్మ మఠములో శపించుచుండగనే అదేవేళకు పాలెగాని యింట పెట్టెలన్నియు భగభగమని మండ దొడ గెను. అతడుచూచి "ఇదేమి మఠమునుండి తెచ్చిన దొంగ

పొత్తును చూచిన పెట్టెలు మాత్రము కాలిపోయినవి'' అని యాశ్చర్యపడి పలుకకుండెను.

ఆవల గొన్నిదినములలో పాలెగాని కుటుంబమును, పొంగలును రోగములపాలయి క్రమముగ క్షీణించి పెక్కు-బాధల ననుభవించి మరణించిరి.

ఈశ్వరమ్మ సంచారము బోవుట

గోవిందయ్యగారు సమాధియైన తర్వాత ఈశ్వరమ్మ మహాత్మ్యము ఎక్కువయ్యెను. ఆమె భక్తులకు అనేకలీలలు చూపుచుండెను. దుర్మార్గులను శాపము నొసంగి శిక్షించుచుండెను. ఆమె ప్రతిభ నానాటికి యెక్కువై నలుదిశల వ్యాపించెను అందువలన యనేక స్త్రీలు పురుషులుగూడ బ్రహ్మక్షేత్రమునకు వచ్చి ఈశ్వరమ్మగారిశిష్యులై యామె వలన యుపదేశముల బొంది బోవుచుండిరి.

అంతట గొందరు ముఖ్యశిష్యులు ఈశ్వరమ్మగారిని చూచి ''తల్లీ! మిమ్మునర్శింపవలయునని దేశమున జనులాతురత బడుచు సంసార బాధలలో జిక్కి రాజాలక అకటా! ఈశ్వరమ్మగారిని దర్శించుభాగ్యము లేకున్నదని విచారపడుచున్నారు. అట్టివారికి తాము దర్శనమిచ్చిన కొంతవఱకు దృష్టి కలుగును. కనుక కూయందు దయయుంచి మీరొక్కసారి సంచారము బయలుదేరిన బాగుండు'' ననిరి

ఈశ్వరమ్మ భక్తులకోరికను కాదనజాలక సపరివార ముగ సంచారము బయలు దేరెను. కందిమల్లయ్యపల్లెనుండి ఈశ్వరమ్మ వని వెంట గ్రామమునకుబోయెను. ఆయూరివిశ్వ బ్రాహ్మణు లింతకుముందు గోవిందమ్మవారి శాపమునకు గురియైనందున ఈశ్వరమ్మగారిని గౌరవించి పూజించిరి. అచ్చటినుండి అల్లాడుపల్లెకేగి వీరభద్రుని దర్శించి, పెద్ద కొమెర్ల, బనగానపల్లె, యాగంటి, మహానంది, ఓంకారము మొదలగు గ్రామముల కేగిజనులకు దర్శన మొసగి ధర్మముల నుపదేశించుచుండెను. ఆమె మరల కందిమల్లయ్యపల్లెకు తిరిగి వచ్చుచు తంబళ్ళపల్లె, కృష్ణాపురము, కమ్మిపాపన్న జలగండముల కేగి శూరుసిద్దుపల్లెకుబోయెను. అచ్చట దత్తి ణామూర్తి సమాధిని దర్శించి జనులచే బూజలనుగొని యహోబిలమునకు బోదలచి బయలు దేరెను.

ఈశ్వరమ్మ దన తండ్రివలన శాపగ్రస్తయగు బ్రహ్మరాక్షసి శాపమును బోగొట్టుట

శిష్యు సమేతముగా ఈశ్వరమ్మ అహోబిలమును జేరి మూడుదినము లుండెను. అచ్చట దిగువ ఎగువ అహోబిల ములజూచి శ్రీ నరసింహస్వామిని దర్శించి యుక్కు స్తంభము నకు బదక్షిణ మొనరించి బయలు దేరి వచ్చుచుండెను.

ఆరీతి ప్రయాణము చేయుచుండగా ఒకనాడు మార్గ మధ్యమున రాత్రియయ్యెను. ఆ దారిప్రక్కన మట్టిచెట్టును

జూచి యందు విశ్రమించిరి. ఆపు డచ్చటనుండిన బ్రహ్మ రాక్షసి వారికి గనంబడెను. ఈశ్వరమ్మ నీవెవరని ప్రశ్నింపగా బ్రహ్మరాక్షసి "తల్లీ! నేనొక బ్రహ్మరాక్షసిని, వీర బ్రహ్మముగారివలన శపింపబడి జీవహింసలమాని వారివలన యాకలి దప్పులు లేకుండా జేయబడితిని. నాకు శాపవిమో చన మార్గమును దెలుపుమని ప్రార్థింపగా స్వామి ఇపుడు నీకు శాపవిమోచనము గలుగదనియు, కొంతకాలమునకు ఈశ్వరమ్మయను మహాభక్తురాలు తన శిష్యులతో యీ మార్గముగా వచ్చును. ఆమెవలన నీకు శాపవిమోచన మగును, అంతవర కిండే బడియుండుమనెను. ఆ ఈశ్వరమ్మ యెపుడువచ్చునో తెలియదనెను.

